

www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

నిజామాబాద్ సిటీ*



శనివారం | 27-1-2018 | పేజీలు: 16 + 20 | వెల: రూ. 5.00 | సంపుటి: 14 సంచిక: 196 |

శ్రీహేవళంబినామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిరరుతువు, మాఘమాసం, శుక్లపక్షం; తిథి: దశమి ఉ. 11.15 తదుపరి ఏకాదశి; నక్షత్రం: రోహిణి తె. 4.05 తదుపరి మృగశిర; వర్జ్యం: రా. 8.44-10.12; దుర్ముహూర్తం: ఉ. 6.53-7.37; అమృతఘడియలు: రా. 1.08-2.36; రాహుకాలం: ఉ 9.00-10.30; సూర్యోదయం: 6.53; సూర్యాస్తమయం: 6.05

Nizamabad | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Anantapur | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Kakinada | Khammam | Kadapa | Ongole | Nallagonda | Bangalore and Chennai







ఎట్ హోం విందులో ఆసియాన్ దేశాధినేతలతో రాష్ట్రపతి కోవింద్, ప్రధాని మోదీ, ఉపరాష్ట్రపతి వెంకయ్య

'దశ'దిశలా చాటుతూ..

పది ఆసియాన్ దేశాధినేతల సాక్షిగా గణతంత్ర వేడుకలు

సైనిక పాటవాన్ని, సాంస్కృతిక వైభవాన్ని కళ్లకు కట్టిన భారత్

అశోకచక్ర పతక ప్రదానంలో రాష్ట్రపతి కోవింద్ కంటతడి 15

మోదీ హల్‌చల్.. పాక్‌తో మిఠాయిలు పంచుకోని భారత్

ప్రగతి పథంలో తెలంగాణ

సవాళ్లను దాటి మున్ముందుకు

కొత్త పరిశ్రమలతో 2 లక్షల మందికి ఉపాధి: గవర్నర్ సందేశం 6

పంచాయతీ ఎన్నికల ముందస్తు లేదు!

ఫిబ్రవరిలో నిర్వహణ లేనట్టే.. గ్రామీణ ఓటర్ల జాబితా సవరణే అడ్డంకి

జాబితా సవరణకు షెడ్యూలు విడుదల.. మార్చి 24న తుది జాబితా

ఆ తర్వాతే ఎన్నికల ఆలోచన.. సూచనప్రాయంగా తెలిపిన సీఎం

అసెంబ్లీ ప్రత్యేక భేటీ లేదు.. బడ్జెట్ సమావేశాల్లోనే కొత్త చట్టం

రాష్ట్రంలో గ్రామ పంచాయతీ ఎన్నికలు ఫిబ్రవరిలో జరిగే అవకాశాలు లేవు. రాష్ట్ర ప్రభుత్వానికి ఓటర్ల జాబితా సవరణ రూపంలో ఊహించని అవరోధం ఎదురైంది. ఈ ప్రక్రియ పూర్తయ్యే వరకు ఎన్నికల గురించి ఆలోచించే పరిస్థితి లేకుండాపోయింది.

హైదరాబాద్, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పంచాయతీ పాలక వర్గాల పదవీ కాలం ఈ ఏడాది జూలై 31తో ముగుస్తున్నది. ఈ నేపథ్యంలో మరో ఆర్నెల్ల సమయం ఉన్నా ప్రభుత్వం ముందస్తు పంచాయతీ ఎన్నికలకు సిద్ధపడింది. వీటిని ఫిబ్రవరిలో నిర్వహించాలనే ఆలోచన చేస్తున్నామని ముఖ్యమంత్రి కేసీఆర్ స్వయంగా ప్రకటించారు. తండాలకు పంచాయతీ హోదా, కొత్త పంచాయతీల ఏర్పాటు, సరిహద్దుల గుర్తింపు వంటి ప్రక్రియల పూర్తికి జిల్లాల అధికార యంత్రాంగాన్ని పురమాయించారు. నూతన పంచాయతీరాజ్ చట్టం తయారీకి మంత్రివర్గ ఉపసంఘాన్ని ఏర్పాటు చేశారు. త్వరితగతిన చట్టాన్ని ఆమోదింపజేసుకోవటానికి ఫిబ్రవరి రెండో వారంలో అసెంబ్లీ ప్రత్యేక సమావేశాలను నిర్వహించనున్నట్లు కూడా సీఎం ప్రకటించారు. అయితే, రాష్ట్రంలోని 83 గ్రామీణ అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఓటర్ల జాబితా సవరణకు కేంద్ర ఎన్నికల సంఘం ఆమోదం మేరకు తెలంగాణ ప్రధాన ఎన్నికల అధికారి ఈనెల 23న షెడ్యూల్‌తోపాటు ఓటరు జాబితా ముసాయిదాను విడుదల చేశారు. ఈ ఏడాది జనవరి ఒకటో తేదీనాటికి 18 ఏళ్లు నిండినవారు కొత్తగా ఓటు హక్కును

మిగతా 2వ పేజీలో...



మువ్వన్నెల జెండా పట్టిన ఎమ్మెల్యే కొండా సురేఖ మనుమరాలితో ముఖ్యమంత్రి కేసీఆర్ ముచ్చట్లు

దావోస్‌లో కేటీఆర్‌కు అరుదైన గౌరవం



పలు దేశాల కేంద్రమంత్రుల సదస్సులో రాష్ట్ర మంత్రి ప్రసంగం

దావోస్‌లో ఇన్వెస్ట్ ఇండియా రౌండ్ టేబుల్ సమావేశంలో కేటీఆర్

డిజిటల్ తెలంగాణ

పౌర సేవలన్నీ డిజిటల్ మాధ్యమాల ద్వారానే: కేటీఆర్

టీ-హబ్, టీ-వర్క్స్‌లో భాగస్వాములు కావాలని పిలుపు

హైదరాబాద్, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ప్రభుత్వ సేవలన్నింటినీ డిజిటల్ మాధ్యమాల ద్వారా అందిస్తున్నామని రాష్ట్ర పరిశ్రమలు, ఐటీ శాఖ మంత్రి కేటీఆర్ అన్నారు. రాష్ట్రంలో ఇంటింటికీ మంచినీటిని అందించేందుకు చేపట్టిన మిషన్ భగీరథ పథకంలో భాగంగా ఫైబర్ గ్రిడ్‌తో ఫైబర్ ఆప్టిక్ కేబుల్ సౌకర్యాన్ని విస్తరిస్తున్నామని చెప్పారు. దావోస్‌లో జరుగుతున్న ప్రపంచ ఆర్థిక

మిగతా 2వ పేజీలో...

మోదీకి ట్రంప్ కౌంటర్

మీ దేశం మీకెంత ముఖ్యమో, మాకూ అమెరికా అంతే ముఖ్యమని వెల్లడి 14

బీజేపీకి బొటాబొటి

ప్రధానిగా మోదీయే, కానీ.. తగ్గిన ప్రజాదరణ

ఓట్లలో ఐదు శాతం కోత.. 30 సీట్లు గల్లంతు

తక్షణమే ఎన్నికలు జరిగితే బీజేపీకి సొంతంగా మెజారిటీ రాదు.. మిత్రపక్షాలే ఆధారం

క్రమంగా పుంజుకుంటున్న కాంగ్రెస్, రాహుల్

లోక్‌నీతి-సీఎస్‌డీఎస్-ఏబీపీ సర్వేలో వెల్లడి

న్యూఢిల్లీ, జనవరి 26: కొన్ని ఓట్లు... ఆ మేరకు సీట్లు తగ్గుతాయి! కానీ... కేంద్రంలో మళ్లీ బీజేపీ నేతృత్వంలోని ఎన్డీయేనే అధికారంలోకి వస్తుందని ఓ సర్వే తేల్చింది. మెజారిటీ తగ్గినా నరేంద్ర మోదీయే రెండోసారి తిరిగి ప్రధాని పగ్గాలు చేపడతారని తెలిపింది. ఇప్పటికిప్పుడు లోక్‌సభ ఎన్నికలు నిర్వహిస్తే ఏం జరుగుతుందో తెలుసుకునేందుకు 'లోక్‌నీతి-సీఎస్‌డీఎస్-ఏబీపీ' కలిసి

మిగతా 14వ పేజీలో...


ఏ ప్రాంతంలో ఎవరికెన్ని?

ప్రాంతం	స్థానాలు	ఎన్డీయే	యూపీఏ	ఇతరులు
ఉత్తర భారతం	151	106-116	10-16	24-30
తూర్పు	142	68-76	15-21	48-56
దక్షిణ	132	31-37	59-67	32-38
పశ్చిమ	118	79-89	30-36	0-2
మొత్తం	543	293-309	122-132	110-120

తీరు మారలేదు.. అడ్మిషన్లు ఆగలేదు

కార్పొరేట్ కాలేజీల ఇష్టారాజ్యం.. మెరిట్ విద్యార్థులకు గాలం.. ప్రైవేటు బదులతో ఒప్పందం

ఇప్పటికే 60 శాతం సీట్ల భర్తీ.. లక్షల్లో దోపిడీ.. ప్రకటనలకే పరిమితమైన ఇంటర్ బోర్డు 5



బయట ఉన్నా.. లోపల సున్నా



'సుఖం' ఎవరికి చేదు? నోరు లేని జంతువు, సర్వసమర్థుడైన మనిషి.. ఇలా ఈ ప్రకృతిలో సమస్తమూ కోరుకునే ఏకైక అనుభవమే సుఖం. సుఖాన్ని పొంది, హాయిగా ఆస్వాదించాలనుకోవడం సహజం. కానీ, మనిషి మాత్రం ఇందుకు భిన్నంగా ప్రవర్తిస్తాడు. సుఖాన్ని ఆస్వాదించడం కన్నా ఇతరులు గుర్తించాలని తహతహలాడుతుంటాడు. ఎప్పుడూ ఇతరుల గుర్తింపు కోసం ఆరాటపడుతుంటాడు. తద్వారా లేనిపోని తంటాలు కొనితెచ్చుకుంటాడు. బయట ఎన్ని ఉన్నా లోపల మాత్రం ఏదో తెలియని వెలితి పీడిస్తూ ఉంటుంది. ఫలితంగా.. తాను సుఖంగా ఉండలేక పక్కవారి హాయిని పాడుచేసే ప్రయత్నాలు చేస్తూ ఉంటాడు. ఇంత గందరగోళానికి కారణం.. అవివేకం. కొందరు తమకున్నదానిని ఆస్వాదించడం పక్కనపెట్టి.. ఎదుటివారితో పోల్చుకుంటూ సతమతమవుతుంటారు. ఇదో విచిత్రమైన ప్రవర్తన. తనకంటే ఇతరులకు ఏ మాత్రం కొద్దిగా ఎక్కువ ఉన్నా తట్టుకోలేరు. ఓర్వలేనితనంతో లోలోపల రగిలిపోతుంటారు. వారికి మనశ్శాంతి ఉండదు. పక్కవారికి కూడా మనశ్శాంతి లేకుండా చేస్తారు. ఇది కూడా అవివేకం వల్ల కలిగే మరో రకమైన అనర్థం. ఇలా అవివేకం వల్ల రకరకాల అనర్థాలు పుట్టుకొస్తాయి. అలాంటి అనర్థాల్లో ఒకటి.. 'మిథ్యా నిర్వేదం'. వాస్తవానికి దూరమై అవాస్తవంలో బతకడం వల్ల చివరకు తనపై తనకే విరక్తి కలిగేలా చేస్తుందీ మిథ్యానిర్వేదం. ఇదే అర్జునుడిని పట్టి పీడించింది. అందుకే యుద్ధరంగంలోకి ప్రవేశించిన అర్జునుడు యుద్ధం చేయాలనే వాస్తవాన్ని మరచి.. "న కాంక్షే విజయం కృష్ణ'.. నాకు విజయకాంక్ష లేదు. రాజ్యాలు, భోగాలు అంతకన్నా వద్దు. ఈ రాజ్యంతో నేను ఏం చేసుకోవాలి. అసలు నేను బతికి ఏం సాధించాలి?" అని ప్రశ్నించాడు.

-స్వామి పరిపూర్ణానంద

Paramjyothi
పరంజ్యోతి

డిజిటల్ తెలంగాణ

(మొదటి పేజీ తరువాయి)

వేదిక సదస్సులో పాల్గొన్న మంత్రి కేటీఆర్.. శుక్రవారం 'లివరింగ్ డిజిటల్ టు డెలివర్ వాల్యూ టు సొసైటీ' అనే అంశంపై ప్రసంగించారు. బెల్జియం, బ్రెజిల్, డెన్మార్క్ తదితర దేశాల నుంచి ఉప ప్రధానులు, కేంద్ర మంత్రులు తమ ప్రభుత్వాల తరఫున ప్రాతినిధ్యం వహించగా మంత్రి కేటీఆర్ ఒక్కరే రాష్ట్ర మంత్రి హోదాలో పలు అంశాలపై ప్రసంగించే అరుదైన, అపూర్వమైన గౌరవం దక్కించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన తెలంగాణ రాష్ట్రంలో చేపట్టిన పలు ప్రతిష్ఠాత్మకమైన ప్రాజెక్టుల గురించి వివరించారు. దావోస్‌లో ఇన్వెస్ట్ ఇండియా సంస్థ ఆధ్వర్యంలో 'పరిశోధన, అభివృద్ధి' అనే అంశంపై జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలోనూ మంత్రి కేటీఆర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా పరిశోధనా రంగానికి మరింత ప్రాధాన్యం కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. సిలికాన్‌వ్యాలీలో గొప్ప విజయాలకు కారణం అక్కడి పరిశోధన సంస్థలేనన్నారు. హైదరాబాద్‌లో సుమారు 50 పరిశోధన సంస్థలను అనుసంధానం చేస్తూ రీసెర్చ్ అండ్ ఇన్నోవేషన్ సర్కిల్ ఆఫ్ హైదరాబాద్ (రిచ్)ను ఏర్పాటు చేశామన్నారు. పరిశోధనా సంస్థల ఫలితాలు మార్కెట్‌లోకి తీసుకురావడానికి 'రిచ్' కృషి చేస్తుందన్నారు. తమ పరిశోధనా పటిమను, సాంకేతిక సత్తాను ప్రపంచానికి చాటేందుకు అతి తక్కువ ఖర్చుతో అత్యుత్తమ ఫలితాలు సాధించవచ్చునని ఇస్రో నిరూపించిందన్నారు. రానున్న కాలంలో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పెద్ద కంపెనీల నుంచి కాకుండా స్టార్టప్‌ల నుంచే వస్తాయన్నారు. ఈ రంగానికి తెలంగాణ ప్రభుత్వం అధిక ప్రాధాన్యమిస్తుందని వివరించారు. రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ రంగంలో ఆసక్తి గల కంపెనీలకు తెలంగాణ ప్రభుత్వం ఆహ్వానం పలుకుతోందని అన్నారు. టీ-హబ్, టీ-వర్క్స్, రిచ్‌లతో భాగస్వాములయ్యేందుకు ముందుకు రావాలని కోరారు. పరిశోధన ఫలితాలు, పేటెంట్, మేధో సంపత్తిని కాపాడేందుకు తెలంగాణ ఇంటెలెక్చువల్ ప్రాపర్టీ క్రైమ్ యూనిట్(టీప్కూ)ను ఏర్పాటు చేశామన్నారు. ఈ తరహాలోనే ప్రతిరాష్ట్రం ఓ నమూనాను ఏర్పాటు చేయాలని ఆయా రాష్ట్రాలకు ఉత్తరాలు రాసినట్టు కేంద్ర పారిశ్రామిక పోత్సాహక విధాన మంత్రిత్వ శాఖ (డీఐపీపీ) కార్యదర్శి అభిషేక్ తెలిపారు. ఇలాంటి విప్లవాత్మకమైన ఆలోచనలతో తెలంగాణ అనేక రంగాల్లో ఆదర్శంగా ఉందని అభినందించారు. కాగా సేల్స్‌ఫోర్స్ సీఈవో మార్క్ బెనియాఫ్.. మంత్రి కేటీఆర్ కోసం దావోస్‌లో లంచ్ ఏర్పాటు చేశారు. అనంతరం సేల్స్‌ఫోర్స్ సంస్థ అధ్యక్షుడు అమీ వీవర్‌తో, ప్రముఖ పవన విద్యుత్ సంస్థ సుజ్లాన్ చైర్మన్ తులసి తంతితో మంత్రి భేటీ అయ్యారు. సోలార్ విద్యుదుత్పాదనలో తెలంగాణ ముందు వరుసలో ఉందని, ఇందులో మరిన్ని పరిశోధనలు జరగాల్సిన అవసరం ఉందని తులసి తంతితో మంత్రి అన్నారు. ఈ సందర్భంగా తెలంగాణలో పవన విద్యుత్ ప్లాంట్‌ను ఏర్పాటు చేయడానికి సుజ్లాన్ ఆసక్తిగా ఉందని తెలిపారు.



దావోస్‌లోని ఇండియా ఇన్వెస్ట్ లాంజ్‌లో గణతంత్ర వేడుకల్లో పాల్గొన్న కేటీఆర్, లోకేశ్, గల్లా జయదేవ్ తదితరులు

ఇన్వెస్ట్ ఇండియా పెవిలియన్‌లో గణతంత్ర వేడుకలు

దావోస్‌లో వరల్డ్ ఎకనామిక్ ఫోరం సదస్సు సందర్భంగా ఏర్పాటు చేసిన ఇన్వెస్ట్ ఇండియా పెవిలియన్‌లో శుక్రవారం ఉదయం జరిగిన భారత గణతంత్ర దినోత్సవ వేడుకల్లో మంత్రి కేటీఆర్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కేంద్ర మంత్రులు పియూష్ గోయెల్, ధర్మేంద్ర ప్రధాన్‌తో పాటు ఏపీ రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్ తదితరులు త్రివర్ణ పతాకావిష్కరణలో పాల్గొన్నారు.



జ్యోతి వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న శశాంక్ గోయల్

ప్రమాదాల నివారణకు ముందస్తు జాగ్రత్తలు

▸▸ కార్మిక శాఖ ముఖ్యకార్యదర్శి గోయల్

హైదరాబాద్, జనవరి 25 (ఆంధ్రజ్యోతి) : మందుల తయారీ పరిశ్రమల్లో జరిగే ప్రమాదాల నివారణకు యాజమాన్యాలు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని కార్మిక శాఖ ముఖ్యకార్యదర్శి డాక్టర్ శశాంక్ గోయల్ సూచించారు. 'ప్రపంచస్థాయి ప్రమాణాలతో మందుల తయారీ' అన్న అంశంపై తెలంగాణ పరిశ్రమల శాఖ, నేషనల్ సేఫ్టీ కౌన్సిల్ సంయుక్తంగా గురువారం నిర్వహించిన సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. మందుల తయారీ పరిశ్రమల్లో ఎప్పటికప్పుడు కొత్తగా చోటుచేసుకుంటున్న మార్పులను గోయల్ ఈ సందర్భంగా ప్రస్తావించారు. మందుల పరిశ్రమల్లో వినియోగించే రసాయనాల విషయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవడం అత్యంత ముఖ్యమన్నారు. కాగా.. 'ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్' అంశంలో కార్మిక శాఖ చేపట్టిన సంస్కరణలకు ప్రసంశలు లభించాయని ఆయన వెల్లడించారు. ఇక మందుల తయారీ పరిశ్రమల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలకు సంబంధించి ఎప్పటికప్పుడు సదస్సులను నిర్వహించాల్సి ఉందని స్పష్టం చేశారు. సువెన్ లైఫ్ సైన్సెస్ చైర్మన్ జాస్తి వెంకట్ మాట్లాడుతూ ప్రమాదాలు జరగకుండా ముందస్తు జాగ్రత్తలను తీసుకుంటేనే కార్మికుల ప్రాణాలకు భద్రత ఉంటుందన్నారు. తెలంగాణ డైరెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ చంద్రమోహన్ మాట్లాడుతూ ప్రమాదాల నివారణ విషయంలో పరిశ్రమల యజమానులు కార్మికులకు ఎప్పటికప్పుడు అవగాహనా సదస్సులను నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

యాసిడ్ దాడి బాధితులు దివ్యాంగులే: మూర్తి

హైదరాబాద్, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): యాసిడ్ దాడి బాధితులను దివ్యాంగులుగా పరిగణిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల మార్గదర్శకాలు రూపొందించిందని సీనియర్ న్యాయవాది, తెలంగాణ దివ్యాంగుల అడ్వకేట్స్ అసోసియేషన్ సలహాదారు జేఎల్‌ఎన్ మూర్తి తెలిపారు. హైదరాబాద్ పురానీహవేలీలోని తెలంగాణ దివ్యాంగుల అడ్వకేట్స్ అసోసియేషన్ ప్రారంభోత్సవంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను దివ్యాంగులు పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలంటే.. కేంద్రప్రభుత్వం 2016లో రూపొందించిన రైట్స్ ఆఫ్ పర్సన్స్ విత్ డిసబిలిటీస్ యాక్ట్ (ఆర్పీడబ్ల్యూడీ)ను తెలంగాణ ప్రభుత్వం అమలు చేయాల్సి ఉందన్నారు.

కనుల పండువగా పశుసంక్రాంతి జాతర

నార్సింగ్/హైదరాబాద్, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ శివారు నార్సింగ్ వ్యవసాయ మార్కెట్‌లో పశుసంక్రాంతి జాతర (పశువుల సంత) కనుల పండువగా సాగింది. ఈసారి గమ్మత్ పేరు కలిగిన దున్నపోతు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. నార్సింగ్‌కు చెందిన ప్రవీణ్‌కుమార్ యాదవ్.. ఈ విత్తనం దున్నను 5 లక్షలకు విక్రయానికి ఉంచారు. పుట్టిన సమయంలో వింతగా ఉండడంతో గమ్మత్తుగా ఉందని, ఈ దున్నపోతుకు గమ్మత్ అని పేరు పెట్టామని తెలిపారు.



ప్రత్యేక ఆకర్షణగా నిలిచిన గమ్మత్ దున్నపోతు

యాసంగిలో చివరాయకట్టుకూ సాగునీరు

▸▸ కాలువల వెంట ఇంజనీర్ల పర్యవేక్షణ

▸▸ సాగునీటి సరఫరా సమీక్షలో హరీశ్

హైదరాబాద్, జనవరి 26 (ఆంధ్రజ్యోతి) : శ్రీరాంసాగర్, నాగార్జునసాగర్, నిజాంసాగర్ ప్రాజెక్టుల పరిధిలోని చివరి ఆయకట్టుకూ నీరందేలా చూడాలని మంత్రి హరీశ్‌రావు అధికారులను ఆదేశించారు. శుక్రవారం జలసౌధలో ఈ మూడు ప్రాజెక్టుల ఆయకట్టుకు అందుతున్న సాగునీటి సరఫరాపై మంత్రి సమీక్షించారు. రబీలో ఆయకట్టుకు సంబంధించి సాగునీటి సరఫరాను క్రమబద్ధం చేసేందుకు తగిన చర్యలు తీసుకోవాలని ఆయన ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. సాగునీటి సరఫరా తీరును సీఈ, ఎస్ఈ, ఈఈలు, సిబ్బంది పర్యవేక్షించాలని సూచించారు. జిల్లా కలెక్టర్ల సహకారంతో రెవెన్యూ సిబ్బందితో సమన్వయంతో పనిచేయాలని మంత్రి చెప్పారు. సంబంధిత జిల్లా మంత్రులు, ప్రజాప్రతినిధులతో సత్సంబంధాలు కొనసాగించాలన్నారు. సాగునీటి క్రమబద్ధీకరణ విషయంలో ఎలాంటి లోటుపాట్లు జరిగినా ఈఈలదే బాధ్యత అని, వారిపై చర్యలకు వెనుకాడబోమన్నారు. నీటిని వదిలినప్పుడు అప్రమత్తంగా ఉండి రబీ ఆయకట్టును కాపాడాలని పిలుపునిచ్చారు. ప్రధాన కాలువలకు ఆన్ అండ్ ఆఫ్ పద్ధతిలో సాగునీటిని సరఫరా చేస్తున్నందున దిగువన ఉన్న ఆయకట్టుకు నీరందించేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని కోరారు. శ్రీరామ్ సాగర్, మానేరు డ్యాం దిగువ ప్రాంతాల్లో ఉన్న డిస్ట్రిబ్యూటరీలు, ఎన్ఎస్‌పీ ఎడమ కాలువ కింద ఉన్న డిస్ట్రిబ్యూటరీలు, నిజాంసాగర్ కింద కాలువల పరిధిలోనూ ఆయకట్టుకు సాగునీటి సరఫరాపై క్షేత్రస్థాయి పరిస్థితిని మంత్రి సమీక్షించారు. ఎస్ఆర్ఎస్‌పీ ఎల్ఎండీ ఎగువ ప్రాంతాల్లో 4,07,417 ఎకరాలు, ఎల్ఎండీ దిగువ భాగాన 1,52,588 ఎకరాలు, ఎన్ఎస్‌పీ కింద 5,25,629 ఎకరాలు, నిజాంసాగర్ కింద 1,51,666 ఎకరాలకు ఈ యాసంగిలో తప్పనిసరిగా సాగు నీరందించాలని మంత్రి హరీష్ రావు ఆదేశించారు. సమీక్షలో ఈఎన్‌సీ మురళీధరరావు, సీఈలు శంకర్, సునీల్, మధుసూధనరావు, ఎస్ఈలు, ఈఈలు పాల్గొన్నారు.



సాహితీ సంస్కృతులకు నిలయం తెలంగాణ

▸▸ రాష్ట్ర ప్రభుత్వ సీఎస్ ఎస్పీ సింగ్



బేగంపేట/హైదరాబాద్, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ సాహిత్యం, కళలు, సంస్కృతికి నిలయమని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్పీసింగ్ అన్నారు. శుక్రవారం ఇక్కడ హైదరాబాద్ లిటరరీ ఫెస్టివల్‌ను ఆయన ప్రారంభించి మాట్లాడారు. రాష్ట్రం మఖ్దూం, సరోజినీనాయుడు, సి.నారాయణరెడ్డి లాంటి ఎందరో దిగ్గజ కవులకు జన్మనిచ్చిన భూమి అన్నారు. ఈ సాహితీ సంబురాల్లో రాష్ట్రానికి చెందిన జానపద కళా రూపాలు, నృత్యాలు, కోలాటాలు, కళాకారులు పాల్గొనడం ద్వారా వారిలో ఉన్న నైపుణ్యం ప్రపంచానికి తెలుస్తాయన్నారు. స్పెయిన్ రాయబారి కార్యాలయ అధికారి ఏడ్వార్డ్ శాన్‌చాన్ ప్రసంగిస్తూ, తెలంగాణలో వ్యాపార, సాంస్కృతిక పరంగా ఎన్నో అవకాశాలు ఉన్నాయని తెలిపారు. శాస్త్రీయ నృత్యకారిణి సోనల్ మాన్‌సింగ్ మాట్లాడుతూ భారత్ ఎదగడానికి, ఉన్నతికి ఇక్కడ ఉన్న సాహిత్యం, కళా సంపదలే కారణమని అన్నారు. తెలంగాణ పర్యాటక, సాంస్కృతిక శాఖ ముఖ్య కార్యదర్శి వెంకటేశం కన్నడ భాషలో మాట్లాడి ఆకట్టుకున్నారు.

లోకం తీరు



పురస్కారాలు ప్రకటించారు కానీ..
ఆ తెలుగు రాష్ట్రాల నుంచి వచ్చిన
అప్లికేషన్లను ముందు ఇక్కడ్నించి తీసేయ్...

ఉష్ణోగ్రతలు

కేంద్రం	కనిష్ఠం	గరిష్ఠం
ఆదిలాబాద్	4.5	30.1
రామగుండం	11.4	31.0
హైదరాబాద్	13.3	31.0
వరంగల్	14.0	30.0
ఖమ్మం	16.0	32.0

తెలంగాణ గజగజ

హైదరాబాద్, జనవరి 26 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రాన్ని చలి గజగజలాడిస్తోంది. ఆదిలాబాద్‌లో శుక్రవారం 4.5 డిగ్రీల రాత్రి ఉష్ణోగ్రత నమోదైంది. రాష్ట్ర వ్యాప్తంగా రాత్రి ఉష్ణోగ్రతలు సాధారణం కన్నా తక్కువగా నమోదయ్యాయి. ఖమ్మంలో 7 డిగ్రీలు, భద్రాచలంలో 6, హన్మకొండ, మెదక్, రామగుండంలలో 5, హైదరాబాద్, హకీంపేట, నిజామాబాద్‌లలో 3, నల్లగొండలో ఒక డిగ్రీ మేరకు సాధారణం కంటే తక్కువగా రాత్రి ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. అయితే మహబూబ్‌నగర్‌లో మాత్రం సాధారణం కంటే ఒక డిగ్రీ మేర అధికంగా రాత్రి ఉష్ణోగ్రత నమోదు కావడం గమనార్హం.



శివసేనకే ఎక్కువ నష్టం

బీజేపీ, శివసేన విడివిడిగా పోటీ చేస్తే ఎవరికి నష్టం? వేర్వేరు కుంపట్ల వల్ల బీజేపీ ఓట్లకు మాత్రమే గండిపడదు. బాగా దెబ్బతినేది శివసేనే. మా(బీజేపీ) కన్నా ఆ పార్టీయే ఎక్కువగా నష్టపోతుంది.

- మహారాష్ట్ర ముఖ్యమంత్రి ఫడణవీస్



ఫేస్‌బుక్ పెళ్లిళ్లు విఫలం!

ఫేస్‌బుక్ ద్వారా జరుగుతున్న పెళ్లిళ్లు విఫలమవుతున్నాయి. రెండు నెలల్లో వారు(ఓ కేసులో జంట) పెళ్లి చేసుకున్నారు. ఆ తరువాత సమస్యలొచ్చాయి. ఫేస్‌బుక్ ద్వారా కుదిరిన ఆధునిక పెళ్లిళ్లలో ఇదొకటి.

- జస్టిస్ జేబీ పర్దీవాలా, గుజరాత్ హైకోర్టు

నేటి పెట్రో ధరలు (లీ.)

పెట్రోల్	డీజిల్
పాత ధర రూ.76.91	పాత ధర 69.15
కొత్త ధర రూ.77.01	కొత్త ధర 69.26
పెరుగుదల 0.10 పైసలు	పెరుగుదల 0.11 పైసలు

కొవ్వు పదార్థాలతో పెద్దపేగు కేన్సర్

లాస్‌ఏంజెల్స్, జనవరి 26: కొవ్వు ఎక్కువగా ఉండే పదార్థాలను తీసుకునే వారికి పెద్దపేగు కేన్సర్ వచ్చే ప్రమాదం ఉందని ఒక సర్వే హెచ్చరిస్తోంది. ఈ మేరకు ఎలుకలపై చేసిన పరిశోధనలు ప్రమాద ఘంటికలు మోగించాయని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. సెల్ స్టెమ్ సెల్ అనే జర్నల్‌లో ఈ పరిశోధన వివరాలు వెల్లడించారు. పెద్దపేగుల్లోని స్టెమ్ సెల్స్‌లో కొవ్వు పదార్థాలు చేరి, కణుతుల్లా ఏర్పడి కేన్సర్‌కు దారి తీస్తున్నట్లు గుర్తించామన్నారు.

రుతుక్రమంపై గాలి కాలుష్యం ప్రభావం

బోస్టన్, జనవరి 26: గాలి కాలుష్యం కారణంగా యువతుల్లో రుతుక్రమం గతి తప్పుతోందని అమెరికా బోస్టన్ వర్సిటీ స్కూల్ ఆఫ్ మెడిసిన్ నిర్వహించిన పరిశోధనలో తేలింది. ముఖ్యంగా 14 నుంచి 18 ఏళ్లున్న యువతుల్లో ఇలాంటి మార్పులు గమనించినట్లు హ్యూమన్ రీ ప్రొడక్షన్ అనే జర్నల్‌లో ప్రచురించిన సర్వేలో వివరించారు. గాలి కాలుష్యం కారణంగా హృదయ, శ్వాసకోశ రుగ్మతలు వచ్చి పునరుత్పత్తి ప్రక్రియ ప్రభావితం అవుతోందని వర్సిటీకి చెందిన పరిశోధకురాలు శ్రుతి మహాలింగయ్య తెలిపారు.

పంచాయతీ ఎన్నికల ముందస్తు లేదు!



(మొదటి పేజీ తరువాయి)

నమోదు చేసుకోవటానికి, జాబితాలో చేర్పులు, మార్పులు, పేరు గల్లంతైనవారు తిరిగి నమోదు చేసుకోవడానికి అవకాశం ఇచ్చారు. మార్చి 22న ఓటర్ల తుది జాబితాను ముద్రించి, 24న విడుదల చేయనున్నారు. ఈ నేపథ్యంలో పంచాయతీ ఎన్నికలు ఫిబ్రవరిలో నిర్వహించడం అసాధ్యం. మార్చి 24 వరకు పంచాయతీ ఎన్నికల నిర్వహణ వీలు కాదని సీఎం కేసీఆర్ శుక్రవారం కొద్దిమంది మంత్రులు, టీఆర్ఎస్ ఎంపీలు, ఎమ్మెల్యేలకు సూచనప్రాయంగా తెలిపారు. పరేడ్ గ్రౌండ్‌లో గణతంత్ర వేడుకల్లో పాల్గొని తనతో పాటు ప్రగతి భవన్‌కు వచ్చిన వారితో ఆయన కొద్దిసేపు ఇష్టాగోష్ఠిగా మాట్లాడారు. పంచాయతీ ఎన్నికలు ఫిబ్రవరిలో నిర్వహించాలని గట్టిగా అనుకున్నా, ఓటర్ల జాబితా సవరణతో వీలు కావటం లేదని చెప్పారు. ఎన్నికలు ఇప్పటికిప్పుడు నిర్వహించలేని పరిస్థితి ఉన్నప్పుడు, ఇక చట్టం ఆమోదానికి తొందర ఎందుకని సీఎం కేసీఆర్ అభిప్రాయపడ్డారు. ఎలాగూ మార్చి 12 నుంచి అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు నిర్వహించాలని భావిస్తున్న నేపథ్యంలో ఆ సెషన్‌లోనే కొత్త పంచాయతీరాజ్ చట్టాన్ని ఆమోదించుకుందామని చెప్పారు. ఓటర్ల జాబితా సవరణ పూర్తయ్యాక పంచాయతీ ఎన్నికల నిర్వహణ చూద్దామని అన్నారు. కాగా, మార్చి 11 నుంచి ప్రారంభించ తలపెట్టిన కొత్త పట్టాదారు పాసు పుస్తకాల పంపిణీ, అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల సన్నద్ధత తదితర అంశాలు కూడా వారి మధ్య చర్చకు వచ్చినట్లు సమాచారం. పాసు పుస్తకాల పంపిణీ కార్యక్రమాన్ని ఒక పండుగలా నిర్వహించాలని సీఎం కేసీఆర్ చెప్పారు. ఎన్నో ఏళ్ల భూ వివాదాలకు తెరపడబోతోందని, ఈ విషయమై ప్రజలు చాలా సంతోషంగా ఉన్నారని తెలిపారు. బడ్జెట్ సమావేశాల కోసం శాఖల వారీగా సిద్ధం కావాలని ఆదేశించారు. సభలో విపక్షాలు లేవనెత్తే అంశాలను ముందే అంచనా వేసి, తగిన రీతిలో స్పందించాల్సి ఉంటుందని అన్నారు. అలాగే, ఈనెల 29 నుంచి ప్రారంభమయ్యే పార్లమెంటు బడ్జెట్ సమావేశాల్లో.. రాష్ట్రానికి కేంద్రం నుంచి రావాల్సిన నిధులు, హైకోర్టు విభజన, రిజర్వేషన్ల పెంపు సహా రాష్ట్ర విభజన సమస్యల పరిష్కారానికి గట్టిగా పోరాడాలని పార్టీ ఎంపీలకు నిర్దేశించారు.

ఓటర్ల జాబితా సవరణకు షెడ్యూలు ఇదే!	
ముసాయిదా జాబితా ప్రకటన	జనవరి 23
అభ్యంతరాల స్వీకరణ	జనవరి 23 నుంచి ఫిబ్రవరి 14
స్పెషల్ క్యాంపెయిన్ తేదీలు	ఫిబ్రవరి 4-11
అభ్యంతరాల పరిష్కారం	మార్చి 5
అప్‌డేషన్ ప్రక్రియ పూర్తి	మార్చి 15
తుది జాబితాల ముద్రణ	మార్చి 22
తుది జాబితాల ప్రకటన	మార్చి 24



మాదిగ మహిళల ఆత్మీయ సమ్మేళనం పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న వంగపల్లి శ్రీనివాస్

6న మాదిగ మహిళల ఆత్మీయ సమ్మేళనం

రాంనగర్/హైదరాబాద్, జనవరి 26 (ఆంధ్రజ్యోతి) : మాదిగ మహిళలను ఆర్థిక, రాజకీయ, సామాజిక, విద్యా రంగాల్లో చైతన్యపరిచేందుకు ఫిబ్రవరి 6న ఉస్మానియా వర్సిటీలోని టెక్నాలజీ ఆడిటోరియంలో ఆత్మీయ సమ్మేళనాన్ని నిర్వహిస్తున్నట్లు టీఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు యాతాకుల భాస్కర్ మాదిగ, కార్యనిర్వాహక అధ్యక్షుడు వంగపల్లి శ్రీనివాస్ మాదిగ, మహిళా అధ్యక్షురాలు ఆకారం రుక్కమ్మ తెలిపారు. ఈ సందర్భంగా సమ్మేళనం పోస్టర్‌ను శుక్రవారం నగరంలోని విద్యానగర్ టీఎమ్మార్పీఎస్ కార్యాలయంలో ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ సమ్మేళనంలో మాదిగ మహిళల భవిష్యత్ కార్యాచరణ, నూతన కార్యవర్గం ఏర్పాటు ఉంటాయన్నారు. సమ్మేళనానికి ప్రొఫెసర్ కంచె ఐలయ్య, ప్రొఫెసర్ రోజారాణి, జూపాక సుభద్రత, డాక్టర్ విజయలక్ష్మి, జంబుద్వీప శక్తి పీఠాధిపతి గురు భగవతి మహరాజ్‌స్వామి హాజరవుతారని తెలిపారు.

'స్మార్ట్'కు పరిష్కారం చూపండి

▸▸ ఇంజనీరింగ్ విద్యార్థులకు 'స్మార్ట్ సిటీ హ్యాకథాన్ - 2018'

హైదరాబాద్, జనవరి 26 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో స్మార్ట్ సిటీలుగా ఎంపికైన నగరాల్లోని సమస్యలకు పరిష్కారం చూపాలంటూ.. ఇంజనీరింగ్ విద్యార్థులకు ప్రభుత్వం స్మార్ట్ సిటీ హ్యాకథాన్ - 2018 పోటీ నిర్వహిస్తోంది. ఇందులో రాష్ట్రంలోని 30 ఇంజనీరింగ్ కళాశాలలకు చెందిన సుమారు ఆరు వేల విద్యార్థులు పాల్గొననున్నట్లు శుక్రవారం ఐటీ శాఖ విడుదల చేసిన ఒక ప్రకటనలో తెలిపింది. నగరాలు, పట్టణాల్లో రహదారులు, పారిశుద్ధ్యం, ఇతర సమస్యలకు 'స్మార్ట్' పరిష్కారాలు చూపే ఆలోచనలు విభాగాల వారీగా ప్రభుత్వం ఎంపిక చేస్తుందన్నారు. విజేతలను ఏప్రిల్‌లో ప్రకటిస్తామని, వినూత్న ఆలోచనలను ప్రభుత్వం స్వీకరించి పరిష్కారానికి ప్రభుత్వం ప్రత్యేక నిధులు కేటాయిస్తుందన్నారు.

దినుసు గడ్డ తీగ మేసి 70పశువులు మృతి

మరిపెడ, జనవరి 26 : పది రోజుల క్రితం గుళకలు చల్లిన దినుసు గడ్డ తీగను మేసిన 70 పశువులు శుక్రవారం మృతిచెందాయి. ఈ సంఘటన మరిపెడ మండలం వీరారం శివారు దుబ్బ తండాలో చోటుచేసుకుంది. ఈ దుర్ఘటనలో మొత్తం 40 ఎడ్లు, 25 ఆవులు, 5 బర్రెలు మృతి చెందాయి. మరో 150 పశువులు తీవ్ర అస్వస్థతకు గురయ్యాయి. సుమారు రూ. 60 లక్షలు నష్టపోయామని తండా వాసులు వాపోతున్నారు. పశువులు మృతిచెందిన బాధితులు తండాలోని ప్రతి ఇంట్లో ఉండటం గమనార్హం. సమాచారం అందుకున్న మండల పశువైద్యాధికారి, పశు సంచార వైద్యశాల సిబ్బంది హుటాహుటిన తండాకు చేరుకుని, అస్వస్థతకు గురైన పశువులకు వైద్యం చేశారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ గుడిపుడి నవీన్, రైస్ మిల్లర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు డీఎస్ రవిచంద్ర, మరిపెడ సర్పంచ్ పానుగోతు రాంలాల్ బాధితులను పరామర్శించారు.

వృద్ధ తండ్రికీ మనోవర్తి!

కుమారులంతా చెల్లించాల్సిందే.. ఆలమూరు కోర్టు సంచలన తీర్పు

ఆలమూరు, జనవరి 26: వృద్ధాప్యంలో ఉన్న తండ్రికి కుమారులంతా కలిసి మనోవర్తి చెల్లించాలంటూ.. తూర్పుగోదావరి జిల్లా ఆలమూరు జూనియర్ సివిల్ జడ్జి కోర్టు న్యాయమూర్తి ఎం.సుబ్బారావు కీలక తీర్పుని వెలువరించారు. కోర్టు వర్గాల కథనం ప్రకారం, ఆలమూరు మండలం గుమ్మిలేరుకు చెందిన పుల్లేటికుర్తి నాగభూషణానికి నలుగురు కుమారులు ఉన్నారు. అయితే వృద్ధ తండ్రికి సహకరించాల్సి వచ్చేసరికి.. వారిలో ముగ్గురు ముఖం చాటేయడంతో 2016 జనవరి 30న కోర్టును ఆశ్రయించాడు. దీనిపై గురువారం కోర్టు తీర్పు వెలువరించింది. కుమారులలో ముగ్గురు ఒక్కొక్కరు నెలకు రూ.1,500 చొప్పున మనోవర్తి కింద చెల్లించాలని, ప్రభుత్వ ఉద్యోగం చేస్తున్న మరో కుమారుడు 4వేలు చెల్లించాలని జడ్జి తీర్పిచ్చారు.

శేష వాహనంపై ఊరేగిన ఆది దంపతులు



నల్లగొండ జిల్లా చెర్వుగట్టు శ్రీ పార్వతీ జడల రామలింగేశ్వర స్వామి దేవస్థానంలో వార్షిక బ్రహ్మోత్సవాల్లో శుక్రవారం పార్వతీ పరమేశ్వరులకు శేషవాహన సేవ నిర్వహించారు. కల్యాణమూర్తులైన ఆది దంపతులను సేవించుకునేందుకు లోక విహారం చేయడానికి ఆదిశేషు వాహనంగా మారిన కారణంగానే ఈ సేవ నిర్వహిస్తున్నట్లు యాజ్ఞీకులు తెలిపారు. శేష వాహనంపై ఆసీనులైన ఉత్సవమూర్తులకు కొండపై సేవ నిర్వహించారు. – నార్కట్‌పల్లి

దుకాణాలకు మొక్కుబడి 'బంగారం'

- మేడారంలో దళారుల మాయాజాలం
- మళ్లీ భక్తులకే జోరుగా అమ్మకం
- చోద్యం చూస్తున్న అధికారులు

భూపాలపల్లి, జనవరి26 (ఆంధ్రజ్యోతి) : దళారుల కక్కురి మేడారం భక్తుల మనోభావాలను దెబ్బతీస్తోంది. మహాజాతరలో తల్లులకు సమర్పించే బంగారం (బెల్లం) మహాప్రసాదం. గద్దెల వద్ద ఒక్క బెల్లం ముక్క దొరికితేనే భక్తులు సంబరపడిపోతుంటారు. అలాంటి బంగారాన్ని గద్దెల వద్ద సేకరించి తిరిగి భక్తులకే విక్రయిస్తూ కొందరు సొమ్ము చేసుకుంటున్నారు. మేడారంలో ఈ నెల 31 నుంచి ఫిబ్రవరి 3వ తేదీ వరకు జాతర జరగనున్న నేపథ్యంలో 15 రోజుల ముందు నుంచే భక్తులు తరలివస్తున్నారు. సమ్మక్క, సారలమ్మ తల్లులకు మొక్కుబడులుగా నిలువెత్తు బంగారం సమర్పించుకుంటున్నారు. ఇలా రోజూ గద్దెల వద్ద టన్నుల కొద్దీ బెల్లం పోగవుతుండడంతో రీసైక్లింగ్‌కు బాటలు పడుతున్నాయి. గద్దెల నుంచి తరలించే క్రమంలో 5, 10 కిలోల బెల్లం బుట్టలను జాతర ప్రాంగణంలోని టెండరుదారుల షాపులకు తరలించి తిరిగి భక్తులకే విక్రయిస్తున్నారు. తల్లులకు ఓ సారి సమర్పించిన బంగారాన్ని మళ్లీ విక్రయించడం అపచారమని భక్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వాస్తవానికి గద్దెల వద్ద పోగైన బెల్లాన్ని తీసుకెళ్లడంతోపాటు ఆలయ ప్రాంగణాన్ని శుభ్రంగా ఉంచేందుకు దేవాదాయ శాఖ టెండరు నిర్వహించింది. ఈ టెండరును మేడారం, వరంగల్‌లో కాకుండా జాతరకు సంబంధమే లేని కొత్తగూడెం జిల్లా మణుగూరులో నిర్వహించారు. దేవాదాయ శాఖ అధికారుల తీరుపై అప్పుడే అనుమానాలు వ్యక్తమయ్యాయి. వాటిని నిజం చేస్తూ దేవాదాయ, పోలీసు, ఎక్సైజ్ శాఖల అధికారులు బెల్లం తరలింపు, గోదాం నిల్వలపై దృష్టి సారించకపోవడంతో రీసైక్లింగ్ దందా యథేచ్ఛగా సాగుతున్నట్లు తెలుస్తోంది. ఇలా ఇప్పటికే వేల టన్నుల బెల్లం రీసైక్లింగ్ జరిగినట్లు సమాచారం. ఇప్పటికైనా అధికారులు దృష్టి సారించి బెల్లం రీసైక్లింగ్‌కు అడ్డుకట్ట వేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు.



జాతర ప్రాంగణంలో గద్దెల వద్ద భక్తులు సమర్పించిన బెల్లం

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య

తిరుమలాయపాలెం: ఖమ్మం జిల్లా తిరుమలాయపాలెం మండలం వెదుళ్లచెరువులో రైతు అనిల్‌కుమార్ (28) ఆత్మహత్య చేసుకున్నాడు. అప్పులు పెరిగిపోయి తీర్చే మార్గం కానరాక శుక్రవారం పురుగుల మందు తాగాడు.

కూతురితో సహా తల్లి ఆత్మహత్య



నిర్మల, శృతి (ఫైల్)

బీబీనగర్ : భర్త మందలించాడనే కోపంతో భార్య ఏడాదిన్నర కూతురితో సహా ఆత్మహత్యకు పాల్పడింది. యాదాద్రి భువనగిరి జిల్లా బీబీనగర్ మండలం మధిర గూడూరులో నిర్మల (25)ను భర్త శ్రీశైలం మందలించాడు. దీంతో మనస్తాపానికి గురైన ఆమె తనతో పాటు ఇద్దరు చిన్నారులపై కిరోసిన్ పోసి నిప్పంటిస్తుండగా పెద్ద కూతురు పరుగెత్తి తప్పించుకుంది. నిర్మల, చిన్న కూతురు శృతి మృతిచెందారు.

విద్యుదాఘాతంతో ఇద్దరి మృతి

దౌల్తాబాద్, జనవరి 26: వికారాబాద్ జిల్లా దౌల్తాబాద్ మండలం ఊరగుంట తండాలో శుక్రవారం బోరు బావిలో మోటారు దించుతుండగా 11 కేవీ విద్యుత్ తీగకు తగిలి వాల్యానాయక్ (32), శ్రీశైలం (20) మృతి చెందారు. వీరితో పాటు ఒకరి పరిస్థితి విషమంగా ఉంది.

లక్ష్యం 2500 మెగావాట్లు

గణతంత్ర వేడుకల్లో సింగరేణి సీఎండీ శ్రీధర్ ● విజయపథంలో సింగరేణి: డైరెక్టర్ పవిత్రన్

హైదరాబాద్/ కొత్తగూడెం, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): సింగరేణిలోని అన్ని ఖాళీ ప్రదేశాల్లో 500 మెగావాట్ల సౌర విద్యుత్ ఉత్పాదన లక్ష్యంగా పెట్టుకున్నామని, ఐదేళ్లలో 2,500 మెగావాట్ల విద్యుత్తు ఉత్పత్తి చేయాలనేది లక్ష్యమని సింగరేణి సీఎండీ ఎన్. శ్రీధర్ ప్రకటించారు. గణతంత్ర దినోత్సవం సందర్భంగా శుక్రవారం హైదరాబాద్ లోని సింగరేణి భవన్‌లో ఆయన జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి మాట్లాడారు. వచ్చే ఐదేళ్లలో 13 కొత్త గనులను ప్రారంభించి 85 మిలియను టన్నుల ఉత్పత్తిని సాధించనున్నామని వివరించారు. సంస్థభారీ విస్తరణకు సంసిద్ధమవుతోందనీ, 2022 నాటికి 850 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి, 2500 మెగావాట్ల విద్యుత్తు ఉత్పత్తి లక్ష్యంగా ప్రణాళికలు అమలు చేస్తామని చెప్పారు. కార్మికులు, అధికారులు మరింత అంకిత భావంతో పని చేయాలన్నారు. ఈ సంవత్సరం కంపెనీ లాభాలు 1000 కోట్ల రూపాయలు దాటే అవకాశం ఉందన్నారు. రూ.8,250 కోట్లతో మంచిర్యాల జిల్లా జైపూర్ వద్ద 1200 మెగావాట్ల థర్మల్ విద్యుత్ కేంద్రాన్ని నెలకొల్పామని, దీని ద్వారా ఏటా 3,500 కోట్ల రూపాయల అమ్మకాలు జరుగుతున్నాయనీ, ఈ ఏడాది రూ.350 కోట్ల లాభం ఆర్జించినట్టు వివరించారు. ఉత్తమ అధికారిగా ఎంపికైన దుండె వెంకటేశం (డిప్యూటీ మేనేజర్), ఉత్తమ ఉద్యోగులుగా ఎంపికైన ఎ.భాస్కర్ , తెరవల్లి శేషగిరిరావు, ఎం.రవీందర్, ఎ.రామును సన్మానించారు. తెలంగాణ ఆవిర్భావం తర్వాత సింగరేణి సంస్థ అనేక విజయాలు సాధిస్తూ.. బొగ్గు ఉత్పత్తి, రవాణా, సంక్షేమ కార్యక్రమాల అమలులో వృద్ధిని సాధిస్తోందని సంస్థ డైరెక్టర్ పవిత్రన్ కుమార్ తెలిపారు. శుక్రవారం కొత్తగూడెంలోని సింగరేణి ప్రకాశం స్టేడియంలో ఆయన జాతీయ పతాకావిష్కరణ చేసి ప్రసంగించారు. రాష్ట్రం ఏర్పడక ముందు 2013-14లో 50 మిలియన్ టన్నుల యూనిట్ల బొగ్గు ఉత్పత్తి చేసిన మనం ఈ ఏడాది 62 మిలియన్ టన్నులకు పైగా బొగ్గు ఉత్పత్తిని చేపడుతున్నామన్నారు.



కొత్తగూడెంలో జాతీయ పతాకానికి వందనం చేస్తున్న డైరెక్టర్ పవిత్రన్ కుమార్



'ఆకుపచ్చని సూర్యోదయం' నవలను ఆవిష్కరిస్తున్న దృశ్యం

విప్లవ చైతన్యాన్ని అగ్నిపునీతం చేసిన
మహనీయుడు అల్లూరి

- నవలావిష్కరణ సభలో వక్తలు

హైదరాబాద్ సిటీ జనవరి 26 (ఆంధ్రజ్యోతి): విప్లవ చైతన్యాన్ని అగ్నిపునీతం చేసిన మహనీయుడు అల్లూరి సీతారామరాజు అని పలువురు వక్తలు కొనియాడారు. మన్యం వీరుడు అల్లూరి జీవిత విశేషాలపై ప్రముఖ రచయిత డాక్టర్ గోపరాజు నారాయణ రావు రాసిన 'ఆకుపచ్చని సూర్యోదయం' నవలను శుక్రవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో సీనియర్ జర్నలిస్టు రామచంద్రమూర్తి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్ వకుళాభరణం రామకృష్ణ, పారిశ్రామికవేత్త కనుమూరి రామకృష్ణం రాజు, కేంద్ర సాహితీ అవార్డు గ్రహీత కె.శివారెడ్డి, నిర్మలానంద, పొన్నపల్లి రామారావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రవి అస్తమించని బ్రిటిష్ సామ్రాజ్య పాలకులను ఆదివాసీల సాయంతో అల్లూరి గడగడలాడించారన్నారు. 'దేశ స్వాతంత్ర్యోద్యమంలో తన ప్రాణాలను అర్పించిన ధీరుడు అల్లూరి సీతారామరాజు. భారత జాతి బతికున్నంత కాలం ఆయన చరిత్ర నిలిచి ఉంటుంది. బ్రిటిష్ కాలంలో గిరిజనులు ఏ విధమైన క్షోభను అనుభవించారో.. ఈ నవలలో చక్కగా వివరించారు. ఇప్పుడు కూడా గిరిజనులపై అదే దోపిడీ జరుగుతోంద'ని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం గోపరాజు తన మొదటి నవలను నిర్మలానందకు అందించారు.

మావోయిస్టుల వెరుపుదాడి?

- ఇసుకర్యాంప్‌లో మూడు లారీల దగ్ధం

పినపాక, జనవరి 26: భద్రాద్రికొత్తగూడెం జిల్లా పినపాక మండలం భూపతిరావుపేట ఇసుక ర్యాంప్‌పై శుక్రవారం రాత్రి మావోయిస్టులు మెరుపు దాడి చేసినట్టు తెలుస్తోంది. అక్కడ ఉన్న మూడు ఇసుక లారీలు దగ్ధం చేసినట్టు తెలుస్తోంది. మరిన్ని ట్రాక్టర్లు, పొక్లెయిన్లను దగ్ధం చేశారని ప్రచారం జరుగుతోంది. రాత్రి 10.30 సమయంలో సాయుధులైన నక్సల్స్ ఒక్కసారిగా ర్యాంప్‌పై దాడిచేసి విధ్వంసానికి పాల్పడినట్టు సమాచారం. దీంతో ర్యాంప్ నిర్వాహకులు తలోదిక్కు పారిపోయినట్టు తెలుస్తోంది. ఘటన జరిగిన గంట తర్వాత స్పెషల్ పార్టీ పోలీసులను పంపుతున్నట్టు డీఎస్పీ సాయిబాబా 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు. లారీలు దహనమైన విషయాన్ని డీఎస్పీ సాయిబాబా ధ్రువీకరించారు. ఈ ఘటనతో మావోయిస్టుల హిట్ లిస్టులో ఉన్న నేతలు సురక్షిత ప్రాంతాలకు వెళుతున్నట్టు సమాచారం. అయితే ఇది మావోయిస్టుల పనేనా అన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి. పదేళ్లుగా స్తబ్దుగా ఉన్న పినపాకలో ఈ ఘటన కలకలం రేపింది.

మేడారానికి గణేశ్ ఉత్సవాల తరహా బందోబస్తు

- సెక్టార్లుగా 10 కిలోమీటర్ల పరిధి
- ప్రతి సెక్టార్‌లో మినీ కంట్రోల్ రూం
- సీసీ, క్రౌడ్ డిటెన్షన్ కెమెరాలు
- రాత్రివేళ నైట్‌విజన్ కెమెరాలు



వనదేవతల గద్దె మొక్కులు చెల్లించుకుంటున్న భక్తులు

హైదరాబాద్/మేడారం, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): మేడారం జాతరకు హైదరాబాద్ గణేశ్ ఉత్సవాల స్థాయిలో కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్లు చేయాలని పోలీసు శాఖ నిర్ణయించింది. జాతర ప్రధాన ప్రదేశంతోపాటు సుమారు 10 కి లోమీటర్ల మేర భక్తుల రద్దీ ఉంటుందని అధికారులు అంచనా వేశారు. బందోబస్తు, శాంతిభద్రతలు, ట్రాఫిక్ క్రమబద్ధీకరణ కోసం ఆ పది కిలోమీటర్ల ప్రాంతాన్ని కొద్ది రోజుల క్రితమే పోలీసులు పూర్తిగా తమ ఆధీనంలో తీసుకున్నారు. ఈ ప్రాంతాన్ని సెక్టార్లుగా విభజించి ఒక్కో అధికారిని ఇన్‌చార్జిగా నియమించారు. ఒక్కో సెక్టార్ పరిధిలో మినీ కంట్రోల్ రూం ఏర్పాటు చేసి ఎప్పటికప్పుడు పరిస్థితిని సమీక్షిస్తారు. మినీ కంట్రోల్ రూంలను ప్రధాన కంట్రోల్ రూంకు అనుసంధానం చేశారు. దీంతో జాతరకు వచ్చే ప్రతి వాహనం, ప్రతి వ్యక్తి కదలికలపైన నిఘా ఉంటుంది. ఈ పది కిలోమీటర్ల పరిధి లో ఇప్పటికే బాంబుస్క్వాడ్, డాగ్ స్క్వాడ్ బృందాలతో తనిఖీ నిర్వహించారు. అనుమానితుల కదలికలు గుర్తించేందుకు డ్రోన్ కెమెరాలను వినియోగిస్తున్నారు. పగటిపూట మాత్రమే కాకుండా రాత్రి వేళల్లోను నైట్ విజన్ డ్రోన్ల సహకారంతో పోలీస్ నిఘా కొనసాగిస్తున్నారు. నిరంతర కమ్యూనికేషన్ కోసం ఇంటర్నెట్, పోలీస్ యాప్‌ను వాడుకలోకి తెచ్చారు. డీజీపీ మహేందర్ రెడ్డి స్వయంగా జాతరకు వెళ్లి అక్కడ బందోబస్తు ఏర్పాట్లను సమీక్షించారు. కాగా మేడారానికి శుక్రవారం భక్తులు భారీగా తరలివచ్చారు.. ఎమ్మెల్యేలు, వినయ్‌భాస్కర్, ఎర్రబెల్లి దయాకర్‌రావు, ఆరూరి రమేష్ మొక్కులు చెల్లించుకున్నారు. ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ వనదేవతలను దర్శించుకుని నిలువెత్తు బంగారాన్ని (బెల్లం) తులాభారం వేసి అమ్మవార్లకు సమర్పించారు.

శాస్త్ర పండితులను అందజేస్తాం

- శారదా పీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి



రథోత్సవాన్ని ప్రారంభిస్తున్న స్వరూపానందేంద్ర

పెందుర్తి, జనవరి 26: శాస్త్ర పండితులను భావితరాలకు అందజేసే బాధ్యతను శారదా పీఠం తీసుకుంటుందని పీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి ప్రకటించారు. విశాఖ చినముషిడివాడలోని శారదాపీఠం వార్షిక వేడుకలు వైభవంగా జరుగుతున్నాయి. మూడవ రోజు శుక్రవారం శాస్త్ర మహాసభలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా పీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి మాట్లాడుతూ ప్రస్తుతం శాస్త్ర పండితులు తగ్గిపోతున్నారని ఆందోళన వ్యక్తంచేశారు. ఈ నేపథ్యంలో శాస్త్ర పండితులను తీర్చిదిద్దే బాధ్యతను ఒక యజ్ఞంలా నిర్వహించాలని సూచించారు. వేద పండితులంతా కలిసి శాస్త్ర పండితుల ఉద్ధరణకు సదస్సు నిర్వహించాలని కోరారు. ఇందుకు టీటీడీతో చర్చించి శారదాపీఠం తరపున పూర్తి సహకారం అందజేస్తామని వెల్లడించారు. సభలకు దేవాదాయ ఆగమ శాస్త్ర చైర్మన్ చిర్రావూరి రామశర్మ అధ్యక్షత వహించారు. సాయంత్రం సుబ్రహ్మణ్యస్వామి రథోత్సవం నేత్రపర్వంగా సాగింది. వల్లీ దేవసేన సహిత సుబ్రహ్మణ్యస్వామి కల్యాణం జరిగింది. ఆస్థాన వేద పండితులు శ్రీకృష్ణశర్మ ఆధ్వర్యంలో చతుర్వేద, సంహిత, స్కంధ యాగాలు, వనదుర్గా హోమం నిర్వహించారు.

'ఉపాధి' పనుల్లో నాణ్యత భేష్: ఐఈజీ సర్వేలో వెల్లడి

న్యూఢిల్లీ, జనవరి 26: మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంపనుల్లో నాణ్యతా ప్రమాణాలపై ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎకానమిక్ గ్రోత్ (ఐఈజీ) ఇటీవల ఓ సర్వే చేపట్టింది. పనుల నాణ్యత చాలా సంతృప్తికరంగా ఉన్నట్లు 76శాతం మంది సర్వేలో అభిప్రాయపడ్డారు. సర్వే వివరాలను కేంద్ర గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ శుక్రవారం వెల్లడించింది. ఉపాధి హామీ పథకం కింద 2016-17లో దేశవ్యాప్తంగా 1.02 కోట్ల పనులు పూర్తయ్యాయని ఆ శాఖ వివరించింది.

కోవింద్ హితవు

గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ చేసిన తొలి ప్రసంగం కొన్ని కీలకమైన అంశాలను పరోక్షంగానైనా ప్రస్తావించినందుకు సంతోషించాలి. సంక్షుభిత సందర్భాల్లో ప్రధాని నోరువిప్పాలనీ, హితవులతోనో, హెచ్చరికలతోనో పరిస్థితిని గాడినపెట్టాలని అనేకులు డిమాండ్ చేయడమూ, అది కనీసం వెంటనే జరగకపోతూండటమూ తెలిసిందే. ఆనవాయితీగా సాగే రాష్ట్రపతి ప్రసంగానికి పెద్ద ప్రజాకర్షణ గుణం ఉండకపోవచ్చును గానీ, వర్తమాన పరిస్థితులపైన రాజకీయ పెద్దలెవరూ నోరువిప్పని స్థితిలో రాజ్యాంగ పరిరక్షకుడి హెచ్చరికలకు ప్రాధాన్యం ఉంటుంది.

నాగరిక సమాజంలో ఉన్న మనమంతా నాగరికంగా ప్రవర్తించాలనీ, ఇతరుల అభిప్రాయాలకు, హక్కులకు విలువనివ్వాలని కోవింద్ చేసిన వ్యాఖ్య 'పద్మావత్' హింస పతాకస్థాయికి చేరిన నేపథ్యంలో చెప్పిన హితవుగా అనేకులు భావిస్తున్నారు. విభేదించడాన్ని సమర్థిస్తూనే అది ఇతరులను అవమానించేట్టుగా, గౌరవాన్నీ, హుందాతనాన్నీ ఎగతాళి చేసేట్టుగా ఉండకూడదన్నారు ఆయన. వేడుకలు చేసుకున్నా, నిరసనలు చేపట్టినా అవి ఇతరులకు అసౌకర్యాన్ని కలిగించే, ఆందోళన రగిలించే విధంగా ఉండకూడదని ఆయన చెప్పారు. చారిత్రక అంశాలైనా అంటూ ఆయన ప్రత్యేకంగా చేసిన ఉటంకింపు, 'పద్మావత్' ఆందోళనలనే కాక, ఇటీవలే కోరేగాం 200సంవత్సరాల స్మృతి దివస్ హింసాత్మకంగా మారిన ఘట్టాన్ని కూడా దృష్టిలో పెట్టుకొని చేసిందని కొందరి భావన. రాష్ట్రపతి మనసులో ఏ సంఘటనలు ఉన్నప్పటికీ, విభేదమన్నది అతి సులభంగా హింసాత్మక రూపాన్ని తీసుకుంటున్న వర్తమాన కాలంలో రాష్ట్రపతి హితవు అత్యంత ప్రధానమైనది, అవశ్యకమైనది. దేశాన్ని కుదిపేసిన సుప్రీంకోర్టు వివాదాన్ని దృష్టిలో పెట్టుకొని రాష్ట్రపతి చేసిన వ్యాఖ్యలు కూడా సముచితంగా ఉన్నాయి. వ్యక్తులకంటే వ్యవస్థలు పెద్దవని గుర్తుచేస్తూ, ప్రతి వ్యవస్థలోనూ వ్యక్తులు క్రమశిక్షణతో, పరిధులకు కట్టుబడి పనిచేయవలసిందేనని తేల్చిచెప్పారు ఆయన. వ్యవస్థల ఔన్నత్యాన్ని నిలబెడుతూ, వీరంతా ప్రజలకు బాధ్యులుగా ఉండాలన్నారు. న్యాయవ్యవస్థ సంక్షోభాన్ని మాత్రమే కాక, సకల వ్యవస్థల్లోనూ కనిపిస్తున్న పతనాన్ని కూడా దృష్టిలో పెట్టుకొనే రాష్ట్రపతి ఈ వ్యాఖ్యలు చేశారని భావించవచ్చు. లాభాపేక్ష వదులుకోవాలని, భారతదేశపు అత్యున్నత దాతృత్వ సంస్కృతిని అలవర్చుకోవాలని ఈ దేశంలోని ధనికులకు ఆయన ఇచ్చిన పిలుపు కూడా సమయోచితమైనదే. కుబేరుల సంఖ్య వేగంగా పెరుగుతూ, 80శాతం మంది సంపదను ఒకశాతమే పోగేసుకుంటున్న దేశంలో ఈ హితవు బిలియనీర్ల చెవులకు ఎక్కుతుందా లేదా అన్నది వేరే విషయం. స్తోమత కలిగిన వారంతా రాయితీలను స్వచ్ఛందంగా వదులుకోవాలన్నది ఆయన మాటగా వినిపించినప్పటికీ అది మోదీ విధానాల్లో భాగమే. ఉపరితలంలో ఈ హితవు స్తోమత ఉన్నవారినుంచి రాయితీలను పెరికివేసి, వాటిని పేదలకు పంచే లక్ష్యంగా, ఎంతో ఉన్నతంగా కనిపిస్తుంది. కానీ, ఉన్నవారికంటే లేనివారినే ఎక్కువగా గొరిగేస్తున్న వాతావరణం ఇప్పుడున్నది. దేనినీ ఉచితంగా తీసుకోవడానికి ప్రజలు సిద్ధంగా లేరని ప్రధాని ఈ మధ్యనే ఓ వ్యాఖ్య చేశారు. క్రమంగా సబ్సిడీలను ఎత్తివేయడం, ఆధార్ తదితర ప్రక్రియల ద్వారా అనేక పథకాల్లో అర్హుల సంఖ్యను తగ్గించి రోడ్డునపడవేయడం, రాయితీలు స్వచ్ఛందంగా వదులుకోమని చెబుతూ, ఏవో ప్రాతిపదికలు సృష్టిస్తూ తామే అనేకమందిని అనర్హులను చేయడం వంటివి జరుగుతున్నవే. దారిద్ర్యాన్ని నిర్మూలించాలనే ఉన్నతమైన లక్ష్యం మనముందున్నదని రాష్ట్రపతి గుర్తుచేశారు. ఆ లక్ష్యదిశగా బలమైన నిర్దిష్టమైన కార్యక్రమాలేవీ లేకుండా, పూర్తి భిన్నమైన మార్గంలో ప్రభుత్వాలు నడుస్తున్న విషయం కూడా రాష్ట్రపతికి తెలియంది కాదు.

గణతంత్ర దినోత్సవం ఈ మారు మరింత ఘనంగా జరిగినట్టు కనిపించింది. పది ఆసియాన్ దేశాల అధినేతలు ఈ దేశ మిలటరీ శక్తిని ప్రత్యక్షంగా చూశారు. ఈ దేశాలను తనవైపునకు తిప్పుకొనే చైనా ప్రయత్నానికి అడ్డుకట్టవేయడానికీ, ప్రాంతీయ సహకారంతో దగ్గరకు తీసుకోవడానికీ ఈ సందర్భం తోడ్పడవచ్చు. రాజ్యాంగం అమలులోకి వచ్చిననాడు ఇలా సైనిక శక్తిని, ఆయుధ శక్తినీ ప్రపంచానికి చూపడం అనవాయితీగా జరుగుతున్నదే. దీనికి ముందుగా ఈ మారు రాజ్యాంగ స్ఫూర్తికి భిన్నంగా వ్యవహరించే శక్తి కూడా మనకు ఉన్నదని చూపించాం. భావ ప్రకటనాస్వేచ్ఛను పాతరేసే శక్తులు నడివీధుల్లో వీరంగం వేశాయి. సర్వోన్నత న్యాయస్థానం ఆదేశించినా, చట్టాలకు, వ్యవస్థలకు లోబడే పద్మావత్ చిత్రం విడుదలవుతున్నా చివరకు పసిపిల్లలు ప్రయాణించే బస్సును కూడా తగులబెట్టిన ఉన్మాదులను చూశాం. ఈ విధ్వంసకారులకు పరోక్షంగా వత్తాసు పలుకుతూ రాజ్యాంగాన్ని ఉల్లంఘించడానికీ, ప్రజాస్వామ్యాన్ని పాతరేయడానికి కొందరు పాలకులు సిద్ధపడ్డారు. ప్రజాస్వామ్యం బలంగా వేళ్ళూనుకొని, ఆర్థిక రంగంలోనూ, ఆహారోత్పత్తిలోనూ నిలదొక్కుకొని, శాస్త్ర సాంకేతిక రంగాల్లో దేశం దూసుకుపోతున్న దశలో రాజ్యాంగ స్ఫూర్తికి విఘాతం కలిగించే శక్తులపట్ల అప్రమత్తంగా ఉండవలసిన అవసరం ఉన్నది.

బీసీ అధ్యయన కేంద్రం ఉండాలి!

కష్టమైన పనిని భుజం మీద వేసుకుని ముందుకుసాగటం, విరుగుడులేని సమస్యలకు విముక్తి కల్గించటం అన్నది ఎవరికైనా సవాలే. సవాళ్లను తన గెలుపు బాటగా మలుచుకోవటం తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు ప్రత్యేకతగా మారింది. కేసీఆర్ ఎవరూ అడగకుండానే, డిమాండ్లు అంతగా లేకున్నప్పటికినీ ఎంబీసీలు, సంచారజాతులకు సంబంధించి వారి జీవనముఖచిత్రం మార్చటానికి సిద్ధపడ్డారు. ఇది మంచి పరిణామం. ఇప్పటి వరకు దేశంలో ఏ రాష్ట్ర ప్రభుత్వమూ ఈ సామాజిక వర్గాల శ్రేయస్సుపై ఇంతగా శ్రద్ధ చూపలేదు.

ఎంబీసీలు, సంచారజాతులకు సంబంధించి మినిస్ట్రీ ఆఫ్ సోషల్ జస్టిస్ అండ్ ఎంపవర్‌మెంటు శాఖ 2015 మార్చి 17న విడుదల చేసిన ప్రకటన చూస్తే సంచారజాతులు ఎంత దుస్థితిలో ఉన్నాయో తెలుస్తుంది. కేంద్రప్రభుత్వం నేషనల్ కమిషన్ ఫర్ డీ నోటిఫైడ్, నొమాడిక్ అండ్ సెమినొమాడిక్ ట్రైబ్స్ (ఎన్‌సిడిఎన్‌టి) ని 2015 జనవరిలో నియమించింది. అన్ని రాష్ట్రాల నుంచి సంచారజాతులకు సంబంధించిన సమాచారాల్ని అందించమని కోరింది. ఏపే రాష్ట్రాలలో ఎంతెంత మంది సంచారజాతులవారున్నారు? ఇప్పటి వరకు గుర్తించిన కులాలెన్ని? గుర్తించని కులాలెన్ని? అని కేంద్రమే అడిగిందంటే విషయం అర్థం చేసుకోవచ్చు. దేశంలో 10శాతం మంది సంచారజాతుల వారున్నారని మాత్రం ఒక అంచనా వేసి చెబుతున్నారు. సరైన లెక్కలు లేవు.

తెలంగాణ ప్రభుత్వం మొత్తం తెలంగాణ సమాజాన్ని గణన చేయవలసి ఉంది. బీసీ కమిషన్ అధ్యయనానికి జనాభా గణన అన్నది అత్యంత ముఖ్యమైనది. తెలంగాణ జిల్లాల్లో ఎక్కడ సంచారజాతులు బాగా ఉన్నారో సరిగ్గా లెక్కలు సేకరించవలసి ఉంది. అన్ని జిల్లాల నుంచి సమగ్ర సమాచారం తెచ్చుకోవాలి. జిల్లా పాలనా యంత్రాంగం కలెక్టర్ నుంచి తహసీల్‌దారు వరకు వాళ్లకున్న పరిధిలో ప్రస్తుతం అందుబాటులో ఉన్న సమాచారాన్ని అందించగలరు కానీ పూర్తిగా సంచారజాతుల సమాచారాన్ని రాబట్టడానికి ఒక పైలట్ ప్రాజెక్టులాగా బీసీ కమిషన్ కృషి చేయవలసి ఉంది. తమిళనాడు రాష్ట్రంలో సత్యనాధన్, జస్టిస్ అంబశంకర్ కమిషన్లు తొలిసారిగా గుర్తింపులేని కులాలు, సంచారజాతులు, విముక్తిజాతులు ఎవరన్న నిర్ధారణకు వచ్చాయి. ఇందుకోసం ఎంతో కృషి చేసి వీరిని గుర్తించటం జరిగింది. బీసీలలో ఉన్న ఈ సంచారజాతుల వారికి ఒక్క అంటరానితనం మాత్రం మినహాయింపు ఉంది గానీ మిగతా విషయాల్లో వీళ్ల దారుణమైన జీవితం గడుపుతున్నారని సత్యనాధన్, జస్టిస్ అంబశంకర్ కమిషన్లు గుర్తించాయి. తమిళనాడులో వీరిని ఎంబీసీల కింద చేర్చటం జరిగింది. తమిళనాడులో ఓబీసీలకు 10 శాతం, విముక్త జాతులకు 10 శాతం, అత్యంత వెనుకబడిన కులాలకు 10 శాతం, వెనుకబడిన ముస్లింలకు 3.5శాతం, వెనుకబడిన క్రిస్టియన్లకు 2.5శాతం రిజర్వేషన్లు ఇవ్వటం జరిగింది. మహారాష్ట్రలో విముక్తిజాతులు, సంచారజాతులకు 3శాతం రిజర్వేషన్లు ఇవ్వటం జరిగింది.



తెలంగాణ జనాభాలో సగ భాగంగా ఉన్న బీసీల జీవనవిధానంపై నిరంతరం అధ్యయనం చేసేందుకు బీసీ అధ్యయన కేంద్రాన్ని ప్రారంభించాలి. ఈ 'థింక్‌ట్యాంక్'ను బీసీ కమిషన్ ఆధ్వర్యంలోనే నిర్వహించాలి. బీసీ అధ్యయన కేంద్రం చేసే నిరంతర అధ్యయనం బీసీ కమిషన్ కృషికి మరింత దోహదపడే విధంగా ఉండగలదు.

రెన్‌కే సిఫారసుల ప్రకారం అవిభక్త ఆంధ్రప్రదేశ్‌లో డిఎన్‌టీలు 59 కులాలు, ఎన్‌టీలు 60 కులాలున్నాయని చెప్పింది. రెన్‌కే సిఫారసులను ఇప్పటి సంచారజాతుల కమిటి జాతీయ ఛైర్మన్ బిక్కురాంజీ ఇదాత్ పరిశీలించి నిర్ణయం తీసుకోవాల్సి ఉంది. సంచారజాతులుగా ఉండి బీసీ, ఎస్సీ, ఎస్టీల్లో గుర్తింపు లేని కులాలను గుర్తించి ధ్రువీకరించాలన్న ప్రయత్నం మొదలైంది. తెలంగాణలో బీసీలలో ఉన్న 18 కులాలు తాము సంచారజాతులమని బిక్కురాంజీ ఇదాత్‌కు విన్నవించారు. దీన్ని పరిగణనలోకి తీసుకుంటారా? లేదా? తెలియదు. డిఎన్‌టీ కమిషన్ వెబ్‌సైట్‌లో మాత్రం వీటి వివరాలను పొందుపర్చారు. 1963 బాలాజీ/ మైసూర్‌స్టేట్ కేసులో సబ్‌కేటగిరీ గురించి మాట్లాడవద్దని అప్పటి కోర్టు చెప్పింది. వెనుకబడిన తరగతులు, అత్యంత వెనుకబడిన తరగతులు అన్నదాన్ని ఆనాటి మైసూర్ హైకోర్టు కొట్టివేసింది. కాని 1992 ఇంద్రసహాని కేసులో ఉపకులాల గురించి కోర్టు మాట్లాడమంది. ఈ అంశాలపై మండల్ కమిషన్‌లో డిసెంట్‌నోట్ ఇచ్చినదాంట్లో ఉన్న పివి.కృష్ణన్ ఉన్నారు. బీసీ కులాల ఉపకులాలవర్గీకరణకు సంబంధించి కేంద్రప్రభుత్వం ఇటీవల జస్టిస్ రోహిణి కమిషన్‌ను నియమించింది. తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రిజర్వేషన్లు అత్యధికంగా పొందేందుకు తమిళనాడు తరహాలో వెళ్లాలని ఆయన అసెంబ్లీలోనే ప్రకటించి ఉన్నారు. పార్లమెంటులో షెడ్యూల్ 9 ప్రకారం తెలంగాణాలో బీసీ, ఎస్సీ, ఎస్టీ కులాల రిజర్వేషన్లను సాధించాలని కేసీఆర్ కృతనిశ్చయంతో ఉన్నారు. ఓబీసీ,ఎంబీసీ, డిఎన్‌టీల వెనుకబాటు తనాన్ని అంచనావేయడానికి తెలంగాణ ప్రభుత్వం ఇప్పటికే జీవో.9ను విడుదలచేసింది. ఈ జీవో ప్రాతిపదికగా సంచారజాతుల, ఎంబీసీల సామాజిక, ఆర్థిక, విద్యా స్థాయిలను అంచనావేయవల్సి ఉంది. వీళ్లజీవన విధానాన్ని ఆమూలాగ్రంగా పరిశీలించవల్సి ఉంది. ఇందుకు సంబంధించిన ఇప్పటి బీసీల గణనను, క్వాంటిఫైబుల్ డేటాను వెలికితీయవల్సి ఉంది. తెలంగాణ రాష్ట్రం ప్రత్యేకించి బీసీలకు, ఎంబీసీలకు, సంచారజాతులకు ఇతోధికమైన సహాయం చేయాలని నిర్ణయించి అందుకు నిధులను కేటాయించడం జరిగింది. ప్రభుత్వం చేసే సహాయంతో వృత్తులకు పని ఉంటే దాంట్లో స్థిరపడటం, వాటిని ఆధునీకరించే అవకాశం ఉంటే అందుకు కృషి చేయటం చేయవల్సి ఉంది. లేదా ప్రత్యామ్నాయ వృత్తుల్లోకి వెళ్లవలసి ఉంది. సంచారజాతుల విషయానికి సంబంధించి మాత్రం దక్కన్‌పీఠభూమి ఆధారంగా మహారాష్ట్ర విధానాలను కూడా అధ్యయనం చేయవల్సి ఉంది. సంచారజాతులను శాస్త్రీయంగా వర్గీకరించిన పరిస్థితి మాత్రం ఒక్క మహారాష్ట్రలో మాత్రమే జరిగింది. అంతకంటే మేలైన అంశాలుంటే వాటిని లోతుగా పరిశీలించవల్సి ఉంది.

చాలా రాష్ట్రాల్లో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు సంబంధించిన అధ్యయన కేంద్రాలున్నాయి. ఈ అధ్యయన కేంద్రాలు ఆయా వర్గాలకు 'థింక్‌ట్యాంక్'లుగా పనిచేస్తున్నాయి. కేరళలో సి.డి.ఎస్ (సెంటర్ ఫర్ డెవలప్‌మెంట్ స్టడీస్) బెంగుళూరు బీసీ కమిషన్‌లో ఐ.ఎస్.ఇ.సి (ఇనిస్టిట్యూట్ ఫర్ సోషియల్ అండ్ ఎకనామిక్ ఛేంజ్), ఐడిఎస్ (ఇనిస్టిట్యూట్ ఫర్ డెవలప్‌మెంట్ స్టడీస్) పశ్చిమబెంగాల్‌లో సెంటర్ ఆఫ్ సోషల్ సైన్స్ రిసెర్చ్, బెంగుళూరులో సి.డి.ఎస్ (సెంటర్ దళిత్ స్టడీస్), న్యూఢిల్లీ లోని ఐఎస్ఏ (ఇనిస్టిట్యూట్ ఫర్ సోషల్ యాక్షన్–ఇది దళిత, బీసీ, మహిళా గొంతుకగా పనిచేస్తుంది), మన రాష్ట్రంలో సిఎస్‌డి (కౌన్సిల్ ఫర్ సోషల్ డెవలప్‌మెంట్) 'సెస్' సంస్థ కూడా నిరంతరం అధ్యయనాలు చేస్తూ ఉంది. తెలంగాణ ప్రభుత్వం మన దగ్గర సెంటర్‌ఫర్ దళిత్ స్టడీస్‌కు సంపూర్ణ సహకారం ఇస్తూ ఆ సంస్థ అభివృద్ధికి కృషిచేస్తుంది. తెలంగాణ రాష్ట్రంలో సగం జనాభా ఉన్న బీసీల జీవనవిధానంపై నిరంతరం అధ్యయనం చేసేందుకు బీసీ అధ్యయన కేంద్రంను ప్రారంభించాలి. అది బీసీ కమిషన్ ఆధ్వర్యంలోనే నిర్వహించబడాలి. బీసీ అధ్యయన కేంద్రం చేసే నిరంతర అధ్యయనం బీసీ కమిషన్ అధ్యయనానికి మరింత దోహదపడుతుంది. మొత్తం బీసీ సమాజానికి సంబంధించిన ఆలోచనలను నిరంతరం కొనసాగించటానికి బీసీ అధ్యయన కేంద్రం నెలకొల్పుకోవాలి.

■ జూలూరు గౌరీశంకర్
తెలంగాణ రాష్ట్ర బీసీ కమిషన్ సభ్యులు

భావి పౌరులకు బతుకే పరీక్ష!

గంట. అంటే అరవై నిమిషాలు. ఒకప్పుడు కాలేజీ డ్రాపవుట్ అయిన బిల్ గేట్స్ ఇప్పుడు గంటకు 4 లక్షల 68 వేల డాలర్లు సంపాదిస్తారని గొప్పగా చెప్పుకుంటాం. అయితే, మన దేశంలో గంటకో విద్యార్థి ఆత్మహత్య చేసుకుంటున్న బాధాకరమైన వాస్తవాన్ని మాత్రం మనలో చాలా మంది పట్టించుకోరు. 2016లో మన దేశంలో ఆత్మహత్య చేసుకున్న విద్యార్థుల సంఖ్య 9,474. ఇక, 2014–16 మధ్య మన దేశంలో చేజేతులా ప్రాణాలు తీసుకున్న విద్యార్థులు 26,476 మంది. రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల ప్రభుత్వాలు 2016కు సంబంధించి కేంద్ర హోం శాఖకు పంపిన నివేదికల సారాంశమిది. చదువు, ఆటపాటలు తప్ప మరో లోకం లేకుండా హాయిగా గడపాల్సిన విద్యార్థులు చావును వెతుక్కోవడానికి కారణం ఏమిటి? దీనికి ప్రధాన కారణం... ఒత్తిడి.

మార్కుల కోసం, ర్యాంకుల కోసం తల్లిదండ్రులు, అధ్యాపకులు పెట్టే ఒత్తిడే విద్యార్థుల బలవన్మరణానికి ప్రధాన కారణం అవుతోంది. బాలల హక్కులనేవి మన దేశంలో నేతిబీర లాంటివే. పిల్లలూ మనుషులేనని, వాళ్లకూ ఇష్టాయిష్టాలు, భావోద్వేగాలు ఉంటాయని తల్లిదండ్రులే గుర్తించనప్పుడు, ఇక బయటి వారు ఎలా గుర్తిస్తారు. ఈ ఆత్మహత్యల్లో మరో కోణం కనిపిస్తుంది. మీడియా వార్తల ప్రకారం, ప్రయివేటు లేదా కార్పొరేట్ విద్యాసంస్థల్లో చదివిన వారే ఎక్కువగా ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. పైసా ఖర్చు లేకుండా ప్రభుత్వ విద్యాసంస్థల్లో చదివే వారిలో ఆత్మహత్యలు చాలా తక్కువ. దీనికి ప్రధాన కారణం, ఒత్తిడి లేకపోవడం.

పరీక్షలు వచ్చాయంటే విద్యార్థులకు ఓ గండమే. ఇన్ని మార్కులు రావాలి, ఇంత ర్యాంకు రావాలంటూ ఉపాధ్యాయులతో పాటు తల్లిదండ్రులు కూడా టార్గెట్ ఫిక్స్ చేస్తుంటారు. ఈ ధోరణి ప్రయివేటు విద్యలోనే ఎక్కువగా కనిపిస్తుంది. అందుకే, పరీక్షల్లో ఫెయిల్ కావడం కాదు... అసలు పరీక్ష రాయడానికి ముందే ఆత్మహత్య చేసుకునే సంఘటనలు పెరుగుతున్నాయి. ఒకప్పుడు పరీక్షా ఫలితాలు వచ్చిన తర్వాత విద్యార్థుల ఆత్మహత్యల వార్తలను పత్రికల్లో చదివే వాళ్లం. ఇప్పుడు పరీక్షల భయంతో ఆత్మహత్యల వార్తలు చదవాల్సి వస్తోంది.

పిల్లలపై ఒత్తిడి చేయకపోతే వాళ్లు అందమైన బాల్యాన్ని ఆస్వాదించగలరు. తోటి పిల్లలతో ఆటపాటలకు అవకాశం ఇస్తే శారీరకంగా, మానసికంగా దృఢంగా తయారవుతారు. జట్టు నాయకులుగా, జట్టులో సభ్యులుగా రాణించే తత్వం అలవరచుకుంటారు. కిందపడి దెబ్బలు తాకితే తట్టుకునే శక్తిని పొందుతారు. ఎలాంటి సమస్య, సవాలు ఎదురైనా ఎదుర్కొనే ధీరులుగా ఎదుగుతారు. లేకపోతే బీరువుల్లా చావును వెతుక్కునే ప్రమాదం ఉంది. ప్రయివేట్ విద్యా సంస్థల ఇష్టారాజ్యాన్ని అడ్డుకోవాల్సిన ప్రభుత్వాలు నిర్లిప్తంగా మారడం వల్ల దుష్పరిణామాలు తప్పడం లేదు.

ప్రస్తుత విద్యార్థుల పరిస్థితిపై ఓ మిత్రుడు తనదైన శైలిలో విశ్లేషించాడు. ప్రభుత్వ విద్యా సంస్థల్లో చదివే వాళ్లు కిలిమంజారో లాంటి ఎత్తయిన పర్వతాలను అధిరోహిస్తున్నారు. కార్పొరేట్ విద్యార్థులు కాలేజీ భవనాల పైనుంచి దూకి ప్రాణాలు తీసుకుంటున్నారు. నిజమే. ఒత్తిడిని జయించలేని విద్యార్థులు చావులో మనశ్శాంతిని వెతుక్కునే ధోరణి పెరిగితే అది మన సమాజానికి మంచిది కాదు. దేశ భవిష్యత్తుకు మేలు చేసే పరిణామం కాదు. భావి పౌరులకు బతుకే భారమైతే, బతకడమే ఓ పరీక్షగా మారితే ఇక ఆ దురదృష్టవంతులకు దిక్కెవరు?


■ గోనె రాజేంద్ర ప్రసాద్

వ్యాసాలు, ఉత్తరాలు పంపవలసిన మెయిల్:
editpage@andhrajyothy.com

అంతరిస్తున్న అమ్మదేవతారాధన

విజయవాడ కనకదుర్గమ్మ ఆలయంలో క్షుద్రపూజలు జరగడంతో భక్తుల మనోభావాలు తీవ్రంగా దెబ్బతిన్నాయంటూ ఇటీవల ప్రచారం జరిగింది. క్షుద్ర పూజలు జరిగాయా లేదా అన్నది పక్కన పెడితే.. కనకదుర్గమ్మ అమ్మవారు పూర్తిగా ద్రావిడ మాతృదేవతగా ఉండి తరువాతి కాలంలో తరువాతి కాలంలో బ్రాహ్మణీకరించబడినట్లుగా, అంటే ఆర్యీకరణకు గురైనట్లుగా అర్థమవుతుంది. ఇది కొన్ని వందల సంవవత్సరాల క్రితమే జరిగినట్లుగా ఆధారాలు ఉన్నాయి.

భక్తి పలువిధాలుగా ఉండవచ్చు, పూజించే విధానం ఏదైనా కావచ్చు. కానీ ఒక ఉత్కృష్టమైన అమ్మ దేవతారాధన పద్ధతి దక్షిణ భారతదేశంలో కనుమరుగైపోతున్నదన్న విషయం మనం గమనించడంలేదు. దక్షిణ భారతదేశంలో మరుగునపడిపోతున్న గొప్ప సంస్కృతి అమ్మ దేవతారాధన. జన్మనిచ్చిన అమ్మను ప్రేమించడం, పూజించడం అన్న భావనలోంచి పుట్టుకొచ్చింది మాతృదేవతారాధన. ఈ ఆరాధనా పద్ధతి గ్రామీణంలో నేటికీ కొనసాగుతూ ఉన్నా, ఈ మాతృదేవతలను శక్తి దేవతలుగా మార్చే పూజా విధానాలు ఊపందుకుంటున్నాయి.



దక్షిణ భారతదేశంలో గ్రామ దేవతలే అమ్మ దేవతలు. ప్రధానంగా వ్యవసాయ జీవులైన ద్రావిడులకు సఫలత (ఫెర్టిలిటి) ఎక్కువ. కావునే, సృజన శక్తికి ప్రతీక, సృష్టికి మూలమైన 'ఆమె'ను అధికంగా ఆరాధిస్తారు. "గ్రామంలో ఉండే అమ్మదేవతల్ని పరిశీలిస్తే ఒకొక్క దేవత ఒకొక్క ప్రదేశానికి, ఒక కులానికి సంబంధించి వెలసి, ప్రాచుర్యం కలిగిన తరువాత నలు మూలల నుండి వచ్చే భక్తులచే పూజింపబడుతుంది. బెజవాడ కనకదుర్గ, శ్రీశైల భ్రమరాంబ, కొల్హాపుర మహాలక్ష్మి మొదలగు శక్తులు ఆయా స్థలాలలో నెలకొన్న మాతృ దేవతలు" అని నాయని కృష్ణ కుమారి అన్నారు. గ్రామ గ్రామానా ఊరి బయట, మధ్యన ఉన్న గ్రామ దేవతలు రాయి రూపంలోనో, కొయ్యతో చెక్కిన బొమ్మల రూపంలోనో ఉంటారు. చిన్నమ్మవారు, పెద్దమ్మవారు, మలేరియా, కలరా, మశూచి లాంటి అంటు వ్యాధులు చెలరేగినపుడు దైవానుగ్రహం కోసం గ్రామస్తులు ముత్యాలమ్మ, పోలేరమ్మ, మారెమ్మ లాంటి మాతృ దేవతలనే పూజిస్తారు. వ్యాధుల నుండి దూరం చేయడం మాత్రమే కాదు, వర్షాలు తెచ్చి, ఇబ్బడిముబ్బడిగా పంటలు ఇచ్చే తల్లిగా ఈ దేవతలను పూజిస్తారు జానపదులు.

ఈ గ్రామ దేవతలు తమ సాహస త్యాగాల ద్వారా మనిషిగా ఉన్న దేహాన్ని త్యజించి పల్లె ప్రజలకు ప్రత్యక్ష దైవాలుగా నిలిచారు. వీరిని కొలిచే విధానం అత్యంత పురాతనం. ఆటవిక దశలో మనిషికి–దైవానికి మధ్య ఆహార నివేదన మాత్రమే ప్రధానాంశంగా కనుబడుతుంది. 'మానవుడు తనకు ఉన్నది కానుకగా నివేదించడం, దైవం సంతృప్తి చెందడం' అన్న ప్రాథమిక భావమే అమ్మ దేవతలకు ఇప్పటికీ ఆచరిస్తున్న పూజా విధానం. జానపదులు తాము వండిన అన్నాన్ని అమ్మ ముందు కుంభం (పోగు)గా పోసి, కోడిపుంజునో, మేకపోతునో బలి ఇచ్చి తాము ఎలా కూర వండుకుంటారో అలాగే కూర వండి నైవేద్యంగా పెడతారు. అంతేకాని, ప్రత్యేక వంటకాలేవీ ఉండవు. అమ్మ దేవత ఎదుట నిలబడి 'అమ్మ'కి చెప్పుకొనేట్లుగానే తమ మాండలిక భాషలోనే చెప్పుకొంటారు. కృతజ్ఞతలు తెలియజేస్తారు. తల్లీ బిడ్డకు మధ్య 'మధ్యవర్తిత్వం' (పూజారి అవసరం) ఉండదు. అందుకే, ఈ పూజా విధానంలో పూజారి మన తరపున భగవంతునికి నివేదించడం ఉండదు. ఒక వేళ పూజారి ఉన్నా, అమ్మకు సేవ చేసేందుకు భక్తులకు బండారు (కుంకుమ)ని ఇచ్చేందుకే పరిమితం, కానీ ప్రస్తుతం ఎండోమెంట్ యాజమాన్యంలోని దేవాలయాల్లో పూజారులుగా వేద మంత్రాలు, శక్తి పూజలు జరిపే పూజారులను నియమిస్తున్నారు. ఎంతో ఉత్కృష్టమైన ప్రాచీన నాగరికతను ధ్వంసం చేస్తున్నారు. గ్రామదేవతల కొలుపులు, జాతరలు, పూజావిధానాలన్నీ పూర్తి అవైదికాలు అయినప్పటికీ వైదిక పూజలకే ప్రాధాన్యమిస్తున్నారు.

గ్రామదేవతల ఆరాధనలో భౌతిక సంస్కృతికి మాత్రమే ప్రాముఖ్యత ఉంటుంది. మరణానంతరం లభించే స్వర్గం, నరకం గురించిన ప్రస్తావన ఉండదు. మనిషి చేసే తప్పొప్పులకు ప్రతిఫలం ఈ లోకంలోనే ఉంటుంది. అవి వ్యాధుల రూపంలోనో, బాధల రూపంలోనో వస్తాయని వీటిని కల్పించేది అమ్మ దేవతలేనని ప్రజలు నమ్ముతారు.

గ్రామ దేవతల గురించి ఎంతో ఆసక్తికరమైన కథనాలు, గాథలు ఉన్నా ఇవేవీ లిఖితపూర్వకంగా లేవు. కొన్ని కులాల వాళ్ల కొలుపులు, జాతరల్లో గానం చేయడం ద్వారా, మౌఖికంగా తరతరాలుగా చెప్పుకోవడం ద్వారా మాత్రమే మనం తెలుసుకోగలం. చరిత్రలో, పురాణాల్లో అమ్మ దేవతల గురించి చెప్పబడలేదు. ఒక వేళ చెప్పినా అమ్మ దేవతలను క్షుద్రదేవతలుగా, పిచ్చి దేవతలుగా చిత్రీకరించారు. అయినా, ఈ గ్రామదేవతలకున్న ఆదరణ ఇప్పటికీ అనూహ్యమైనది. లక్షలకొద్దీ జనం గుమిగూడి సామూహికంగా జరుపుకునే పండుగలు అమ్మ దేవతల జాతరలు మాత్రమే. ఇంతగా సమాజంలో ఆదరణ పొందుతున్న అమ్మ దేవతలు క్రమంగా ఆర్యీకరించబడి శక్తి దేవతలుగా మారుతుండడం శోచనీయం. ఉమ, అంబిక మొదలైన పేర్లు అమ్మ శబ్దానికి మారురూపాలు. ఈమే దుర్గగా స్తుతించబడింది. ఈ పేరుతోనే భాగవతం, దేవీ పురాణం లాంటి గ్రంథాలలో శక్తి దేవతగా స్థానం పొందింది. జానపద అమ్మ దేవతలందరూ శివుడి పత్నీ అగు దుర్గాదేవి అంశలుగా గ్రహించబడి ఒక స్థాయిని పొందడం జరిగింది. శక్తి రూపంలో ఉండే గ్రామ దేవతలు శివరుద్ర రూపాలలో ఉండే దేవర్లు ద్రవిడ దేవతలే. చనిపోయిన వారిలో కొందరు దెయ్యాలై శక్తి రూపిణులై తమను బాధిస్తారని జనుల విశ్వాసం ఆదిమ కాలం నుంచి నేటి వరకు అవిచ్ఛిన్నంగా వచ్చింది. బెజవాడ కనకదుర్గమ్మ కూడా మాతృ దేవతేనన్నది జానపదులు చెప్పుకొనే కథల ద్వారా తెలుస్తోంది.

తాంత్రిక పూజల్లో ప్రముఖంగా చెప్పబడిన దేవి, కాళి, జగద్ధాత్రి, చండీ, భైరవి, భద్రకాళి... పూజలు పరమోత్కృష్టమైనవిగా చెప్పబడ్డాయి కానీ గ్రామ దేవతల పూజా విధానం అందుకు పూర్తిగా విరుద్ధం. గ్రామ దేవతలు ఉండేది ఎక్కడో స్వర్గంలో కాదు. గ్రామాలలో చెట్టుకిందనో, ఊరవతల గుడిలోనో ఉంటారు. మనతో కలిసి జీవిస్తారు. మనం తిని వాళ్లకింతపెట్టి ఆనందంగా చిందులేస్తాం. గ్రామదేవతల ఆరాధనలో భౌతిక సంస్కృతికి మాత్రమే ప్రాముఖ్యత ఉంటుంది. మరణానంతరం లభించే స్వర్గం, నరకం గురించిన ప్రస్తావన ఉండదు. మనిషి చేసే తప్పొప్పులకు ప్రతిఫలం ఈ లోకంలోనే ఉంటుంది. అవి వ్యాధుల రూపంలోనో, బాధల రూపాంలోనో వస్తాయని, వీటిని కల్పించేది అమ్మ దేవతలేనని ప్రజలు నమ్ముతారు. వారికి తాము చేసిన పనుల వల్ల కోపం వచ్చిందని భావించి వారికి మొక్కులు చెల్లించుకొంటారు. భౌతిక ప్రపంచంలో జరిగే అన్ని విషయాలనూ కుటుంబ పెద్దగా భావించి అమ్మకు చెప్పుకుంటారు. ఆమెను సంతృప్తి పరచేందుకు కొలుపులు, జాతరలూ చేస్తారు. వాస్తవికతతో ముడిపడి ఉన్న ఆచారాలను ఎక్కువుగా పాటిస్తారు. స్వర్గనరకాల గురించిన ఊహే ఉండదు. అంటూ ముట్టూ పేరుతో దేవాలయాల్లోకి రానివ్వకపోవడం ఉండదు. అందరికీ ఆమె కన్నతల్లి. ఆమె దగ్గర మనమంతా పిల్లలమే అన్న భావనతో అన్ని కులాలవారూ స్వేచ్ఛగా ఆమె వద్దకొస్తారు. తల్లి తమ తప్పులను మన్నించి కాపాడుతుందని నమ్ముతారు.

కానీ, ఇప్పుడు ఈ అమ్మ దేవతారాధన పద్ధతులను శరవేగంగా మార్చేస్తున్నారు. ఈ పూజా పద్ధతుల మార్పుపై ఎందుకు మనం మాట్లాడలేకపోతున్నాం? అమ్మ దేవతల జాతర్లల్లో జంతు బలుల నిషేధాన్ని ఎందుకు ప్రశ్నించలేకపోతున్నాం? భగవంతునికి మాంసం అర్పించడమన్నది అన్ని మతాల్లోనూ ఉంది. ఈ పురాతన ఆచారాల మీద ఇంత రాద్ధాంతం ఎందుకు? పవిత్రమైన పూజలు, క్షుద్ర పూజలూ అని పూజలు వేర్వేరుగా ఉండవు. మన నమ్మకాలు మాత్రమే మంచి చెడులను నిర్ణయిస్తాయి. ఎవరి నమ్మకం వారిది. ఇతరులకు చెడు జరగనంతవరకూ ఎదుటి వారి నమ్మకాలలో తలదూర్చడం ఎందుకు?

■ డాక్టర్ గాది శ్రీనివాస్

తెలంగాణ కళా తాత్విక ధార

తెలంగాణ పల్లెను ప్రపంచానికి కొత్తగా పరిచయం చేయడానికే అతడు జీవితాన్ని ధారవోశాడు. తెలంగాణ అస్తిత్వ జెండాను, దేశం గుండెల మీద నిలబెట్టడానికి ఇంకా తండ్లాడుతూనే ఉన్నాడు. తెలంగాణ నేల అతడి కెమెరా కంటికి సబ్జెక్టూ ఆబ్జెక్టూ. తెలంగాణ మట్టిమనుషులే అతడి పెయింటింగ్‌కి క్యాన్వాసు. తెలంగాణ బతుకే అతడి అక్షరాలకు వస్తువు. నాలుగు దశాబ్దాల తెలంగాణ జీవితాన్ని జాగ్రత్తగా ఒడిసి పట్టుకున్న కెమెరా కన్ను భరత్ భూషణ్. తెలంగాణ గత చరిత్రను ఈ తరానికి పరిచయం చేస్తున్న సృజనకారుడు. అతడిలోని బహుముఖ సృజన కళలు ఎంతటి విపత్కర పరిస్థితుల్లోను ఆగిందే లేదు. వరంగల్ నగరంలో ఓ సాధారణ మధ్య తరగతి కుటుంబంలో పుట్టినా, అతడి ఆలోచనలు అభిరుచులు మాత్రం సాధారణమైనవి కావు. అందరిలా చదువుకోమన్న తండ్రి మాటను కాదని, సామాజిక కట్టుబాట్లను ఎదిరించి జీవితంలో బరిగీసి కొట్లాడుతున్న ఫోటోగ్రాఫర్, పెయింటర్, రైటర్ భరత్ భూషణ్.

తెలంగాణ నేల శతాబ్దాలుగా సాంస్కృతిక ఔన్నత్యం కలిగి ఉంది. కానీ, ఫోటోగ్రఫీ వంటి ఆధునిక సృజనాత్మక కళారంగంలో నాలుగైదు దశాబ్దాల క్రితం అంతగా తెలంగాణ కళాకారులు లేరు. ఉన్నా, వారంతా వేళ్ల మీది లెక్కకే పరిమితం. ఇటీవల కాలంలో మాత్రమే ఆ లోటు కొంత పూడ్చేందుకు కొద్దిమంది ఎదిగి వచ్చారు. వరంగల్ నగరంలో పుట్టిన భరత్ భూషణ్ బాల్యమంతా కాకతీయుల రాజధాని ఖిలాలోనే గడిచింది. ఖిలా వరంగల్ ఒక చారిత్రక ప్రదేశం. గుళ్లు, గోపురాలు, అపారమైన శిల్ప సంపద ఎవ్వరినైనా కట్టిపడేస్తాయి. అలాంటి చోట గడిపిన భరత్‌భూషణ్‌కు ఆ శిల్ప సంపదను రికార్డు చేయాలనే ఆలోచన కలిగింది. చిన్ననాటి నుండే పెయింటర్‌గా బొమ్మలు గీసిన భరత్ భూషణ్ డిగ్రీ చదివే నాటికే ఫోటోగ్రాఫర్‌గా మారారు. అట్లా తన ప్రయాణాన్ని మొదలు పెట్టి, ఏ విషయం మీద దృష్టి సారించాలో తొందరలోనే ఒక స్పష్టతకు వచ్చాడు. తన అనుభవం నుంచి, తన చుట్టూ ఉన్న తెలంగాణ జీవితాన్నే కెమెరాలో బంధించాలని భావించాడు. అది కూడా ఒక అభిరుచిలా కాదు, ఒక రీసెర్చ్‌గా తన పనిని మొదలుపెట్టాడు. అట్లా తన పయనం కాకతీయుల రాజధాని నుంచి కుతుబ్ షాహీల రాజధాని హైదరాబాద్ వరకు సాగింది. ఈ రెండు సాంస్కృతిక చారిత్రక పట్టణాల మధ్య తను చూసిన జీవితాన్ని జాగ్రత్తగా ఒడిసి పట్టుకున్నాడు.

భరత్ భూషణ్ చూపులోనే కెమెరా లెన్స్‌కు ఉన్నంత మెకానిజం ఉంది. తాను ఏ విషయాన్ని ఫొటోలో బంధించాలో దాన్ని మాత్రమే ఒక సబ్జెక్టుగా ఎన్నుకుంటాడు. అట్లా తన కెమెరాలో బంధించినదంతా తెలంగాణ జీవితాన్నే. తెలంగాణ అనగానే గుర్తొచ్చే బతుకమ్మ పండుగ మొదలు బోనాలు, మట్టిగోడలు, దర్వాజలు, ముగ్గులు, పతంగులు, సకినాలు, కులవృత్తులు, చిందు, డక్కలి కళారూపాలు ఇలా ఒకటేమిటి ఏదైనా సరే అందంగా ఫోటోలోకి వచ్చి ఒదిగిపోవాల్సిందే. అందుకే బతుకమ్మ ఫోటోను చూస్తే భరత్ భూషణే గుర్తుకు రావడం ఆశ్చర్యమేమి కాదు. అట్లా సంవత్సరాల తరబడి ఒక విషయం మీదనే పని చేయడం అలవాటు చేసుకున్నాడు. తెలంగాణ గ్రామీణ జీవితంలో వైవిధ్యమైన విషయాలన్నింటిని ఫోటోలు తీశాడు. ముఖ్యంగా ఒక్క దర్వాజల మీదనే పదకొండు సంవత్సరాల పాటు ఫోటోలు తీసే పని చేశాడంటే ఎవ్వరికైనా ఆశ్చర్యం కలుగక మానదు. అంతటి నిబద్ధతే తనను ఈ స్థాయికి చేర్చింది. సినిమా రంగానికి వెళితే సత్యజిత్‌రే అంతటి డైరక్టర్ కావాలని, పెయింటింగ్ వేస్తే పికాసో అంతటి చిత్రకారుడు కావాలని కలగన్నాడు. కానీ, ఊహించని విధంగా తెలంగాణ గర్వించే ఫోటోగ్రాఫర్‌గా ఎదిగాడు.

తెలంగాణ నేలకు ఉన్న వైవిధ్యాన్ని అర్థం చేసుకున్నతనం భరత్ భూషణ్ రచనల్లో, ఫొటోల్లో కనిపిస్తది. వరంగల్‌లో ఉన్నంత కాలం అక్కడి ప్రజల జీవితంతో మమేకమై పని చేశాడు. కాకతీయుల శిల్పకళా నైపుణ్యం దగ్గరి నుండి మొదలు పెట్టి గౌండ్ల వారి జీవితాన్ని ప్రపంచానికి పరిచయం చేసినతనం వరకు ఆయనది సామాన్యుల పక్షం. అందుకే గాడిద పాలమ్ముకునే డక్కలి మహిళనైనా, చిందు భాగోతానికి అంతర్జాతీయ ఖ్యాతిని తెచ్చిపెట్టిన చిందు ఎల్లమ్మనైనా, తెలంగాణ సాయుధ పోరాటంలో కొదమసింగంలా గర్జించిన చాకలి ఐలమ్మనైనా, విప్లవోద్యమంలో నెత్తురసొంటి కవిత్వం రాసిన చెరబండరాజునైనా భరత్ భూషణ్ కెమెరా అద్భుతంగా చిత్రించింది. వరంగల్ నుంచి వచ్చి, హైదరాబాద్‌లో స్థిరపడినా తన పట్టుదల ఏమాత్రం తగ్గలేదు. ఫోటో జర్నలిస్టుగా, ఫ్రీలాన్సర్‌గా ఎంతో సేవ చేశాడు.

వరంగల్‌లో ఉన్నంతకాలం అక్కడి చరిత్రను, వర్తమానాన్ని కెమెరాలో బంధించిన భరత్ భూషణ్, హైదరాబాద్ వచ్చాక, ఈ చారిత్రక నగరం ఆత్మను పట్టుకోవడం మీద దృష్టి పెట్టాడు. సామాన్య ప్రజానీకానికి హైదరాబాద్ అంటే బతుకునిచ్చే పట్టణం మాత్రమే. కానీ, భరత్ భూషణ్‌కు అలా కాదు. అంతకు మించినదేదో వెతుకుతాడు. అలా తాను కనుగొన్నవే ముత్యాలు, గాజులు, పతంగులు, స్వీట్ల మీద పెట్టే సిల్వర్ పూతలు. భిన్నమతాల ప్రజలు, భిన్న సంస్కృతుల జాడలు భరత్ భూషణ్‌లో కొత్త చింతనకు దారులు వేశాయి. తిండి మరిచి, ఇల్లు కిరాయి బాధలు మరిచి కేవలం తన కళ మీదనే ఫోకస్ పెట్టడం అందరికీ సాధ్యంకాదు. అట్లా ఒక్కో విషయం మీద వందలాది ఫోటోలు తీసి పదిలంగా చరిత్రనంతా రికార్డు చేశాడు. ఎక్కడికి పోయినా అక్కడి ప్రజల జీవన విధానాన్ని, వారి చరిత్రను, సంస్కృతిని అధ్యయనం చేయడం తనకు ఇష్టమైన పని. అప్పుడు మాత్రమే ఆ జాగా గొప్పతనం అర్థమవుతుందని భావిస్తాడు. అందువల్లనే ఒక్క బతుకమ్మ మీదనే ఇరవై సంవత్సరాలు పని చేశాడు.



భరత్ భూషణ్ కెమెరాలో బంధించినదంతా తెలంగాణ జీవితాన్నే. తెలంగాణ అనగానే గుర్తొచ్చే బతుకమ్మ పండుగ మొదలు బోనాలు, మట్టిగోడలు, దర్వాజలు, ముగ్గులు, పతంగులు, సకినాలు, కులవృత్తులు, చిందు, డక్కలి కళారూపాలు ఇలా ఒకటేమిటి ఏదైనా సరే అందంగా ఫోటోలోకి ఒదిగి పోవాల్సిందే.

ఇక భరత్‌భూషణ్‌లో చిన్ననాటి నుంచి ఉన్న పెయింటింగ్ కళ కూడా ఆగిపోలేదు. ఒకవైపు ఫొటోగ్రఫీలో సుదీర్ఘ అనుభవం గడిస్తూనే, మరోవైపు చిత్రకళ మీద కూడా దృష్టి సారించాడు. చిత్రకళా రంగ చరిత్రను అధ్యయనం చేసి, తనదైన సొంత శైలిని ఏర్పరచుకున్నాడు. తెలంగాణలో దళిత, బహుజన, మహిళల జీవితాలను పెయిటింగ్ ద్వారా పరిచయం చేశాడు. అలాగే రచయితగా తెలంగాణ నేటివిటీని అక్షరాల్లోకి ఒంపాడు. తెలంగాణలో ప్రముఖమైన జాతరలైన సమ్మక్క సారక్క, ఐనవోలు మల్లన్న, కొమురవెల్లి వంటి పుణ్యక్షేత్రాలను పరిచయం చేస్తూ పలువ్యాసాలు రాశాడు. ఈ వ్యాసాలు, ఫోటోలు, పెయింటింగ్‌లు అనేకమంది ప్రముఖులను ఆకర్షించాయి. జాతీయ స్థాయిలో ఇక్రిశాట్‌లో వాటర్ రిసోర్సెస్ మీద జరిగిన వర్క్‌షాప్‌లో భరత్ భూషణ్ బతుకమ్మ మీద ఇచ్చిన ప్రజెంటేషన్ శాస్త్రవేత్తల దృష్టిని సైతం ఆకట్టుకుంది. బతుకమ్మను తయారు చేసేందుకు వాడే పువ్వుల్లో, నీటిని శుభ్రం చేసే లక్షణముందని చెప్పి, మెప్పించాడు.

తెలంగాణలో కిందికులాలకు సాధ్యం కాని ఫోటోగ్రఫీ, రచన, పెయింటింగ్.. ఈ మూడు రంగాల్లో తనదైన ముద్రను నెలకొల్పాడు భరత్ భూషణ్. ఒకవైపు కుటుంబ భారాన్ని మోస్తూనే, ఆరోగ్యాన్ని సైతం లెక్క చేయకుండా శ్రమించాడు. నాలుగు దశాబ్దాల విలువైన కాలాన్ని కళకు అంకితం చేశాడు. రాజా త్రయంబకం రాజా వంటి విశిష్ట పురస్కారాలు అందుకున్నా తన కృషికి రావాల్సినంత పేరు, గుర్తింపుగాని రాలేదు. క్యాన్సర్‌తో పోరాడుతూనే తన కళా ప్రస్థానాన్ని ఇంకా కొనసాగించడం ఈనాటి తరానికి ఆదర్శం. తెలంగాణ వచ్చిన తర్వాత ఈ మహా కళాకారున్ని తెలంగాణ సర్కార్ గుర్తించడం హర్షణీయం. వృద్ధాప్యం శరీరానికే గాని, మనసుకు కాదంటూ ఇంకా శ్రమిస్తున్న భరత్ భూషణ్ యావత్ తెలంగాణ సమాజం గర్వించదగ్గ కళాకారుడు.

■ పసునూరి రవీందర్

(నేడు భరత్ భూషణ్ తెలుగు విశ్వవిద్యాలయం విశిష్ట పురస్కారాన్ని అందుకుంటున్నారు)

రీచార్జి విద్యుత్తు మీటర్లు వచ్చేశాయ్

» మహబూబాబాద్ జిల్లా గూడూరులో అందుబాటులోకి


రీచార్జి విద్యుత్తు మీటరు

గూడూరు, జనవరి 26: మొబైల్ ఫోన్‌లో రీచార్జ్ చేసుకున్నట్లుగా.. ఇప్పుడు ఇంట్లో వాడుకునే విద్యుత్తు మీటర్లలోనూ సిమ్ కార్డు ద్వారా రీచార్జి చేసుకునే సౌలభ్యం అందుబాటులోకి వచ్చింది. ఇకపై నెలనెలా వినియోగదారులు విద్యుత్తు బిల్లులు చెల్లించాల్సిన అవసరం లేకుండా రీచార్జి చేసుకునే విద్యుత్తు మీటర్లు మహబూబాబాద్ జిల్లా గూడూరుకు వచ్చాయి. ఈ మీటరులో ఐడియా సిమ్ కార్డు ఉంటుందని, నెలనెలా రీచార్జ్ చేసుకోవాలని ట్రాన్స్‌కో ఏఈ రవికుమార్ తెలిపారు. గూడూరుకు ముందుగా 50 రీచార్జి మీటర్లు వచ్చాయని, వీటిని ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలల్లో అమర్చుతున్నట్లు, ఫారెస్టు కార్యాలయంలో అమర్చినట్టు తెలిపారు. ఈ మీటరులో సిమ్ కార్డు అమర్చిన వెంటనే ఆన్‌లైన్‌లో వరంగల్‌లోని సీఎండీ కార్యాలయానికి అనుసంధానం అవుతుందని పేర్కొన్నారు. రీచార్జి గడువు దగ్గర పడుతున్న సమయంలో సంకేతం వస్తుందని, విద్యుత్తు వెలుతురు తగ్గుతుందని, దీంతో వినియోగదారులు అప్రమత్తమై రీచార్జి చేసుకోవాలని ఆయన సూచించారు.

పాల కల్తీపై స్పందించిన హైకోర్టు

» సుమోటో పిల్‌గా స్వీకరణ

హైదరాబాద్, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో విక్రయిస్తున్న పాలలో కల్తీపై హైకోర్టు స్పందించింది. దీనిలో ప్రమాదకరమైన బ్యాక్టీరియా ఉన్నట్లుగా వచ్చిన వార్తా కథనంపై నల్గొండకు చెందిన కె. నర్సింగరావు అనే వ్యక్తి హైకోర్టు ఏసీజేకు లేఖ రాశారు. పిల్ కమిటీలోని మెజారిటీ జడ్జిలు దీనిని సుమోటో పిల్‌గా స్వీకరించాలని సిఫార్సు చేశారు. దీంతో ఈ వ్యాజ్యాన్ని సుమోటో పిల్‌గా విచారణకు వేయాలని ఏసీజే రిజిస్ట్రీని ఆదేశించారు. ఈ వ్యాజ్యంలో తెలంగాణ పశుసంవర్ధక, పాడి పరిశ్రమ శాఖ ముఖ్య కార్యదర్శి, డెయిరీ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్, చీఫ్ పబ్లిక్ అనలిస్ట్, స్టేట్ ఫుడ్ లేబోరేటరీలను ప్రతివాదులుగా చేర్చారు. ఈ వ్యాజ్యం మంగళవారం హైకోర్టులో విచారణకు వచ్చే అవకాశం ఉంది.

సర్పంచ్ ఎన్నికల బరిలో బీఎల్ఎఫ్!

హైదరాబాద్, జనవరి 26 (ఆంధ్రజ్యోతి) : గ్రామ పంచాయతీ ఎన్నికల్లో బీఎల్ఎఫ్ (బహుజన లెఫ్ట్ ఫ్రంట్)ను బరిలోకి దింపి సత్తా చాటాలని కూటమికి నేతృత్వం వహిస్తోన్న సీపీఎం భావిస్తోంది. మగ్దూం భవన్‌లో శుక్రవారం జరిగిన సీపీఎం కార్యవర్గ సమావేశంలో ఫిబ్రవరి 4న నల్లగొండలో నిర్వహించే పార్టీ రాష్ట్ర మహాసభల్లో ప్రవేశపెట్టాల్సిన తీర్మానాల నివేదికపై చర్చించారు. ఈ మేరకు శనివారం మరోసారి సమావేశమై స్థానిక సంస్థల ఎన్నికలపై ప్రధానంగా చర్చించనున్నారు. ఇందులోభాగంగా స్థానిక సంస్థలకు ముందస్తు ఎన్నికలు వస్తే ఎలా ఎదుర్కోవాలి, సర్పంచ్ ఎన్నికలు ప్రత్యక్ష లేదా పరోక్ష పద్ధతిలో జరిగితే అనుసరిచాల్సిన వ్యూహం, కూటమి పార్టీలను సమాయత్తం చేయాల్సిన విధివిధానాలు చర్చకు రానున్నాయి. స్థానిక ఎన్నికల్లోపే బీఎల్ఎఫ్‌ను బలోపేతం చేసేందుకు ఫిబ్రవరిలో గ్రామ, మండల, జిల్లా స్థాయిల్లో ఆవిర్భావ సభలు నిర్వహించాలని సీపీఎం ఆలోచిస్తోంది. ఈమేరకు ఆయా అంశాలపై కూటమి పార్టీలతో చర్చించి తుది నిర్ణయం తీసుకోనున్నారు. అలాగే, రాష్ట్రంలో తాజా రాజకీయ పరిస్థితులు, నిరుద్యోగ సమస్య, నిర్వాసితులకు పరిహారం చెల్లింపులో ప్రభుత్వ వైఫల్యం తదితర సమస్యలపైనా చర్చించనున్నారు. సీపీఎం కేంద్రకమిటీ పొలిట్‌బ్యూరో సభ్యుడు బీవీ.రాఘవులుతోపాటు రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సమావేశంలో పాల్గొన్నారు.

కమ్మేసిన పొగమంచు

» చెన్నైలో విమానసర్వీసులకు ఆటంకం.. హైదరాబాద్‌కు మళ్లింపు

చెన్నై, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): చెన్నై విమానాశ్రయాన్ని కమ్మేసిన పొగమంచు.. విమానాల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగించింది. శుక్రవారం ఉదయం రెండున్నర గంటల పాటు రన్‌వేను మూసేశారు. జాతీయ, అంతర్జాతీయ విమాన సర్వీసులను నిలిపివేశారు. దేశ, విదేశాల నుంచి ఇక్కడకు రావాల్సిన పలు విమానాలను కొయంబత్తూరు, తిరువనంతపురం, బెంగళూరు, హైదరాబాద్‌లకు మళ్లించారు. మస్కట్, పూణె, బెంగుళూరు ప్రాంతాల నుంచి చెన్నై వెళ్లాల్సిన విమానాలను శంషాబాద్‌లో ల్యాండ్ చేశారు. అటు ఢిల్లీలో శుక్రవారం సాయంత్రం పొగమంచు కారణంగా.. హైదరాబాద్ నుంచి ఓ విమానం రెండు గంటలు ఆలస్యంగా బయలుదేరింది.

చార్జీలు భరించలేం.. తగ్గించండి

» ఈఆర్‌సీకి నీటిపారుదల శాఖ వినతి

» దక్షిణ మధ్య రైల్వే, బీఎస్ఎన్ఎల్ కూడా..

» తెలంగాణలోనే అధికమని స్పష్టీకరణ



హైదరాబాద్, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): "కర్ణాటకలో ఎత్తిపోతల పథకాలకు యూనిట్‌కు రూ.2.25 మాత్రమే వసూలు చేస్తున్నారు. మహారాష్ట్రలో రూ.5.39 (11 కేవీ), కేరళలో రూ.2.80 వసూలు చేస్తున్నారు. తెలంగాణలో మాత్రం 2017-18లో యూనిట్ కరెంట్‌కు రూ.6.40 చార్జీ విధించారు. 2018-19లో డిమాండ్ చార్జీ నెలకు రూ.390తోపాటు యూనిట్‌కు రూ.4.88 ప్రతిపాదించారు. దీనివల్ల సగటున యూనిట్‌కు రూ.6.44 పడనుంది. దేశంలో మరే రాష్ట్రంలో లేనివిధంగా తెలంగాణలోనే అధికంగా చార్జీలు ప్రతిపాదించారు. చార్జీల ప్రతిపాదనలపై పునఃపరిశీలన చేయండి" అని తెలంగాణ రాష్ట్ర విద్యుత్ నియంత్రణ మండలి (టీఎస్ఈఆర్‌సీ)ని సాగునీటి పారుదల శాఖ కోరింది. అంతేకాదు, కరెంటు చార్జీలు తగ్గించాలని, వీటిని భరించలేమని, ఓపెన్ యాక్సెస్‌లో కొనుగోలుకు అనుమతి ఇవ్వాలని దక్షిణ మధ్య రైల్వే, భారత సంచార్ నిగమ్ లిమిటెడ్ (బీఎస్ఎన్ఎల్) కూడా అభ్యర్థించింది. అంతేగా, బహిరంగ విపణిలో కరెంట్ కొనుగోలుదారులపై తెలంగాణ డిస్కమ్‌లు ప్రతిపాదించిన అదనపు సర్‌చార్జీపై ఎనర్జీ ఎక్స్ఛేంజ్ ఆఫ్ ఇండియా అభ్యంతరం తెలిపింది. తక్షణమే ప్రతిపాదనను వెనక్కి తీసుకోవాలని, చార్జీలు విధించడానికి చూపించిన కారణాలు సహేతుకంగా లేవని తప్పుబట్టింది. 2018-19 సంవత్సరానికి డిస్కమ్‌లు దాఖలు చేసిన వార్షిక ఆదాయ అవసరాలు (ఏఆర్ఆర్), టారిఫ్ ప్రతిపాదనలు, క్రాస్ సబ్సిడీ సర్‌చార్జీ, అదనపు సర్‌చార్జీపై ఈనెల 23న ఈఆర్‌సీ అభ్యంతరాలు స్వీకరించింది.

ఏడాదిలో రూ.10,464 కోట్ల భారం

ఎత్తిపోతల పథకాల ప్రతిపాదించిన టారిఫ్‌తో రానున్న ఒక్క ఏడాది (2019-20)లో ఏకంగా రూ.10,464 కోట్ల భారం పడనుందని తెలంగాణ నీటిపారుదలశాఖ ఆందోళన వ్యక్తం చేసింది. ఎత్తిపోతల పథకాలకు 2016-17లో రూ.745 కోట్లు ఖర్చు చేస్తే, 2017-18లో రూ.1,069 కోట్లు అయిందని, ఈ ఏడాది 2018-19లో ఏకంగా రూ.4,977 కోట్లకు, 2019-20లో రూ.10,464 కోట్లకు చేరనుందని తెలిపింది. ఎత్తిపోతల పథకాలతో డిస్కమ్‌లకు పరోక్ష ప్రయోజనాలు ఉన్నాయని తెలిపింది. వీటితో గ్రావిటీ ద్వారా నీరు పొలాలకు చేరుతుందని, భూగర్భ జలాలు పెరిగి వ్యవసాయ కనెక్షన్ల వాడే మోటార్ల సామర్థ్యం తగ్గించుకుంటు వీలుంటుందని, అంతిమంగా విద్యుత్ వినియోగం తగ్గుతుందని స్పష్టం చేసింది.

ఏటా రూ.397 కోట్ల కరెంట్ కొంటున్నాం

రైల్వే పట్టాలపై ఉన్న రీచ్‌ల కోసం ఏటా 598 మిలియన్ యూనిట్ల కరెంట్ కొంటున్నామని, ఇందుకు రూ.397 కోట్లను చెల్లిస్తున్నామని దక్షిణ మధ్య రైల్వే పేర్కొంది. తాజా ప్రతిపాదనలతో రాష్ట్రంలో యూనిట్ చార్జీ రూ.5.60కు చేరిందని, పొరుగున ఉన్న ఏపీలో యూనిట్ రూ.4.70లకే లభిస్తోందని వివరించింది. దీనివల్ల రైల్వేపై పెనుభారం పడనుందని, క్రాస్ సబ్సిడీ సర్‌చార్జీని తీసేసి, ఓపెన్ యాక్సెస్‌లో కొనుగోలుకు అనుమతి ఇవ్వాలని కోరింది. యూనిఫైడ్ చార్జీలు వసూలు చేయాలని, చార్జీల్లో 10 శాతం రిబేట్ ఇవ్వాలని నివేదించింది. 'ఏటా రూ.90 కోట్లను కరెంట్ బిల్లుల రూపంలో చెల్లిస్తున్నాం. మమ్మల్ని హైఎండ్ కన్స్యూమర్ గ్రూప్‌లో చేర్చవద్దు. చార్జీలు తగ్గించండి' అని బీఎస్ఎన్ఎల్ కోరింది.

కార్పొరేట్ తీరు మారలేదు!

అడ్మిషన్లు ఆగలేదు .. రాష్ట్రంలో కార్పొరేట్ కళాశాలల ఇష్టారాజ్యం..



హైదరాబాద్, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): నగరానికి చెందిన పదోతరగతి విద్యార్థి తల్లిదండ్రులను ఓ కార్పొరేట్ జూనియర్ కళాశాలకు చెందిన ప్రతినిధులు సంప్రదించారు. 'మా కాలేజీలో మీ అమ్మాయికి అడ్మిషన్ తీసుకోండి.. ఇప్పుడు ఒప్పందం చేసుకుంటే తక్కువ ఫీజు. తర్వాత వస్తే సుమారు రూ. 50 వేల వరకు పెరగవచ్చు. ఆ తర్వాత మీ ఇష్టం' అంటూ ఆ విద్యార్థి తల్లిదండ్రులను బెదిరింపులతో కూడిన ఆందోళనకు గురి చేశారు. దీంతో తప్పని పరిస్థితుల్లో వారు రూ. 20 వేల ఫీజు చెల్లించి అడ్మిషన్‌ను ఖరారు చేసుకున్నారు. ఇదీ రాష్ట్రంలోని కార్పొరేట్ జూనియర్ కళాశాలల్లో జరుగుతున్న అడ్మిషన్ల తీరు. రాష్ట్రంలోని అన్ని కార్పొరేట్ కళాశాల్లో అడ్మిషన్ల ప్రక్రియ జోరుగా సాగుతోంది. ఇప్పటికే సుమారు 60 శాతం అడ్మిషన్లు పూర్తయినట్లు సమాచారం. అయితే నోటిఫికేషన్ ఇచ్చేంత వరకు ఎలాంటి ముందస్తు అడ్మిషన్లు చేపట్టవద్దని ఓవైపు విద్యాశాఖ మంత్రి కడియం శ్రీహరి, మరోవైపు ఇంటర్మీడియట్ బోర్డు అధికారులు పదేపదే ప్రకటనలు చేశారు. అయితే వీరి మాటల్ని బేఖాతర్ చేస్తూ.. కళాశాలల యాజమాన్యాలు వారికి ఇష్టం వచ్చినట్లుగా అడ్మిషన్ల ప్రక్రియను ప్రారంభించడం గమనార్హం.

చెక్కు చెదరని పీఆర్వో వ్యవస్థ..

కార్పొరేట్ కళాశాలలు.. విద్యార్థుల అడ్మిషన్ల కోసం ప్రత్యేకంగా పీఆర్వో వ్యవస్థను ఏర్పాటు చేసుకున్నాయి. జిల్లా, మండల స్థాయిలో పీఆర్వోలు అడ్మిషన్లప్రక్రియను కొనసాగిస్తున్నారు. వీరి పనంతా.. పదోతరగతి విద్యార్థుల వివరాలు సేకరించడం.. వారి తల్లిద్రండులకు ఫోన్లు చేయడం.. లేదా స్వయంగా కలుస్తున్నారు. ప్రస్తుతం అడ్మిషన్లు తీసుకుంటే.. తక్కువ ఫీజుతోపాటు సీటు ఖాయంగా ఉంటుందని ఆలస్యంగా వస్తే.. సీటు కష్టమంటూ పేర్కొంటున్నారు. దీంతో చేసేది లేక విద్యార్థుల తల్లిదండ్రులు ఎంతో కొంత ఫీజును చెల్లించి సీటును ఖరారు చేసుకుంటున్నారు. ప్రైవేటు పాఠశాలల్లో మెరుగ్గా చదివే విద్యార్థులను తమతమ కళాశాలల్లో చేర్చే విధంగా యాజమాన్యాలతో ఒప్పందాలు కుదుర్చుకుంటున్నారు. ఇంటర్ బోర్డు మాత్రం పీఆర్వో వ్యవస్థను సమూలంగా అరికడతామని ప్రకటనలు చేసిందే తప్ప.. ఇంత వరకు చేసింది ఏమీ లేదు.

ఆమడ దూరంలో 'రెసిడెన్షియల్' విధానం

కార్పొరేట్ కాలేజీల్లో రెసిడెన్షియల్ విధానాన్ని ప్రభుత్వపరిధిలోకి తీసుకొస్తామని బోర్డు ప్రకటించింది. అయితే ఇప్పటి వరకు అటువంటి చర్యలు ఏవీ తీసుకోలేదు. ఓవైపు రెసిడెన్షియల్‌కు సంబంధించి అడ్మిషన్లు జరుగుతున్నా.. అధికారులు పట్టించుకోవడం లేదు. ఆకులు కాలాక.. చేతులు పట్టుకున్న చందంగా అడ్మిషన్లు పూర్తయ్యాక వాటిని మూసేస్తాం.. అంటూ అధికారులు కదలడం మామూలుగా జరిగే కథే. యాజమాన్యాలేమో విద్యార్థులను అడ్డుపెట్టుకుని ఈ ఒక్కయేడాది అనుమతించాలని విన్నవించడం తెలిసిందే. దీనికి తోడు అధికారులను సంతృప్తి పరిచి వారికి కావాల్సిన పనిని పూర్తి చేసుకుంటుంటారు.

రూ. లక్షల్లో ఫీజులు..

నిబంధనలకు విరుద్ధంగా కాలేజీలు విద్యార్థుల నుంచి రూ. లక్షల్లో ఫీజులు వసూలు చేస్తున్నారు. ఐఐటీ, నీట్ కోచింగ్‌లు అంటూ ప్రత్యేక విభాగాలు ఏర్పాటు చేసి ఇందులో ఏసీ, నాన్ ఏసీ క్యాంపస్‌లను కూడా ఏర్పాటు చేశారు. ఏసీ క్యాంపస్ అయితే రూ. 1.60 లక్షలు, నాన్ ఏసీ అయితే రూ. 70 వేల నుంచి రూ. లక్ష వరకు ఫీజు వసూలు చేస్తున్నారు.

తేలని అఫిలియేషన్ ప్రక్రియ..

ప్రైవేటు జూనియర్ కాలేజీలకు సంబంధించి ఇంటర్ బోర్డు ఇప్పటి వరకు ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. మార్చి నెలాఖరులోగా అఫిలియేషన్ ప్రక్రియను పూర్తి చేసేందుకు కసరత్తు చేస్తోంది. ఈప్రక్రియలో ఎన్ని కాలేజీలకు అనుమతి వస్తుందో? రాదో? తెలియదు. గతేడాది నిబంధనలు పాటించిన సుమారు 15 కార్పొరేట్ కళాశాలలకు ముందస్తు అనుమతి లభించలేదు. అనంతరం వాటికి ప్రభుత్వం షరతులతో కూడిన అనుమతులిచ్చింది. అయితే ఈ యేడాది షరతులతో కూడిన అనుమతులు ఉండవని విద్యాశాఖ మంత్రి కడియం శ్రీహరి స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలో విద్యార్థుల ముందస్తు అడ్మిషన్ల ప్రక్రియ ఆందోళన కలిగిస్తోంది.

బోర్డు.. ప్రకటనలకే పరిమితమా?

'2018-19 విద్యా సంవత్సరం నుంచి రాష్ట్రంలో ఇంటర్ విద్యలో సమూల మార్పులు తీసుకొస్తున్నాం.. కార్పొరేట్ కాలేజీల ఆగడాలను అరికడతా'మంటూ బోర్డు అధికారులు బీరాలు పలికారు. కానీ ఈసారి ముందస్తు అడ్మిషన్లపై ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నా అధికారుల్లో చలనం లేకపోవడం గమనార్హం.

జెండా రంగుల పూలతో శివలింగానికి అలంకరణ



సూర్యాపేటలోని రామలింగేశ్వర ఆలయంలో శుక్రవారం గణతంత్ర దినోత్సవం సందర్భంగా శివలింగాన్ని జాతీయ జెండా రంగుల పూలతో అలంకరించారు. పక్కనే భరతమాత ఫొటోలను ఏర్పాటు చేశారు. ఈ అలంకరణ భక్తులను ఆకట్టుకుంది.

-సూర్యాపేట

గణతంత్ర వేడుకల్లో అపశ్రుతి

» విద్యాదాఘాతంతో గార్డు మృతి

» కోహెడ మార్కెట్‌లో గ్రామస్థుల ఆందోళన

కోహెడ, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): గణతంత్ర దినోత్సవ వేడుకలకు జెండాను ముస్తాబు చేస్తుండగా.. విద్యుదాఘాతానికి గురై ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈసంఘటన సిద్దిపేట జిల్లా కోహెడలో శుక్రవారం చోటుచేసుకుంది. వివరాలిలా ఉన్నాయి.. కోహెడ మండలం బస్వాపూర్ పరిధిలోని ఆరెపల్లికి చెందిన గొట్టె చంద్రయ్య (42) కోహెడ వ్యవసాయ మార్కెట్ కమిటీ పరిధిలోని బస్వాపూర్ చెక్‌పోస్టులో సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తున్నాడు. గణతంత్ర దినోత్సవ ఏర్పాట్లలో భాగంగా మార్కెట్ కమిటీ కార్యాలయంలో ఇనుప పైపుతో జెండాను తయారు చేసి పాతుతుండగా పైన ఉన్న విద్యుత్ వైర్లు తగలడంతో విద్యుదాఘాతానికి గురై మృతి చెందాడు. దీంతో బాధిత కుటుంబానికి న్యాయం చేయాలంటూ బస్వాపూర్ గ్రామస్థులు మార్కెట్ కమిటీ కార్యాలయం ఎదుట మృతదేహంతో ఆందోళనకు దిగారు. ఎమ్మెల్యే సతీష్‌కుమార్.. సంఘటనా స్థలానికి చేరుకుని బాధితులతో మాట్లాడారు. మృతుడి భార్యకు కాంట్రాక్టు ఉద్యోగం, రూ.3వేల పింఛన్, రూ.10 లక్షల పరిహారం ఇస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

ఆర్టీసీ బస్సులో మంటలు

» తృటిలో తప్పిన ప్రమాదం.. 48 మంది ప్రయాణికులు సురక్షితం


అగ్నికి ఆహుతవుతున్న బస్సు

కొల్చారం, జనవరి 26 (ఆంధ్రజ్యోతి) : మంటలు చెలరేగి ఆర్టీసీ బస్సు తగలబడిపోయింది. ఈ ప్రమాదం నుంచి 48 మంది ప్రయాణికులు సురక్షితంగా బయటపడ్డారు. ఈ సంఘటన మెదక్ జిల్లా కొల్చారంలో శుక్రవారం చోటుచేసుకుంది. బాన్సువాడ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు హైదరాబాద్‌కు వస్తుండగా కొల్చారం వద్దకు రాగానే ఇంజన్‌లో మంటలు చెలరేగాయి. దీంతో అందులో ప్రయాణిస్తున్న 48 మంది ప్రయాణికులు కిటికీల నుంచి సురక్షితంగా బయటపడ్డారు. సమాచారం అందుకున్న ఫైరింజన్ సిబ్బంది అక్కడకు చేరుకొని మంటలను ఆర్పేశారు.

ఆరు నెలలకే కాన్పు.. తల్లీబిడ్డలు క్షేమం


శిశువుతో తల్లి

జగిత్యాల టౌన్, జనవరి 26: జగిత్యాల జిల్లా కేంద్రంలో అరుదైన ప్రసవం జరిగింది. ఆరు నెలలకే ఓ గర్భిణి.. పండంటి బిడ్డకు జన్మనిచ్చింది. సాధారణ డెలివరీ కావడం.. తల్లీబిడ్డలిద్దరూ క్షేమంగా ఉండడం గమనార్హం. మెట్‌పల్లి మండలం జగ్గసాగర్ గ్రామానికి చెందిన కావ్య అనే గర్భిణికి ఆరోనెలలో గర్భంలో ఉమ్మనీరు తక్కువగా ఉండడంతో.. సమస్యలేర్పడ్డాయి. దీంతో.. స్థానిక ప్రైవేటు ఆసుపత్రి డాక్టర్ చైతన్య సుధ.. అత్యవసర కేసుగా గుర్తించారు. కుటుంబ సభ్యుల అభ్యర్థన మేరకు గురువారం చికిత్స నిర్వహించి.. సాధారణ ప్రసవం చేశారు.

గవర్నర్ వద్దకు ఎందుకెళ్లారు?

» షబ్బీర్, రేవంత్ తీరును తప్పుబట్టిన నేతలు

» ఎట్ హోమ్‌కు హాజరు కావొద్దని నిర్ణయం

» మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలి మనస్తాపం

హైదరాబాద్, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): గాంధీభవన్‌లో గణతంత్ర వేడుకల అనంతరం సీనియర్ నేతల ఇష్టాగోష్టి సమావేశంలో పలు కీలక పరిణామాలు చోటుచేసుకున్నట్లు తెలిసింది. శుక్రవారం టీపీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్ రెడ్డి జాతీయ పతాకాన్ని ఎగురవేసిన అనంతరం సీనియర్ నేతలు భేటీ అయ్యారు. ఈ సందర్భంగా గురువారం గవర్నర్ వద్దకు షబ్బీర్ అలీ, రేవంత్ రెడ్డిలు వెళ్లిన విషయం ప్రస్తావనకు వచ్చింది. గవర్నర్ వద్దకు కాంగ్రెస్ ఎన్నిసార్లు వెళ్లి ఫిర్యాదులు చేసినా ప్రయోజనం లేకుండా పోవడమే కాకుండా పార్టీని అవమానించే తీరులో ఆయన వ్యవహరించారనీ, అలాంటి పరిస్థితుల్లో ఇంకా ఆయన వద్దకు వెళ్లడం ఏమిటని ఒక సీనియర్ నేత తీవ్ర అభ్యంతరం తెలియజేసినట్లు సమాచారం. నేరెళ్ల, ఇసుక మాఫియా, ప్రాజెక్టులు, మల్లన్నసాగర్ రైతులు, ఖమ్మంలో గిరిజన రైతులకు బేడీలు మొదలుకొని అనేక అంశాలపై కాంగ్రెస్ వివిధ సందర్భాల్లో గవర్నర్‌ను కలిసినా.. ఎన్నడూ సానుకూలంగా స్పందించలేదని సదరు నేత అన్నట్లు తెలిసింది. పైగా ఇటీవల కాంగ్రెస్ నేతలు వెళ్లినపుడు గవర్నర్ ప్రభుత్వాన్ని సమర్థిస్తూ, కాంగ్రెస్ నేతలను విమర్శించడం తారాస్థాయికి చేరిన సంఘటన అని అభిప్రాయపడ్డట్లు తెలిసింది. కాళేశ్వరం విషయంలోనూ గవర్నర్ ప్రవర్తనలో విపరీత ధోరణి పతాక స్థాయికి చేరిందని అభిప్రాయపడ్డట్లు సమాచారం. ఇలాంటి పరిస్థితుల్లో ఇంకా గవర్నర్ వద్దకు వెళ్లడం అర్థంలేదని ఆయన వాదించినట్లు తెలిసింది. 'ఎట్ హోం'కు కూడా వెళ్లడంసరికాదని, రాజ్‌భవన్‌ను టీఆర్ఎస్‌భవన్‌గా భావించడమే మేలని స్పష్టం చేసినట్లు తెలిసింది. దీనికి షబ్బీర్ అలీ స్పందిస్తూ పార్లమెంటరీ సెక్రటరీల విషయంలో ఎమ్మెల్యేల తొలగింపు విషయంలో పార్టీ తరఫున వాదనను రిజిస్టర్ చేసేందుకే గవర్నర్ వద్దకు వెళ్లినట్లు వివరణ ఇచ్చినట్లు తెలిసింది. వారు వెళ్తున్న విషయం పార్టీలో ముఖ్యనేతలకు తెలియదనీ, ఇకపై ఇలాంటి వ్యవహారాల్లో అందరూ చర్చించుకోవాలని మరో నేత అభిప్రాయపడినట్లు సమాచారం. కాగా, నేతల భేటీలో మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు నేరెళ్ల శారద, అధికార ప్రతినిధిగా ఉన్న మరో నేత మధ్య వాగ్వాదం చోటుచేసుకున్నట్లు తెలిసింది. ఇరువురు పరుష పదజాలంతో దూషించుకున్నట్లు తెలిసింది. తీవ్ర మనస్తాపంతో ఉన్న నేరెళ్ల శారద పార్టీలో ఇదే పరిస్థితి ఉంటే తాను పదవికి రాజీనామా చేసేందుకు సిద్ధంగా ఉన్నట్లు పీసీసీ అధ్యక్షునికి చెప్పినట్లు సమాచారం.

పద్మ అవార్డుల్లో తెలంగాణకు అన్యాయం

» ప్రధాని మోదీకి ఎంపీ వినోద్ లేఖ

హైదరాబాద్, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): ప్రతిష్ఠాత్మక పద్మ అవార్డులను దేశంలోని కొన్ని రాష్ట్రాల వారికే ఏకపక్షంగా ప్రకటించారని టీఆర్ఎస్ ఎంపీ వినోద్‌కుమార్ అసంతృప్తి వ్యక్తం చేశారు. తెలంగాణ నుంచి ఒక్కరినీ అవార్డుకు ఎంపిక చేయకపోవడం అన్యాయమని పేర్కొన్నారు. ఈ మేరకు ప్రధాని మోదీకి శుక్రవారం ఆయన ఓ లేఖ రాశారు. తెలంగాణ నుంచి పలు రంగాలతోపాటు ప్రత్యేకించి సాహిత్య రంగంలో విశేష సేవలందించిన వారి పేర్లను ప్రతిపాదించామని, వారందరూ ఆయా రంగాల్లో సమాజంపై విశేష ప్రభావం చూపిన వారేనని లేఖలో ప్రధానంగా పేర్కొన్నారు.

నిర్వాసితుల డిమాండ్లను పరిష్కరించండి

» సీఎం కేసీఆర్‌కు చాడ బహిరంగ లేఖ

హైదరాబాద్, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): మల్లన్నసాగర్ రిజర్వాయర్ పరిధిలోని నిర్వాసితుల డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి చాడ వెంకటరెడ్డి డిమాండ్ చేశారు. వేములఘాట్ గ్రామస్థులు 600రోజులుగా దీక్షలు చేస్తున్నారని, రిజర్వాయర్ సామర్థ్యం పెంపు, నష్టపరిహారం అంశాలపై అఖిలపక్షం ఏర్పాటు చేయాలని సీఎం కేసీఆర్‌కు శుక్రవారం బహిరంగ లేఖ రాశారు.

ఈఎన్‌సీల పంచాయితీ!

పంచాయతీరాజ్ వర్సెస్ ఆర్‌డబ్ల్యూఎస్..

» కొలిక్కి రాని సీనియారిటీ జాబితా

» జాబితా తయారీ బాధ్యత పీఆర్ ఈఎన్‌సీకి..

» తేల్చడం లేదంటున్న ఆర్‌డబ్ల్యూఎస్ ఈఎన్‌సీ

హైదరాబాద్, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): రెండు విభాగాల ఈఎన్‌సీల మధ్య పంచాయితీ తేలడం లేదు! ఇంజనీర్ల పదోన్నతల అంశం వారి మధ్య వివాదానికి కారణమవుతోంది! ఉన్నతాధికారులిద్దరూ నేరుగా విమర్శించుకొనే దశకు చేరుకున్నారు. వారే పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్ ఈఎన్‌సీలు. సీనియారిటీ జాబితా తయారీలో జాప్యం వీరి మధ్య వివాదానికి తెరలేపింది! సమైక్య ఆంధ్రప్రదేశ్‌లో 2008 మార్చి నెలాఖరువరకు పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజనీరింగ్ విభాగాలు ఒక్కటిగానే ఉన్నాయి. 2008 ఏప్రిల్ 1 నుంచి ఆర్‌డబ్ల్యూఎస్‌ను ప్రత్యేక విభాగంగా ఏర్పాటు చేశారు. దీంతో ఇంజనీర్లు, సిబ్బందిని కూడా విభజించారు. అప్పట్లో క్షేత్ర స్థాయి నుంచి ఈఎన్‌సీ వరకు గల అన్ని పోస్టుల్లోని వారిని వారి అభీష్టం మేరకు ఈ విభాగాలకు కేటాయించారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు రెండు విభాగాలు వేర్వేరుగానే ఉన్నాయి. అయితే 2008 వరకు గల ఉద్యోగులకు పదోన్నతులు కల్పించేందుకు సీనియారిటీ జాబితాను ఖరారు చేసే బాధ్యతను ప్రభుత్వం ప్రస్తుత పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ ఈఎన్‌సీ సత్యనారాయణరెడ్డికి అప్పగించింది. దీంతో 2008 ఏప్రిల్ 1 నుంచి ఆర్‌డబ్ల్యూఎస్‌లోకి వచ్చిన ఇంజనీర్ల సీనియారిటీని ఆయన తయారు చేయాల్సి ఉంది. ఈ జాబితా ఖరారవకపోవడంతో పదోన్నతుల విషయంలో తలెత్తుతున్న ఇబ్బందులు ఇరు విభాగాల మధ్య వివాదాన్ని తారాస్థాయికి చేర్చాయి. సీనియారిటీ జాబితా తేలకపోవడంతో ఆర్‌డబ్ల్యూఎస్ విభాగంలో అందరూ ఇన్‌చార్జిలుగా పదోన్నతులు పొందుతున్నారు. సీఈ, ఎస్ఈ, ఈఈ, డీఈఈ, కార్యాలయ నిర్వహణ పోస్టుల్లో కొనసాగుతున్న వారంతా కూడా ఇన్‌చార్జిలుగానే ఉన్నారు. సీనియారిటీ జాబితా ఖరారైతేనే రెగ్యులర్ పదోన్నతులకు అవకాశం ఉంటుందని, అప్పటి వరకు ఇదే పరిస్థితి నెలకొంటుందని చెబుతున్నారు.

ఇంజనీర్ల సీనియారిటీ జాబితా ఖరారు చేయడంలో జాప్యానికి కోర్టు కేసులే కారణమని పంచాయతీరాజ్ ఈఎన్‌సీ సత్యనారాయణరెడ్డి తెలిపారు. 18 ఏళ్లుగా సీనియారిటీ జాబితా వివాదం నెలకొందని, దీన్ని పరిష్కరించేందుకు కృషి చేస్తున్నామని చెప్పారు. ఈఈ, ఆపై కేడర్ పోస్టులకు ఇప్పటికే సీనియారిటీ జాబితాను ఖరారు చేశామన్నారు. ఇంకా దిగువ స్థాయిలో పోస్టులకు జాబితా రూపొందించేందుకు కోర్టు కేసులు ఇబ్బందిగా మారాయని, దీనిపై ప్రభుత్వానికి లేఖ రాశామని చెప్పారు. త్వరలోనే జాబితా తయారవుతుందని తెలిపారు. అయితే పంచాయతీరాజ్ ఈఎన్‌సీ నుంచి ఆశించినంత సహకారం అందడం లేదని ఆర్‌డబ్ల్యూఎస్ ఈఎన్‌సీ బి.సురేందర్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. సీనియారిటీ ఖరారులో పంచాయతీరాజ్ విభాగం మీనమేషాలు లెక్కిస్తోందన్నారు. సీనియారిటీ జాబితా లేకపోవడంతో పదేళ్లుగా ఇన్‌చార్జి పదోన్నతులతో సరిపెట్టుకోవాల్సి వస్తోందని వాపోయారు.

బొడ్డుపల్లి శ్రీనివాస్‌ది రాజకీయ హత్యే

» ఎమ్మెల్యే వీరేశంవి క్రిమినల్ రాజకీయాలు

» కేసును సీబీఐకి అప్పగించాలి: ఉత్తమ్

» కాల్ డేటాను విచారించాలి: జానారెడ్డి

» కోర్టుకు వెళతా: కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

» నల్లగొండ మునిసిపల్ చైర్‌పర్సన్‌కు కాంగ్రెస్ నేతల పరామర్శ

నల్లగొండ, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): నల్లగొండ మునిసిపల్ చైర్‌పర్సన్ భర్త, కాంగ్రెస్ నాయకుడు బొడ్డుపల్లి శ్రీనివాస్‌ది రాజకీయ హత్యేనని టీపీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. నిందితులను నిష్పాక్షికంగా తేల్చేందుకు కేసును సీబీఐకి అప్పగించాలని డిమాండ్ చేశారు. శుక్రవారం సీఎల్పీ నేత జానారెడ్డి, మండలి ప్రతిపక్ష నేత షబ్బీర్ అలీ, వి.హనుమంతరావు, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, మల్లు రవి తదితరులతో కలిసి శ్రీనివాస్ భార్య బొడ్డుపల్లి లక్ష్మిని నల్లగొండలో ఉత్తమ్ పరామర్శించారు. అనంతరం ఆమె నివాసంలో విలేకరులతో మాట్లాడుతూ.. శ్రీనివాస్ హత్యను తెలంగాణ కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా పరిగణిస్తుందని తెలిపారు. హత్య వెనుక సూత్రధారులు ప్రభుత్వంలో కీలక పదవుల్లో ఉన్నారని, ఇందుకు సీఎం కేసీఆర్ సిగ్గుతో తలదించుకోవాలని అన్నారు. తమ అనుచరుడికి రక్షణ కావాలంటూ ఎమ్మెల్యే వెంకట్‌రెడ్డి సీఎంను కోరినా సీఎం స్పందించలేదన్నారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో ఎమ్మెల్యే వీరేశం అనేక క్రిమినల్ చర్యలకు పాల్పడుతున్నారని, ఇవి ఎవరి అండ చూసుకుని జరుగుతున్నాయో ముఖ్యమంత్రి, జిల్లా మంత్రి జగదీశ్‌రెడ్డి జవాబు చెప్పాలని డిమాండ్ చేశారు. శ్రీనివాస్ కుటుంబానికి కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందన్నారు. కాగా శ్రీనివాస్ ఫోన్‌కు సంబంధించి ఆరు నెలల కాల్ డేటాను పరిశీలిస్తే హత్యకు కారణాలు వెల్లడవుతాయని సీఎల్పీ నేత జానారెడ్డి అన్నారు. అనుచరులే హత్య చేశారంటూ టీఆర్ఎస్ నేతలు, పోలీసులు కట్టుకథలు అల్లుతున్నారని ఆరోపించారు. నిందితులు ఎమ్మెల్యే వేముల వీరేశం సన్నిహితులంటూ ఓ ఫొటోను మీడియాకు చూపారు. చెక్‌పోస్టులపై దాడులు, ఇసుక మాఫియాలో ఎమ్మెల్యే వీరేశం ఉన్నాడని షబ్బీర్ అలీ ఆరోపించారు. నల్లగొండ డీఎస్పీ సుధాకర్‌ను విధుల నుంచి తప్పించాలని డిమాండ్ చేశారు. కాగా గ్యాంగ్‌స్టర్ నయీంను ఎన్‌కౌంటర్ చేసి.. ఎమ్మెల్యే వీరేశంను ఎందుకు వదిలిపెట్టారని వి.హనుమంతరావు ప్రశ్నించారు. హత్యాకాండకు సంబంధించి పూర్తి ఆధారాలున్నాయని, కేసును సీబీఐకి అప్పగించకపోతే కోర్టుకు వెళతానని ఎమ్మెల్యే కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. హత్యలే మార్గమనుకుంటే టీఆర్ఎస్‌లో ఎవరూ మిగలరని హెచ్చరించారు.

ప్రధాన నిందితుల అరెస్టు..

బొడ్డుపల్లి శ్రీనివాస్ హత్యకేసులో ప్రధాన నిందితులు ఇద్దరిని నల్లగొండ పోలీసులు శుక్రవారం అరెస్టు చేశారు. ఈ కేసులో మొత్తం ఏడుగురు నిందితులు ఉండగా.. హత్య జరిగిన రాత్రే మెరుగు గోపి, కత్తుల చక్రి, మాతంగి మోహన్, చంద్రయ్యను అదుపులోకి తీసుకున్నారు. మాంద్ర మల్లేష్, రాంబాబును శుక్రవారం హైదరాబాద్‌లో అరెస్టు చేశారు. మరో నిందితుడు శరత్ పరారీలో ఉన్నాడు. విశ్వసనీయ సమాచారం ప్రకారం బుధవారం అర్ధరాత్రి దాటాక శ్రీనివాస్ హత్య అనంతరం ప్రధాన నిందితులు రైల్వే ట్రాక్ వెంట వెళ్లి తెల్లవారే వరకు ట్రాక్ వెంట ముళ్లపొదల్లో దాక్కున్నారు. తెల్లవారుజామున నల్లగొండ సమీపంలోని పానగల్ వద్దకు చేరుకొని ఆటో ఎక్కి హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారిపై ఉన్న నకిరేకల్ బైపాస్ వరకు చేరుకున్నారు. అక్కడ బస్సు ఎక్కి హైదరాబాద్ వెళ్లి షెల్టర్ తీసుకున్నారు.

దైవదర్శనానికి బయలుదేరిన..

కుటుంబాన్ని మింగిన లారీ

» 'పశ్చిమ'లోని అనంతపల్లి వద్ద దుర్ఘటన

» ఆర్టీసీ బస్సులోని ఐదుగురు దుర్మరణం

» మృతుల్లో నలుగురిది ఒకటే కుటుంబం

» ద్వారకా తిరుమల వెళ్తూ.. రోడ్డుకు బలి

నల్లజర్ల, జనవరి 26 : పశ్చిమ గోదావరి జిల్లా నల్లజర్ల మండలం అనంతపల్లి శివారులో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఐదుగురు దుర్మరణం పాలయ్యారు. మృతుల్లో నలుగురిది ఒకటే కుటుంబం. ఆర్టీసీ బస్సులో అత్తా, భార్య, ఇద్దరు పిల్లలతో కలిసి అతడు దైవదర్శనం నిమిత్తం ద్వారకా తిరుమలకు బయలుదేరాడు. ఇప్పుడు వారందరినీ ఈ ప్రమాదంలో పోగొట్టుకొని ఒంటరిగా మిగిలిపోయాడు. ఘటనాస్థలి వద్ద అతని రోదన చూపరులను చలింపజేసింది. ఎదురుగా వచ్చిన లారీ.. ఆర్టీసీ బస్సు పక్కభాగంలో ఢీకొట్టడంతో ఈ దుర్ఘటన చోటుచేసుకొంది. పోలీసుల కథనం ప్రకారం, తూర్పుగోదావరి జిల్లా తునికి చెందిన కాపుశెట్టి నాగేశ్వరరావు బంగారు దుకాణంలో గుమస్తా. ఆయన భార్య కాపుశెట్టి జ్యోతి(33).. పశ్చిమ గోదావరి జిల్లా నిడదవోలులోని తన తల్లి గేలం లక్ష్మి వద్ద ఉంటూ తమ పిల్లలు శివసాయి, సంతోషిని చదివిస్తోంది. వారంలో ఒకసారి నాగేశ్వరరావు వారి వద్దకు వెళ్లి వస్తుంటాడు. శుక్రవారం పిల్లలకు గణతంత్ర వేడుకల సెలవు ఉండటంతో, వారిని చూడటం కోసం అతడు గురువారం రాత్రి నిడదవోలు చేరుకొన్నాడు. మరునాడు ఉదయం ఐదు గంటలకు అత్త, భార్య, పిల్లలతో కలిసి ద్వారకా తిరుమలకు బయలుదేరాడు. యర్నగూడెం వద్ద వారంతా రాజమండ్రి నుంచి ఏలూరు వెళుతున్న కొవ్వూరు డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు ఎక్కారు. నల్లజర్ల మండలం అనంతపల్లి ఎర్ర కాల్వ బ్రిడ్జి సమీపానికి వారి బస్సు వచ్చేసరికి, సిమెంట్ లోడు లారీ అతివేగంగా ఎదురుగా వచ్చింది. అంతే వేగంతో బస్సును ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో నాగేశ్వరరావుకు గాయాలు కాగా, ఆయన కుటుంబసభ్యులంతా చనిపోయారు. బస్సు ఎక్కిన పది నిమిషాల్లోనే అంతా అయిపోయిందని నాగేశ్వరరావు కన్నీటిపర్యంతమయ్యాడు. తనకూ బలమైన గాయాలు తగిలినా, తమ వారి మృతదేహాల వద్ద నుంచి కదలకుండా, అక్కడే మూడుగంటలపాటు ఉన్నాడు. అనంతరం ఆయనను ఆస్పత్రికి తరలించారు. కాగా, మరో మృతురాలిని భువనేశ్వర్‌కు చెందిన పల్లా సావిత్రమ్మ(60)గా గుర్తించారు. మనవరాలి పెళ్లి కోసం ఆమె భువనేశ్వర్ నుంచి నల్లజర్ల మండలం దూబచర్లకు వస్తూ.. ప్రమాదంలో చిక్కుకొంది. కాగా, లారీ డ్రైవర్ నిర్లక్ష్యం కారణంగానే ఈ ప్రమాదం జరిగినట్టు పోలీసులు గుర్తించారు.


జెండా వందనం చేస్తున్న ట్రాన్స్‌కో, జెన్‌కో సీఎండీ ప్రభాకర్‌రావు

త్వరలో విద్యుత్ వాహన విధానం

▸▸ గణతంత్ర వేడుకల్లో ట్రాన్స్‌కో, జెన్‌కో సీఎండీ ప్రభాకర్‌రావు

హైదరాబాద్, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ప్రభుత్వం త్వరలో విద్యుత్ వాహన విధానాన్ని (ఎలక్ట్రిక్ వెహికల్ పాలసీ) అమలు చేయనున్నట్లు ట్రాన్స్‌కో, జెన్‌కో సీఎండీ ప్రభాకర్‌రావు తెలిపారు. గణతంత్ర దినోత్సవం సందర్భంగా శుక్రవారం ఆయన విద్యుత్‌సౌధలో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి మాట్లాడారు. ఈ విధానం అమలైతే చార్జింగ్ స్టేషన్లకు విద్యుత్ అవసరం ఎక్కువగా ఉంటుందన్నారు. రాష్ట్రంలో ప్రస్తుతం 11 వేల మెగావాట్ల విద్యుత్ డిమాండ్ ఉన్నా.. ఇంకా ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు. కార్యక్రమంలో ట్రాన్స్‌కో జేఎండీ శ్రీనివాసరావు, డైరెక్టర్లు పాల్గొన్నారు.


మధురమ్మకు పాదాభివందనం చేస్తున్న కలెక్టర్ శ్రీదేవసేన

మల్లోజుల తల్లికి కలెక్టర్ పాదాభివందనం

పెద్దపల్లి, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): మావోయిస్టు అగ్రనేతలు మల్లోజుల కోటేశ్వర్‌రావు అలియాస్ కిషన్‌జీ, మల్లోజుల వేణుగోపాల్‌రావు తల్లి మధురమ్మకు పెద్దపెల్లి జిల్లా కలెక్టర్ శ్రీదేవసేన పాదాభివందనం చేశారు. జిల్లా పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో శుక్రవారం జరిగిన గణతంత్ర వేడుకల సందర్భంగా స్వాతంత్ర్య సమరయోధులను సన్మానించారు. ఇందులో భాగంగా మధురమ్మ భర్త వెంకటయ్య స్వాతంత్ర్య సమరయోధుడు కాగా, ఆయన మరణించడంతో మధురమ్మను కార్యక్రమానికి ఆహ్వానించారు. కలెక్టర్ ఆమెకు శాలువా కప్పిన అనంతరం పాదాభివందనం చేశారు. మధురమ్మ ఇద్దరు కుమారులు మల్లోజుల కోటేశ్వర్‌రావు, మల్లోజుల వేణుగోపాల్‌రావు మావోయిస్టు అగ్రనేతలు. కోటేశ్వర్‌రావు ఎన్‌కౌంటర్‌లో మృతి చెందగా, వేణుగోపాల్‌రావు ప్రస్తుతం మావోయిస్టు కేంద్ర కమిటీ సభ్యుడుగా కొనసాగుతున్నారు.

నచ్చని వాళ్లను జైల్లో పెడతారా?: కోదండరాం

హైదరాబాద్, జనవరి 26(ఆంధ్రజ్యోతి): "ఐపీసీ 506, 507 అమలుకు సంబంధించి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం సరికాదు. పరుష పదజాలంతో దూషించారంటూ నచ్చని వాళ్లను జైల్లో పెట్టే ప్రమాదం కనిపిస్తోంది" అని టీజేఏసీ చైర్మన్ కోదండరాం అన్నారు. ప్రభుత్వ వైఖరిని విమర్శించిన వారిని అరెస్టు చేసేందుకు న్యాయస్థానం అనుమతి తీసుకోవాలన్న నిబంధన తొలగించడం అన్యాయమని, పరుష పదజాలానికి కొలమానం ఉండదని అభిప్రాయపడ్డారు. గణతంత్ర దినోత్సవం సందర్భంగా శుక్రవారం టీజేఏసీ కార్యాలయంలో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించిన అనంతరం ఆయన మాట్లాడుతూ కోర్టు అనుమతి లేకుండానే అరెస్టు చేసేలా చట్టాన్ని సవరించడం రాజ్యాంగ విరుద్ధమని, ఈ విషయమై గవర్నర్ చొరవ చూపి రాజ్యాంగ స్ఫూర్తిని కాపాడాలని కోరారు. ఈ విషయమై టీజేఏసీ తరఫున కార్యాచరణ రూపొందిస్తామని ప్రకటించారు. రాజకీయాల్లోకి రావాల్సిన అవసరం ఉందని టీజేఏసీ గుర్తించిందని, అయితే అది ఏ వేదిక ద్వారా అనే విషయమై స్పష్టత రావాల్సి ఉందన్నారు. ఫిబ్రవరికల్లా ఒక నిర్ణయాన్ని ప్రకటిస్తామని తెలిపారు.

రేవంత్.. ఏమైంది నీ రాజీనామా?: నాయిని

"కేసీఆర్ పాలనలో ప్రజలంతా సంతోషంగా ఉన్నారు. ఎవడెవడో ఏదో మాట్లాడుతున్నాడు. వాటికి విలువ లేదు. ఆమ్ ఆద్మీ పార్టీ ఎమ్మెల్యేల్లా టీఆర్ఎస్ వాళ్లపై చర్యలు తీసుకోవాలని మాట్లాడే వాళ్లకు బుద్ధి, జ్ఞానం లేదు. అరే నువ్వు... రేవంత్‌రెడ్డి... నువ్వు కాంగ్రెస్‌లో చేరావు. ఏమైంది నీ రాజీనామా? ఎక్కడ పోయింది?. నువ్వు రాజీనామా చేసి మిగతా ఎమ్మెల్యేల గురించి మాట్లాడు"అని హోం మంత్రి నాయిని నర్సింహారెడ్డి వ్యాఖ్యానించారు. గతంలో టీఆర్ఎస్ నుంచి 10 మంది ఎమ్మెల్యేలు కాంగ్రెస్‌లోకి ఫిరాయించినప్పుడు ఆ పార్టీకి బుద్ధి లేదా? అని ప్రశ్నించారు. గణతంత్ర దినాన్ని పురస్కరించుకుని శుక్రవారం ఇక్కడ టీఆర్ఎస్ కేంద్ర కార్యాలయం తెలంగాణ భవన్‌లో జాతీయ జెండాను నాయిని ఎగురవేశారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ వామపక్షాలు, బీజేపీ నేతలెవరికీ టీఆర్ఎస్ గురించి మాట్లాడే అర్హత లేదన్నారు. "మా ప్రభుత్వానికి ప్రజల మద్దతు ఉంది. దమ్ముంటే ఎన్నికల్లో తేల్చుకుందాం రండి" అని ప్రతిపక్షాలకు సవాల్ విసిరారు. తెలంగాణ ప్రజల ఆశలకు అనుగుణంగా సీఎం కేసీఆర్ పాలన సాగిస్తున్నారని తెలిపారు. 17శాతం వృద్ధి రేటు సాధించడం రాష్ట్రానికే గర్వకారణమన్నారు.


ప్రధాని నరేంద్ర మోదీతో మాట్లడుతున్న వనజీవి రామయ్య

రాష్ట్రపతి విందుకు హాజరైన వనజీవి రామయ్య

ఖమ్మంరూరల్, జనవరి 26: ఢిల్లీలోని రాష్ట్రపతి భవన్‌లో గణతంత్ర దినోత్సవం సందర్భంగా శుక్రవారం రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ ఇచ్చిన (ఎట్‌హోం)విందుకు పద్మశ్రీ అవార్డు గ్రహీత వనజీవి రామయ్య హాజరయ్యారు. ఈ విందుకు హాజరుకావాలని రాష్ట్రపతి భవన్‌నుంచి వారం రోజుల క్రితమే వనజీవికి లేఖ అందింది. ఈ సందర్భంగా రాష్ట్రపతి కోవింద్, ప్రధాని నరేంద్ర మోదీతో పాటు మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్‌ను కలిసి రామయ్య ముచ్చటించారు. కరెన్సీ నోట్లపై మొక్కలు నాటే చిత్రాలను ముద్రించాలని ఈ సందర్భంగా ప్రధానిని కోరినట్టు ఆయన తెలిపారు.

పచ్చని దేశం


గణతంత్ర దినోత్సవం సందర్భంగా రైతులు పొలాల్లో జెండా పండుగ జరుపుకొని తమ దేశభక్తిని చాటుకున్నారు. శుక్రవారం వికారాబాద్ జిల్లా పెద్దేముల్ మండలం మంబాపూర్ గ్రామానికి చెందిన రైతులు కమ్మరి రాములు, తలారి అంజిలయ్య, తలారి రాములు, కృష్ణలు నారుమడితో దేశ చిత్రపటాన్ని పొలంలోనే తయారు చేసి ఔరా అనిపించారు. -పెద్దేముల్

ప్రగతి పథంలో నవ తెలంగాణ

సవాళ్లను అధిగమించి ముందుకు.. కొత్త పరిశ్రమలతో 2 లక్షలమందికి ఉపాధి

- **▸▸ ఉత్పాదక రంగంతో ఆర్థికస్థితి మెరుగు**
- **▸▸ ఈసారి వ్యవసాయానికి ప్రత్యేక బడ్జెట్**
- **▸▸ వచ్చే ఏడాదికి 2.65 లక్షల డబుల్ ఇళ్లు**
- **▸▸ గణతంత్ర దినోత్సవంలో గవర్నర్**

హైదరాబాద్, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): "ఎన్నో ఏళ్ల ఆకాంక్షల తర్వాత తెలంగాణ రాష్ట్రం ఏర్పడింది. అవాంతరాలను, సవాళ్లను అధిగమించి ప్రగతి దిశగా ముందుకెళుతోంది. ప్రజల కళ్లలో ఆనందం కోసం ప్రభుత్వం సంక్షేమ పథకాలను అమలు చేస్తోంది. టీఎస్‌ఐపాస్ ద్వారా కొత్త పరిశ్రమలతో రూ.1,18,000 కోట్ల పెట్టుబడులు వచ్చాయి. ఉత్పాదక రంగంతో రాష్ట్ర ఆర్థిక పరిస్థితి మెరుగుపడింది. 2016-17లో జాతీయ వృద్ధి రేటు 11 శాతం. కాగా.. తెలంగాణ వృద్ధిరేటు 13.9 శాతం. జాతీయ తలసరి ఆదాయం రూ.1,03,219 కాగా.. తెలంగాణలో తలసరి ఆదాయం రూ.1,55,216! 2017-18లో వృద్ధి రేటు 18 శాతం. ఐటీ రంగంలో 12 శాతం వృద్ధి నమోదైంది" అని గవర్నర్ నరసింహన్ తెలిపారు. వచ్చే బడ్జెట్‌లో వ్యవసాయ రంగానికి ప్రత్యేక బడ్జెట్‌ను ప్రభుత్వం ప్రవేశపెట్టనుందన్నారు. పరేడ్ గ్రౌండ్‌లో శుక్రవారం గణతంత్ర దినోత్సవానికి హాజరైన గవర్నర్, సీఎం అమరవీరుల స్థూపం వద్ద పూల మాల వేసి నివాళులర్పించారు. ఆ తర్వాత పోలీసు వందనం స్వీకరించారు. అనంతరం గణతంత్ర దినోత్సవ ప్రసంగం చేశారు. సామాజిక అసమానతలను రూపుమాపి, అట్టడుగు వర్గాల అభ్యున్నతికి పాటుపడుతున్నామని చెప్పారు. పట్టణాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యం ఇస్తున్నామన్నారు. ద్వితీయ శ్రేణి నగరాలు వరంగల్, ఖమ్మం, కరీంనగర్, నిజామాబాద్‌లకు ఐటీ రంగాన్ని విస్తరిస్తున్నామన్నారు. రాష్ట్రంలో అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో శాంతిభద్రతల పరిరక్షణకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. మూడున్నరేళ్లుగా ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ పథకాల గురించి వివరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యమంత్రి కేసీఆర్, స్పీకర్ మధుసూదనచారి, మండలి చైర్మన్ స్వామిగౌడ్, ఉప ముఖ్యమంత్రి మహమూద్ అలీ, మంత్రులు హరీశ్‌రావు, ఈటల, తుమ్మల, తలసాని, జోగు రామన్న, పద్మారావు, సీఎస్ ఎస్పీ సింగ్, గవర్న ర్ సతీమణి విమలా నరసింహన్ హా జరయ్యారు.

అధికారులకు పురస్కారాలు

తెలంగాణలో ప్రతిభ చాటిన అధికారులకు గవర్నర్ నరసింహన్ పురస్కారాలు ప్రదానం చేశారు. యాదాద్రి భువనగిరి కలెక్టర్ అనితా రామచంద్రన్, కరీంనగర్ మున్సిపల్ కమిషనర్ శశాంక్, ఐపీఎస్ అధికారులు రాజేశ్ కుమార్, స్వాతిలక్రా, ఐఎఫ్ఎస్ అధికారులు ఆర్.శోభ, స్వర్గం శ్రీనివాస్‌లకు పురస్కారాలు అందించారు. హైదరాబాద్ నగర పోలీసు చరిత్రపై రూపొందించిన పుస్తకానికి ఫొటోలు అందించిన నూపుర్‌కుమార్, డి.రవీందర్‌రెడ్డిలకు కూడా అవార్డులు అందించారు. టీఎస్‌ఐపాస్ అమల్లో ప్రతిభ చాటిన ఎ.గోపాలరావు (సీఎండీ, టీఎస్‌ఎన్పీడీసీఎల్), జి.రఘుమారెడ్డి (సీఎండీ, టీఎస్ఎస్పీడీసీఎల్), పి.చంద్రమోహన్ (డైరెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్), పి.సత్యనారాయణరెడ్డి (టీఎస్‌పీసీబీ సభ్య కార్యదర్శి), సంగ సురేశ్ (జాయింట్ డైరెక్టర్, కమిషనర్ ఆఫ్ ఇండస్ట్రీస్), కె.చంద్రశేఖర్ బాబు (అసిస్టెంట్ డైరెక్టర్, కమిషనర్ ఆఫ్ ఇండస్ట్రీస్) కూడా పురస్కారాలు అందుకున్నారు. అనంతరం వీరంతా సీఎం కేసీఆర్ ఆశీస్సులు అందుకున్నారు.


సికింద్రాబాద్ పరేడ్‌గ్రౌండ్‌లో పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరిస్తున్న గవర్నర్ నరసింహన్

ఆకట్టుకున్న పరేడ్

గణతంత్ర దినోత్సవం సందర్భంగా పరేడ్ గ్రౌండ్‌లో వివిధ విభాగాల ప్రదర్శన ఆకట్టుకుంది. అత్యుత్తమ ప్రదర్శనగా జమ్మూ కశ్మీర్ బ్రిగేడ్‌కు, ఆ తర్వాత 16 డోగ్రా రెజిమెంట్‌కు అవార్డులను గవర్నర్ అందించారు. మహారాష్ట్ర స్టేట్ రిజర్వ్ పోలీసు బలగానికి ప్రోత్సాహక బహుమతి ప్రదానం చేశారు. జూనియర్ విభాగంలో తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ విద్యార్థులకు, ఆ తర్వాత ఎన్‌సీసీ (గర్ల్స్)కు మెమొంటో అందించారు. భరతమాత వేషం వేసిన మనవరాలితో ఎమ్మెల్యే కొండా సురేఖ రాగా.. ముఖ్యమంత్రి ఆ అమ్మాయిని ఒడిలో కూర్చోబెట్టుకొని ఆశీర్వదించారు.


పోలీసు అమరుల స్థూపం వద్ద నివాళులర్పించి వస్తున్న సీఎం కేసీఆర్

గవర్నర్ ప్రసంగంలోని ముఖ్యాంశాలు

- రాష్ట్రంలో కోటి ఎకరాల సాగే లక్ష్యంగా ప్రాజెక్టుల నిర్మాణానికి ఏటా రూ.25 వేల కోట్లు ఖర్చు చేస్తున్నాం. శ్రీరాంసాగర్ పునరుజ్జీవ పథకం చేపట్టాం. కాళేశ్వరం పూర్తయితే అత్యధిక భాగం సస్యశ్యామలమవుతుంది.
- గతంలో రైతులు విత్తనాలు, ఎరువుల కోసం ఇబ్బందులు పడ్డారు. ప్రస్తుతం ఏ ఇబ్బంది లేకుండా సకాలంలో వీటిని సరఫరా చేస్తున్నాం. రైతులను ఆదుకోవడానికి ఎకరాకు రూ.8 వేల ఆర్థిక సహాయం అందించాలని నిర్ణయించాం.
- వివాదాల్లేని వ్యవసాయ భూములకు పట్టాదార్‌పాస్ పుస్తకాలను త్వరలో అందించనున్నాం.
- టీఎస్‌ఐపాస్‌తో 6,070 కొత్త పరిశ్రమలకు అనుమతులు ఇచ్చాం. 2,000 పరిశ్రమలు ఇప్పటికే ఉత్పత్తి ప్రారంభించాయి.
- మిగులు కరెంట్ దిశగా రాష్ట్రం ముందుకెళుతోంది. జనవరి ఒకటి నుంచి వ్యవసాయ కనెక్షన్లకు 24 గంటల ఉచిత కరెంట్ ఇస్తున్నాం.
- సంక్షేమ పథకాలకు రూ.40 వేల కోట్లు ఖర్చు చేస్తున్నాం. ఆసరా పింఛన్లు, ప్రతి వ్యక్తికి 6 కేజీల బియ్యం, కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్, ఆరోగ్యలక్ష్మి పథకాలు అమలు చేస్తున్నాం.
- డబుల్ బెడ్‌రూమ్ పథకం కింద పేదలకు 2.65 లక్షల ఇళ్లను నిర్మించి ఇవ్వనున్నాం.
- రాష్ట్రంలో 1.50 కోట్ల గొర్రెలను 7.61 లక్షల కుటుంబాలకు పంపిణీ చేయాలని లక్ష్యంగా పెట్టుకుని, 40 లక్షల గొర్రెలు పంపిణీ చేశాం.
- కేజీ టు పీజీ విద్యలో భాగంగా 542 గురుకులాలను ప్రారంభించాం.
- పేదలకు మెరుగైన వైద్యాన్ని అందించడానికి జాతీయ ప్రమాణాలతో అన్ని ఆస్పత్రులను 265 కోట్లతో తీర్చిదిద్దుతున్నాం.
- గిరిజన తండాలన్నీ గ్రామ పంచాయతీలుగా మార్చనున్నాం.


హైదరాబాద్ పాతబస్తీలోని మదీన చౌరస్తాలో జాతీయ జెండాను ఎగురవేస్తున్న ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ

రెండు మూడు నెలల్లో గ్రూప్-4

▸▸ టీఎస్‌పీఎస్సీ చైర్మన్ ఘంటా చక్రపాణి



హైదరాబాద్, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): రెండు మూడు నెలల్లో గ్రూప్-4 ఉద్యోగాలకు నోటిఫికేషన్ జారీ చేయనున్నట్లు టీఎస్‌పీఎస్సీ చైర్మన్ ఘంటా చక్రపాణి తెలిపారు. శుక్రవారం కమిషన్ కార్యాలయంలో జాతీయ జెండాను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. మరిన్ని పోస్టులకు శాఖల నుంచి ఇండెంట్లు రాగానే గ్రూప్-4 ఉద్యోగాలకు నోటిఫికేషన్ జారీ చేస్తామన్నారు. ఈ నెల 31న హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ పోస్టులకు నోటిఫికేషన్ జారీ చేయనున్నట్లు తెలిపారు. టీఎస్‌పీఎస్సీ సభ్యులు విఠల్, మతీనుద్దీన్, సాయిలు, చంద్రావతి, సెక్రటరీ వాణిప్రసాద్ పాల్గొన్నారు.

ఎస్వీఆర్, సావిత్రికి 'పద్మ'లు ఇవ్వాలి: పవన్



హైదరాబాద్, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): తెలుగు రాష్ట్రాలకు చెందిన మరింత మందికి 'పద్మ' అవార్డులు ప్రకటిస్తే సముచితంగా ఉండేదని జనసేన అధినేత, సినీ నటుడు పవన్ కల్యాణ్ పేర్కొన్నారు. దివంగత నటులు ఎస్వీ రంగారావు, సావిత్రికి కూడా మరణానంతర 'పద్మ' పురస్కారాలు ఇచ్చి ఉండాల్సిందని శుక్రవారం ఒక ప్రకటనలో అభిప్రాయపడ్డారు. ఈ విషయంలో తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు చొరవ చూపాలని విజ్ఞప్తి చేశారు. 'పద్మ' అవార్డులు అందుకోనున్న బ్యాడ్మింటన్ క్రీడాకారుడు కిడాంబి శ్రీకాంత్, సంగీత దర్శకుడు ఇళయరాజాకు పవన్ అభినందనలు తెలియజేశారు.



రాజ్‌భవన్‌లో ఏర్పాటు చేసిన ఎట్ హోం కార్యక్రమానికి హాజరైన సీఎం కేసీఆర్; మంత్రి ఈటలను తోడ్కొని వెళ్తున్న నరసింహన్

కన్నుల పండువగా 'ఎట్ హోం'

హాజరైన సీఎం కేసీఆర్, మంత్రులు.. ఏపీ సీఎం చంద్రబాబు గైర్హాజరు

- **▸▸ గైర్హాజరవ్వాలని కాంగ్రెస్ నిర్ణయం**
- **▸▸ టీఎస్ఆర్, దానం, రాపోలు మాత్రం హాజరు**
- **▸▸ వామపక్షాల నాయకులు రాలేదు**

హైదరాబాద్, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): గణతంత్ర దినోత్సవం సందర్భంగా రాజ్‌భవన్‌లో శుక్రవారం సాయంత్రం 'ఎట్ హోం' కార్యక్రమం సందడిగా జరిగింది. గవర్నర్ ఈఎస్ఎల్ నర్సింహన్, విమలా నర్సింహన్ దంపతులు అతిథులకు సాదరంగా ఆహ్వానం పలికారు. రాజ్‌భవన్ లాన్‌లో ఏర్పాటు చేసిన తేనీటి విందుకు సీఎం కేసీఆర్, శాసన సభాపతి మధుసూధనాచారి, మండలి చైర్మన్ స్వామిగౌడ్, డిప్యూటీ స్పీకర్ పద్మా దేవేందర్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి కడియం శ్రీహరి, మంత్రులు టి.హరీశ్ రావు, ఈటల రాజేందర్, తుమ్మల నాగేశ్వరరావు, మాజీ ముఖ్యమంత్రులు కె.రోశయ్య, నాదెండ్ల భాస్కరరావు, బీజేపీ నుంచి కిషన్ రెడ్డి, చింతల రామచంద్రా రెడ్డి, ఎన్‌వీఎస్ఎస్ ప్రభాకర్, టీటీడీపీ నుంచి ఎల్.రమణ, ఎంఐఎం నుంచి అసదుద్దీన్ ఒవైసీ హాజరయ్యారు. ఏపీ నుంచి స్పీకర్ కోడెల శివప్రసాద్, మంత్రులు కేఈ కృష్ణమూర్తి, కామినేని శ్రీనివాసరావు, ప్రత్తిపాటి పుల్లారావు వచ్చారు. గవర్నర్ వైఖరిపై గుర్రుగా ఉన్న కాంగ్రెస్ నేతలు 'ఎట్ హోమ్'కు గైర్హాజరు కావాలని నిర్ణయించుకున్నారు. కానీ టి.సుబ్బరామిరెడ్డి, రాపోలు ఆనంద్ భాస్కర్, దానం నాగేందర్ మాత్రం హాజరయ్యారు. దీనిపై రాపోలు, దానం నాగేందర్ మీడియాతో మాట్లాడుతూ గైర్హాజరు నిర్ణయంపై తమకు సమాచారం లేదని చెప్పారు. వామపక్ష నేతలు కూడా గవర్నర్ ఇచ్చిన విందుకు గైర్హాజరయ్యారు. రాజ్‌భవన్‌లో జరిగే ప్రతి కార్యక్రమానికి విధిగా హాజరయ్యే ఏపీ సీఎం చంద్రబాబు ఈసారి గైర్హాజరయ్యారు. ప్రపంచ ఆర్థిక సదస్సు జరుగుతున్న దావోస్ నుంచి శుక్రవారం సాయంత్రం 4 గంటల ప్రాంతంలో అమరావతికి వచ్చిన ఆయన సమయాభావం వల్ల రాలేకపోయారని ఏపీ నేతలు తెలిపారు. ఎట్ హోమ్ పూర్తయి, సీఎం కేసీఆర్ కూడా రాజ్‌భవన్ నుంచి వెళ్లిపోయిన అనంతరం భద్రతా సిబ్బందిని నెక్లెస్ రోడ్డు వైపు నుంచి వచ్చిన గాలి లాంతర్లు పరుగులు పెట్టించాయి. బీజేపీ నేతృత్వంలో భారత మాతకు మహా హారతి కార్యక్రమంలో భాగంగా గాలి లాంతర్లు వదిలారు. అవి ఆకాశంలో తేలుతూ కొన్ని రాజ్‌భవన్‌లో పడ్డాయి. దాంతో బెంబేలెత్తిన పోలీసులు వాటిని ఆర్పివేసేందుకు ఉరుకులు పరుగులు పెట్టారు.

తెలంగాణలో నియంత పాలన: రమణ

హైదరాబాద్, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో రాజ్యాంగం అమలు కావడం లేదని, నియంత పాలన సాగుతోందని టీడీపీటీఎస్ అధ్యక్షుడు ఎల్.రమణ మండిపడ్డారు. నిలదీసిన వారిని జైలుకు పంపుతున్న కేసీఆర్ ప్రభుత్వంపై పోరాటం చేస్తామని ప్రకటించారు. ఎన్టీఆర్ భవన్‌లో శుక్రవారం గణతంత్ర దినోత్సవం సందర్భంగా జాతీయ జెండాను రమణ ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాజ్యాంగాన్ని ప్రభుత్వాలు అమలు చేస్తే ఫలితం ఉండేదన్నారు. కేసీఆర్ పాలనకు స్వస్తి చెబుతూ వచ్చే ఎన్నికల్లో టీడీపీ అధికారంలోకి వస్తుందని జోస్యం చెప్పారు. ప్రభుత్వాలు రాజ్యాంగాన్ని పక్కాగా అమలు చేసేలా ఓ చట్టం తేవాల్సిన అవసరం ఉందని పొలిట్‌బ్యూరో సభ్యుడు రావుల చంద్రశేఖర్‌రెడ్డి అభిప్రాయపడ్డారు.

హక్కులను హరించేలా కొత్త చట్టం: కిషన్‌రెడ్డి

పౌర హక్కులు హరించేలా టీఆర్ఎస్ ప్రభుత్వం కొత్త చట్టాన్ని తీసుకువస్తోందని బీజేపీ నేత కిషన్‌రెడ్డి మండిపడ్డారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా మాట్లాడిన వారిని కోర్టు అనుమతి లేకుండానే జైల్లో పెట్టేందుకు కుట్ర పన్నుతోందని ధ్వజమెత్తారు. నిజాం అడుగుజాడల్లోనే సీఎం కేసీఆర్ పాలన సాగుతోందని మండిపడ్డారు. గణతంత్ర దినోత్సవం సందర్భంగా శుక్రవారం బీజేపీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమానికి కిషన్‌రెడ్డితోపాటు వందలాదిమంది నాయకులు పాల్గొన్నారు. ఎంపీ బండారు దత్తాత్రేయ మాట్లాడుతూ సీఎంకు ప్రజాస్వామ్యంపై గౌరవం ఉంటే ఇతర పార్టీల నుంచి ఎమ్మెల్యేలను ఎలా తీసుకుంటారని ప్రశ్నించారు.


గాంధీభవన్‌లో జాతీయ జెండా ఆవిష్కరణ అనంతరం వందనం చేస్తున్న కాంగ్రెస్ నేతలు

యథేచ్ఛగా మానవ హక్కుల ఉల్లంఘన

పాలకులే రాజ్యాంగాన్ని అవమానిస్తున్నారు: ఉత్తమ్

నాలుగేళ్లలో ఎన్ని పరిశ్రమలొచ్చాయి?: జానా

హైదరాబాద్/నిజామాబాద్ అర్బన్, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో మానవ హక్కుల ఉల్లంఘన యథేచ్ఛగా సాగుతోందని, ప్రజల హక్కులను రక్షించాల్సిన పాలకులే భక్షకులుగా మారుతున్నారని టీపీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మండిపడ్డారు. ప్రజల భావ ప్రకటన స్వేచ్ఛను హరిస్తూ నిరసన వ్యక్తం చేసిన వారిపై అన్యాయంగా కేసులు పెట్టి జైల్లో వేస్తున్నారని ధ్వజమెత్తారు. గాంధీభవన్‌లో శుక్రవారం గణతంత్ర దినోత్సవం సందర్భంగా జాతీయ జెండాను ఆవిష్కరించిన అనంతరం ఆయన మాట్లాడుతూ అంబేడ్కర్ రచించిన రాజ్యాంగాన్ని పాలకులు అవమానిస్తున్నారని, దళిత, గిరిజన, బడుగు, బలహీన, మైనార్టీ వర్గాలకు రక్షణ లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నియంత పాలన సాగిస్తున్నాయని ఆరోపించారు. బ్రిటీష్ పాలన నుంచి దేశానికి స్వాతంత్ర్యం తేవడంలో కాంగ్రెస్ కీలక పాత్ర పోషించిందని గుర్తుచేశారు. తెలంగాణ రాష్ట్రాన్ని ఇచ్చి ప్రజల మనోభావాలను గౌరవించిందన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక ప్రజలు మెచ్చేలా పాలన అందిస్తుందన్నారు. నాలుగేళ్లలో టీఆర్ఎస్ ప్రభుత్వం రాష్ట్రానికి ఎన్ని పరిశ్రమలు తీసుకొచ్చింది? ఎంత మందికి ఉపాధి లభించింది? తదితర వివరాలతో శ్వేతపత్రం విడుదల చేయాలని సీఎల్పీ నేత జానారెడ్డి డిమాండ్ చేశారు. గాంధీభవన్‌లో ఆయన మాట్లాడుతూ సొంత పనులు చక్కబెట్టుకునేందుకు, దోచుకున్న సొమ్మును దాచుకునేందుకే కేటీఆర్ విదేశాల్లో పర్యటించారని ఆరోపించారు. అబద్ధపు హామీలతో అధికారంలోకి వచ్చారంటూ కేసీఆర్‌పై దుమ్మెత్తి పోశారు. కాగా, ప్రభుత్వ పాలనను విమర్శించే ప్రజాప్రతినిధులు, ప్రజల గొంతు నొక్కేలా ప్రభుత్వం తెస్తున్న కొత్త చట్టాన్ని కాంగ్రెస్ పార్టీ అడ్డుకుంటుందని మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్ అన్నారు. నిజామాబాద్ జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రభుత్వాన్ని విమర్శించే వారిని కోర్టు అనుమతి లేకుండా అరెస్టు చేసేలా కేసీఆర్ ప్రభుత్వం చట్టం తీసుకురావడం సిగ్గుచేటన్నారు. తెలంగాణలో రాజకీయాల్లో బూతు పురాణం ప్రారంభించి, నైతిక విలువలను దిగజార్చింది సీఎం కేసీఆర్ కాదా? అని ప్రశ్నించారు. కేసీఆర్ తీరును సోషల్ మీడియా, బహిరంగ సభల్లో కచ్చితంగా విమర్శిస్తామన్నారు.



చింతచిగురు, పచ్చి చింతకాయల సీజన్ వచ్చేసింది. వీటితో వండే నాన్‌వెజ్ రుచులను ఇష్టపడేవాళ్లు ఎందరో. నాన్‌వెజ్ ప్రియులకు ఈ సీజనంతా పండగే పండగ. చింత చిగురు ఘుమఘుమలతో, చింతకాయ వగరు, పులుపులతో నాన్‌వెజ్ వంటకాలు నోరూరిస్తుంటే... ఎప్పుడెప్పుడు తిందామా అని ఎదురుచూడడం ఖాయం. మీకలా ఎదురు చూసే 'చింత'లేకుండా చింతకాయ, చింతచిగురులతో చేసిన కొన్ని వెరైటీ నాన్‌వెజ్ వంటకాలు ఈ వారం 'వంటిల్లు'లో...

మిస్సయితేనే చింత!

రొయ్యల 'చిగురు'

కావలసినవి: చింతచిగురు-200 గ్రాములు, రొయ్యలు- పావుకిలో, అల్లంవెల్లుల్లి పేస్టు-ఒక టేబుల్‌స్పూను, పచ్చిమిర్చి- ఆరు, ఉల్లిపాయలు- రెండు (సన్నగా తరిగి), గరం మసాలా- ఒక టీస్పూను, కారం- మూడు టీస్పూన్లు, ఉప్పు- తగినంత, పసుపు-పావు టీస్పూను, నూనె- మూడు టేబుల్‌స్పూన్లు.

తయారీ:

- చింతచిగురును చేతుల్లో తీసుకుని నలిపి పొడిలా చేయాలి. కాడల నుంచి ఆకులు పూర్తిగా విడిపోతాయి. ఆ కాడలను బయటకు తీసేయాలి. ఇవి రుచిగా ఉండవు.
- ఉల్లిపాయలు, పచ్చిమిర్చిలను సన్నగా తరగాలి.
- పాన్‌లో నూనె వేడిచేసి, అందులో ఉల్లిపాయ, పచ్చిమిర్చి, అల్లంవెల్లుల్లి పేస్టు వేసి ఉల్లిపాయముక్కలు బంగారువర్ణంలోకి వచ్చేవరకూ వేగించాలి.
- ఆ తర్వాత అందులో రొయ్యలు, ఉప్పు, పసుపు వేసి కలపాలి.
- ఈ మిశ్రమాన్ని ఐదు నిమిషాలపాటు సన్నని మంటపై ఉడికించాలి. అంటే రొయ్యల్లో ఉన్న నీరంతా బయటకు వచ్చేవరకూ ఉంచాలన్నమాట.
- తర్వాత అందులో ఒక కప్పు నీళ్లు పోసి మూతపెట్టి ఉడికించాలి.
- రొయ్యలు మెత్తగా ఉడికిన తర్వాత అందులో కారం, చింత చిగురు, గరం మసాలా వేసి బాగా కలపాలి.
- గ్రేవీ చిక్కనయ్యేంతవరకూ అంటే ఐదు నిమిషాల పాటు స్టవ్‌పై ఉడికించాలి. చింత చిగురు, రొయ్యల కూర రెడీ!



మాంసం పులుసు

కావలసినవి: మటన్- ఒక కిలో (బాగా కడిగి నీరు వంపేయాలి), పసుపు- పావు టీస్పూను, కారం- ముప్పావు టేబుల్‌స్పూను, పచ్చిచింతకాయలు-సరిపడి నన్ని (ఉడకబెట్టి గుజ్జు తీయాలి), ఉప్పు- తగినంత, నూనె- ఒకటిన్నర టేబుల్‌స్పూను.

కచ్చాపచ్చాగా ఉండే పేస్టుకోసం: ఉల్లిపాయలు, పచ్చి మిర్చి ఒక్కొక్కటి మూడు చొప్పున, వెల్లుల్లి రెబ్బలు-12, అల్లం - చిన్న ముక్క.

తయారీ:

- లోతైన కడాయిలో నూనె వేడిచేయాలి. ఉల్లిపాయ పేస్టును అందులో వేసి ఆరు నిమిషాలు వేగించాలి.
- తరువాత శుభ్రంచేసిన మటన్‌ను వేసి బాగా కలిపి ఎనిమిది నిమిషాలు స్టవ్ మీద ఉడికించాలి.
- పసుపు, కారం వేసి రెండు నిమిషాలు ఉడికించాలి.
- తర్వాత రెండు కప్పుల నీళ్లు, తగినంత ఉప్పు వేసి మాంసం సగానికి పైగా ఉడికేంత వరకు ఉంచాలి.
- ముందుగా రెడీ చేసుకున్న పచ్చిచింతకాయగుజ్జును, ఒక కప్పు నీళ్లను అందులో వేసి బాగా కలపాలి. మాంసం పూర్తిగా మెత్తగా అయ్యేవరకూ అంటే దాదాపు అరగంట ఉడికించాలి. మీకు కావలసిన చిక్కదనంలో గ్రేవీ తయారైన తర్వాత కడాయిని స్టవ్ మీద నుంచి కిందికి దించాలి. ఉప్పు సరిపోయిందో, లేదో చూసుకోవాలి. సన్నగా తరిగిన కొత్తిమీరను పైన చల్లితే టేస్టీ మాంసం పులుసు రెడీ అయినట్టే. ఈ పులుసును వేడి అన్నంతో తింటే బాగుంటుంది.



చింతకాయ చేపల పులుసు

కావలసినవి: చేపలు - అర కిలో (మకెరల్. ఒక టేబుల్ స్పూను కారం, ఉప్పు, నిమ్మ రసం వేసి కలిపి ఒక గంట నానబెట్టాలి), పచ్చి చింతకాయలు(పెద్దవి) - పది (కొద్దిగా నీళ్ల పోసి మెత్తగా ఉడికించాలి. తర్వాత వాటి మీదున్న పొట్టు తీసి, గుజ్జు పిండి రసం తీయాలి. అందులో చిటికెడు ఉప్పు, కారం, ధనియాలపొడి వేయాలి. ఉల్లిగడ్డలు- రెండు (సన్నగా తరిగి), పచ్చిమిర్చి- ఆరు (నిలువుగా కోసి), ఆవాలు - అర టీస్పూను, జీలకర్ర- ఒక టీస్పూను, వెల్లుల్లి రెబ్బలు - నాలుగు (కచ్చాపచ్చాగా చేసి), మెంతులు- పావు టీస్పూను, ఎండు మిర్చి- రెండు, కరివేపాకులు - కొన్ని, పసుపు-చిటికెడు, కారం- ఒక టీస్పూను, ధనియాలపొడి-రెండు టీస్పూన్లు, ఉప్పు- సరిపడా, నూనె-మూడు టీస్పూన్లు.

డ్రై పౌడర్‌కి: ధనియాలు- ఒక టీస్పూను, మెంతులు- అర టీస్పూను. నూనె లేకుండా వీటిని వేగించి చల్లారాక మెత్తటి పొడిలా గ్రైండ్ చేయాలి.

పేస్టుకు: పచ్చిమిర్చి- ఒకటి, ఆవాలు- అర టీస్పూను. ఈ రెండింటినీ కలిపి మెత్తటి పేస్టు చేయాలి.

తయారీ:

- లోతైన పాన్‌లో టీస్పూను నూనె వేసి చేపలను మూడు నిమిషాలు వేగించాలి.
- వెడల్పాటి పాన్‌లో కొంచెం నూనె వేసి ఆవాలు వేసి, అవి చిటపటమంటున్నప్పుడు జీలకర్ర, మెంతులు, కచ్చాపచ్చాగా చేసిన వెల్లుల్లి, ఎండుమిర్చి, కరివేపాకులు వేసి అర నిమిషం వేగించాలి. ఉల్లిపాయముక్కలు, పచ్చిమిర్చి కూడా వేసి ఉల్లిపాయముక్కలు బంగారురంగులోకి వచ్చే వరకు వేగించాలి.
- అందులోనే పసుపు, ఉప్పు, కారం, ధనియాల పొడి వేసి కాసేపు వేగించాలి. తరువాత చేపలు వేసి కలిపి మూడు నిమిషాలు ఉడికించాలి.
- తర్వాత చింతకాయ రసం, కొన్ని నీళ్లు పోసి గ్రేవీ వచ్చేవరకూ పులుసును ఉడికించాలి.
- ఇందులో ఆవాలు, పచ్చిమిర్చి పేస్టు, ధనియాలు, మెంతుల పొడి కలిపి కాసేపు ఉడికించాలి. కొత్తిమీర చల్లి.. వేడి అన్నం లేదా రాగి సంకటితో తింటే యమ్మీగా ఉంటుంది.

చింతకాయ చికెన్

కావలసినవి: చికెన్- అరకిలో, టొమాటో- ఒకటి (పెద్దది, సన్నగా తరిగి), ఉల్లిపాయ- ఒకటి (సన్నగా తరిగి), పచ్చిమిర్చి -ఎనిమిది (చిన్న ముక్కలు), పచ్చిచింతకాయ గుజ్జు- ఐదు టేబుల్‌స్పూన్లు, అల్లంవెల్లుల్లి పేస్టు- రెండు టేబుల్‌స్పూన్లు, పసుపు, లవంగాల పొడి- ఒక్కొక్కటి పావు టీస్పూను చొప్పున, కారం- అరటేబుల్‌స్పూను, ఉప్పు-తగినంత, నూనె- తగినంత, కొత్తిమీర- సరిపడా.

తయారీ:

- పాన్‌లో నూనె వేడిచేయాలి. అందులో పచ్చిమిర్చి, ఉల్లిపాయ ముక్కలు వేసి బంగారు రంగు వచ్చే వరకూ వేగించాలి. తర్వాత అందులో అల్లంవెల్లుల్లి పేస్టు వేసి పచ్చివాసన పోయే వరకూ వేగించాలి.
- సన్నగా తరిగిన టొమాటో ముక్కలు, పచ్చిచింతకాయ గుజ్జు ఈ మిశ్రమంలో వేసి ఒక కప్పు నీళ్లు కూడా పోయాలి. తర్వాత చికెన్ ముక్కలు వేసి బాగా కలిపి, కూరలోని నీళ్లు ఆవిరయ్యేంతవరకూ సన్నని మంటపై ఉడికించాలి.
- కూర రంగు మారేవరకు స్టవ్ మీద ఉంచాలి.
- తర్వాత సన్నగా తరిగిన కొత్తిమీరను చల్లాలి.
- వేడి వేడి అన్నంతో ఈ కూరను తింటే ఎంతో బాగుంటుంది.



ఆహారం ఆరోగ్యం

తగు మోతాదులో నెయ్యి మంచిదే!

మేడమ్... నెయ్యి ఆరోగ్యానికి మంచిదేనా ? రోజుకు ఎంత వాడవచ్చు? చిన్నపిల్లలకి పెద్దవాళ్ళకి వాడకం లో తేడా ఏమైనా వుందా?

నెయ్యి ఆరోగ్యానికి చాలా మేలు చేస్తుంది. అయితే అవసరానికి మించి వాడితే ఏదైనా సరే ఆరోగ్యానికి చేటు.



* నెయ్యి అధిక శక్తినిస్తుంది కాబట్టి తగు మోతాదులో మాత్రమే తీసుకోవాలి. రెండు లేదా మూడు టీస్పూన్స్ నెయ్యి ఒక్కరోజుకి ఒక్క వ్యక్తి తీసుకోవచ్చు. మనం రోజుకి 30 గ్రాములకంటే ఎక్కువ కొవ్వు పదార్థాలు తీసుకోకూడదు. నెయ్యి కూడా ఈ 30 గ్రాముల కొలతలో భాగమవ్వాలి .

* కొవ్వుతో కరిగి మన శరీరానికి ఉపయోగపడే విటమిన్లు ఎ,డి,ఇ,కె. ఇవి నెయ్యిలో ఉంటాయి. వీటి వల్ల చర్మం, ఎముకలు, కళ్ళు ఆరోగ్యంగా వుంటాయి. ఈ విటమిన్లు ఇతర జీవక్రియలో కూడా ఉపయోగపడతాయి.

* నెయ్యికి అధికమైన స్మోక్‌పాయింట్(పొగ బిందువు) వుంది. అంటే అధికమైన వేడిని తట్టుకోగలదు. అందువల్ల బేకరీలో ఉపయోగించవచ్చు. కొవ్వు పదార్థాలు, నూనె అధిక వేడి వల్ల కేమికల్ చేంజ్ (రసాయన మార్పు) వచ్చి ఆరోగ్యానికి హాని కలుగుతుంది. నెయ్యితో ఈ ఇబ్బంది ఉండదు.

* నెయ్యి తగు మోతాదులో ట్యూమర్స్‌ని అరికడుతుంది. కొలెస్ట్రాల్‌ని తగ్గిస్తుంది. శరీరంలో ఉన్న కొవ్వు పదార్థాలను సమంగా ఉంచుతుంది .

* నెయ్యిలో ప్రత్యేకమైన కొవ్వు ఆమ్లాలు ఉండటం వల్ల, పెద్ద పేగుకి చాలా ఉపయోగకరంగా ఉంటుంది. ఈ కొవ్వు ఆమ్లాలు ముఖ్యంగా ఛిజిటొ్సెట ఛీజీట్ఫుట్ఫ, ఐఆఖీ, ఔూఛ్ఫిట్ఫజీర్ఛి ఛౌూజూఝ్ఞీజీట వున్నవారికి చాలా ఉపయోగకరం. మంచి బ్యాక్టీరియా వృద్ధి చెంది జీర్ణకోశ ఆరోగ్యం బాగుచేస్తుంది.

చిన్నపిల్లలు, పెద్ద వాళ్ళు కూడా నెయ్యి తీసుకోవచ్చు. పెద్ద వాళ్ళు తమకి ఉన్న వ్యాధులను దృష్టిలో ఉంచుకొని కొంచెం తగ్గించి వాడితే మంచి ఫలితాలు పొందుతారు. అలాగే రుచిని వదులుకోవాల్సిన అవసరం ఉండదు.

డాక్టర్ జానకి
న్యూట్రిషనిస్ట్
drjanakibadugu@gmail.com



గుడ్ ఫుడ్

వెరీ గుడ్డు



గుడ్డు తింటే అంతా 'గుడ్ డే'నే. రుచిలో దానికి సాటి ఏదీ లేదు. గుడ్డుతో చేసుకునే రెసిపీలు సైతం బోలెడు ఉన్నాయి. ఇక ఆరోగ్య ప్రయోజనాలైతే లెక్కే లేదు. అందుకు చిన్న ఉదాహరణ ... గుండెకు గుడ్డు ఎంతో మంచిదట! గుడ్డు గురించి ఎన్నో 'ఎగ్ 'సైటింగ్ విషయాలు ఉన్నాయి. అవేంటంటే...


- ప్రతిరోజూ ఒక గుడ్డు తింటే ఎంతో మంచిది. శరీరంలోని కణజాలంలో ఎనర్జీ నింపడానికి కావలసిన విటమిన్లు, మినరల్స్ ఇందులో పుష్కలంగా ఉన్నాయి.
- గుండెజబ్బులు, స్ట్రోకు రిస్కులను ఇది తగ్గిస్తుంది.
- మాంసకృత్తులు ఇందులో పుష్కలంగా ఉన్నాయి. గుడ్డులో ఉండే మాంసకృత్తుల్లో సగం తెల్లసొనలోనే ఉన్నాయి.
- గుడ్డులో విటమిన్ బి-2 ఉంది.
- రోజూ డైట్‌లో ఒక గుడ్డు తీసుకుంటే బరువు తగ్గుతారు.
- గుడ్డును తినడం వల్ల కడుపు నిండుగా ఉండి తొందరగా ఆకలి వేయదు.
- గుడ్డులోని తెల్లసొన, పచ్చసొన రెండింటిలో ప్రొటీన్లు, విటమిన్లు, ఖనిజాలు అధికం.
- కొవ్వు, కొలెస్ట్రాల్‌లను కరిగించే విటమిన్లు, ఎసెన్షియల్ ఫ్యాటీ యాసిడ్లు గుడ్డు సొనల్లో ఉన్నాయి.
- తెల్లసొనలో విటమిన్-డి, సెలీనియం, బి-6, బి-12లతో పాటు జింక్, ఐరన్, కాపర్ వంటి ఖనిజాలు ఉన్నాయి.
- గుడ్డు సొనల్లో ఫ్యాట్, కాలరీలు సమృద్ధిగా ఉన్నాయి. ఇవి బ్లడ్ కొలెస్ట్రాల్‌పై చెడు ప్రభావం చూపవు. అంతేకాదు గుడ్డు తింటున్న వారిలో 70 శాతం మందికి కొలెస్ట్రాల్ సమస్య ఉండదు. మిగతా 30 శాతం మందిలో ఎల్‌డిఎల్‌పై అతి కొద్ది ప్రభావమే ఇది చూపిస్తోంది.
- గుడ్డు వల్ల ఆరోగ్యవంతమైన, మంచి కొలెస్ట్రాల్ (హెచ్‌డిఎల్) పెరుగుతుంది.
- గుడ్డు 'కంప్లీట్ ప్రొటీన్ ఫుడ్'. వీటిల్లో తొమ్మిది ఎసెన్షియల్ ఎమైనో యాసిడ్లు ఉన్నాయి.
- టీనేజి పిల్లలు తాము తీసుకునే డైట్‌లో చక్కెరతో చేసే స్వీట్లను బాగా తక్కువ తింటూ, ఆరు నెలల పాటు ప్రతి రోజూ గుడ్డును తీసుకుంటే ఆరోగ్యకరమైన పొడుగు ఉంటారని ఒక స్టడీలో వెల్లడైంది.



- గుడ్డులోని పోషకాల్లో బిటైన్, కొలైన్‌లు కూడా ఉన్నాయి. గర్భిణులకు, పాలు ఇచ్చే తల్లులకు కొలైన్ అధికశాతం అవసరం. కొలైన్ మెదడు వృద్ధికి కూడా ఎంతో తోడ్పడుతుంది.
- గుడ్డు జీర్ణశక్తిని, మూత్రపిండాల పని తీరును శక్తివంతం చేస్తుంది.
- గుడ్డులో విటమిన్-డి బాగా ఉంటుంది. అందుకే గుడ్డును తరచూ తినడం వల్ల రికెట్స్, ఆస్టియోపొరాసిస్‌ల బారిన పడరు. ఎముకలు పెళుసుగా కావు.
- గుడ్డు కంటికి ఎంతో మంచిది. గుడ్డు సొనల్లో ఉండే ల్యుటిన్, జెక్సాన్‌థిన్, యాంటాక్సిడెంట్లు కంటి ఆరోగ్యాన్ని కాపాడతాయి. వయసు పైబడినా కంటిచూపును పటిష్ఠంగా ఉంచుతాయి.

ఉడుతా.. ఉడుతా... ఊచ్!

చదవండి



టోపోల్ సీ



ఇది విన్నారా?

ఎక్స్‌ప్లోడింగ్ లంచ్ బ్యాగ్!




ఇదిగో కొంగ!



పేపర్ కళ

విశ్వం లోతుల్లోకి చూసే టెలిస్కోప్



విశ్వంలో అంతుబట్టని రహస్యాలెన్నో ఉన్నాయి. మనిషి చూడని అద్భుతాలు ఎన్నో ఉన్నాయి. వాటిని చూడాలంటే మనిషి కన్ను సరిపోదు. అందుకే శక్తిమంతమైన టెలిస్కోప్‌ను తయారుచేసి విశ్వంలోకి అంతరిక్షంలోకి పంపించే ప్రయత్నాలు చేస్తున్నారు. హబుల్ టెలిస్కోప్‌కన్నా ఎంతో శక్తిమంతమైన టెలిస్కోప్ విశేషాలు తెలుసుకుందామా!

★ 400 ఏళ్ల క్రితం గెలిలియో మొట్టమొదటిసారి టెలిస్కోప్‌ను తయారు చేశారు. ఇటలీకి చెందిన ఈ శాస్త్రవేత్త అంతరిక్ష అధ్యయనం కోసం టెలిస్కోప్‌ను తయారుచేశాడు. అప్పటి నుంచి శాస్త్రవేత్తలు టెలిస్కోప్‌లు వాడుతూనే ఉన్నారు.

★ 1990లో హబుల్ స్పేస్ టెలిస్కోప్‌ను అంతరిక్షంలోకి పంపించారు. ఇది ఇప్పటివరకు పదిలక్షలకు పైగా చిత్రాలను పంపించింది. ఈ టెలిస్కోప్ జీవితకాలం మరో పదేళ్లు మాత్రమే ఉంది.

★ తాజాగా హబుల్ టెలిస్కోప్ కన్నా కొన్ని వందలరెట్లు శక్తిమంతమైన టెలిస్కోప్‌ను అంతరిక్షంలోకి పంపాలని ప్రయత్నం చేస్తున్నారు. దానిపేరు జేమ్స్ వెబ్ స్పేస్ టెలిస్కోప్.

★ ఈ ఏడాది అక్టోబర్‌లో ఫ్రెంచ్ గయానాలోని యూరోపియన్ స్పేస్ ఏజెన్సీ నుంచి ఏరైన్ 5 అనే రాకెట్ ద్వారా జేమ్స్ వెబ్ టెలిస్కోప్‌ను అంతరిక్షంలోకి పంపాలని చూస్తున్నారు. ఒకవేళ వీలుకాకపోతే 2019 మార్చి నుంచి జూన్ మధ్య కాలంలో తప్పనిసరిగా ప్రయోగించనున్నారు. ఈ టెలిస్కోప్ ద్వారా విశ్వానికి సంబంధించిన మరిన్ని అంశాలు తెలుసుకునే అవకాశం కలుగుతుందని శాస్త్రజ్ఞులు భావిస్తున్నారు.


★ భూమి వంటి గ్రహాలు మరేమైనా ఉన్నాయో వెతికే పని చేస్తుంది టెలిస్కోప్. ఈ టెలిస్కోప్‌కు ప్రత్యేక కెమెరాను, టూల్స్‌ను అమర్చారు. మనిషి కన్ను చూడలేని వాటిని ఈ కెమెరా చూస్తుంది.


★ ఈ టెలిస్కోప్ పనితీరుకు సంబంధించిన పరీక్షలన్నింటిని నాసా పూర్తి చేసింది.

★ జేమ్స్ టెలిస్కోప్‌ను 9,30,000 మైళ్ల దూరంలో ఉన్న ఎల్2 అనే పాయింట్‌లో ప్రవేశపెట్టనున్నారు. టెలిస్కోప్ ఇక్కడికి చేరుకోవడానికి నెల రోజుల సమయం పట్టనుంది.

★ జేమ్స్ ఎడ్విన్ వెబ్ అనే వ్యక్తి 1961 నుంచి 68 మధ్య కాలంలో నాసా సెకండ్ అడ్మినిస్ట్రేటర్‌గా పనిచేశారు. ఆయన పేరును టెలిస్కోప్‌కు పెట్టారు.

★ సోలార్ ప్యానెల్స్ టెలిస్కోప్‌కు అవసరమైన పవర్‌ను అందిస్తాయి.





జాతీయ పక్షి

1964లో భారత ప్రభుత్వం 'నెమలి'ని జాతీయ పక్షిగా గుర్తించింది. భారత వన్యప్రాణి సంరక్షణ చట్టం - 1972 ప్రకారం నెమలికి పూర్తి సంరక్షణ కల్పించారు. శ్రీలంక కూడా తమ జాతీయ పక్షిగా నెమలిని గుర్తించింది. నెమళ్లకు దాదాపు రెండు వేల సంవత్సరాల చరిత్ర ఉంది. ఆడ నెమలిని 'పిహెన్' అంటారు. నెమళ్లు గంటకు 16 కిలోమీటర్ల వేగంతో పరుగెత్తగలవు.

మీకు తెలుసా?

చేతి గోళ్లు కాలి గోళ్ల కన్నా నాలుగు రెట్లు వేగంగా పెరుగుతాయి.

ఆణిముత్యం

జీవితం కొంతకాలమే ఉంటుంది. మంచి పేరు చిరకాలం ఉంటుంది.

పాక ప్రావీణ్యం!

నీతి కథ

గౌతమి నగర రాకుమారుడికి యుక్తవయస్సు వచ్చింది. అతను తాను పెళ్లాడగోరిన రాజకుమార్తెను వెతుకుతూ దేశాల మీద బయలుదేరి, అనేక మంది రాజకుమార్తెలను చూశాడు. చూసిన ప్రతి రాజకుమార్తెను అతను "నీకేమేమి వంటకాలు వచ్చును" అని అడిగేవాడు. వాళ్లు చెప్పేవాళ్లు. అతను తృప్తిపడక అక్కడ నుంచి వెళ్లిపోయేవాడు. అలాగే అతను పూర్ణిమా నగరానికి వెళ్లి అక్కడి రాజకుమార్తెను "నీకు ఏమేమి వంటకాలు వచ్చును?" అని అడిగాడు. "మీకు ఎవరిని, ఏమి అడగాలో తెలియనట్టుంది. నేను యువరాణిని. ఇంతవరకు వంట చెయ్యలేదు. ఇకముందు కూడా చెయ్యబోను," అన్నది. ఆ రాజకుమారుడు ఆమెను పెళ్లాడటానికి అంగీకరించాడు.

- మారుపాక సంధ్యారాణి

క్విజ్

ఆవిష్కరణలు, వాటి ఆవిష్కర్తలను గుర్తించండి.


1) విమానం	ఎ) అలెగ్జాండర్ ఫ్లెమింగ్
2) ఎక్స్‌రే	బి) జె.ఎల్.బయర్డ్
3) పెన్సిలిన్	సి) ఆల్ఫ్రెడ్ నోబెల్
4) డైనమైట్	డి) రైట్ సోదరులు
5) టెలివిజన్	ఇ) విలియం కె. రాంట్‌జెన్



10 తేడాలు గుర్తించండి



పజిల్ పూరించండి?



ఈ ఏడాది గణతంత్రదినోత్సవ వేడుకలకు ఒక ప్రత్యేకత ఉంది. అదేంటంటారా..! తొలిసారిగా సరిహద్దు భద్రతా దళాలకు (బోర్డర్ సెక్యూరిటీ ఫోర్స్)కు చెందిన మహిళలు కవాతులో భాగంగా బైక్‌పై సాహస విన్యాసాలతో దుమ్ము రేపారు. మొత్తం 113 మంది మహిళా సభ్యులున్న ఈ 'సీమా భవాని' బృందం అద్భుత ప్రదర్శన వెనుక అలుపెరుగని శ్రమ, సంకల్పం ఉన్నాయి...



దుమ్మురేపిన డేర్ డెవిల్స్!

...సాహస విన్యాసాలలో రాటుదేలారు. డిప్యూటీ కమాండెంట్ రమేష్ చంద్ర వీళ్ల చీఫ్ కోచ్. సబ్ ఇనెస్పెక్టర్ కె.ఎం.కళ్యాణ్ ఈ బృందానికి శిక్షణ ఇచ్చారు. ఈ టీమ్ రాజ్‌పథ్‌లో విజయవంతంగా పలు రిహార్సల్స్ చేసిన తర్వాతే ప్రదర్శనకు సిద్ధమయ్యింది.

విభిన్నంగా...

సాధారణంగా బైక్ నడపడం ఒకెత్తయితే... వాటిపై సాహసాలు...



వివిధ రాష్ట్రాల నుంచి...

ఈ బృందంలో అత్యధికంగా పంజాబ్‌కు చెందిన మహిళలు 20 మంది ఉన్నారు. పశ్చిమబెంగాల్, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, ఉత్తరప్రదేశ్‌లకు చెందిన వారు వరుసగా 15, 10, 9, 8 మంది, అసోం, బిహార్‌ల నుంచి ఏడుగురు, ఒడిశా నుంచి ఆరుగురు, రాజస్తాన్, మణిపూర్, గుజరాత్‌ల నుంచి ఐదుగురు, జమ్ము-కశ్మీర్, ఛత్తీస్‌ఘడ్‌ల నుంచి ఐదుగురు, కేరళ, ఢిల్లీ, కర్ణాటక, ఉత్తరాఖండ్‌ల నుంచి ఇద్దరు, మేఘాలయ, హిమాచల్‌ప్రదేశ్‌ల నుంచి ఒక్కొక్కరు సభ్యులున్నారు.

...చేశారు. రాష్ట్రపతి, ప్రధాని సహా పది ఆసియా దేశాల నాయకులను అబ్బురపరిచారు.

వెల్లుల్లి.. కల్పవల్లి

మీకు మీరే డాక్టర్



- వెల్లుల్లి రసాన్ని పులిపిర్లపై పట్టిస్తూ ఉంటే అవి మాడి రాలిపోతాయి.
- వెల్లుల్లి పాయలను నలగ్గొట్టి అందులో గ్రాము సైందవ లవణం, స్పూను నువ్వుల నూనె కలిపి తింటూ ఉంటే, దవడలు పట్టేసే వ్యాధి తగ్గిపోతుంది.
- వెల్లుల్లిని రోజూ మూడు గ్రాముల చొప్పున నూరి, వరుసగా వారం రోజుల పాటు నువ్వుల నూనెతో గానీ, ఆవు నెయ్యితో గానీ, బియ్యపు గంజితో గానీ సేవిస్తే భుజం నొప్పి, పక్కల నొప్పి, తల నొప్పి తగ్గుతాయి. జీర్ణశక్తి వృద్ధి చెందుతుంది.
- 50 గ్రాముల సుగంధిపాల వేర్లను 2 వెల్లుల్లిపాయలతో కలిపి ముద్దగా నూరి, వస్త్రంతో పిండిన రసాన్ని 2 స్పూన్ల మోతాదులో రోజుకు రెండు పూటలా కొద్ది రోజుల పాటు సేవిస్తే రుతుక్రమ వ్యత్యాసాలు తొలగిపోతాయి.
- మెత్తగా నూరిన స్పూను వెల్లుల్లి ముద్దకు రెట్టింపు నువ్వుల నూనె కలిపి, భోజనంలో ఆవు నెయ్యి కలిపి తింటూ ఉంటే పలురకాల వాత రోగాలు హరిస్తాయి.
- రోజూ రెండు వెల్లుల్లి పాయలు తింటూ ఉంటే కొలెస్ట్రాల్ అదుపులోకి వచ్చి గుండె జబ్బులు దూరంగా ఉంటాయి.
- పాయల పై పొట్టును కాల్చి మసిచేసి నూనెలో కలిపి తలకు పట్టించడం ద్వారా తెల్ల వెంట్రుకలు రాకుండా ముందే నియంత్రించవచ్చు.

ఇంట్లో స్పాంజ్ తోట

స్మార్ట్ హోమ్




ఎలాంటి విత్తనాలు?

జాగ్రత్తలు ఏంటి?

కొత్తదే మేలు

క్యాబేజీ కట్టు



పేరెంటింగ్

ఆ బాధ్యత మీదే!

పిల్లలు చేసే అల్లరి, ఆకతాయితనాన్ని తట్టుకోలేక రోజుకు ఒక సారయినా కోపం తెచ్చుకోని తల్లిదండ్రులు దాదాపు ఉండరు. ఏ తల్లిదండ్రులైనా తమ పిల్లలు నలుగురిలో క్రమశిక్షణతో మెలగాలని కోరుకుంటారు. ఇతరులను గౌరవించాలని, వారి దగ్గర గౌరవం పొందాలని భావిస్తారు. కానీ కొందరు పిల్లల ప్రవర్తన దీనికి పూర్తి విరుద్ధంగా ఉంటుంది. అలాంటప్పుడు పిల్లల చక్కని నడవడికకు అడ్డుగోడలు ఏమిటో తల్లిదండ్రులు తెలుసుకోవాలి. క్రమశిక్షణను నేర్పే పద్ధతులను తెలుసుకోవాలి. ఓపికగా ఆచరణలో పెట్టాలి. అప్పుడే పిల్లల అనుచిత ప్రవర్తనను మొగ్గలోనే తుంచేయవచ్చు.

క్రమశిక్షణ అంటే?

"ఏ రకమైన ప్రవర్తన ను సమాజం ఆమోదిస్తుంది? ఎలాంటి ప్రవర్తనను ఆమోదించదు?" అనే విషయాన్ని పిల్లలకు తెలియజెప్పే ప్రక్రియనే క్రమశిక్షణ అనొచ్చు. నియమాలను పాటించటం కూడా క్రమశిక్షణ కిందకే వస్తుంది.

అయితే పిల్లలకు క్రమశిక్షణ నేర్పటం చెప్పినంత సులువు కాదు. ఆశావాదం, ఆదర్శమైన వ్యక్తులు, ప్రేమించే కుటుంబం, కుటుంబ సభ్యులతో అనుబంధాలు తదితర అంశాలు పిల్లల క్రమశిక్షణకు దోహదం చేస్తాయి. కొన్ని సందర్భాల్లో దండించడం ద్వారా పిల్లల్ని క్రమశిక్షణలో పెట్టాల్సిరావచ్చు కానీ దండించటం వల్లనే పిల్లల్లో మంచి నడవడిక ఏర్పడుతుందని భావించకూడదు.

కటువుగా ఉండొద్దు

ప్రశంసించండి


సహజంగా నేర్పించండి

పర్యవసానాలు వివరించండి

కత్తెర వేయండి



డైలీ సుడోకు - 88



ఎలా పూరించాలి?

సుడోకు - 87 సమాధానం




కృష్ణ కాదు మహేశే!

'నో డౌట్! ఈ వాయిస్ మహేశ్‌ది కాదు. కృష్ణగారిదే!' అనుకున్నారంటే నమ్మండి... గణతంత్ర దినోత్సవం సందర్భంగా 'ఫస్ట్ ఓథ్' పేరిట విడుదల చేసిన 'భరత్ అనే నేను' ఆడియో క్లిప్‌లో మహేశ్‌బాబు వాయిస్ విన్న కొంతమంది ప్రేక్షకులు! ఘట్టమనేని అభిమానులైతే... 'మాటల్లో మహేశ్ తండ్రిని గుర్తు చేశాడ'న్నారు. మహేశ్‌బాబు హీరోగా కొరటాల శివ దర్శకత్వంలో డీవీవీ దానయ్య నిర్మిస్తున్న సినిమా 'భరత్ అనే నేను'. శుక్రవారం ఈ సినిమా టైటిల్, అందులో మహేశ్ ఫస్ట్ లుక్ విడుదల చేశారు. 'ఫస్ట్ ఓథ్'లో మహేశ్ ముఖ్యమంత్రిగా నటిస్తున్నారనే విషయాన్ని స్పష్టం చేశారు. అయితే... ముఖ్యంగా ఆ ఆడియోలో మహేశ్ వాయిస్ సోషల్ మీడియాలోనూ, ప్రేక్షకుల్లోనూ చర్చకు దారితీసింది. ఈ వాయిస్ ఎవరిది? డబ్బింగ్ ఎవరు చెప్పారు? అనుకున్నారంతా! అయితే... అందులోని వాయిస్ కృష్ణది కాదు. అలా డబ్బింగ్ చెప్పింది మహేశ్‌బాబే! ఫస్ట్ లుక్‌ను బట్టి ఆయన స్టైలిష్ సి.ఎం.గా కనిపించనున్నారని అర్థమవుతోంది. రాజకీయ నేపథ్యంతో రూపొందుతోన్న ఈ చిత్రానికి దేవిశ్రీ ప్రసాద్ స్వరకర్త. ఇందులో కియారా అలీ అద్వాని కథానాయికగా నటిస్తున్నారు.

వాళ్లిద్దరి కంటే ఎక్కువే!

సర్వసాధారణంగా భారీ బడ్జెట్ చిత్రాల్లో హీరోయిన్లకంటే హీరోలకే ఎక్కువ పారితోషికం ఉంటుంది. బిజినెస్ అంతా హీరోల పేరు మీదే జరుగుతుంటుంది కనుక నిర్మాతలు కూడా హీరోలకు ఎక్కువ పారితోషికం ఇవ్వడానికి వెనకాడరు. పారితోషికం విషయంలో తమకీ, హీరోలకు మధ్య వ్యత్యాసం ఉండటం కరెక్ట్ కాదనీ సోనాక్షి సిన్హా, కంగనా రనౌత్ వంటివారు నిరసన గళం వినిపించినా పట్టించుకొన్న నిర్మాతలు లేరు. అయితే భారతీయ సినీ చరిత్రలోనే తొలిసారిగా హీరోలకంటే ఎక్కువ పారితోషికం తీసుకొన్న ఘనత దీపికా పదుకొనేకు దక్కింది. రెండు రోజుల క్రితం విడుదలైన 'పద్మావత్' చిత్రంలో ఇద్దరు హీరోలు.. రణవీర్ , షాహిద్ ఉన్నారు. వారిద్దరికీ చెరో రూ. పది కోట్లు పారితోషికంగా చెల్లించగా, టైటిల్ పాత్ర పోషించిన దీపికకు మాత్రం రూ. 13 కోట్లు ఇచ్చారట. మహిళా ప్రాధాన్యం ఉన్న సినిమా కావడం, టైటిల్ రోల్ పోషించడం, ఈ సినిమా కోసం దీపిక కష్టపడిన విధానం గమనించిన నిర్మాతలు ఆమెకు అంత భారీ పారితోషికం ముట్టజెప్పారట. 'పద్మావత్' చిత్రం దీపిక కలల కష్టం కనుక తమకంటే ఆమెకు ఎక్కువ పారితోషికం ఇచ్చినా హీరోలిద్దరూ అభ్యంతరం చెప్పలేదట. హీరోయిన్లంతా గర్వంగా చెప్పుకోవాల్సిన సంఘటనే ఇది.


రన్‌వీర్


షాహిద్


దీపిక


నాగశౌర్య, చిరంజీవి

ఇలాంటి హీరోలు పరిశ్రమకు అవసరం

- చిరంజీవి

"నాగశౌర్యలాంటి హీరోలు సినిమా పరిశ్రమకు రావాలి. అప్పుడే పరిశ్రమ కొత్తరక్తంతో ఉరకలు వేస్తుంది. తన సినిమాలను నేనిప్పటిదాకా బిగ్ స్ర్కీన్‌మీద చూడలేదు. మా నీహారికతో నటించిన 'ఒకమనసు'ను టీవీలో చూశాను. హ్యాండ్‌సమ్‌గా ఉన్నాడు. స్పార్క్ కనిపించింది. నేను హీరోగా ఎదుగుతున్న రోజుల్లో నా సినిమాకు సంబంధించిన ఓ వేడుకకు ఓ పెద్ద హీరో వస్తానని చెప్పి, రాలేకపోయారు. ఆ రోజు నేను డిజప్పాయింట్ అయ్యాను. నాగశౌర్య నన్ను ఈ వేడుకకు ఆహ్వానించగానే నాకు ఆ రోజు గుర్తు వచ్చింది. ఆరోజు నేనున్న పరిస్థితిలో ఈరోజు నాగశౌర్య ఉన్నాడు. శౌర్యను ప్రోత్సహించాలనే ఈ కార్యక్రమంలో పాల్గొన్నాను" అని ప్రముఖ హీరో చిరంజీవి అన్నారు. ఆయన ముఖ్య అతిథిగా గురువారం రాత్రి హైదరాబాద్‌లో 'ఛలో' ప్రీరిలీజ్ వేడుక జరిగింది. నాగశౌర్య, రష్మిక మండన్నా జంటగా ఐరా క్రియేషన్స్ పతాకంపై శంకర్‌ప్రసాద్ ముల్పూరి సమర్పణలో రూపొందిన చిత్రం 'ఛలో'. వెంకీ కుడుముల దర్శకుడు. ఉషా ముల్పూరి నిర్మాత. మహతి స్వర సాగర్ సంగీతం అందించారు. దర్శకుడు మాట్లాడుతూ "నేను తెరకెక్కించిన సినిమాకు చిరంజీవిగారు అతిథిగా వస్తారని ఊహించలేదు. మా చిత్రం తప్పకుండా హిట్ అవుతుంది" అని చెప్పారు. నాగశౌర్య మాట్లాడుతూ "నాకు ఇంకో జన్మంటూ ఉంటే మా అమ్మానాన్నలకే పుడతాను. మెగాస్టార్ అభిమానిగానే పుడతాను. మా టీమ్ అందరూ కష్టపడి చేసిన చిత్రం 'ఛలో'" అని తెలిపారు. ఈ కార్యక్రమంలో సినీ ప్రముఖులు సి.కల్యాణ్, వంశీ పైడిపల్లి, కల్యాణి మాలిక్, ప్రగతితో పాటు చిత్ర యూనిట్ సభ్యులు కూడా పాల్గొన్నారు.

ఫుల్ స్వింగులో...


శంకర్, రజనీకాంత్

చేపా చేపా నువ్వెందుకు ఎండలేదు? కథ గుర్తుందా!? రజనీకాంత్ '2.0' వివరాల గురించి ఏం అడిగినా... చిత్ర బృందం చెప్పే సమాధానాలు ఆ కథను గుర్తుకు తెస్తుంది. ఈ సినిమా టీజర్ ఎప్పుడో విడుదల కావాలి. కానీ, ఇంకా కాలేదు. మొన్నటివరకూ సినిమా విడుదల వాయిదా పడింది కాబట్టి టీజర్ విడుదలనూ వాయిదా వేసినట్టు ఫీలర్లు వదిలారు. కానీ, ఇప్పుడు దర్శకుడు శంకర్ అసలు మేటర్ చెప్పారు. టీజర్ రెడీ కాలేదట! సీజీ వర్క్ వల్లే దాని విడుదల ఆలస్యమైందన్నారు. "ప్రస్తుతం లాస్‌ఏంజిల్స్‌లోని మాబ్‌సీన్‌లో '2.0' టీజర్ సీజీ వర్క్ ఫుల్ స్వింగులో జరుగుతోంది. ఇందులో చాలా గ్రాఫిక్ వర్క్ చేయాలి. అది పూర్తయిన తర్వాత టీజర్ విడుదల తేదీ ప్రకటిస్తాం" అని శంకర్ పేర్కొన్నారు.

తెగువగు ధీరుడివనీ... బలమగు భక్తుడవనీ!


అల్లు అర్జున్

...వేలెత్తి ఎలుగెత్తి భూమి పిలిచింది నీ శక్తిని నమ్మి!
ఇల్లే ఇండియా దిల్లే ఇండియా నీ తల్లే ఇండియా!

అల్లు అర్జున్ హీరోగా కె. నాగబాబు సమర్పణలో రామలక్ష్మీ సినీ క్రియేషన్స్ పతాకంపై లగడపాటి శిరీషా-శ్రీధర్ నిర్మిస్తున్న 'నా పేరు సూర్య - నా ఇల్లు ఇండియా'లో రామజోగయ్య శాస్త్రి రాసిన 'సైనిక..' పాటలోని కొన్ని పంక్తులు. గణతంత్ర దినోత్సవం సందర్భంగా విడుదల చేసిన ఈ పాట సైనికుల శక్తికీ, త్యాగాలకు ప్రతీకగా నిలిచిందని పలువురు ప్రశంసిస్తున్నారని చిత్రబృందం పేర్కొంది. పాటకు శ్రోతల నుంచి అద్భుత స్పందన లభిస్తుండడం ఎంతో సంతోషంగా ఉందన్నారు రామజోగయ్య శాస్త్రి. వక్కంతం వంశీ దర్శకుడిగా పరిచయమవుతోన్న ఈ చిత్రంలో అల్లు అర్జున్ సైనికుడిగా కనిపించనున్న సంగతి తెలిసిందే. మరో పాతిక రోజులు చిత్రీకరణ చేస్తే సినిమా పూర్తవుతుందట! వేసవి సందర్భంగా ఏప్రిల్ 27న చిత్రాన్ని విడుదల చేయనున్నట్లు నిర్మాతలు తెలిపారు. అనూ ఇమ్మాన్యుయేల్ హీరోయిన్‌గా, తమిళ నటులు అర్జున్, శరత్‌కుమార్ కీలక పాత్రల్లో నటిస్తున్న ఈ చిత్రానికి 'బన్నీ' వాసు సహనిర్మాత. విశాల్-శేఖర్ స్వరకర్తలు.

రవితేజను టీజ్ చేశా

- సీరత్ కపూర్


- సీరత్ కపూర్

'రన్ రాజా రన్' నుంచి ఏదొక అవకాశం వస్తూనే ఉంది. అప్పట్లో ఓ మంచి సినిమా చేశానని నాకు అర్థం కాలేదు. ఆ తర్వాత కూడా అంతే.. కొన్ని సినిమాలు నా కెరీర్‌కు ఉపయోగపడతాయా లేదా అన్నది కూడా ఆలోచించలేదు. కానీ ఆ పాత్రలన్నీ నాకు గుర్తింపు తెచ్చాయి. ఈ నాలుగేళ్ల జర్నీలో చాలా విషయాలు నేర్చుకున్నా. సినిమా సినిమాకు నాలో ఇంప్రూవ్‌మెంట్ కనిపిస్తోంది. ప్రతి రోజును ఛాలెంజింగ్‌గా భావించి పనిచేస్తున్నా" అని సీరత్ కపూర్ అన్నారు. ఇటీవల 'రాజుగారి గది 2', 'ఒక్కక్షణం' చిత్రాలతో ఆకట్టుకున్న ఆమె 'టచ్ చేసి చూడు'తో అలరించేందుకు సిద్ధమవుతోంది. విక్రమ్ సిరికొండ దర్శకత్వంలో నల్లమలుపు శ్రీనివాస్(బుజ్జి), వల్లభనేని వంశీ సంయుక్తంగా నిర్మించిన చిత్రమిది. వచ్చే నెల 2న ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నారు. ఈ సందర్భంగా సీరత్ కపూర్ శుక్రవారం విలేకర్లతో మాట్లాడారు. ఆ విశేషాలివి...

క్యారెక్టర్ టచ్ చేసింది..

పోలీస్‌గా తను నమ్మిన సిద్ధాంతం కోసం నిలబడే ఓ వ్యక్తి కథ ఇది. రవితేజ పవర్‌ఫుల్ పోలీస్ ఆఫీసర్‌గా కనిపిస్తారు. మామూలుగా ఏ సినిమాలోనైనా హీరో క్యారెక్టర్ హీరోయిన్‌ను డామినేట్ చేస్తుంది. కానీ ఇందులో హీరోయిన్ క్యారెక్టర్ హీరోని డామినేట్ చేస్తుంది. ఎదుటి వ్యక్తి పోలీస్ అయినప్పటికీ ఏమాత్రం భయపడని క్యారెక్టర్ అది. ఆ పాయింటే నన్ను టచ్ చేసింది. గత పాత్రలకు పూర్తి కాంట్రాస్ట్ క్యారెక్టర్ ఇది. సెకండాఫ్‌లో నా ఎంట్రీ ఉంటుంది. రాశీఖన్నాకు, నాకు కాంబినేషన్ సీన్స్ లేవు. కానీ ఇద్దరి పాత్రలకు ప్రాధాన్యం ఉంటుంది, నిడివి సరిసమానంగా ఉంటుంది. పోలీస్ నేపథ్యం ఉన్న కథలనగానే ఎక్కువశాతం సీరియస్‌గానే ఉంటాయి. ఇందులో సీరియస్, కామెడీ, సెంటిమెంట్ అన్నీ సమపాళ్లతో ఉండేలా దర్శకుడు తెరకెక్కించారు. ఇందులో నాకో మాస్ సాంగ్ ఉంది. ఈ తరహా సాంగ్ చెయ్యడం ఇదే మొదటిసారి. సినిమాలో హీరోని డామినేట్ చేశాను కానీ రియల్‌లైఫ్‌లో నేను డామినేటింగ్ గాళ్‌ని కాదు.

ఆ తపన నచ్చింది...

కొత్తగా కనిపించాలి, ప్రేక్షకులకు కొత్తదనాన్ని చూపించాలనే రవితేజ తపన నాకు బాగా నచ్చింది. చాలా డౌన్ టు ఎర్త్ ఆయన. సీన్‌ను ఇంప్రవైజ్ చెయ్యడంలో ఆయన ది బెస్ట్ ఆర్టిస్ట్. పాజిటివ్‌నెస్ ఆయన చుట్టూ వైఫైలా ఉంటుంది. సెట్‌లో ఆయన అందరినీ టీజ్ చేస్తారని విన్నా. ఈసారి ఆయన్ను నేను టీజ్ చేశా. సినిమాలోనే కాదు సెట్‌లో కూడా.

అవగాహన పెరిగింది...

'రాజుగారి గది 2' తర్వాత నేను చేసిన పెద్ద సినిమా ఇది. 'ఒక్కక్షణం' కథానాయికగా ఓ మెట్టు ఎక్కించిందని అనుకుంటున్నా. 'ఒక్కక్షణం', 'టచ్ చేసి చూడు' సినిమాలూ నా కెరీర్‌కు ఉపయోగపడతాయి. ఈ పాత్రలనుబట్టి ఇకపై ఎలాంటి పాత్రలు చెయ్యాలనే దానిపై ఓ అవగాహన వచ్చింది.

కాఫీ... ఇలా తాగానోయ్!


హన్సిక

అసలే శీతాకాలం! అందులోనూ మంచు మబ్బులు నేలమీదకొస్తున్నాయ్. అటువంటి సమయంలో... చల్లటి ఉదయం వేళ... మంచులో మంచి వేడి వేడి ఛాయ్ లేదా కాఫీ భలే ఉంటుంది కదూ! బట్, హోటల్‌లో విపరీతమైన వేడి వేడి కాఫీ సర్వ్ చేస్తే? కొంచెం చల్లగా చేసుకుని తాగాలి. శుక్రవారం హీరోయిన్ హన్సికకు అచ్చంగా అటువంటి సందర్భమే ఎదురయ్యింది. అప్పుడు కాఫీని చల్లగా చేయడం ఎలాగో చక్కగా నేర్చేసుకున్నారు. ఎంతైనా నటి కదా... సెట్‌లో దర్శకుడు సన్నివేశం వివరించగానే అందులోని భావోద్వేగాలను చిటికెలో అర్థం చేసుకున్నట్టు, కాఫీని ఎలా చల్లగా చేయాలో చాలా త్వరగా నేర్చుకున్నారు. చివరకు, 'ఇదిగో నేనిలా కాఫీ తాగానోయ్' అంటూ ఇన్‌స్టాగ్రామ్‌లో పేర్కొన్నారు.

గతజన్మ ప్రేమ...


అంజన, అరుణ్

అరుణ్ రాహుల్, అంజన జంటగా 'చేతిలోన చెయ్యేసి చెప్పు బావ' చిత్రం శుక్రవారం అన్నపూర్ణ స్టూడియోలో ప్రారంభమైంది. కట్ల రాజేంద్రప్రసాద్ దర్శకత్వంలో కె.జె.రాజేశ్ నిర్మిస్తున్న చిత్రమిది. భాను చందర్, సుమన్ కీలక పాత్రధారులు. పూజా కార్యక్రమాల అనంతరం ముహూర్తపు సన్నివేశానికి సాయి వెంకట్ క్లాప్‌నిచ్చారు. దర్శకుడు మాట్లాడుతూ "గత జన్మలో ప్రేమను దక్కించుకోలేని ఓ జంట మరు జన్మలో ఎలా ఒకటయ్యారు' అన్న ఇతివృత్తంతో తెరకెక్కుతున్న చిత్రమిది. నిర్మాత చక్కని కథ అందించారు" అని తెలిపారు.

పౌరాణికంలో సస్పెన్స్

మైథలాజికల్ సస్పెన్స్ థ్రిల్లర్‌గా మా చిత్రాన్ని తెరకెక్కిస్తాం అని దర్శకుడు చెన్నకుని శెట్టి (కుమార్) అన్నారు. ఆయన దర్శకత్వంలో భరతవర్ష క్రియేషన్స్ ఓ చిత్రాన్ని రూపొందిస్తోంది. ఈ చిత్రం పూజా కార్యక్రమాలు ఇటీవల హైదరాబాద్‌లో జరిగాయి. దర్శకుడు సముద్ర, తెలంగాణ ఫిల్మ్ చాంబర్ అధ్యక్షుడు ప్రతాని రామకృష్ణగౌడ్, సెక్రటరీ సాయి వెంకట్, జీవీఆర్ 4 మ్యూజిక్ అధినేత వి.గోపాలకృష్ణ, మురళీ తదితరులు పాల్గొన్నారు. దర్శకుడు మాట్లాడుతూ "కొత్తవారితో పాటు పాపులర్ ఆర్టిస్టులు కూడా మా చిత్రంలో నటిస్తారు' అని తెలిపారు.

దెయ్యం కథ!



తెలుగులో ఇంతవరకూ వచ్చిన దెయ్యం చిత్రాలకు తమ సినిమా 'దెయ్యం చెప్పిన కథ' కేరాఫ్‌గా నిలుస్తుందని దర్శకుడు ప్రదీప్ కాన్ఫిడెంట్‌గా చెబుతున్నారు. విభిన్నమైన కథ, కథనాలతో పూర్తి స్థాయి హారర్ సినిమా దీనిని రూపొందించామని చెప్పారు. ఈ సినిమాతో 29 మంది కొత్త వారికి అవకాశం కల్పించినట్లు ప్రదీప్ చెప్పారు. నవ్యాంధ్రప్రదేశ్ ఫిల్మ్‌చాంబర్ అధ్యక్షుడు ఎస్వీఎస్ రావు సారథ్యంలో పినాక దయాకరరెడ్డి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ప్రస్తుతం రీరికార్డింగ్ జరుపుకొంటున్న ఈ చిత్రాన్ని మార్చిలో విడుదల చేస్తామని ఆయన తెలిపారు. ఈ సినిమా తర్వాత ప్రదీప్ దర్శకత్వంలోనే 'దెయ్యంతో ఓ రాత్రి' సినిమా తీయనున్నట్లు దయాకరరెడ్డి ప్రకటించారు.

యుఎస్ఐబిసి బోర్డులోకి మజుందార్‌షా



న్యూఢిల్లీ: బయోకాన్ చీఫ్ కిరణ్ మజుందార్ షా, ఐడిఎఫ్‌సి బ్యాంక్ వ్యవస్థాపకులు రాజీవ్ లాల్‌కు అమెరికా-భారత్ వాణిజ్య సమాఖ్య (యుఎస్ఐబిసి)- 2018 బోర్డులో ప్రాతినిధ్యం లభించింది. అబాట్ చైర్మన్ మైల్స్ వైట్, కెపిఎంజి ఇంటర్నేషనల్ గ్లోబల్ చైర్మన్ విలియమ్ థోమాస్ కూడా ఈ బోర్డు సభ్యులుగా నియమితులయ్యారు. భారత్, అమెరికాకు చెందిన పారిశ్రామికవేత్తలు సభ్యులుగా ఉండే ఈ బోర్డు ఇరు దేశాల మధ్య ద్వైపాక్షిక వాణిజ్య సంబంధాలను పెంపొందించే దిశగా కృషి చేస్తోంది.

దక్కన్ క్రానికల్ కేసులో కొత్త ఆర్‌పి

- స్వయంగా ఎంపిక చేసిన ఎన్‌సిఎల్‌టి
- క్రెడిటార్స్ కమిటీ పేర్లు పక్కకు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): దక్కన్ క్రానికల్ హోల్డింగ్స్ రుణాల ఎగవేతకు సంబంధించిన ఇన్‌సాల్వెన్సీ కేసులో గతంలో నియమించిన ఇంటెరిమ్ రిజల్యూషన్ ప్రొఫెషనల్ (ఐఆర్‌పి) స్థానే హైదరాబాద్‌లోని నేషనల్ కంపెనీ లా ట్రిబ్యునల్ (ఎన్‌సిఎల్‌టి) మరో కొత్త రిజొల్యూషన్ ప్రొఫెషనల్‌ను నియమించింది. అయితే రుణ సంస్థల కమిటీ సూచించిన ప్యానెల్‌లోని మూడు పేర్లను పక్కనబెట్టి స్వయంగా తానే ఒక రిజొల్యూషన్ ప్రొఫెషనల్‌ను ట్రిబ్యునల్ ఎంపిక చేయడం సంచలనం సృష్టించింది. సాధారణంగా రిజొల్యూషన్ ప్రొఫెషనల్ పేర్లను క్రెడిటార్స్ కమిటీ సూచిస్తుంది. అందులోంచి ఒకరిని ట్రిబ్యునల్ న్యాయమూర్తులు ఎంపిక చేయాల్సి ఉంటుంది. ఈ సంప్రదాయనికి భిన్నంగా క్రెడిటార్స్ కమిటీ సూచించిన మూడు పేర్లలో ఒకరి పేరును ప్రొసీజర్స్‌కు అనుగుణంగా లేదన్న కారణంగా తిరస్కరించారు. మరో ఇద్దరినీ అర్హతలకు సంబంధించిన కారణాలతో పక్కనబెట్టారు. కొత్త రిజొల్యూషన్ ప్రొఫెషనల్‌గా కోల్‌కతాకు చెందిన మమతా బినానీని నియమిస్తున్నట్టు ట్రిబ్యునల్ ప్రకటించింది. ట్రిబ్యునల్ నియామకం కొత్త సంప్రదాయానికి దారితీయడంతో పాటు స్థానిక న్యాయవర్గాలు, చార్టర్డ్ అకౌంటెంట్లు, ఆర్థిక సంస్థల్లో చర్చకు కూడా తెరలేపింది.

10 వేల కోట్ల రూపాయల కేసు...

దక్కన్ క్రానికల్ హోల్డింగ్స్ 2004-2012 మధ్య కాలంలో కెనరా బ్యాంక్, ఆంధ్రా బ్యాంక్, ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్‌తో సహా దాదాపు డజనుకు పైగా బ్యాంకుల నుంచి 10,000 కోట్ల రూపాయల వరకు తీసుకుంది. రుణాల ఎగవేతకు పాల్పడటంతో రుణసంస్థలు కేసు దాఖలు చేశాయి. ఈ కేసులో ఎన్‌సిఎల్‌టి నియమించిన ఐఆర్‌పి గడువు ముగుస్తున్నా రుణ పునర్వ్యవస్థీకరణకు సంబంధించిన ప్రణాళికను సిద్ధం చేయకపోవడంతో ఆయన్ను మార్చి కొత్త ఆర్‌పిని నియమించాలని రుణ సంస్థలు ట్రిబ్యునల్‌ను అభ్యర్థించాయి.ఈ మేరకు మూడు పేర్లతో ప్రతిపాదన కూడా అందించాయి. వారి వాదన విన్న ట్రిబ్యునల్ గురువారం నాడు ఉత్తర్వులు జారీ చేసింది. క్రెడిటార్స్ కమిటీ ప్రతిపాదించిన పేర్లలో ఏ ఒక్క పేరుకూ క్రెడిటార్స్ 75 శాతం ఓట్లు ఇవ్వలేదని కూడా ట్రిబ్యునల్ వెల్లడించింది. ఆ మూడు పేర్లను పక్కనబెట్టి తానే కొత్త ఆర్‌పి పేరును ప్రతిపాదించింది. కార్పొరేట్ ఇన్‌సాల్వెన్సీ రిజొల్యూషన్ ప్రక్రియ సజావుగా సాగేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్టు వెల్లడించింది.

న్యాయవర్గాల్లో సంచలనం..

దక్కన్ క్రానికల్ కేసు కావడంతో దీనిపై న్యాయవర్గాలు, సిఎలు, ఇన్‌సాల్వెన్సీ నిపుణులు, బ్యాంకింగ్ వర్గాల్లో ఈ కేసు విషయంలో ఉత్కంఠ ఉంది. నిజానికి ఇన్‌సాల్వెన్సీ అండ్ బ్యాంక్‌రప్టసీ కోడ్ కింద రిజొల్యూషన్ ప్రొఫెషనల్ ఎంపిక, నియామకాలకు సంబంధించిన అడ్మినిస్ట్రేటివ్ ప్రక్రియలో జోక్యం చేసుకునేందుకు ట్రిబ్యునల్‌కు ప్రత్యేక అధికారాలు లేవు. అదే సమయంలో న్యాయ ప్రయోజనాల దృష్ట్యా తాను సరైనదీ అనుకున్న చర్యలు తీసుకునే అధికారం కూడా ట్రిబ్యునల్‌కు ఉంది. ఈ కేసులో ట్రిబ్యునల్ స్వయంగా తీసుకున్న నిర్ణయాన్ని కొందరు ప్రస్తుతించగా, మరికొందరు మాత్రం చట్టప్రకారం రిజొల్యూషన్ ప్రొఫెషనల్ ఎంపిక హక్కు క్రెడిటార్స్‌కే ఉంటుందన్నారు. మమతా బినానీని ఆర్‌పిగా ప్రకటించడం ఆమె గురువారం హైదరాబాద్‌లో ఉండటం కూడా చర్చనీయాంశంగా మారింది.

స్వేచ్ఛా వాణిజ్యానికి సై

కాకపోతే పారదర్శకత ఉండాలి..అమెరికా ఫస్ట్ అంటే మేమొక్కరమే కాదు

- డబ్ల్యుఇఎఫ్‌లో అధ్యక్షుడు ట్రంప్

దావోస్: స్వేచ్ఛా వాణిజ్యానికి తమ దేశం మద్దతిస్తుందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ స్పష్టం చేశారు. కాకపోతే ఈ విషయంలో పారదర్శకత కోరుకుంటున్నామని, పరస్పర ప్రయోజనకారిగా ఉండాలని ఆయన అన్నారు. దావోస్‌లో వరల్డ్ ఎకనామిక్ ఫోరం (డబ్ల్యుఇఎఫ్) సదస్సులో ట్రంప్ మాట్లాడుతూ.. "ఏ దేశం నిబంధనలను పాటించకపోయినా స్వేచ్ఛ, బహిరంగ వాణిజ్యం సాధ్యపడదు. స్వేచ్ఛా వాణిజ్యానికి మేం మద్దతిస్తాం. కానీ అది పారదర్శకంగా, పరస్పరం లాభదాయకంగా ఉండాలని కోరుకుంటున్నాం" అని అన్నారు.



'అమెరికా ఫస్ట్' అనే సిద్ధాంతాన్ని నేనెప్పుడూ నమ్ముతానని, ప్రపంచంలోని ఇతర దేశాధినేతలు కూడా తమ దేశం విషయంలో ఇదే సిద్ధంతాన్ని ఆచరించాలని కోరుకుంటున్నా అని ట్రంప్ పేర్కొన్నారు. అయితే, అమెరికా ముఖ్యం అంటే మే మొక్కరమే అని మాత్రం కాదన్నారు.

వెల్‌కమ్ టు అమెరికా..

బహిరంగ వాణిజ్యానికి అమెరికా మళ్లీ సిద్ధంగా ఉందని ట్రంప్ తెలిపారు. వ్యాపారం, ఉద్యోగాలు, పెట్టుబడులను అమెరికాకు తరలించేందుకు ఇదే తగిన సమయం అంటూ ప్రపంచ దేశాల పారిశ్రామికవేత్తలకు ఆయన స్వాగతం పలికారు.

ట్రంప్ విందులో ముగ్గురు భారత సిఇఒలు

దావోస్‌లో యూరోపియన్ పారిశ్రామికవేత్తలకు ట్రంప్ ఇచ్చిన విందులో భారత సంతతికి చెందిన ముగ్గురు చీఫ్ ఎగ్జిక్యూటివ్‌లు (సిఇఒ) కూడా పాల్గొన్నారు. యూరప్‌కు చెందిన 15 అంతర్జాతీయ సంస్థల ప్రతినిధులను ట్రంప్ విందుకు ఆహ్వానించారు. అందులో నోవార్టిస్ సిఇఒ వాస్ నరసింహన్, నోకియాకు చెందిన రాజీవ్ సూరి, డెలాయిట్‌కు చెందిన పునీత్ రెంజెన్ ఉన్నారు.

దేశ ప్రయోజనాలకే పెద్దపీట

అమెరికా అధ్యక్షుడిగా దేశంతోపాటు కార్మికులు, స్థానిక కంపెనీల ప్రయోజనాలను ఎల్లప్పుడూ రక్షిస్తానని ట్రంప్ అన్నారు. అమెరికాతో ఇతర దేశాలకు పనికొచ్చే విధంగా ఆర్థిక వ్యవస్థను తీర్చిదిద్దుతామని ఆయన పేర్కొనారు. ఇప్పటికే అమెరికా పలు దేశాలతో ఒప్పందాలు కుదుర్చుకుందని, మరిన్ని దేశాలతో సంప్రదింపులు జరుపుతోందన్నారు.

నియంత్రిస్తేనే బిట్‌కాయిన్‌పై నమ్మకం

- విశ్లేషకుల అభిప్రాయం

బిట్‌కాయిన్ వంటి క్రిప్టో కరెన్సీ టెక్నాలజీతో ప్రయోజనం పొందాలనుకుంటున్న నేపథ్యంలో వాటిని నియంత్రణ పరిధిలోకి తీసుకొస్తేనే వినియోగదారులకు నమ్మకం పెరుగుతుందని డబ్ల్యుఇఎఫ్ సదస్సులో విశ్లేషకులు అభిప్రాయపడ్డారు. ఇప్పటికే పలు దేశాలు బిట్‌కాయిన్ల నియంత్రణ మార్గదర్శకాలను రూపొందించడంపై దృష్టిసారించాయి. స్వీడన్ సొంత క్రిప్టో కరెన్సీని ప్రవేశపెట్టే ఆలోచనలో ఉంది. 'ఇ క్రోనా' పేరుతో తమ సొంత డిజిటల్ కరెన్సీని విడుదల చేయబోతున్నట్లు స్వీడన్ సెంట్రల్ బ్యాంక్ డిప్యూటీ గవర్నర్ సెసిలియా స్కింగ్‌స్లే తెలిపారు. భౌతిక కరెన్సీ క్రమంగా ఆదరణ కోల్పోనుందని ఆమె అన్నారు. "ఇతర కరెన్సీల్లాగే క్రిప్టో కరెన్సీలను సైతం నియంత్రణ పరిధిలోకి తీసుకురావాలి. ప్రధాన స్రవంతిలోకి తీసుకొచ్చే ఏ కరెన్సీనైనా నియంత్రించాల్సిందే" అని స్విట్జర్లాండ్‌కు చెందిన ఇండెక్స్ వెంచర్స్ సహ వ్యవస్థాపకులు నీల్ రిమెర్ అభిప్రాయపడ్డారు. ప్రజల్లో వాటిపై నమ్మకం పెరిగేందుకు నియంత్రణే సరైన మార్గమని ఆయన పేర్కొన్నారు. చాలావరకు వర్ధమాన దేశాలు క్రిప్టో కరెన్సీ సాంకేతికతతో ప్రయోజనం పొందాలని చూస్తున్నాయి. క్రిప్టో కరెన్సీలకు సానుకూల నిబంధనలు రూపొందించడం ద్వారా భారీగా పెట్టుబడులను, నిపుణులను ఆకర్షించవచ్చని చిన్న దేశాలు చూస్తున్నాయని హాంకాంగ్‌కు చెందిన రేడియన్ పార్ట్‌నర్స్ ప్రతినిధి ఝు స్కాట్ అన్నారు.

రూ.32 లక్షల కోట్లకు క్రిప్టో ఆస్తులు

గడిచిన నాలుగేళ్లలో బిట్‌కాయిన్ విలువ 12 రెట్లు పెరిగింది. ప్రస్తుతం ట్రేడవుతున్న అన్ని క్రిప్టో కరెన్సీల మార్కెట్ క్యాపిటలైజేషన్ 50 వేల కోట్ల డాలర్లు (రూ.32 లక్షల కోట్లు) దాటిందని డబ్ల్యుఇఎఫ్ నోట్‌లో పేర్కొంది. బిట్‌కాయిన్‌కు లభిస్తున్న ఆదరణ, ధరలో పెరుగుదలను బట్టి చూస్తుంటే అంతర్జాతీయ ఆర్థిక వ్యవస్థపై క్రిప్టో కరెన్సీలు గణనీయ ప్రభావం చూపవచ్చని డబ్ల్యుఇఎఫ్ అభిప్రాయపడింది. అయితే, ఈ పరిణామం ఎటు దారితీస్తుందనే విషయంపై అనేక ప్రశ్నలు తలెత్తుతున్నాయంది.

డబ్ల్యుటిఒ మంత్రులకు సురేష్ ప్రభు ఆహ్వానం

డబ్ల్యుఇఎఫ్ సమావేశాల్లో భాగంగా వరల్డ్ ట్రేడ్ ఆర్గనైజేషన్ (డబ్ల్యుటిఒ) తన సభ్య దేశాల వాణిజ్య మంత్రుల కోసం ఏర్పాటు చేసిన విందుకు భారత్ తరపున సురేష్ ప్రభుత్వ హాజరయ్యారు. మార్చిలో భారత్‌లో ఏర్పాటు చేయబోయే డబ్ల్యుటిఒ మినీ మంత్రివర్గ సమావేశానికి హాజరుకావాలని ఇతర దేశాల వాణిజ్య మంత్రులను సురేష్ ప్రభు ఆహ్వానించారు.

ముప్పు పొంచే ఉంది: లగార్డ్

ప్రధాన దేశాలన్నీ మెరుగైన వృద్ధి సాధిస్తుండటంతో ప్రపంచ ఆర్థిక వ్యవస్థ భవిష్యత్ ఆశాజనకంగా కన్పిస్తున్నదని అంతర్జాతీయ ద్రవ్యనిధి (ఐఎంఎఫ్) చీఫ్ క్రిస్టీన్ లగార్డ్ అన్నారు. ఈ ఏడాదిలో 120 దేశాలు మంచి వృద్ధి సాధించే అవకాశం ఉందని అంచనా. ఇది సంబరపడే పరిణామమే అయినప్పటికీ అమెరికాలో పన్ను రేట్ల తగ్గింపు, ఆర్థిక అసమానతల పెరుగుదల, దేశాల మధ్య కొరవడిన పరస్పర సహకారం వంటి అంశాల రూపంలో ముప్పు పొంచే ఉందని ఆమె హెచ్చరించారు.

ప్రభుత్వ నిధులు లేకున్నా

ఉడాన్ లాభదాయకమే..!

- స్పైస్‌జెట్ చీఫ్ అజయ్ సింగ్



దావోస్: చిన్న నగరాలకు సైతం విమానయాన సేవలను అందుబాటులోకి తెచ్చేందుకు కేంద్ర ప్రభుత్వం చేపట్టిన ఉడాన్ పథకం మంచి విజయం సాధించిందని స్పైస్‌జెట్ చీఫ్ అజయ్ సింగ్ అన్నారు. తద్వారా దేశంలోని చిన్న నగరాల్లో ఉన్న ఎయిర్‌పోర్టుల్లో చాలావరకు వాడుకలోకి వచ్చాయని డబ్ల్యుఇఎఫ్ సమావేశాల్లో పిటిఐకి ఇచ్చిన ఇంటర్వ్యూలో పేర్కొన్నారు. ఈ పథకంలో భాగంగా విమానాలు నడిపేందుకు ఇప్పటివరకైతే తాము ప్రభుత్వం నుంచి వయబిలిటీ గ్యాప్ ఫండ్ (విజిఎఫ్) కోరలేదన్నారు. ప్రభుత్వ ఆర్థిక మద్దతు లేకున్నా ఈ మార్గాల్లో విమానయాన సేవలు లాభదాయకమేనని ఆయన అభిప్రాయపడ్డారు.

ఇప్పటివరకు సేవలు అందుబాటులో లేని, తగినన్ని సర్వీసులు నడవని విమానాశ్రయాలను ప్రధాన నగరాలతో అనుసంధానం చేయడంతోపాటు సామాన్యులకు సైతం విమానయానాన్ని అందుబాటులోకి తెచ్చే ఉద్దేశంతో కేంద్రం ఉడాన్ (ఉడే దేశ్ కా ఆమ్ నాగరిక్) పథకాన్ని ప్రవేశపెట్టింది. ఈ స్కీంలో చేర్చిన మార్గాల్లో విమానాలు నడిపేందుకు అవసరమైన లైసెన్సుల కోసం కేంద్రం ఇప్పటికే రెండు రౌండ్ల బిడ్డింగ్ నిర్వహించింది. ఈ రెండు బిడ్డింగ్‌లలోనూ స్పైస్‌జెట్ పలు మార్గాల్లో విమానయాన సేవలందించేందుకు లైసెన్సులు దక్కించుకుంది. మొదటి రౌండ్‌లో 128 మార్గాలకు, రెండో రౌండ్‌లో మరో 325 మార్గాల్లో విహంగ సేవలకు లైసెన్సులు మంజూరు చేసింది. ఉడాన్ పథకంలో భాగంగా విమాన సంస్థలకు లభించే విజిఎఫ్‌లో 80 శాతం కేంద్రం, మిగతా 20 శాతం రాష్ట్ర ప్రభుత్వం సమకూరుస్తాయి. ఈశాన్య రాష్ట్రాల విషయానికొస్తే ఈ నిష్పత్తి 90:10 శాతంగా ఉంది.

చౌక విమానయాన సేవల సంస్థ స్పైస్‌జెట్ రోజుకు సరాసరిగా 402 సర్వీసులు నడుపుతోంది. ఏడు అంతర్జాతీయ మార్గాలతో కలిపి మొత్తం 51 రూట్లలో సేవలందిస్తున్నది. సంస్థ వద్ద 38 బోయింగ్ 737ఎన్‌జి, 22 బొంబార్డియర్ క్యూ-400 విమానాలు న్నాయి.

నిజాయితీగా ఉంటే సత్వరమే రుణాలు

- ఆర్థిక సర్వీసుల కార్యదర్శి రాజీవ్ కుమార్

న్యూఢిల్లీ : నిజాయితీపరులు ప్రభుత్వ రంగ బ్యాంకుల (పిఎస్‌బి) నుంచి సులభంగా రుణాలు అందుకునే విధంగా కొన్ని సంస్కరణలు తీసుకురానున్నట్లు కేంద్ర ఆర్థిక సర్వీసుల కార్యదర్శి రాజీవ్ కుమార్ వెల్లడించారు. బ్యాంకింగ్ రంగం కోసం ప్రభుత్వం కొన్ని సంస్కరణలు ప్రకటించిందని, ఇందులో భాగంగానే మార్చి 31 నాటికల్లా 20 పిఎస్‌బిలకు 88,139 కోట్ల రూపాయల రుణాలను అందిస్తున్నట్లు ఆయన చెప్పారు. కఠినతరమైన నిబంధనల్లో భాగంగా అధిక విలువ కలిగిన రుణాల మంజూరుకు పటిష్ఠమైన నిబంధనలను ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ ప్రకటించారని రాజీవ్ పేర్కొన్నారు. 250 కోట్ల రూపాయలకు పైబడిన రుణాలను ఎగ్గొట్టిన డిఫాల్టర్లపై పూర్తి స్థాయిలో నిఘా ఉంచనున్నామని చెప్పారు. ఈ తరహా నిబంధనలతో నిజాయితీతో రుణాలు చెల్లించేవారికి రుణ లభ్యత విస్తృతంగా అందుబాటులోకి రానుందన్నారు. ప్రస్తుతం ప్రభుత్వ రంగ బ్యాంకుల మొండి బకాయిలు 8 లక్షల కోట్ల రూపాయలకు చేరుకున్న సంగతి తెలిసిందే. రుణాల మంజూరుకు సంబంధించి కఠినమైన నిబంధనలతో పాటు వివిధ రకాలైన ఫిన్‌టెక్ టూల్స్‌ను వినియోగించనున్నట్లు రాజీవ్ చెప్పారు. వీటితో పాటు సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల (ఎంఎస్ఎంఇ)పై ప్రత్యేకంగా దృష్టి సారించటమే కాకుండా ఫైనాన్షియల్ ఇంక్లూజన్, ఉద్యోగ కల్పనకు అత్యంత ప్రాధాన్యతను ఇవ్వనున్నట్లు ఆయన తెలిపారు. ఎంఎస్ఎంఇ రంగం రుణాలను సులువుగా అందుకునేందుకు ఆన్‌లైన్ దరఖాస్తును అందుబాటులోకి తీసుకురావటమే కాకుండా ప్రతి దశలో దరఖాస్తును ట్రాక్ చేయనున్నట్లు రాజీవ్ చెప్పారు. ఉదయంమిత్రా డాట్‌కామ్ ద్వారా స్వీకరించనున్న దరఖాస్తులను పదిహేను రోజుల్లోనే క్లియర్ చేయనున్నట్లు ఆయన తెలిపారు. ఇప్పటికే కేంద్రం ప్రకటించిన ముద్రా, స్టాండప్ ఇండియా వంటి పథకాల ద్వారా 8,9 కోట్ల మంది లబ్దిదారులకు 3.80 లక్షల కోట్ల రూపాయల రుణాలను మంజూరు చేసినట్లు రాజీవ్ తెలిపారు.

ఫ్యూచర్ గ్రూప్ చేతికి

స్నాప్‌డీల్ లాజిస్టిక్స్

- డీల్ విలువ రూ.35 కోట్లు

న్యూఢిల్లీ: స్నాప్‌డీల్‌కు చెందిన లాజిస్టిక్ సేవల విభాగం వుల్కాన్ ఎక్స్‌ప్రెస్‌ను కొనుగోలు చేస్తున్నట్లు ఫ్యూచర్స్ సప్లై చెయిన్ సొల్యూషన్స్ ప్రకటించింది. పూర్తిగా నగదు చెల్లింపుల ద్వారా జరగనున్న ఈ డీల్ విలువ రూ.35 కోట్లు. వుల్కాన్ కొనుగోలు ద్వారా లాజిసిక్స్ సేవల సామర్థ్యాన్ని మరింత పెంచుకోవడంతోపాటు ఇ-కామర్స్, రిటైల్ క్లయింట్లకు ఆధునిక సాంకేతికతతో కూడిన సేవలందించాలని అనుకుంటున్నట్లు శుక్రవారం విడుదల చేసిన ప్రకటనలో ఫ్యూచర్స్‌గ్రూప్ వ్యవస్థాపకులు, సిఇఒ కిశోర్ బియానీ పేర్కొన్నారు. వుల్కాన్ విక్రయం మూడు పార్టీలకు (వుల్కాన్, స్నాప్‌డీల్, ఫ్యూచర్ గ్రూప్) కలిసిరానుందని స్నాప్‌డీల్ చీఫ్ స్ట్రాటజీ అండ్ ఇన్వెస్ట్‌మెంట్ ఆఫీసర్ జాసన్ కొఠారీ అన్నారు. పూర్తిగా ఇ-కామర్స్ వ్యాపారంపైనే దృష్టిపెట్టాలన్న వ్యాపార వ్యూహంలో భాగంగానే స్నాప్‌డీల్ కీలకేతర ఆస్తులను విక్రయిస్తున్నట్లు కొఠారీ చెప్పారు.

రాబడుల్లో ఇటిఎఫ్‌లే మిన్న



ముంబై : ఒక పెట్టుబడి సాధనంగా ఇటిఎఫ్‌ను ప్రోత్సహించడానికి ప్రభుత్వం గట్టి కృషి చేస్తూ ఉండడంతో పాటు రిటైల్ ఇన్వెస్టర్లు కూడా ఈ సాధనాల పట్ల మక్కువ ప్రదర్శించడం వల్ల రానున్న కాలంలో ఈ విభాగం మంచి వృద్ధిని నమోదు చేస్తుందంటున్నారు. 2012 సంవత్సరం నుంచి 2017 చివరి నాటికి సగటున 40 శాతం వృద్ధితో ఇటిఎఫ్‌ల కార్పస్ 77,897 కోట్ల రూపాయలకు చేరింది. ఇన్వెస్టర్లు నేరుగా మార్కెట్‌లో కాకుండా పరోక్షంగా స్టాక్ మార్కెట్‌లో ఇన్వెస్ట్ చేసేందుకు ఆసక్తి చూపుతున్నారనేందుకు ప్రభుత్వ పెట్టుబడుల ఉపసంహరణకు విశేష స్పందన లభిస్తూ ఉండడమే తార్కాణమని రిలయన్స్ సెక్యూరిటీస్ తాజా నివేదికలో తెలిపింది. ఎంపిక చేసిన కొన్ని కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థల వాటాలతో జారీ చేసిన సిపిఎస్ఇ ఇటిఎఫ్ ప్రారంభ తేదీ 2014 మార్చి 28 నుంచి ఈ ఏడాది జనవరి పదో తేదీ మధ్యన పెట్టుబడిపై సగటున 16.7 శాతం రాబడిని అందించిందని వెల్లడించింది. కేవలం గత ఆరు నెలల కాలాన్ని పరిగణనలోకి తీసుకున్నా పెట్టుబడిపై నిఫ్టీ అందించిన రాబడి 9.4 శాతం కాగా సిపిఎస్ఇ ఇటిఎఫ్ అందించిన రాబడి 16.6 శాతమని పేర్కొంది. ఆయిల్ దిగ్గజాలు ఓఎన్‌జిసి, ఇండియన్ ఆయిల్, గెయిల్ ఇండియా, ఆయిల్ ఇండియా సహా కోల్ ఇండియా, పిఎఫ్‌సి, భారత్ ఎలక్ట్రానిక్స్, ఆర్ఇసి, ఇంజనీర్స్ ఇండియా, కంటైనర్ కార్పొరేషన్ నిఫ్టీ సిపిఎస్ఇ ఇండెక్స్‌లో భాగస్వాములుగా ఉన్నాయి. ఈ ఇండెక్స్‌ను సిపిఎస్ఇ ఇటిఎఫ్ ట్రాక్ చేస్తుంది. 2017 డిసెంబరు చివరి నాటికి గ్లోబల్ ఇటిఎఫ్ మార్కెట్ పరిమాణం 4.8 లక్షల కోట్ల డాలర్లు. దేశీయ ఇటిఎఫ్ మార్కెట్ ఇటీవల కాలంలో మంచి వృద్ధిని సాధించిన మాట వాస్తవమే అయినా ఇంకా శైశవ దశలోనే ఉన్నట్టు ఆ నివేదిక తెలిపింది.

పన్ను రేట్లు తగ్గించండి.. ప్రోత్సాహకాలివ్వండి

ప్రభుత్వాన్ని కోరుతున్న వినియోగ ఉత్పత్తుల సంస్థలు





దేశీయంగా ఉత్పత్తులను తయారు చేస్తున్న కంపెనీలకు ప్రోత్సాహకాలివ్వాలని, విదేశాల నుంచి దిగుమతయ్యే ఉత్పత్తులపై మరింత ఎక్కువగా కస్టమ్స్ సుంకాన్ని విధించాలని కన్స్యూమర్ డ్యూరబుల్స్, హోమ్ అప్లయెన్సెస్ కంపెనీలైన గోద్రెజ్ అప్లయెన్సెస్, పానసోనిక్, ఫిలిప్స్ లైటింగ్స్, ఇంటెక్స్ ప్రభుత్వాన్ని కోరుతున్నాయి. అంతేకాకుండా పన్ను రేట్లను కూడా తగ్గిస్తూ వచ్చే బడ్జెట్‌లో ప్రకటన చేయాలని పేర్కొంటున్నాయి. ఇంధన సామర్థ్యం కలిగిన ఉత్పత్తులను తయారు చేస్తున్న కంపెనీలను మరింతగా ప్రోత్సహించాలని కూడా కోరుతున్నాయి. "రిఫ్రిజిరేటర్లు, వాషింగ్ మిషన్లు, ఏసీలు అనేవి విలాసవంతమైన ఉత్పత్తులు కావు. ఇలాంటి ఉత్పత్తులను వినియోగదారులకు మరింత అందుబాటు ధరల్లో అందించాల్సిన అవసరం ఉంది. ఈ ఉత్పత్తులపై 28 శాతం పన్నుకు బదులుగా 18 శాతం పన్ను విధించాలి" అని గోద్రెజ్ అప్లయెన్సెస్ బిజినెస్ హెడ్ అండ్ ఇవిపి కమల్ నంది తెలిపారు. 5 స్టార్, 4 స్టార్ ఉత్పత్తులపై పన్నును తగ్గించాలని, అప్పుడే ఎక్కువ మంది ఈ ఉత్పత్తులను కొనుగోలు చేయడానికి అవకాశం ఉంటుందని చెప్పారు. అప్లయెన్సెస్ అండ్ కన్స్యూమర్ ఎలక్ట్రానిక్స్ (ఎసిఇ) కేటగిరీలోకి వచ్చే వాషింగ్ మిషన్లు, రిఫ్రిజిరేటర్లపై కస్టమ్స్ సుంకాన్ని పెంచాలని, దీని వల్ల స్థానికంగా తయారీని ప్రోత్సహించే అవకాశం ఏర్పడుతుందని పానసోనిక్ ఇండియా, దక్షిణాసియా ప్రెసిడెంట్, సిఇఒ మనీష్ శర్మ పేర్కొన్నారు. స్మార్ట్‌ఫోన్లు, టీవీలు, ఎల్ఇడి లాంపులపై ప్రభుత్వం కస్టమ్స్ సుంకాన్ని పెంచిందని, వాషింగ్ మిషన్లు, రిఫ్రిజిరేటర్లపైనా ప్రభుత్వం బడ్జెట్‌లో సుంకాన్ని పెంచుతుందని ఆశిస్తున్నామని ఆయన తెలిపారు. ఫినిష్డ్ ఎల్ఇడి బల్బులపై కస్టమ్స్ సుంకాన్ని 10 శాతం నుంచి 20 శాతానికి పెంచారని, దీన్ని ఫినిష్డ్ లైటింగ్ ఉత్పత్తులకు కూడా ప్రభుత్వం వర్తింపజేస్తుందని భావిస్తున్నట్టు ఫిలిప్స్ లైటింగ్ ఇండియా వైస్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ సుమిత్ జోషి తెలిపారు. మొబైల్ ఫోన్లలో వినియోగించే బ్యాటరీ తదితర విడిభాగాలపై వసూలు చేస్తున్న 28 శాతం పన్నును 12 శాతానికి తగ్గించాలని ప్రభుత్వాన్ని ఇంటెక్స్ కోరుతోంది.

పన్ను రేట్లను పునఃపరిశీలించాలి : పర్యాటక పరిశ్రమ

అంతర్జాతీయంగా పోటీ పడాలంటే దేశీయ పర్యాటక రంగానికి మరింతగా ప్రోత్సాహం అందించాలని, ఇందులో భాగంగా 2018-19 బడ్జెట్‌లో పన్ను రేట్లను ప్రభుత్వం పునఃపరిశీలించాలని ఈ పరిశ్రమవర్గాలు కోరుతున్నాయి. ఉద్యోగాల కల్పన, సమ్మిళిత వృద్ధిలో కీలకమైన ఈ రంగంలో వృద్ధికి అనుకూల విధానాలు, సరైన వాతావరణ అవసరం ఉందని పేర్కొంటున్నారు. పర్యాటకం విషయంలో థాయ్‌లాండ్, మలేషియా, సింగపూర్ వంటి దేశాలతో పోటీపడాలంటే అంతర్జాతీయ రేట్లకు సమాన స్థాయిలో సర్వీసులు అందించాల్సి ఉంటుందని మేక్‌మైట్రిప్ వ్యవస్థాపకుడు, గ్రూప్ సిఇఒ దీప్ కల్రా తెలిపారు. ఈ దేశాల్లో ఆతిథ్య రంగంపై విధించే పన్నులు తక్కువ స్థాయిలో ఉన్నాయని, ఫలితంగానే పర్యాటకులను ఎక్కువగా ఆకర్షించే అవకాశం ఏర్పడుతోందని ఆయన పేర్కొన్నారు. దేశంలోని మౌలిక రంగంలో పురోగతి చాలా ముఖ్యమని, మౌలిక సదుపాయాల అభివృద్ధికి అదనపు ప్రోత్సాహకాలు ఇవ్వడం వల్ల మరింత ఎక్కువగా ప్రైవేటు పెట్టుబడులను ఆకర్షించి వృద్ధిని సాధించడానికి ఆస్కారం ఉంటుందని ఆయన తెలిపారు. కాక్స్ అండ్ కింగ్స్ గ్రూప్ సిఇఒ పీటర్ కేర్కర్ కూడా ఇదే రకమైన అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. 2,500-7,500 రూపాయల కేటగిరీ పరిధిలోకి వచ్చే హోటల్ గదులపై 18 శాతం జిఎస్‌టిని వసూలు చేస్తున్నారని, ప్రభుత్వం దీన్ని తగ్గించాలని ఆయన కోరారు. పలు పోటీ దేశాలతో పోల్చితే ఇది చాలా ఎక్కువని, దీన్ని హేతుబద్ధీకరించడం ద్వారా మరింత పోటీ వంతంగా తయారుకావడానికి ఆస్కారం ఉంటుందన్నారు.

ఫుడ్ ప్రాసెసింగ్, గ్రామీణ ప్రాంతాలపై బడ్జెట్ దృష్టి

ప్రభుత్వం వచ్చే బడ్జెట్‌లో ఫుడ్ ప్రాసెసింగ్, గ్రామీణ ప్రాంతాలపై ఎక్కువగా దృష్టి పెట్టే అవకాశం ఉందని వినియోగదారు ఉత్పత్తుల కంపెనీలు భావిస్తున్నాయి. ఫుడ్ ప్రాసెసింగ్ రంగానికి ప్రాధాన్యం ఇవ్వడం వల్ల వ్యవసాయ ఉత్పత్తులకు మరింతగా విలువను జోడించే అవకాశం ఉంటుందని కంపెనీలు అంటున్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో వేతనాలు పెరిగేందుకేకాకుండా, వినియోగదారుల చేతిలో ఎక్కువ సొమ్ము ఉండే విధంగా పన్నులను ప్రభుత్వం తగ్గించే అవకాశం ఉందని పరిశ్రమవర్గాలు భావిస్తున్నాయి. మౌలిక సదుపాయాల అభివృద్ధి, చిన్న వ్యాపారాలు, అందుబాటు ధరల్లో ఇళ్లు, గోదాములు, కోల్డ్ చెయిన్ సదుపాయాలను ఏర్పాటు చేసే వారికి ప్రోత్సాహకాలు కల్పించాలని ప్రభుత్వాన్ని ఎఫ్ఎంసిజి కంపెనీలు కోరాయి.


ఈ రంగంలోకి విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు పెరిగే విధంగా చర్యలు తీసుకోవాలని కూడా సూచించాయి. ఫుడ్ ప్రాసెసింగ్ రంగానికి ప్రాధాన్యం ఇవ్వడం వల్ల అగ్రి వాల్యూ చెయిన్ సామర్థ్యాలు పెరుగుతాయని, రైతుల ఆదాయాలను రెండింతలు పెంచాలన్న ప్రభుత్వ లక్ష్యాలకు ఈ చర్యలు దోహదపడతాయని ఐటిసి ఉన్నతాధికారి ఒకరు పేర్కొన్నారు.

పిఎస్‌బిల రేటింగ్ పెంపు

ముంబై : ప్రభుత్వ రంగ బ్యాంకుల (పిఎస్‌బి) ఔట్‌లుక్‌ను రేటింగ్ ఏజెన్సీ నెగిటివ్ నుంచి స్టేబుల్ (నిలకడ)కు మార్చింది. కేంద్ర ప్రభుత్వం 18 పిఎస్‌బిలకు 88,139 కోట్ల రూపాయల మూలధనాన్ని అందిస్తున్నట్లు ప్రకటించటంతో క్రిసిల్ ఈ రేటింగ్‌ను పెంచింది. ప్రతిపాదిత మూలధనంతో బ్యాంకుల బ్యాలెన్స్ షీట్ పటిష్ఠమయ్యే అవకాశాలుండటమే కాకుండా రుణాలకు డిమాండ్ పెరిగే చాన్స్ ఉందని పేర్కొంది.

మార్చి నాటికి కల్లా ఆంధ్రా బ్యాంక్, సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, బ్యాంక్ ఆఫ్ బరోడా, బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర, ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్, ఓరియెంటల్ బ్యాంక్, పంజాబ్ అండ్ సింధ్ బ్యాంక్, పంజాబ్ నేషనల్ బ్యాంక్, సిండికేట్ బ్యాంక్, యూనియన్ బ్యాంక్, యునైటెడ్ బ్యాంక్‌లు కేంద్ర ప్రభుత్వం నుంచి మూలధనాన్ని అందుకోనున్నాయి.

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	77.00	విజయవాడ	84.00
కరీంనగర్	79.00	గుంటూరు	84.00
వరంగల్	77.00	ఒంగోలు	86.00
మహబూబ్‌నగర్	77.00	చిత్తూరు	64.00
కర్నూలు	77.00	నెల్లూరు	74.00
విశాఖపట్నం	78.00	అనంతపురం	70.00
గోదావరి	83.00		

రిటైల్ (ఒక గుడ్డు) ధర రూ. 4.40 — నెక్ (100 గుడ్లు)



హైదరాబాద్	380.00	చిత్తూరు	388.00
వరంగల్	382.00	చెన్నై	395.00
విజయవాడ	397.00	నమక్కల్	380.00
గోదావరి	397.00	బెంగళూరు	390.00
విశాఖపట్నం	402.00	ముంబై	425.00

ఆంధ్రజ్యోతి

దిక్సూచి

12 diksuchi@andhrajyothy.com

నిజామాబాద్ • శనివారం 27 జనవరి 2018



ఇంటర్ ప్రాక్టికల్స్

ఇంటర్మీడియెట్ ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు కీలక సమయం ఆసన్నమైంది. ఒక వైపు పబ్లిక్ పరీక్షలు, మరో వైపు ఎంసెట్, జేఈఈ, నీట్ వంటి పోటీ పరీక్షల హడావుడి మధ్యలో ప్రాక్టికల్స్. సమయం మాత్రం పరిమితంగానే ఉంది. తెలుగు రాష్ట్రాల్లో త్వరలోనే ఇంటర్మీడియెట్ ప్రాక్టికల్స్ ప్రారంభమవుతున్నాయి. అటుపై బోర్డు పరీక్షలు. ఒక వైపు పరీక్షలకు సిద్ధమవుతూనే, ప్రాక్టికల్స్‌కు సన్నాహాలు మొదలుపెట్టాల్సిన పరిస్థితి. పబ్లిక్ పరీక్షల్లో మార్కులు ఎంత కీలకమో ప్రాక్టికల్ మార్కులు కూడా అంతే ముఖ్యం. అంతేకాకుండా ప్రాక్టికల్స్‌లో 100 శాతం మార్కులను స్కోర్ చేసేందుకు అవకాశం ఉంటుంది. తద్వారా తుది ఫలితాల్లో మెరుగైన మార్కులు సాధించవచ్చు. ఒక్కోసారి తుది మార్కుల్లో ప్రాక్టికల్స్‌లో సాధించిన మార్కులే నిర్ణయాత్మకంగా ఉంటాయి. ఎంసెట్ వంటి పోటీ పరీక్షల్లో ఇంటర్మీడియెట్ మార్కులకు వెయిటేజీ ఇస్తున్నారు. ఈ నేపథ్యంలో ప్రతి మార్కూ కీలకమే. కాబట్టి ప్రాక్టికల్స్‌కు పక్కాగా ప్రిపేర్ అయి అధిక మార్కులను సాధించడానికి ప్రయత్నించాలి.

ప్రయోగ పరీక్షలు ఫలించాలంటే..

బోటనీ

ఇంటర్మీడియట్ విద్యార్థులు థియరీకి ఇచ్చినంత ప్రాధాన్యం ప్రాక్టికల్స్‌కు కూడా ఇవ్వాలి. ప్రాక్టికల్స్‌లో కొద్దిపాటి శ్రమతో తేలిగ్గా మరిన్ని మార్కులు తెచ్చుకోవచ్చు. నూటికి నూరు శాతం మార్కులు ప్రాక్టికల్స్‌లో సాధ్యం. విద్యార్థులు ప్రాక్టికల్ పరీక్షకు హాజరవడానికి ముందుగా కొన్ని అంశాల్లో జాగ్రత్తలు తీసుకోవాలి.

- బోటనీ ప్రాక్టికల్స్‌లో మంచి మార్కులు సాధించాలంటే థియరీలో కూడా విద్యార్థికి పట్టు ఉండాలి.
- ప్రశ్నల నిధిని తప్పనిసరిగా చదవాలి. ఇందులో పేర్కొన్న స్కీం ఆఫ్ ఎవాల్యుయేషన్ ప్రకారమే ప్రాక్టికల్స్‌కు మార్కులు ఇస్తారు. ఇందులో ఇచ్చిన మార్కుల విభజనను గుర్తుంచుకోవాలి. తదనుగుణంగా జవాబులు రాయాల్సి ఉంటుంది.
- రికార్డు మొత్తం పూర్తి చేయాలి. అన్నిటికి నోట్సు రాసుకోవాలి. బొమ్మలన్నింటికి పేర్లు రాయడం, భాగాలు గుర్తించడం మర్చిపోవద్దు. అలాగే డిపార్ట్‌మెంట్ అధ్యాపకుడి సంతకం తప్పనిసరిగా తీసుకోవాలి. అన్ని పేజీల మీద అధ్యాపకుడి సంతకం తీసుకోవాలి. సర్టిఫై చేసిన రికార్డులను మాత్రమే ఎగ్జామినర్ ఎవాల్యుయేషన్‌కు పరిగణనలోకి తీసుకుంటారు.



- స్పాటింగ్ బిట్స్‌కు నిర్ణీత సమయంలోనే జవాబులు రాయాల్సి ఉంటుంది. స్పాట్‌లను గుర్తించి కారణాలు కూడా రాయాలి. పటాలు గీయనవసరం లేదు.
- రికార్డు ప్రిపరేషన్‌లో జాగ్రత్తలు తీసుకోవాలి. మొదటి, రెండో సంవత్సరం ప్రాక్టికల్ సిలబస్‌ను అనుసరించి రికార్డులో పటాలు గీయాలి.
- అధ్యాపకుల వద్ద ప్రశ్నల నిధి ఉంటుంది. దీన్ని జిరాక్స్ తీసుకొని దగ్గర ఉంచుకోవాలి. వీటిలో ప్రయోగాలు కూడా వివరంగా పొందుపరచారు.
- ప్రశ్నలోని కొన్ని భాగాలకు అరమార్కు కేటాయిస్తారు. మార్కులు మొత్తం కూడేటప్పుడు అది ఒక మార్కు అవుతుంది. అందువల్ల జవాబులో చిన్న భాగాన్ని కూడా వదిలిపెట్టకూడదు.
- ప్రాక్టికల్ పరీక్షల టైమ్ టేబుల్‌లో మీకు కేటాయించిన బ్యాచ్ నెంబరును స్పష్టంగా నోట్ చేసుకోవాలి. మీకు కేటాయించిన బ్యాచ్, సెషన్‌లోనే పరీక్షకు హాజరవ్వాలి. బ్యాచ్‌ను మార్చుకొనే అవకాశం ఉండదు.

- పి. నరసింహ ప్రసాద్,
సీనియర్ అధ్యాపకులు

జువాలజీ

జువాలజీ ప్రాక్టికల్స్‌కు ప్రణాళికా బద్ధంగా సిద్ధం కావాలి. ఎలాంటి భయం లేకుండా, అదే సమయంలో తేలిగ్గా తీసుకోకుండా తయారవ్వాలి. ప్రాక్టికల్ పరీక్షలు విద్యార్థుల బహుముఖ నైపుణ్యాలను పరీక్షించడానికి ఉద్దేశించినవి. ఇందులో సాధించే మార్కులు ఇంటర్‌లో పర్సంటేజీని నిర్ణయించడంలో కీలకపాత్ర పోషిస్తాయని మర్చిపోవద్దు.

- అన్ని డయాగ్రమ్‌లను నాలుగైదు సార్లు ప్రాక్టీస్ చేయాలి. అలాగే డయాగ్రమ్ భాగాలను గుర్తుంచుకోవాలి.
- వానపాము జీర్ణ వ్యవస్థ, నాడీ వ్యవస్థ; బొద్దింక నోటి భాగాలు, జీర్ణ వ్యవస్థ, నాడీ వ్యవస్థలను కూడా బాగా సాధన చేయాలి.
- పటాలు గీయడానికి, వాటి భాగాలు గుర్తించడానికి పెన్సిల్ మాత్రమే వాడాలి.
- రికార్డు వర్క్ పూర్తయ్యాక చివరిగా మెరుగులు దిద్దుకోవాలి. అన్ని పేజీలకు తప్పనిసరిగా నంబర్లు వేయాలి. ఫస్ట్ పేజీలో విషయసూచిక రాయాలి.
- విచ్ఛేదనాలు చాలా ముఖ్యమైనవి. వీటిని సరిగా గుర్తించడం నేర్చుకొంటే సులువుగా మరిన్ని మార్కులు తెచ్చుకోవచ్చు. తర్వాత కూడా ప్రయోజనం ఉంటుంది. మెడికల్ ప్రవేశ పరీక్షల్లో పటాల ఆధారంగా కొన్ని ప్రశ్నలు అడుగుతారు. అలాంటివాటికి సమాధానాలు తేలిగ్గా గుర్తించాలంటే విచ్ఛేదనాలు బాగా నేర్చుకోవాలి.
- ప్రయోగ విధానాన్ని రాసేటప్పుడు ఒక క్రమ పద్ధతి పాటించాలి. ప్రయోగ ఉద్దేశం, ఆధార సూత్రం, రసాయనాలు, పరికరాలు, ప్రయోగ విధానం, చివరిగా ఫలితాలను రాయాలి.
- చెక్కిన పెన్సిళ్లు, ఎరేజర్, షార్ప్‌నర్, స్కేల్ మొదలైనవి అన్నీ సిద్ధంగా ఉంచుకోవాలి. పరీక్ష కేంద్రానికి ఒక గంట ముందే చేరుకోవాలి. రికార్డు, హాల్ టికెట్, కాలేజ్ ఐడీ కార్డు తీసుకుపోవడం మర్చిపోవద్దు.



- కె. విజయ లక్ష్మి
సీనియర్ అధ్యాపకురాలు

ఫిజిక్స్

ఈ సబ్జెక్ట్‌లో ప్రాక్టికల్స్ కోసం 30 మార్కులు కేటాయించారు. సిలబస్‌లోని 20 ప్రయోగాలలో లాటరీ ద్వారా ఒక ప్రయోగాన్ని ఎంపిక చేస్తారు.

- మొదటి అర్ధగంటలో మీకు ఇచ్చిన ప్రయోగానికి సంబంధించిన థియరీ భాగాన్ని రాసి ఇవ్వాలి. ఇందులో కింది విషయాలు స్పష్టంగా ఉండాలి. అవి..

ఎ) ఫార్ములా
బి) ఫార్ములాలోని అన్ని పదాల వివరణ
సి) ప్రతీ పదం యూనిట్‌లు
డి) టేబుల్ (పట్టిక) ఇ) మోడల్ గ్రాఫ్

- ఇవి కాకుండా ప్రయోగ విధానం (Procedure) రాయాలి. తీసుకోవల్సిన జాగ్రత్తలను కూడా పొందుపరచాలి.
- మిగిలిన రెండు గంటల సమయంలో ప్రయోగాన్ని నిర్వహించాలి. దానికి సంబంధించిన పరికరాలను ఎగ్జామినర్ ద్వారా తీసుకోవాలి. వచ్చిన విలువలను / రీడింగ్స్ పట్టికలో పొందుపరచాలి.
- వచ్చిన విలువలను / రీడింగ్స్ ద్వారా ఫార్ములాను ఉపయోగించి తుది ఫలితాన్ని పట్టికలో పొందుపరచాలి.



- ముఖ్యంగా ఫార్ములా ద్వారా ఫలితాన్ని లెక్క కట్టేటప్పుడు సరైన యూనిట్లను వాడాలి.
- ప్రాక్టికల్స్‌లో 30 మార్కులను కింది విధంగా విభజిస్తారు.

ప్రయోగ విధానం	:	3 మార్కులు
ఫార్ములా	:	2 మార్కులు
జాగ్రత్తలు	:	2 మార్కులు
పట్టిక	:	2 మార్కులు
పరిశీలనలు (రీడింగ్స్)	:	4 మార్కులు
గ్రాఫ్	:	2 మార్కులు
కాలిక్యులేషన్స్	:	4 మార్కులు
ఫలితం	:	1 మార్కు
యూనిట్స్	:	1 మార్కు
మౌఖిక పరీక్ష (వైవా)	:	5 మార్కులు
రికార్డు	:	4 మార్కులు

మౌఖిక పరీక్ష

- ఇందులో సాధారణంగా ఇచ్చిన ప్రయోగానికి సంబంధించిన థియరీ ప్రశ్నలు, ఫార్ములాలు, జాగ్రత్తలపై ప్రశ్నలడుగుతారు. సిలబస్‌లోని 20 ప్రయోగాల పట్టికలు, ఫార్ములాలు, గ్రాఫ్‌లు, యూనిట్‌లను బాగా ప్రిపేరైతే 30 మార్కులు తేలిగ్గా వస్తాయి.

కెమిస్ట్రీ



విద్యార్థి తరగతిలో నేర్చుకున్న సబ్జెక్ట్ పరిజ్ఞానాన్ని, నైపుణ్యాలను అంచనా వేసేలా ప్రాక్టికల్స్ ఉంటాయి. ఎంపీసీ విద్యార్థులకు ప్రాక్టికల్స్‌కు 60 మార్కులు కేటాయించారు. ఇందులో ఫిజిక్స్‌కు 30 మార్కులు, కెమిస్ట్రీకి 30 మార్కులు ఉంటాయి. ఎంపీసీతో పోల్చితే బైపీసీ విద్యార్థులకు ప్రాక్టికల్స్‌పరంగా వెయిటేజీ అధికంగా ఉంటుంది. బైపీసీకి 120 మార్కులు కేటాయించారు. వీటిలో ఫిజిక్స్‌కు 30 మార్కులు, కెమిస్ట్రీకి 30 మార్కులు, జువాలజీకి 30 మార్కులు, బోటనీకి 30 మార్కులు ఉంటాయి. కాబట్టి బైపీసీ విద్యార్థులు ప్రాక్టికల్స్‌ను అధిక ప్రాధాన్యం ఇవ్వాలి.

కెమిస్ట్రీలో ప్రాక్టికల్‌కు 30 మార్కులు కేటాయించారు. ఇందులో ప్రధానంగా మూడు భాగాలు ఉంటాయి. అవి..

I. లవణాల గుణాత్మక విశ్లేషణ (Qualitative Salt Analysis, 10 మార్కులు)

II. ఘనపరిమాణాత్మక విశ్లేషణ (Volumetric Analysis, 8 మార్కులు)

III. ఆర్గానిక్ సమ్మేళన విశ్లేషణ లేదా
కొల్లాయిడ్ ద్రావణం తయారీ లేదా
క్రోమోటోగ్రఫీ లేదా
కార్బోహైడ్రేట్, ప్రోటీన్ విశ్లేషణ (6 మార్కులు)

ఇవి కాకుండా రికార్డ్ కోసం 2 మార్కులు, ప్రాజెక్ట్ వర్క్ కోసం 2 మార్కులు, మౌఖిక ప్రశ్నలకు 2 మార్కులు ఇస్తారు.

I. లవణాల గుణాత్మక విశ్లేషణ

ఇందులో కార్బనేట్, క్లోరైడ్, బ్రోమైడ్, నైట్రేట్, సల్ఫేట్ అయాన్‌ల విశ్లేషణ, నిర్ధారణ పరీక్షలను నేర్చుకోవాలి. కేటయాన్ విశ్లేషణలో ఇచ్చిన లవణంతో ద్రావణాన్ని తయారు చేసుకొని పరీక్షలు చేయాల్సి ఉంటుంది. ముందుగా గ్రూప్‌ను నిర్ధారణ చేయటానికి రియేజెంట్‌ను నేర్చుకోవాలి.

- I - గ్రూప్: సజల HCl (Ag^{+}, Pb^{2+})
- II - గ్రూప్: సజల HCl / H_2S (Cu^{2+})
- III - గ్రూప్: NH_4Cl (S) / NH_4OH(liq) $(Fe^{2+}, Fe^{3+}\ Al^{3+})$
- IV - గ్రూప్: NH_4Cl (S) / NH4OH / H2S $(Zn^{2+}, Ni^{2+}\ Mn^{2+})$
- V - గ్రూప్: $NH_4Cl + NH_4OH + (NH_4)_2\ CO_3$ (Ca^{2+}, Ba^{2+})

గ్రూప్ నిర్ధారణను అవక్షేపం ద్వారా చేసిన తరవాత వివిధ కేటయాన్‌ల కోసం నిర్ధారణ పరీక్షలు చేయాలి.

II. ఘనపరిమాణాత్మక విశ్లేషణ: ఈ భాగంలో ఏదైనా ద్రావణం మోలారిటీని కనుక్కోవాలి. దీని కోసం ఇచ్చిన ద్రావణాన్ని ఉపయోగించాలి.

ఎ) $KMnO_4$ మరియు వేడి $H_2C_2O_2.2H_2O$ విశ్లేషణ
బి) $KMnO_4$ మరియు మోర్ లవణం విశ్లేషణ
సి) H_2SO_4 మరియు NaOH లేదా Na_2CO_3
డి) HCl మరియు NaOH లేదా Na_2CO_3

- ఈ టైట్రేషన్‌లకు సంబంధించిన సమీకరణాలు, ఫార్ములాలు, అణుభారాలు గుర్తుంచుకోవాలి.
- ప్రతి టైట్రేషన్‌కి సంబంధించిన స్థాయికి యోమెట్రిక్ సమీకరణాన్ని నేర్చుకోవాలి. ఈ సమీకరణం నుంచి $M_1V_1\ /\ n_1 = M_2V_2\ /\ n_2$ ఫార్ములా ద్వారా మోలారిటీని కనుక్కోవాలి. మోలారిటీ ద్వారా ద్రావితం (Solute) భారాన్ని కింది ఫార్ములాతో లెక్కించాలి.

$m = M.V_{\ell t} \times (GMW)_{\text{ద్రావిత}}$ గ్రాములు

III. ఎ) ఆర్గానిక్ విశ్లేషణ: ఇందులో ఇచ్చిన ఆర్గానిక్ పదార్థంలో ఉన్న ప్రమేయ సమూహాన్ని తెలుసుకొనే పరీక్షలు చేయాలి. టోలెన్ పరీక్ష, ఎస్టరీకరణం, 2, 4 – DNP వంటి పరీక్షల ద్వారా ఇది సాధ్యమవుతుంది.

బి) కొల్లాయిడ్ తయారీ: ఇచ్చిన స్టార్చ్ లేదా ప్రోటీన్‌లో కొల్లాయిడ్ తయారు చేసి చూపాలి.

సి) క్రొమోటోగ్రఫీ: ఇంటర్మీడియెట్ ప్రయోగశాల పరిధిలో ఈ పరీక్ష ఇచ్చే అవకాశం తక్కువ. అయినప్పటికీ క్రొమోటోగ్రఫీ థియరీ చదువుకోవటం మంచిది.

డి) కార్బోహైడ్రేట్ (మాలిష్ టెస్ట్)

- ప్రోటీన్ (నిన్‌హైడ్రిన్, గ్జాంతో ప్రోటీన్ టెస్ట్, బైయూరేట్ టెస్ట్)లను గుర్తించటం నేర్చుకోవాలి.
- మౌఖిక పరీక్ష (Viva Voce)లో సాధారణంగా విద్యార్థి చేసిన ప్రయోగానికి సంబంధించిన ప్రశ్నలే అడుగుతారు. ముఖ్యంగా ఎనయాన్, కేటాయన్ నిర్ధారణ పరీక్షలు చెప్పగలగాలి. టైట్రేషన్‌ల సూచికలు, వాటిని వాడటానికి కారణాలు చెప్పాలి.

- ఆర్ అండ్ డీ విభాగం, వెలాసిటీ విద్యాసంస్థలు

జాబ్ కార్నర్

టీఎస్‌పీఎస్సీ నియామకాలు ఇలా..

423 పోస్టులు

తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీఎస్‌పిఎస్సీ) భారీ నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. దీని ద్వారా తెలంగాణ రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖలో 423 పోస్టులను భర్తీ చేయనుంది. ఇందుకు సంబంధించిన ఖాళీలు, అర్హత, పరీక్షా విధానం, ఇతర వివరాలను చూద్దాం..

టీఎస్‌పిఎస్సీ తాజాగా విడుదల చేసిన నోటిఫికేషన్‌లో ఫార్మసిస్ట్, ఏఎన్ఎం, హార్టికల్చర్ ఆఫీసర్, అసిస్టెంట్ లైబ్రేరియన్ పోస్టులు ఉన్నాయి. ఈ పోస్టులకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.

ఫార్మసిస్ట్ గ్రేడ్ - 2

- మొత్తం ఖాళీలు: **238**
- విభాగాల వారీగా ఖాళీలు: డైరెక్టర్ ఆఫ్ పబ్లిక్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్‌లో ఖాళీలు: 125
- మెడికల్ ఎడ్యుకేషన్: 58
- తెలంగాణ వైద్య విధాన పరిషత్‌లో ఖాళీలు: 55
- అర్హత: ఇంటర్మీడియెట్ / తత్సమాన పరీక్షలో ఉత్తీర్ణతతోపాటు డిప్లొమా ఇన్ ఫార్మసీ (డి.ఫార్మసీ). ఫార్మసీ కౌన్సిల్‌లో రిజిస్ట్రేషన్ చేసుకొని ఉండాలి.
- వయసు: 18-44 ఏళ్లు (జూలై 1, 2018 నాటికి). నిబంధనలకు అనుగుణంగా ఆయా వర్గాలకు వయోపరిమితిలో సడలింపు ఉంటుంది.
- ఎంపిక విధానం: రాత పరీక్ష, ప్రభుత్వ సర్వీసుల్లో అనుభవం ఆధారంగా ఎంపిక ప్రక్రియ ఉంటుంది. రాత పరీక్షకు 70 శాతం వెయిటేజీ, అనుభవానికి 30 శాతం వెయిటేజీ ఇస్తారు.
- రాత పరీక్ష: ఆబ్జెక్టివ్ విధానంలో ఉండే రాత పరీక్షకు 150 మార్కులు కేటాయించారు. సమాధానాలను గుర్తించడానికి 150 నిమిషాల సమయం ఉంటుంది. ఇందులో రెండు పేపర్లు ఉంటాయి. అవి..
- పేపర్ - 1: జనరల్ ఎబిలిటీస్ (50 ప్రశ్నలు, 50 మార్కులు). ఈ పేపర్ ఇంగ్లీష్, తెలుగు భాషల్లో ఉంటుంది.
- పేపర్ - 2: ఫార్మసీ (డిప్లొమా స్థాయి) (100 ప్రశ్నలు, 100 మార్కులు). ఈ పేపర్ ఇంగ్లీష్ భాషలో మాత్రమే ఉంటుంది.
- పేపర్ - 2 సిలబస్: ఇది పూర్తిగా సబ్జెక్టివ్ పేపర్. డిప్లొమా స్థాయిలో ప్రశ్నల క్లిష్టత ఉంటుంది. ఇందులో అనాటమీ అండ్ ఫిజియాలజీ, మెట్రోలజీ అండ్ పోసోలజీ, మాన్యుఫాక్చరింగ్ అండ్ ఎవల్యూషన్ ఆఫ వేరియస్ డోసేజ్ ఫామ్స్, స్టడీ ఆఫ్ ఇమ్యూనాలజీ అండ్ ఇమ్యూనోలాజికల్ ప్రొడక్ట్స్, న్యూట్రిషన్ అండ్ హెల్త్, ఫస్ట్ ఎయిడ్, ఫండమెంటల్ ప్రిన్సిపల్స్ ఆఫ్ మైక్రోబయాలజీ, ఇనార్గానిక్ కంపౌండ్స్, ఫార్మాకోలజీ, ఇంట్రొడక్షన్ టూ ఫార్మోకోపిసెస్, ప్యాకింగ్ ఆఫ్ ఫార్మాస్యూటికల్స్, యూనిట్ ఆపరేషన్స్, ప్రిస్కిప్షన్స్, విటమిన్స్, ఫార్మసీ యాక్ట్ 1948, పాయిజన్స్ యాక్ట్ 1919, లేటెస్ట్ డ్రగ్స్ తదితర అంశాల నుంచి ప్రశ్నలు ఇస్తారు.

ఏఎన్ఎం

- ఖాళీలు: **152**
- విభాగం: తెలంగాణ వైద్య విధాన పరిషత్
- అర్హత: ఎస్ఎస్‌సీ / తత్సమాన పరీక్షలో ఉత్తీర్ణతతోపాటు ఎంపీహెచ్‌డబ్ల్యూ (ఎఫ్) శిక్షణ పూర్తి చేసి, ఆంధ్రప్రదేశ్ / తెలంగాణ నర్సింగ్ కౌన్సిల్‌లో రిజిస్ట్రేషన్ చేసుకొని ఉండాలి.
- వయసు: 18 - 44 ఏళ్లు (జూలై 1, 2018 నాటికి). నిబంధనలకు అనుగుణంగా ఆయా వర్గాలకు వయోపరిమితిలో సడలింపు ఉంటుంది.
- ఎంపిక విధానం: రాత పరీక్ష, ప్రభుత్వ సర్వీసుల్లో అనుభవం ఆధారంగా ఎంపిక ప్రక్రియ ఉంటుంది. ఈ క్రమంలో రాత పరీక్షకు 70 శాతం వెయిటేజీ, అనుభవానికి 30 శాతం వెయిటేజీ ఇస్తారు.
- రాత పరీక్ష: ఆబ్జెక్టివ్ విధానంలో ఉండే రాత పరీక్షకు 150 మార్కులు కేటాయించారు. సమాధానాలను గుర్తించడానికి 150 నిమిషాల సమయం ఉంటుంది. ఇందులో రెండు పేపర్లు ఉంటాయి. అవి..
- పేపర్ - 1: జనరల్ ఎబిలిటీస్ (50 ప్రశ్నలు, 50 మార్కులు). ఈ విభాగం ఇంగ్లీష్, తెలుగు భాషల్లో ఉంటుంది.
- పేపర్ - 2: రేడియోగ్రాఫర్ (డిప్లొమా స్థాయి) (100 ప్రశ్నలు, 100 మార్కులు). ఈ విభాగం ఇంగ్లీష్ భాషలో మాత్రమే ఉంటుంది.
- పేపర్ - 2 సిలబస్: ఇందులో అనాటమీ అండ్ ఫిజియాలజీ, మైక్రోబయాలజీ, సైకాలజీ, సోషియాలజీ, హైజీన్, ఫండమెంటల్స్ ఆఫ్ నర్సింగ్, ఫస్ట్ ఎయిడ్ అండ్ ఎమర్జెన్సీ నర్సింగ్, చైల్డ్ హెల్త్ గ్రోత్ అండ్ డెవలప్‌మెంట్, ఫ్యామిలీ ప్లానింగ్, కమ్యూనిటీ హెల్త్, బేసిక్ మెడిన్ అండ్ ఫార్మాకాలజీ తదితర అంశాల నుంచి ప్రశ్నలు వస్తాయి.

పేపర్ - 1 సిలబస్ (జనరల్ ఎబిలిటీస్)

ఈ విభాగం సిలబస్ అన్ని పోస్టులకు ఒకే విధంగా ఉంటుంది. కాకపోతే ప్రశ్నల సంఖ్య, మార్కులు, క్లిష్టతలో మాత్రమే తేడా కనిపిస్తుంది. ఇందులో తెలంగాణ ఉద్యమం, కరెంట్ అఫైర్స్, లాజికల్ రీజనింగ్, సైన్స్ అండ్ టెక్నాలజీ, ఇండియన్ ఎకానమీ, పర్యావరణం, ఎకాలజీ, తెలంగాణ, భారతదేశంలోని సహజ వనరులు, తెలంగాణ చరిత్ర, సంస్కృతి, సంప్రదాయాలు, పండుగలు, ఉత్సవాలు, ఎకానమీ, ప్రభుత్వ పథకాలు తదితర అంశాల నుంచి ప్రశ్నలు వస్తాయి. టీఎస్‌పీఎస్సీ గత ప్రశ్నపత్రాలను పరిశీలిస్తే ప్రశ్నల సరళి, క్లిష్టతపై ఒక అవగాహన వస్తుంది.

హార్టికల్చర్ ఆఫీసర్

- ఖాళీలు: **27**
- విభాగం: అగ్రికల్చర్ అండ్ కోఆపరేషన్ డిపార్ట్‌మెంట్
- అర్హత: హార్టికల్చర్‌లో డిగ్రీ. హార్టికల్చర్‌లో డిగ్రీ చేసిన అభ్యర్థులు లేని పక్షంలో ఎంఎస్సీ (అగ్రికల్చర్, హార్టికల్చర్ స్పెషలైజేషన్) చేసిన వారిని నియామకం కోసం పరిగణనలోకి తీసుకుంటారు. ఎస్సీ / ఎస్టీ ఖాళీల భర్తీకి హార్టికల్చర్‌లో డిగ్రీ చేసిన అభ్యర్థులు లేని పక్షంలో బీఎస్సీ (అగ్రికల్చర్) చేసిన వారిని అర్హులుగా గుర్తిస్తారు.
- వయసు: 18 - 44 ఏళ్లు (జూలై 1, 2018 నాటికి). నిబంధనలకు అనుగుణంగా ఆయా వర్గాలకు వయోపరిమితిలో సడలింపు ఉంటుంది.
- ఎంపిక విధానం: రాత పరీక్ష, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపిక ఉంటుంది.
- రాత పరీక్ష: ఆబ్జెక్టివ్ విధానంలో ఉండే రాత పరీక్షకు 300 మార్కులు కేటాయించారు. సమాధానాలను గుర్తించడానికి 300 నిమిషాల సమయం ఉంటుంది. ఇందులో రెండు పేపర్లు ఉంటాయి. అవి..
- పేపర్ - 1: జనరల్ ఎబిలిటీస్ (150 ప్రశ్నలు, 150 మార్కులు, 150 నిమిషాలు). ఈ విభాగం ఇంగ్లీష్, తెలుగు భాషల్లో ఉంటుంది.
- పేపర్ - 2: హార్టికల్చర్ సబ్జెక్ట్ (డిగ్రీ స్థాయి, 150 ప్రశ్నలు, 150 మార్కులు, 150 నిమిషాలు).
- పేపర్ - 2 సిలబస్: ఇందులో క్లాసిఫికేషన్ ఆఫ్ హార్టికల్చర్ క్రాప్స్, ఫ్రూట్ క్రాప్స్, వెజిటేబుల్ క్రాప్స్, స్కోప్ అండ్ ఇంపార్టెన్స్ ఆఫ్ ఫ్లోరికల్చర్, ప్రొడక్షన్ టెక్నాలజీ, పోస్ట్ హార్వెస్ట్ టెక్నాలజీ, ప్లాంట్ బయోకెమిస్ట్రీ, ఫార్మ్ పవర్ తదితర అంశాల నుంచి ప్రశ్నలు వస్తాయి.

అసిస్టెంట్ లైబ్రేరియన్స్

- ఖాళీలు: **6**
- విభాగం: డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్
- అర్హత: బీఏ / బీఎస్సీ / బీకామ్‌తోపాటు బీఎల్ఎస్సీ ఉండాలి. డిగ్రీలో బయాలజీ, కంప్యూటర్ డేటాబేస్‌లో పరిజ్ఞానం ఉన్నవారికి ప్రాధాన్యం ఇస్తారు.
- వయసు: 18 - 44 ఏళ్లు (జూలై 1, 2018 నాటికి). రిజర్వ్‌డ్, పీహెచ్ వర్గాలకు మినహాయింపు ఉంటుంది.
- ఎంపిక విధానం: రాత పరీక్ష, ఇంటర్వ్యూ ఆధారంగా.
- రాత పరీక్ష: ఆబ్జెక్టివ్ విధానంలో ఉండే రాత పరీక్షకు 300 మార్కులు కేటాయించారు. సమాధానాలను గుర్తించడానికి 300 నిమిషాల సమయం ఉంటుంది. ఇందులో రెండు పేపర్లు ఉంటాయి. అవి..
- పేపర్ - 1: జనరల్ ఎబిలిటీస్ (150 ప్రశ్నలు, 150 మార్కులు, 150 నిమిషాలు).
- పేపర్ - 2: లైబ్రరీ అండ్ ఇన్ఫర్మేషన్ సైన్స్ సబ్జెక్ట్ (డిగ్రీ స్థాయి, 150 ప్రశ్నలు, 150 మార్కులు, 150 నిమిషాలు).



- పేపర్ - 2 సిలబస్: ఇందులో ఫౌండేషన్ ఆఫ్ లైబ్రరీ అండ్ ఇన్ఫర్మేషన్ సైన్స్, ఇన్ఫర్మేషన్, కమ్యూనికేషన్, సొసైటీ, ఇన్ఫర్మేషన్ సోర్సెస్, ఇన్ఫర్మేషన్ సర్వీసెస్, ఇన్ఫర్మేషన్ ప్రాసెసింగ్, లైబ్రరీ మేనేజ్‌మెంట్, ఫండమెంటల్స్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, డిజిటల్ లైబ్రరీ, రీసెర్చ్ మెథడాలజీ, లైబ్రరీ ఆటోమేషన్ అండ్ నెట్‌వర్క్స్ తదితర అంశాల నుంచి ప్రశ్నలు వస్తాయి.

ముఖ్య సమాచారం

- అన్ని పోస్టులకు ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభం: జనవరి 29, 2018
- అన్ని పోస్టులకు దరఖాస్తుకు చివరి తేదీ: ఫిబ్రవరి 28, 2018
- వెబ్‌సైట్: www.tspsc.gov.in



పాలమూరుకే
కందుల 'మద్దతు'!

- ఒక్క జిల్లాలోనే 3.08 లక్షల క్వింటాళ్ల సేకరణ
- సేకరణలో అక్రమాలు జరిగాయన్న అనుమానాలు

హైదరాబాద్, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): మద్దతు ధరకు కందుల సేకరణలో అక్రమాలు జరిగాయన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. రాష్ట్ర వ్యాప్తంగా 3.35 లక్షల క్వింటాళ్ల కందులను మద్దతు ధరకు సేకరించడానికి కేంద్రం అనుమతిస్తే.. ఇందులో 3.08 లక్షల క్వింటాళ్ల కందులను కేవలం మహబూబ్‌నగర్ జిల్లా నుంచే హాకా సేకరించింది. మిగిలిన అన్ని జిల్లాల్లో కలిపి సేకరించింది 1.76 లక్షల క్వింటాళ్లు మాత్రమే. ఒక్క జిల్లాలోనే ఇంత పెద్ద ఎత్తున కందుల సేకరణ జరగడంతో.. అక్రమాలు జరిగాయేమోనన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. వాస్తవానికి కంది పంట హార్వెస్టింగ్ జరిగి మార్కెట్‌కు రావడమన్నది జనవరి చివరివారంలో, ఫిబ్రవరిలో ఎక్కువగా ఉం టుంది. అయితే మార్కెట్లో కందుల ధర.. మద్దతు ధర కన్నా తక్కువగా ఉండడంతో రాష్ట్ర ప్రభుత్వం ముందు జాగ్రత్తతో.. రాష్ట్రంలో మద్దతు ధరకు కందుల సేకరణ జరపాలం టూ గత నవంబరులోనే కేంద్రానికి ప్రతిపాదన పం పింది. దానిని పరిగణనలోకి తీసుకున్న కేంద్రం.. రాష్ట్రంలో 3.35 లక్షల క్వింటాళ్ల కందులను డిసెంబరు 1 నుంచి జనవరి 31 వరకు మద్దతు ధరకు సేకరించేలా నాఫెడ్‌కు అనుమతినిచ్చింది. అయితే కేంద్రం విధించిన తుది గడువుకు కంది పంట మార్కెట్లోకి పూర్తిస్థాయిలో వచ్చే అవకాశం లేకపోవడం, దిగుబడులూ పెరిగే అవకాశం ఉండడంతో రాష్ట్రవ్యాప్తం గా లక్షన్నర టన్నుల కందుల ను మద్దతు ధరకు సేకరించాలని సేకరణ తుది గడువునూ మార్చి 31 వరకు పొడిగించాలని కేంద్రానికి రాష్ట్రం ప్రతిపాదన పంపింది. కేంద్రం పరిమితి పెం చుతుందన్న నమ్మకంతో హాకా, మార్క్‌ఫెడ్ కలిసి ఈనెల 23 వరకు రాష్ట్రవ్యాప్తంగా 4.84 లక్షల క్వింటాళ్ల కందులను సేకరించాయి. అయితే.. పాలమూరు జిల్లాలో సేకరించిన కందులపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

సేకరణ పరిమితి పెంపు

మద్దతు ధరకు కందుల సేకరణ పరిమితిని గతంలో ఉన్న 3.35 లక్షల క్వింటాళ్ల (33,500 టన్నులు) నుంచి 5.36 లక్షల క్వింటాళ్ల (53,600 టన్నుల)కు కేంద్రం పెంచింది. ఈ మేరకు రాష్ట్రంలో మద్దతు ధరకు కందుల సేకరణ జరపాలంటూ నాఫెడ్‌ను ఆదేశిస్తూ ఇటీవల ఉత్తర్వులు జారీ చేసింది. దీంతోపాటు సేకరణ తుది గడువును జనవరి 31 నుంచి ఫిబ్రవరి 28కి పొడిగించింది. అయితే నాఫెడ్ తరఫున హాకా, మార్క్‌ఫెడ్‌లు ఇప్పటికే 4.84 లక్షల క్వింటాళ్లు సేకరించాయి. దీంతో ఇక 52 వేల టన్నుల మేరకు మాత్రమే సేకరించే అవకాశం ఉంది.



ఆమె బదిలీ.. నిలిచిన ప్రగతి



జనగామలో నిర్మాణంలో ఉన్న సమీకృత కలెక్టరేట్ భవన సముదాయం. (ఇన్‌సెట్లో) బదిలీ అయిన కలెక్టర్ శ్రీ దేవసేన

కలెక్టర్ శ్రీదేవసేన బదిలీతో మందగించిన అభివృద్ధి

- బమ్మెరలో పోతన సమాధి సహా ఆగిన ఇతర పనులు
- నిధులు మంజూరైనా ప్రారంభం కాని పరిస్థితి
- ఓడీఎఫ్ పనులు, డబుల్ ఇళ్ల నిర్మాణంలోనూ తగ్గిన వేగం
- ఇంచార్జి కలెక్టర్ జిల్లాకు వచ్చింది రెండుసార్లే..
- పూర్తిస్థాయి కలెక్టర్‌ను నియమించాలని ప్రజల వినతి

జనగామ, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): కొత్త జిల్లాగా ఏర్పడింది మొదలు జనగామ జిల్లాలో ఎన్నో అభివృద్ధి పనులు.. అధికారులను ఉరుకులు పరుగులు పెట్టిస్తూ మరెన్నో సమీక్షలు! జిల్లాను పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేసేందుకు బమ్మెరలోని పోతన సమాధి, వాల్మీకి సంచరించిన వల్మిడి గ్రామం, జఫర్‌గడ్, ఖిలాషాపురం కోటల అభివృద్ధికి కోట్ల నిధులతో ప్రణాళికలు.. జనగామను బహిరంగ మలవిసర్జన రహిత (ఓపెన్ డెఫికేషన్ ఫ్రీ-ఓడీఎఫ్) జిల్లాగా ప్రకటించేందుకు మరుగుదొడ్ల నిర్మాణం పనులు.. డబుల్‌బెడ్‌రూం ఇళ్ల నిర్మాణం, సమీకృత కలెక్టరేట్ భవన నిర్మాణం.. దళితులకు భూపంపిణీ.. ఇలా ఎన్నో అభివృద్ధి పనులు సాగుతున్నాయి! అయితే, ప్రస్తుతం ఇవన్నీ నిలిచిపోయాయి. 14 నెలలుగా ప్రగతి పథంవైపు జోరుగా పయనిస్తున్న జనగామ జిల్లాలో అభివృద్ధి పనులకు బ్రేక్ పడింది. కారణం.. ఒకే ఒక్క బదిలీ నిర్ణయం! ఇన్నాళ్లు జిల్లా కలెక్టర్‌గా ఉన్న అల్లమరాజు శ్రీదేవసేనను ఈ నెల 2న పెద్దపల్లి జిల్లా కలెక్టర్‌గా బదిలీ చేశారు. యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్‌గా ఉన్న అనితారామచంద్రన్‌కు జనగామ కలెక్టర్‌గా అదనపు బాధ్యతలు అప్పగించారు. పూర్తిస్థాయి కలెక్టర్ లేకపోవడం జనగామ జిల్లాపై తీవ్ర ప్రభావం చూపుతోంది. పలు అభివృద్ధి కార్యక్రమాల కోసం నిత్యం సమీక్షలు, సమావేశాలతో బిజీగా ఉండే కలెక్టర్ కార్యాలయం ప్రస్తుతం బోసిపోయి కనిపిస్తోంది. ఇన్‌చార్జి కలెక్టర్ అనితారామచంద్రన్ బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి 2 సార్లు మాత్రమే జిల్లాకు వచ్చారు. అభివృద్ధి పనులు గాడిలో పడిన తరుణంలో శ్రీదేవసేనను ప్రభుత్వం బదిలీ చేయడంతో అనేక పనులు నిలిచిపోయాయి. సీఎం కేసీఆర్ గత జూన్‌లో పాలకుర్తి నియోజకవర్గంలో పర్యటించిన సందర్భంగా జిల్లాను పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేసేందుకు రూ.40 కోట్లు మంజూరు చేశారు. ఈ పనులను వేగవంతంగా పూర్తిచేసేందుకు కలెక్టర్ శ్రీదేవసేన ప్రణాళికలను రూపొందించారు. రాష్ట్ర పర్యాటక శాఖ చైర్మన్ పేర్వారం రాములుతో కలిసి ఆయా ప్రాంతాలను సందర్శించారు. అధికారులతో సమీక్షలు జరిపారు. తీరా అభివృద్ధి పనుల కోసం టెండర్లు పిలిచే సమయంలో ఆమె బదిలీ అయ్యారు. దీంతో నిధులు మంజూరైనా పర్యాటకాభివృద్ధి పనులు మొదలు కాలేదు. అదే విధంగా జనగామను ఓడీఎఫ్ జిల్లాగా ప్రకటించేందుకు కలెక్టర్ శ్రీదేవసేన తీవ్రంగా కృషి చేశారు. పలు గ్రామాలను సందర్శించి మరుగుదొడ్ల నిర్మాణంపై ప్రజలకు అవగాహన కల్పించారు. మరుగుదొడ్ల నిర్మాణ ప్రక్రియ చివరి దశలో ఉన్న సమయంలో ఆమె బదిలీ కావడంతో ఆ పనుల్లో వేగం తగ్గింది. సమీకృత కలెక్టరేట్ భవన నిర్మాణం కోసం శ్రీదేవసేన ప్రత్యేక చొరవ చూపారు. ప్రస్తుతం కలెక్టరేట్ భవనం నిర్మిస్తున్న 30 ఎకరాల స్థలంలో 20 ఏళ్లుగా నిరుపేదలు గుడిసెలు వేసుకొని జీవిస్తున్నారు. గుడిసెవాసులను ఖాళీ చేయించేందుకు చొరవ తీసుకున్నారు. వారికి ప్రత్యామ్నాయంగా డబుల్ బెడ్‌రూం గృహాలు నిర్మించి ఇస్తామని హామీ ఇచ్చారు. అనంతరం కలెక్టరేట్ నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. సెలవు రోజుల్లోనూ శ్రీదేవసేన.. ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రభుత్వ పథకాలను విజయవంతంగా అమలు చేయడంలో కీలక పాత్ర పోషించారు. రాష్ట్రంలోనే మిషన్ భగీరథ పనుల్లో జిల్లా మొదటి స్థానంలో ఉండగా.. ఈ పనుల్లోనూ జాప్యం నెలకొంది. ఇప్పటికైనా ప్రభుత్వం జనగామకు పూర్తిస్థాయి కలెక్టర్‌ను నియమించాలని జిల్లా ప్రజలు కోరుతున్నారు.



అభివృద్ధికి నోచుకోని బమ్మెరలోని పోతన స్మారకభవనం (ఫైల్)



అభివృద్ధి చెందనున్న ఖిలాషాపురం కోట అంతర్భాగం(ఫైల్)



బమ్మెర గ్రామంలోని పోతన సమాధి(ఫైల్)



వల్మిడి గుట్టపై ఉన్న కల్యాణమండపం(ఫైల్)

ఇంటివద్దకే ఇసుక!

శాండ్ ట్యాక్సీ పాలసీతో సత్ఫలితాలు.. ఇసుక అక్రమ రవాణాకు పడిన అడ్డుకట్ట

- వినియోగదారులకు అందుబాటులో ధరలు.. పలు జిల్లాల్లో అమలవుతున్న నూతన పాలసీ

రాష్ట్రంలో ఇసుక అక్రమ రవాణాను అరికట్టేందుకు, అదే సమయంలో వినియోగదారులకు ఇబ్బందుల్లేకుండా ఇసుకను సరఫరా చేసేందుకు ప్రభుత్వం ప్రవేశపెట్టిన శాండ్ ట్యాక్సీ విధానం సత్ఫలితాలనిస్తోంది. ఇసుక అక్రమ తవ్వకం, రవాణాపై 'ఆంధ్రజ్యోతి' ప్రచురించిన వరుస కథనాలపై ప్రభుత్వం స్పందించి ఈ నూతన పాలసీని అమల్లోకి తెచ్చిన విషయం తెలిసిందే. తొలిసారిగా పెద్దపల్లి జిల్లాలో గత ఏడాది ఫిబ్రవరి చివరి వారంలో దీనిని ప్రారంభించారు. ఆ తరువాత దశలవారీగా అన్ని జిల్లాల్లోనూ శాండ్ ట్యాక్సీ పాలసీని అమలు చేస్తున్నారు.

(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్)

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



శాండ్ ట్యాక్సీ విధానం ప్రకారం.. ఇసుక అవసరమైన వినియోగదారుడు ఎవరినీ సంప్రదించాల్సిన అవసరం లేకుండా ఆన్‌లైన్ ద్వారా బుక్ చేసుకుంటే ప్రభుత్వమే అతనికి ఇసుకను సరఫరా చేస్తుంది. ఇందుకోసం ఇసుక రవాణా ట్రాక్టర్లను రిజిస్ట్రేషన్ చేసి, వాటికి ప్రత్యేకంగా జీపీఆర్ఎస్‌ను ఏర్పాటు చేసి అనుసంధానం చేస్తారు. వినియోగదారుడు మీసేవ కేంద్రాల్లో రిజిస్ట్రేషన్ చేసుకుంటే.. అతనికి ఏ రీచ్ నుంచి ఇసుక వస్తుందో, ఏ ట్రాక్టర్ ద్వారా ఏ సమయంలో వస్తుందనే సమాచారం వెంటనే ఎస్ఎంఎస్ ద్వారా తెలియజేస్తారు. అదే సమయంలో సీరియల్‌లో ఉన్న ట్రాక్టర్ డ్రైవర్‌కు కూడా ఇదే సమాచారం వెళుతుంది. ఫలానా రీచ్ నుంచి ఫలానా వినియోగదారునికి ఇసుక తీసుకెళ్లేందుకు అనుమతినిస్తూ ఎస్ఎంఎస్ పంపుతారు. ఇసుక రీచ్ వద్ద ప్రభుత్వం ఏర్పాటు చేసిన క్లర్కు సమక్షంలో ట్రాక్టర్‌లో ఇసుకను నింపి, వినియోగదారునికి పంపిస్తారు. జీపీఆర్ఎస్ అనుసంధానమై ఉండడంతో మధ్యలో దారి మళ్లితే సంబంధిత మండల తహసీల్దార్ సహా ఉన్నతాధికారులకు వెంటనే తెలిసిపోతుంది. దీంతో వారు చర్యలు తీసుకునే అవకాశం ఉంటుంది. కాగా వినియోగదారుడు తనకు కావాల్సిన ఇసుకకు ఎంత చెల్లించాలన్నది కూడా మీసేవ కేంద్రంలో దరఖాస్తు చేసుకున్నప్పుడే తెలుస్తుంది. దరఖాస్తు సమయంలో ఏ రీచ్‌లో ఇసుక అందుబాటులో ఉందో ఆన్‌లైన్ ద్వారా గుర్తించి.. అది ఎంత దూరంలో ఉందో లెక్కిస్తారు. కిలో మీటర్‌కు రూ.300 చొప్పున మొత్తాన్ని మీసేవలో చెల్లించాల్సి ఉంటుంది. వినియోగదారులు చెల్లించే మొత్తంలో ట్రాక్టర్ రవాణాకు కిలోమీటర్‌కు రూ.55 చొప్పున చెల్లిస్తారు. మిగతా మొత్తంలో ఎగుమతి చార్జీలు పోను మిగిలిన డబ్బు ప్రభుత్వానికి జమ అవుతుంది.



ఖమ్మం జిల్లాలో త్వరలో అమలు..

ఖమ్మం జిల్లాకు సంబంధించి ఖమ్మం నగరంలో ఇసుక డిపో ఏర్పాటు చేసేందుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. ఈ నెలాఖరు వరకు ఇసుక డిపోను ఏర్పాటు చేయనున్నట్లు చెబుతున్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని పది ఇసుక రీచ్‌ల ద్వారా ఖమ్మం నగరానికి ఇసుకను చేరవేసి.. అక్కడి నుంచి వినియోగదారులకు సరఫరా చేయనున్నారు. ఇక నల్లగొండ జిల్లాలో ఫిబ్రవరి 1వ తేదీ నుంచి శాండ్ టాక్సీ విధానానికి శ్రీకారం చుట్టనున్నారు. జిల్లాలో 4 లక్షల 56 వేల క్యూబిక్ మీటర్ల ఇసుక అందుబాటులో ఉంది. ఇసుక సరఫరా ప్రతి రోజూ ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు మాత్రమే జరుగుతుంది. కాగా వికారాబాద్ జిల్లాలోనూ ఈ పాలసీని ఈ నెలాఖరులోగా అమల్లోకి తెచ్చేందుకు సన్నాహాలు చేస్తున్నారు. మొత్తంగా శాండ్ ట్యాక్సీ పాలసీతో ఇసుక అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయడమే కాకుండా పెరుగుతున్న ఇసుక ధరలు కూడా అందుబాటులోకి వస్తాయని అధికారులు భావిస్తున్నారు.

మహబూబ్‌నగర్ జిల్లాలో 7200 మందికి ఇసుక సరఫరా..



మహబూబ్‌నగర్ జిల్లాలో 2017 ఆగస్టు 15 నుంచి శాండ్ ట్యాక్సీ పాలసీ అమలవుతోంది. పాలమూరు శాండ్ డాట్‌కామ్ వెబ్‌సైట్ ద్వారా ఈ పాలసీని అమలు చేస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా 534 ట్రాక్టర్లను పాలమూరు శాండ్ సరఫరాకు రిజిస్ట్రేషన్ చేసుకొని జీపీఆర్ఎస్‌కు అనుసంధానం చేశారు. ఈ పాలసీ కింద జిల్లాలో ఇప్పటివరకు 7200 మందికి ఇసుకను అందించారు. తద్వారా ఐదు నెలల్లో ప్రభుత్వానికి రూ.8.67 కోట్ల ఆదాయం సమకూరింది. నిజామాబాద్ జిల్లాలో 27 రీచ్‌ల ద్వారా ప్రభుత్వ పథకాలకు ఇసుక అనుమతులు ఇచ్చారు. వాటి ద్వారానే ఇసుక త వ్వకాలు జరుగుతున్నాయి. జిల్లాలో సుమారు 18లక్షల క్యూబిక్ మీటర్ల ఇసుక అందుబాటులో ఉన్నట్లు అధికారులు అంచనా వేశారు. ఈ ఇసుక నిల్వల ఆధారంగా శాండ్ ట్యాక్సీ పాలసీని అమలు చేయనున్నారు. కాగా కరీంనగర్ జిల్లాలో ఫిబ్రవరి 1 నుంచి అమలు చేయాలని నిర్ణయించారు. పెద్దపల్లి జిల్లాలో గత ఏడాది ఫిబ్రవరి నుంచే ఈ పాలసీ అమలవుతోంది. జిల్లాలోని మానేరు నదిపై ఏడు రీచ్‌లు, గోదావరి నదిపై ఒక రీచ్ ద్వారా ఇసుకను తోడి సరఫరా చేస్తున్నారు. ఇప్పటివరకు ప్రభుత్వానికి రూ.14.85 కోట్ల ఆదాయం సమకూరింది. మంచిర్యాల జిల్లాలో ఆరు రీచ్‌లలో శాండ్ ట్యాక్సీ పాలసీని అమలు చేయాలని జిల్లా యంత్రాంగం భావిస్తోంది.

వాలంటరీ శ్రమదోపిడీ!

- ప్రభుత్వ టీచర్లకు పోటీగా పాఠాలు.. విద్యావాలంటీర్లకు అరకొర వేతనాలు
- దయ దలిస్తేనే సకాలంలో జీతాలు.. వచ్చే ఏడాది కొలువుగ్యారెంటీ లేదు
- టీఆర్‌టీతో మానేస్తున్న వాలంటీర్లు.. కుంటు పడుతున్న చదువులు
- కొత్త టీచర్లు కుదురుకొనే దాకా ఇబ్బందే..



ఆంధ్ర జ్యోతి నెట్‌వర్క్: విద్యావాలంటీర్లకు ఆ పేరెందుకు పెట్టారో కానీ నిజంగా రాష్ట్రంలో వారి పరిస్థితి స్వచ్ఛంద ఉచిత సేవలాగే ఉంది. కేవలం రూ.12,000 వేతనానికి రెగ్యులర్ టీచర్లతో పోటీగా విద్యార్థులకు పాఠాలు చెబుతున్నారు. బోర్డు పరీక్షలకు సిద్ధం చేస్తున్నారు. రెగ్యులర్ టీచర్లంత జీతాల్లేక పోయినా ప్రత్యేక తరగతులు తీసుకొంటూ ఫలితాల్లో పాఠశాల వెనుకబడకుండా కష్టపడుతున్నారు. అయితే, విద్యా వాలంటీర్లకు శ్రమకు తగినంత వేతనం, గౌరవం దక్కడం లేదు. విద్యావాలంటీర్ల వేతనాలకు ఇబ్బంది లేకుండా రాష్ట్ర ప్రభుత్వం వచ్చే మార్చి వరకు అవసరమైనన్ని నిధులను ముందే జిల్లాలకు విడుదల చేసింది. జీతాల సొమ్ము ఎంఈవోల ఖాతాల్లో వేసేశారు కూడా. చాలా జిల్లాల్లో వేతనాల చెక్కులు సకాలంలో అందజేస్తున్నారు. జనగామ, సూర్యాపేట, వరంగల్ అర్బన్ లాంటి కొన్ని జిల్లాల్లో మాత్రం తిప్పించుకుంటే కానీ ఎంఈవోలకు విలువ ఉండదనుకున్నారేమో ఖాతాల్లో డబ్బులు పెట్టుకొని కూడా ఒకటి నుంచి మూడు నెలల జీతాలు పెండింగులో పెట్టారు. గట్టిగా అడగాలంటే వచ్చే ఏడాది రెన్యువల్ చేస్తారో లేదోనన్న భయం విద్యా వాలంటీర్లను వెంటాడుతోంది. కొత్త టీచర్ల నియామకం కోసం రాష్ట్ర ప్రభుత్వం టీఆర్‌టీ నోటిఫికేషన్ ఇవ్వడంతో నవంబరు, డిసెంబరు నెలల్లో చాలా చోట్ల విద్యావాలంటీర్లు ఉద్యోగం మానేశారు. రాష్ట్రంలో పలు స్కూళ్లు అచ్చం విద్యావాలంటీర్ల మీదే నడుస్తున్నాయి. టీఆర్‌టీ నోటిఫికేషన్‌తో వాటన్నింటికీ ఇబ్బంది వచ్చిపడింది. దాంతో పాఠశాల విద్యాకమిటీలు ఆగమేఘాల మీద సమావేశమై కొత్త వాలంటీర్ల నియామకాలకు తీర్మానాలు చేశాయి. టీఆర్‌టీ దెబ్బకు అతలాకుతలమైన పాఠశాలలు ఇప్పుడిప్పుడే కొత్త వాలంటీర్ల రాకతో కుదురుకుంటున్నాయి. కొత్తగా నియమితులైన వారికి బ్యాంకు ఖాతాలు లేకపోవడం వల్ల కొన్ని జిల్లాల్లో జీతాలు ఇంకా రాలేదంటున్నారు. ప్రభుత్వ ఉపాధ్యాయులకు పాఠశాల సెలవులకు తోడు సీఎల్, ఈఎల్, ఎస్ఎల్ ఉండగా, వారితో సమానంగా పనిచేస్తున్న విద్యావాలంటీర్లకు మాత్రం ఒక్క రోజు బడికి రాకపోయినా జీతం కత్తిరిస్తున్నారు. వాలంటీర్లేమైనా తక్కువ చదువుకున్నారా? అంటే అదీ లేదు. సంబంధిత సబ్జెక్టులో బీఈడీ పూర్తయిన వారినే రోస్టర్, మెరిట్ ప్రకారం విద్యా వాలంటీరుగా తీసుకున్నారు. అన్నింట్లో సమానంగా ఉన్న తమకు మెరుగైన జీతాలిస్తే ఇంకా బాగా పని చేస్తామని వాలంటీర్లంటున్నారు.



ఏ నేరానికి ఈ శిక్ష!?

- నేరస్థుల సమగ్ర సర్వేతో ఆందోళన
- కేసు కొట్టేసినా వివరాల సేకరణ
- పెట్టీ కేసుల్లోనూ జియో ట్యాగింగ్
- ఉద్యోగాల్లోంచి తొలగిస్తున్న యజమానులు
- ఇళ్లు ఖాళీ చేయాలంటూ ఒత్తిళ్లు
- సామాజిక సంక్షోభంలో 'పాత నేరస్థులు'

వనపర్తి, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): వనపర్తి జిల్లా పెద్దమందడి మండలానికి చెందిన ఓ యువకుడు 2010లో ప్రియురాలితో సహా పారిపోయి పెళ్లి చేసుకున్నాడు. అతడిపై, అతడికి సహకరించిన ఇద్దరు మిత్రులపై అమ్మాయి తల్లిదండ్రులు ఫిర్యాదు చేశారు. వారిపై కిడ్నాప్ కేసు నమోదు చేశారు. కానీ, కొన్ని రోజులకే రెండు కుటుంబాలు ఒక్కటయ్యాయి. ఆరు నెలల తర్వాత కేసును కొట్టేశారు. అసలు ఆ ఘటననే అంతా మర్చిపోయారు. తాజాగా, పోలీసుల బృందం రెండు రోజుల కిందట ఆ యువకుడి ఇంటికి వెళ్లి వేలిముద్రలు, వివరాలు సేకరించింది. వాళ్ల ఇంటిని జియో ట్యాగింగ్ చేస్తామని చెప్పింది. దాంతో, తాను ఎప్పుడో చేసిన పొరపాటుకు అప్పట్లోనే శిక్ష అనుభవించానని, ఇప్పుడు మళ్లీ తనను నేరగాడిగా చిత్రీకరించడంతో ఊళ్లో పరువు పోవడంతోపాటు తాను చేసే ప్రైవేటు ఉద్యోగం కూడా పోయే పరిస్థితి ఉందని బాధితుడు ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. తనకు సాయం చేసిన ఇద్దరు మిత్రులు కూడా తీవ్రంగా నష్టపోతారని ఆందోళన చెందుతున్నాడు. గద్వాల జిల్లాకు చెందిన మరో వ్యక్తి గతంలో చిన్న చిన్న నేరాలు చేసి శిక్ష కూడా అనుభవించాడు. ప్రస్తుతం పని చేసుకుంటూ బుద్ధిగా జీవనం సాగిస్తున్నాడు. ఇటీవల జరిగిన సర్వే కారణంగా యజమాని పనిలోంచి తొలగించాడు. ఇల్లు ఖాళీ చేయాలని ఇంటి యజమాని హుకుం జారీ చేశాడు.

..నేరస్థుల సమగ్ర సర్వేతో కొంతమంది ఎదుర్కొంటున్న ఇబ్బందులివి. నేర చరితుల కంటే కూడా ఎప్పుడో చిన్న చిన్న పొరపాట్లు చేసి ఇప్పుడు గుట్టుగా జీవనం సాగిస్తున్న వారు ఇబ్బందులు పడుతున్నారు. ప్రేమ, కులాంతర వివాహాలు చేసుకున్నవారు, భూ తగాదాల్లో పరస్పరం కేసులు పెట్టుకున్న వారు.. ఇటువంటి వాళ్లంతా ఇప్పుడు ఆందోళన, ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పోలీసులు తమకు ఏదైనా అనుమానం ఉంటే పోలీసు స్టేషన్‌కు పిలిపించి మాట్లాడితే సరిపోయేదని, ఇంటికి పది మంది పోలీసుల బృందం రావడంతో ఇబ్బందులు పడుతున్నామని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చేస్తున్న ఉద్యోగానికీ ఎసరు వస్తోంది. కొంతమంది జీవితాల్లో ఊహించని సంక్షోభానికి నేరస్థుల సర్వే కారణమవుతోంది. రాష్ట్రస్థాయి మార్గదర్శకాల ప్రకారం పదే పదే నేరాలు చేసిన వారిని మాత్రమే నేరగాళ్లుగా పరిగణనలోకి తీసుకోవాలి. కానీ, జిల్లాస్థాయిలో 2008 నుంచి నమోదైన ప్రతి కేసుకు సంబంధించి సర్వే చేస్తుండడంతో గ్రామీణ ప్రాంతాల్లో సామాజికంగా తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉంది. గ్రామీణ ప్రాంతాల్లో ఎక్కువగా చిన్న చిన్న తగాదాలు, భూ పంచాయితీలతో పరస్పరం నమోదు చేసుకునే కేసులే ఎక్కువగా ఉంటాయి. వాటికి సంబంధించి ఇప్పుడు వివాదం సమసిపోయినా.. అప్పట్లో కేసులు నమోదయ్యాయి కాబట్టి మీరు నేరగాళ్లే అనే ముద్ర వేయడం సరికాదని చాలామంది అభిప్రాయపడుతున్నారు. కేసులు కొట్టివేసినా, పెట్టీ కేసుల్లో పేరు నమోదైనా ఇప్పుడు వివరాలు నమోదు చేస్తుండడంతోపాటు ఇంటిని జియో ట్యాగింగ్ చేస్తామని చెబుతుండడంతో పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. జిల్లాల్లో పోలీసులు కొట్టేసిన కేసుల్లో వ్యక్తులను కూడా ఇప్పుడు నేరగాళ్లుగా పరిగణిస్తుండటంతో సమస్య తీవ్రరూపం దాలుస్తోంది. సరైన మార్గదర్శకాలు విడుదల చేసి, పదే పదే నేరాలు చేసేవారిని మాత్రమే నేరగాళ్లుగా ముద్రవేయాలని, అంతే తప్ప, అందరినీ ఒకేగాటన కట్టకూడదని పలువురు అభిప్రాయపడుతున్నారు.

తత్కాల్ పాస్‌పోర్టు.. ఇక ఈజీ!

న్యూఢిల్లీ, జనవరి 26: తత్కాల్ పథకం కింద జారీ చేసే పాస్‌పోర్టులకు తిప్పలు పడాల్సిన అవసరం లేకుండా విదేశాంగ మంత్రిత్వ శాఖ నిబంధనలు సడలించింది. సీనియర్ గెజిటెడ్ అధికారులు సంబంధిత ధ్రువ పత్రాలను పరిశీలించాలనే నిబంధనను ఎత్తివేసింది. ఆధార్ నెంబర్ ఆధారంగా తత్కాల్ పాస్‌పోర్టులను ఇవ్వాలని నిర్ణయించింది. ఈ విధానం ఈ నెల 25 నుంచే అమల్లోకి వచ్చింది. ఈ మేరకు విదేశాంగ శాఖ శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొంది. తత్కాల్ పథకంలో పాస్‌పోర్టు పొందేందుకు ఇప్పటి వరకు దరఖాస్తుదారుని ధ్రువపత్రాలను పరిశీలించి.. క్లాస్-1 గెజిటెడ్ అధికారి సిఫారసు చేయాలనే నిబంధన ఉంది. మారిన నిబంధనల మేరకు దరఖాస్తుదారుడు తన ఆధార్‌ను చూపించి తత్కాల్ పాస్‌పోర్టుకు దరఖాస్తు చేసుకోవచ్చు. పట్టణాలు, నగరాలకు దూరంగా నివసించేవారు ఆన్‌లైన్ ద్వారా టైం స్లాట్‌ను బుక్ చేసుకోవచ్చు. ఈ విషయంలో ఇప్పటి వరకు 'ఎవరు ముందొస్తే వారికి' విధానంలో రోజుకు 180 మందికే టైం స్లాట్ ఇస్తున్నారు. దీనిని ఇక నుంచి 250 స్లాట్లకు పెంచారు. ఇక, 18 ఏళ్ల కన్నా తక్కువ వయసున్న వారు పాస్‌పోర్టు పొందేందుకు ఆధార్‌తోపాటు విద్యార్థి ఫొటో గుర్తింపు కార్డు, జనన ధ్రువీకరణ పత్రం సమర్పిస్తే సరిపోతుంది. తత్కాల్ పాస్‌పోర్టును దరఖాస్తు సమర్పించిన మూడు పనిదినాల్లో మంజూరు చేయనున్నారు.

ఇకపై నీట్‌లో ఒకే సెట్ ప్రశ్నపత్రం

న్యూఢిల్లీ, జనవరి 26: మెడిసిన్, డెంటల్ కోర్సుల్లో అడ్మిషన్ కోసం నీట్‌కు సిద్ధమవుతున్న విద్యార్థులకు ఈ ఏడాది నుంచి ఒకే సెట్ ప్రశ్నాపత్రం ఉంటుంది. ఈ మేరకు సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్(సీబీఎస్ఈ) సుప్రీంకోర్టుకు తెలియజేసింది. వాస్తవానికి నీట్ ప్రశ్నాపత్రం పది భాషల్లో ఉంటుంది. అయితే ఒకే సెట్ కాకుండా...ఒకే స్థాయిలో ఉండే ప్రశ్నలతో వేర్వేరుగా ఆయా భాషల్లో ప్రశ్నాపత్రాలను సిద్ధం చేస్తున్నారు. ఈ విధానం సరైంది కాదని సంకల్ప్ అనే చారిటబుల్ ట్రస్ట్ సుప్రీంను ఆశ్రయించింది. జస్టిస్ అరుణ్‌మిశ్రా, జస్టిస్ ఎస్ఏ నజీర్‌లతో కూడిన ధర్మాసనం పిటిషనర్ వాదనతో ఏకీభవించింది. ఒకే సెట్ కాకుండా...ఒకే స్థాయి కలిగిన ప్రశ్నలను వేర్వేరు భాషలో ఇవ్వడం వల్ల విద్యార్థుల ప్రతిభను ఏ విధంగా అంచనా వేయగలమని సీబీఎస్ఈని కోర్టు ప్రశ్నించింది. ఇకపై నీట్‌లో ఒకే సెట్ పేపరు ఉండాలని...దానినే ఆయా భాషల్లో అనువదించి ప్రవేశపరీక్ష నిర్వహించాలని ధర్మాసనం ఆదేశించింది.

అసంఘటిత కార్మికులకు 'యువిన్'

న్యూఢిల్లీ, జనవరి 26: అసంఘటిత రంగ కార్మికుల సామాజిక భద్రతకు ప్రభుత్వం ఏప్రిల్ నుంచి బృహత్తర పథకం ప్రారంభించనున్నది. దీనివల్ల 47 కోట్ల మందికిపైగా కార్మికులకు ప్రయోజనం చేకూరుతుంది. ఈ పథకం కింద అసంఘటిత రంగంలోని కార్మికులకు 'యువిన్' కార్డులు మంజూరు చేస్తారు. 'యువిన్' అంటే అన్ ఆర్గనైజ్డ్ వర్కర్ ఇండెక్స్ నంబరు. వచ్చే ఏప్రిల్‌కల్లా కార్మికుల నమోదు ప్రక్రియను పూర్తి చేయాలని కేంద్ర కార్మిక శాఖ లక్ష్యంగా నిర్దేశించుకుంది. ఈ కార్యక్రమం కింద నమోదైన అసంఘటిత కార్మికులకు ఈపీఎఫ్‌వో, ఈఎస్ఐ కింద సామాజిక భద్రతా పథకాలను అమలు చేయనున్నట్లు ప్రభుత్వ ఉన్నతాధికారి ఒకరు తెలిపారు. 'యువిన్' కార్డులో యునీక్ నంబరు ఉంటుందని, దాన్ని ఆధార్‌తో అనుసంధానం చేసుకుంటే సామాజిక భద్రతా పథకాలన్నీ అమలవుతాయని ఆయన పేర్కొన్నారు.

ఐటీ అధికారికి శౌర్య చక్ర

న్యూఢిల్లీ, జనవరి 26: గణతంత్ర వేడుకల్లో ఈసారి ఇదో ప్రత్యేకత. మాతృభూమికి సేవ చేయాలని సైన్యంలో చేరి... సరిహద్దుల్లో అసాధారణ ధైర్య సాహసాలు ప్రదర్శించిన ఆదాయ పన్ను శాఖ అదనపు కమిషనర్‌ను 'శౌర్య చక్ర' వరించింది. ఇది మూడో అత్యున్నత సాహస పురస్కారం. ఆయన పేరు కెప్టెన్ ప్రదీప్ శౌరి ఆర్య. వయసు 47 ఏళ్లు. 2004 బ్యాచ్ ఇండియన్ రెవెన్యూ సర్వీస్ (ఐఆర్ఎస్) అధికారి. ముంబైలో ఆదాయ పన్ను శాఖ అదనపు కమిషనర్ నియమితులైన ఆయన కోరి మరీ 2009లో సైన్యంలో చేరారు. శౌరి టీమ్‌ను జమ్ము కశ్మీర్‌లోని బారాముల్లా జిల్లాలో నియంత్రణ రేఖ (ఎల్‌వోసీ) వెంబడి నిఘా, రక్షణ కోసం నియమించారు. గత ఏడాది మే 28వ తేదీ రాత్రి ప్రాణాలను సైతం లెక్క చేయక ఉగ్రవాదులకు ఎదురెళ్లి వారిని అంతమొందించారు. ఇండియన్ మిలిటరీ అకాడమీలో శౌరి ఉత్తమ ట్రెయినీ ఆఫీసర్‌గానూ నిలిచారు.

బీజేపీకి బొటాబొటి



ఏ ప్రాంతంలో ఎవరికెన్ని?

ప్రాంతం	స్థానాలు	ఎన్‌డీఏ	యూపీఏ	ఇతరులు
ఉత్తర భారతం	151	106-116	10-16	24-30
తూర్పు	142	68-76	15-21	48-56
దక్షిణ	132	31-37	59-67	32-38
పశ్చిమ	118	79-89	30-36	0-2
మొత్తం	543	293-309	122-132	110-120

(మొదటి పేజీ తరువాయి)

'మూడ్ ఆఫ్ ది నేషన్' పేరిట సర్వే నిర్వహించాయి. 2017లో జరిపిన సర్వే ఫలితాలతో తాజా పరిస్థితిని పోల్చి చూశారు. బీజేపీ గత ఎన్నికల్లో మ్యాజిక్ మార్కును దాటి... సొంతంగా 282 సీట్లు సాధించింది. మిత్రపక్షాలను కలుపుకొని 336 సీట్లు గెలిచింది. ఇప్పటికిప్పుడు ఎన్నికలు జరిగితే మాత్రం... బీజేపీ 30 స్థానాల వరకు నష్టపోతుందని, ఐదు శాతం ఓట్లను కోల్పోతుందని సర్వేలో తేలింది. అంటే, బీజేపీ తన సొంత బలంతో అధికారంలోకి రాలేదు. మిత్రపక్షాలపై ఆధారపడక తప్పదు. మొత్తంగా ఎన్డీఏ కూటమికి 293 నుంచి 309 స్థానాలు రావచ్చని సర్వే వెల్లడించింది. గత ఎన్నికల్లో కాంగ్రెస్ నేతృత్వంలోని యూపీఏ 59 స్థానాలే గెలవగలిగింది. ఇందులో కాంగ్రెస్ వాటా 44. ఈసారి యూపీఏ బలం 122 నుంచి 132 వరకు పెరగొచ్చని అంచనా. ఉత్తర, పశ్చిమ, తూర్పు భారతాల్లో మోదీ ప్రభుత్వానికి ప్రజాదరణ ఉండగా.. దక్షిణ భారతంలో యూపీఏ బలం పెరగొచ్చన్నది తాజా అంచనా!

మోదీ.. రాహుల్ అటూ ఇటూ!

కాంగ్రెస్ అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించిన నేపథ్యంలో రాహుల్ గాంధీకి ప్రజాదరణ పెరుగుతున్నట్లు స్పష్టమైంది. ప్రధానిగా రాహుల్‌కు 8 నెలల క్రితం 9 శాతం మంది మాత్రమే ఓటు వేశారు. ఇప్పుడు ఆ సంఖ్య 20 శాతానికి చేరింది. మోదీ 'పాపులారిటీ' మసకబారుతున్నట్లు తేలింది. 'మోదీయే మళ్లీ ప్రధాని కావాలి' అని 2017 మే నెలలో 44 శాతం మంది కోరుకున్నారు. ఇప్పుడు ఆ సంఖ్య 37 శాతానికి పడిపోయింది. దేశంలోని అన్ని ప్రాంతాల్లో మోదీకి ప్రజాదరణ తగ్గింది. దక్షిణాదిన మరీ ఎక్కువగా పడిపోయింది.

ప్రభుత్వ పనితీరుపై ఇలా...

మోదీ సర్కారు పనితీరు బాగుందని గతంలో 64 శాతం మంది సంతృప్తి వ్యక్తం చేశారు. ఇప్పుడు... 51 శాతం మందే ఆ మాట చెప్పారు. ఆ మేరకు.. అసంతృప్తి 27 నుంచి 40 శాతానికి పెరిగింది.

మంచి రోజులేవీ?

'అచ్చే దిన్'.. ఇది మోదీ మంత్రం! నిజంగానే 'మంచి రోజులు వచ్చాయని/వస్తాయని భావిస్తున్నారా?' అని 8 నెలల కిందట ప్రశ్నించగా.. 63 శాతం మంది ఔను.. అని బదులిచ్చారు. ఇప్పుడా సంఖ్య 40కి పడిపోయింది.

ఏమిటి మీ సమస్య?

'మీ దృష్టిలో ప్రధాన సమస్య ఏమిటి?' అని ప్రశ్నించగా... 27 శాతం మంది 'నిరుద్యోగం' అని బదులిచ్చారు. 14 శాతం మంది పేదరికం, 10 శాతం మంది ధరల పెరుగుదల గురించి ప్రస్తావించారు. 'అవినీతి' తగ్గుతోందని ఈ సర్వేలో వెల్లడైంది. గత సర్వేలో 13 శాతం మంది 'అవినీతే ప్రధాన సమస్య'ని చెప్పగా.. ఇప్పుడు ఆ సంఖ్య 9 శాతానికి పడిపోయింది. 'నోట్ల రద్దు' భారత ఆర్థిక వ్యవస్థకు మంచిదని 48 శాతం మంది.. కాదని 34 శాతం మంది అభిప్రాయపడ్డారు. ఇక.. జీఎస్టీని హడావుడిగా ప్రవేశపెట్టారని 42 శాతం మంది, ఆలోచించే చేశారని 27 శాతం తెలిపారు.

ఇదీ శాతాల లెక్క

ఈ నెలలోనే ఎన్నికలు జరిగితే... ఎన్డీఏకు దేశవ్యాప్తంగా 40 శాతం ఓట్లు లభిస్తాయి. యూపీఏ 30 శాతానికి పరిమితమవుతుంది. అచ్చంగా బీజేపీకి 34 శాతం ఓట్లు లభిస్తాయి. 2014 ఎన్నికలతో పోల్చితే... ఇది 3 శాతం ఎక్కువే. కానీ... ఎనిమిది నెలల క్రితం జరిగిన సర్వేలో బీజేపీకి 39 శాతం ఓట్లు వచ్చాయి. అంటే... ఇప్పుడు ఐదు శాతం మైనస్ అన్నమాట! బీజేపీ మిత్రపక్షాల బలం మాత్రం... అప్పుడూ, ఇప్పుడు యథాతథంగా ఉండటం గమనార్హం.

ఈ రాష్ట్రాల్లో ఇలా...

ఈ ఏడాదిలో ఎన్నికలు జరగనున్న కర్ణాటక, రాజస్థాన్‌లలో మోదీ సర్కారుపై 8 నెలల్లో అసంతృప్తి 20 నుంచి 26 శాతానికి పెరిగింది. అలాగే.. 'ప్రధానిగా ఎవరు ఉండాలని కోరుకుంటున్నారు?' అనే ప్రశ్నకు గత ఏడాది మేలో 42 శాతం మంది బెంగాలీలు మోదీ పేరు చెప్పారు. ఇప్పుడు ఆ సంఖ్య 26 శాతానికి పడిపోయింది. అదే సమయంలో... మమతా బెనర్జీ 'ప్రధాని అభ్యర్థిత్వానికి' మద్దతు 13 నుంచి 29 శాతానికి, రాహుల్‌కు 2 నుంచి 7 శాతానికి పెరిగింది. ఇక.. రైతులు, వ్యాపార వర్గాల్లో బీజేపీపై అసంతృప్తి పెరుగుతోంది. తమ సమస్యలను ఎన్డీఏ కంటే యూపీఏనే బాగా పరిష్కరించిందని ఆ వర్గాల వారు తెలిపారు.

భన్సాలీ తల్లిపై సినిమా తీస్తాం

ఆయన మా తల్లి పద్మావతిని అవమానించారు

మేము మాత్రం ఆయన తల్లిని గౌరవిస్తాం: కర్ణిసేన

న్యూఢిల్లీ/గురుగ్రామ్, జనవరి 26: బాలీవుడ్ వివాదాస్పద చిత్రం 'పద్మావత్'ను వ్యతిరేకిస్తూ ఆందోళన చేపట్టిన కర్ణిసేన ఆగ్రహం ఇంకా చల్లారలేదు. ఆ చిత్ర దర్శకుడు సంజయ్ లీలా భన్సాలీ తల్లిపై తాము సినిమా తీస్తామని శ్రీ రాజ్‌పుత్ కర్ణిసేన ప్రకటించింది. ఆ సినిమాకు 'లీలా కీ లీలా' అనే పేరు పెట్టనున్నట్లు, అరవింద్ వ్యాస్ దర్శకత్వం వహించనున్నట్లు కర్ణిసేన నాయకుడు గోవింద్‌సింగ్ ఖంగరోత్ తెలిపారు. ఏడాదిలోగా షూటింగ్‌ను పూర్తిచేసి సినిమాను విడుదల చేస్తామని ప్రకటించారు. రాణి పద్మావతిని భన్సాలీ అవమానించారని, తాము మాత్రం ఆయన తల్లిని గౌరవిస్తామని తెలిపారు. ఇదిలా ఉండగా..పద్మావత్ విడుదల సందర్భంగా విధించిన ఆంక్షలను ఉల్లంఘించారంటూ కర్ణిసేన జాతీయ ప్రధాన కార్యదర్శి సూరజ్‌పాల్‌ను శుక్రవారం గురుగ్రామ్ పోలీసులు అరెస్టు చేశారు. కాగా.. విధ్వంసాలకు పాల్పడుతున్న కర్ణిసేన గూండాలను జీపులకు ఎందుకు కట్టేయరని జమ్ము కశ్మీర్ మాజీ ముఖ్యమంత్రి ఫరూక్ అబ్దుల్లా ప్రశ్నించారు. మరోవైపు.. పద్మావత్ సినిమా విడుదలైన తొలిరోజే రూ.19 కోట్లు వసూలు చేసింది.

వర్మ హోమోసెక్సువలా?

- నన్ను లైంగికంగా వేధించాడు: పి. జయకుమార్
- తన స్క్రిప్ట్‌ను కాపీ కొట్టి 'జీఎస్టీ' తీశాడని ఆరోపణ



చెన్నై, జనవరి 26: దర్శకుడు రాంగోపాల్‌వర్మ హోమోసెక్సువలా? మగాళ్లను కూడా లైంగికంగా వేధిస్తాడా? అవుననే అంటున్నారు రచయిత పి.జయకుమార్! హాలీవుడ్‌లో అనేక మంది తారల జీవితాలతో ఆడుకున్న హార్వే వీన్‌స్టీన్‌తో పోల్చారు. 'విజయవంతమైన వ్యక్తులతో పనిచేస్తే భవిష్యత్తు ఉంటుందని ఆశించడం సహజం! నేనూ అలాగే అనుకున్నాను. వర్మలో మరో మనిషి ఉన్నాడు. ఆయనలోని స్వలింగసంపర్క స్వభావాన్ని బయటపెట్టాలనుకోలేదు. కానీ వర్మ లైంగిక వేధింపులను వ్యతిరేకించాల్సిన సమయం వచ్చింది' అంటూ జయకుమార్ చేసిన కామెంట్స్ సంచలనం సృష్టిస్తున్నాయి. వర్మ సర్కార్-3 సినిమాకు జయకుమార్ రచయితగా పనిచేశారు. ఇటీవల హాలీవుడ్ నిర్మాత హార్వే వీన్‌స్టీన్‌పై వందమందికి పైగా మహిళలు లైంగిక వేధింపుల ఆరోపణలు చేశారు. 'మీ టూ' ఉద్యమం నేపథ్యంలో వీన్‌స్టీన్ అకృత్యాలను బయటపెట్టారు. 'మీ టూ' తరహాలో ఆర్జీవీ అకృత్యాలకు వ్యతిరేకంగా పోరాడాలంటున్నారు జయకుమార్! 'హార్వే వీన్‌స్టీన్ మాదిరిగా.. ఎందరో యువ కళాకారులు, రచయితలను వర్మ వేధించాడు. వాళ్లంతా మీ టూ ఆర్జీవీ క్యాంపయిన్‌లో పాల్గొనాలి' అని కుమార్ పిలుపునిచ్చారు. అంతేకాదు తన స్క్రిప్ట్‌ను కాపీ కొట్టే 'గాడ్ సెక్స్ అండ్ ట్రూత్' షార్ట్‌ఫిల్మ్ తీశారని కూడా ఆరోపిస్తున్నారు. జయకుమార్ ఆరోపణలను వర్మ తోసిపుచ్చారు. అతనో దొంగ అని ఆరోపించారు. 'మా ఆఫీస్‌లో దొంగతనం చేస్తూ జయకుమార్ అనేకసార్లు దొరికిపోయాడు. అనేకసార్లు హెచ్చరించిన తర్వాత జైను తొలగించాం. గాడ్ సెక్స్ అండ్ ట్రూత్ అతని రచన కాదు. అతని స్క్రిప్ట్‌ను హ్యాక్ చేశాననడంలో నిజం లేదు' అని రాంగోపాల్‌వర్మ ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

రాహుల్ కోర్ టీమ్ సారథిగా కొప్పుల రాజు!

- 1981 బ్యాచ్ ఏపీ కేడర్ ఐఏఎస్ అధికారి
- యూపీఏ హయాంలో ఎన్ఏసీ కార్యదర్శి
- ప్రస్తుతం ఎస్సీ సెల్ జాతీయ అధ్యక్షుడు



న్యూఢిల్లీ, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పగ్గాలు చేపట్టిన తరువాత పార్టీని బలోపేతం చేసేందుకు రాహుల్ గాంధీ వ్యూహ రచన చేస్తున్నారు. ఆ క్రమంలోనే ఆయన కోర్ టీమ్‌ని నడిపించే బాధ్యతను పార్టీ ఎస్సీ సెల్ జాతీయ అధ్యక్షుడు కొప్పుల రాజుకు అప్పగించినట్లు విశ్వసనీయ సమాచారం. ప్రతి రాష్ట్రానికి చెందిన వారు ఉండే విధంగా మొత్తం 100 మంది రాహుల్ సైన్యాన్ని వెతికే పనిలో పడ్డారు. కొప్పుల రాజు 1981 బ్యాచ్ ఏపీ కేడర్ ఐఏఎస్ అధికారి. యూపీఏ హయాంలో నేషనల్ అడ్వైజరీ కౌన్సిల్ (ఎన్ఏసీ) కార్యదర్శిగా పనిచేశారు. ఆ సమయంలో సమాచార హక్కు, విద్యా హక్కు చట్టాలు, ఉపాధి పథకాలు తీసుకురావడంలో క్రియాశీల పాత్ర పోషించడంతో కాంగ్రెస్ అధినాయకత్వం దృష్టిని ఆకర్షించారు. 2013లో స్వచ్ఛంద పదవీ విరమణ చేశారు. అనంతరం రాహుల్ వ్యూహరచన బృందంలో ముఖ్య సభ్యుడిగా కొనసాగుతున్నారు.

తినండి... తగ్గండి!



ఎక్కువ ఫ్యాట్‌తో ఎక్కువ ఆరోగ్యం

బెజవాడ వాసి సృష్టించిన కొత్త 'డైట్'

ఆయన డాక్టర్ కాదు! పోషకాహార నిపుణుడూ కాదు! లెక్కలతో కుస్తీ పట్టే చార్టెర్డ్ అకౌంటెంట్! కానీ... ఆయన వేలాదిమంది జీవితాల 'తిండీ -తిప్పల'ను మార్చేస్తున్నారు. చర్చలు, సమావేశాలు, యూట్యూబ్ వీడియోలతో హల్‌చల్ సృష్టిస్తున్నారు. "ఇది వినండి.. ఇలా తినండి.. రోగాలు మీ దరి చేరవు. బరువు దించేసుకుంటారు. షుగర్ పరార్. జీవన శైలి రోగాలన్నీ గాయబ్" అని తేల్చి చెబుతున్నారు. సామాన్యులే కాదు... ఎంతో మంది వైద్యులు కూడా ఆయన చెప్పింది వింటున్నారు, తింటున్నారు. ఈ డైట్ పేరు... 'లో కార్బ్- హై ఫ్యాట్'! అంటే... కార్బొహైడ్రేట్లు తక్కువగా తీసుకోవడం. కొవ్వు పదార్థాలు ఎక్కువగా తినడం! మీరు చదివింది నిజమే... కొవ్వు పదార్థాలను ఎక్కువగా తినడమే! తన సొంత సమస్యకోసం పరిష్కారాలు వెదికి... సరికొత్త డైట్ సూత్రాన్ని కనిపెట్టిన ఆయన పేరు వీరమాచినేని రామకృష్ణారావు! ఊరు విజయవాడ! ఇప్పుడు తెలుగు రాష్ట్రాల్లో పర్యటిస్తూ ఆహార నియమాలపై విస్తృత ప్రచారం చేస్తున్నారు. అది కూడా సొంత ఖర్చుతో! అసలేమిటి 'హై ఫ్యాట్ ఫుడ్'! మీరే చూడండి!

(విజయవాడ ఫీచర్స్ - ఆంధ్రజ్యోతి)

- అన్నం, చపాతీలు, పండ్లు, స్వీట్లు నిషేధం
- డ్రైఫ్రూట్స్, గింజలు, కొబ్బరి నూనె మేలు
- మంచినీళ్లు, ఉప్పులేని నీళ్ల మజ్జిగ..
- తెలుగు రాష్ట్రాల్లో విస్తృత ప్రచారం
- అనుసరిస్తున్న వేలాదిమంది ప్రజలు
- అధిక బరువు నుంచి విముక్తి
- బీపీ, షుగర్, ఇతర జీవన శైలి రుగ్మతలకు చెక్
- షుగర్‌ను తరిమేస్తానంటున్న రామకృష్ణా రావు



"ఇక బేరియాట్రిక్ సర్జరీల అవసరం ఉండదు. మధుమేహం, బీపీ, థైరాయిడ్, స్పాండిలైటిస్, ఆర్థరైటిస్ వంటి వ్యాధులకు మందులు వాడాల్సిన పనిలేదు. గంటల తరబడి పని చేసినా మానసిక ఒత్తిడి దరిచేరదు. అయితే.. ఆహారం తీసుకోవడంలో చేస్తున్న పొరపాట్లకు స్వస్తిచెప్పాలి".. ఇది వీరమాచినేని మాట! ఆహార విధానంలో కొద్దిమార్పులతో జీవనశైలి సంబంధిత వ్యాధులన్నీ తగ్గిపోతాయని చెబుతున్నారు. ఈ పద్ధతిలో పొద్దున్నే టిఫిన్, మధ్యాహ్నం భోజనం, రాత్రి మళ్లీ భోజనం లేదా చపాతీలు తినడం కుదరదు. అలాగని నోరు కట్టేసుకోవాల్సిన పని లేదు. మాంసాహారం తినేయవచ్చు. మీగడ, నెయ్యి వాడొచ్చు. ఈ 'హై ఫ్యాట్' డైట్‌ను ఆర్నెళ్లపాటు అనుసరిస్తే.. కొద్దిపాటి నియంత్రణతో ఆరోగ్యంగా ఉండొచ్చునని రామకృష్ణారావు చెబుతున్నారు.

ఇలా మొదలైంది...

ఒకప్పుడు రామకృష్ణారావు బరువు 123 కిలోలు! భారీ కాయాన్ని తగ్గించుకోవడానికి శరీరాన్ని చాలా కష్టపెట్టేవారు. ఉదయాన్నే సైకిల్ తొక్కడం.. ఇతరత్రా వ్యాయామాలు చేసేవారు. అదే సమయంలో... ఊబకాయం, మధుమేహం, ఇతర జీవన శైలి సంబంధిత సమస్యలకు పరిష్కారాన్ని శోధించడం మొదలుపెట్టారు. చైనా సంతతికి చెందిన కెనడా నెఫ్రాలజిస్టు జీసన్‌ఫెంగ్ పరిశోధనలు ఆయన కంట పడ్డాయి. దీని ఆధారంగా... కొవ్వుకు కొవ్వుతోనే చెక్ చెప్పే ఆహార నియమావళిని రూపొందించారు. ఈ ప్రయోగాన్ని తొలుత తనపైనే చేసుకున్నారు. ఆయన బరువు 60 రోజుల్లోనే 123 కిలోల నుంచి 93 కిలోలకు తగ్గింది. తర్వాత... మధుమేహంతో బాధపడుతున్న ఓ స్నేహితుడిని ఒప్పించి, ఈ ఆహార నియమాలను పాటించేలా చేశారు. ఆయన షుగర్ లెవెల్ తగ్గినట్లు గమనించారు. ప్రస్తుతం తెలుగు రాష్ట్రాలతో పాటు ఇతర రాష్ట్రాలు, ఆస్ట్రేలియా, అమెరికా, లండన్, దుబాయి దేశాల్లోని తెలుగు వారు ఈ డైట్ పాటిస్తున్నారు.

ఏం తినాలి.. ఎలా తినాలి?

హై ఫ్యాట్ డైట్‌ను వ్యక్తుల అవసరాలను బట్టి రెండు నెలల నుంచి నాలుగు నెలలు అనుసరించాలి. లక్ష్యం సాధించాక ఈ ప్రోగ్రామ్ నుంచి బయటికి వచ్చి.. కొద్దిపాటి నియంత్రణతో ముందులాగే ఆహారం తీసుకోవచ్చు. ఆయిల్ ఫ్యాట్, నిమ్మకాయలు, మంచినీళ్లు, పల్చటి మజ్జిగ, మల్టీ విటమిన్ టాబ్లెట్లు.. కొత్త ఆహారంలో ఇవే కీలకం. బాదం, పిస్తా, వాల్‌నట్, గుమ్మడి గింజలు, పొద్దు తిరుగుడు, పుచ్చ, అవిసె గింజలు, తెల్ల నువ్వులు తినవచ్చు. రోజుకు ఆరు వరకు కోడిగుడ్లు (పచ్చసొనతో సహా) తినొచ్చు. పావు కిలో మటన్, చికెన్, ఫిష్, రొయ్యలను నిర్దిష్ట విధానంలో వండుకుని తీసుకోవచ్చు. స్వీట్లు, పండ్లు, పాలు, పాల పదార్థాలు, చక్కెర, బెల్లం, తేనె, కూల్‌డ్రింక్స్, కొబ్బరినీళ్లు, కాఫీ, టీ, మద్యం, ధూమపానం, గుట్కాలు పూర్తిగా నిషిద్ధం. గ్రీన్ టీ, షుగర్ లెస్ లెమన్ టీ తీసుకోవచ్చు. అన్నం, చపాతి, పుల్కా, బొంబాయి రవ్వ ఉప్మా, ఇడ్లీ, దోసె, పూరీ వంటివి తినకూడదు. మొక్కజొన్న, సజ్జలు, జొన్న, రాగులు, కొర్రలు వంటి చిరుధాన్యాలూ తినొద్దు. రిఫైన్డ్ ఆయిల్స్ అస్సలు వాడొద్దు. కురుడీకాయల నుంచి తీసిన కొబ్బరి నూనె, ఆవు, గేదె నెయ్యి, ఆలివ్ ఆయిల్, మీగడ, వెన్న మాత్రమే వంటల్లో వాడాలి. రోజూ నాలుగైదు లీటర్ల మంచినీళ్లు తాగాలి. ఉప్పు లేకుండా.. పల్చటి మజ్జిగలో నిమ్మరసం కలిపి తాగాలి. వంటల్లో సముద్రపు ఉప్పు మాత్రమే వాడాలి. బంగాళ దుంప, చేమ, కంద, పెండలం, చిలగడ దుంపలు, బీట్‌రూట్, కూర అరటికాయ, నాటు చిక్కుడు, బఠానీ, గోరు చిక్కుడు (బీన్స్) పూర్తి నిషేధం. సొరకాయ, తోటకూరకాడలు, బీరకాయలను పాలతో కలిపి వండుకోవచ్చు. పాల మీద మీగడతో కూరలు వండుకోవచ్చు. నేరుగా పాల మీద మీగడ తినకూడదు.



గమనిక: ఇది హైఫ్యాట్ డైట్‌పై అవగాహన కల్పించే కథనం మాత్రమే. పూర్తి వివరాలకు 9246472677 నెంబర్‌కు ఫోన్ చేయవచ్చు.

మేలు చేసే ఆహార విధానం



"థైరాయిడ్, బీపీ, ఫ్యాటీలివర్, పీసీవోడీ, స్పాండిలైటిస్, ఆర్థరైటిస్, మైగ్రెయిన్, వెన్నునొప్పి, కాళ్ల నొప్పి, రుతుచక్రంలో అసమతుల్యత, సంతాన సాఫల్యత.. ఇలా వేర్వేరు సమస్యల నివారణకు వైద్యులను సంప్రదిస్తే ముందు బరువు తగ్గాలని అంటుంటారు. ఎలా తగ్గాలని ఎవరూ చెప్పరు. కొత్త విధానంతో బరువు తగ్గడం సులువు. నా స్నేహితుడు డయాబెటిక్ పేషెంట్. ఆయనకు 58 సంవత్సరాలు. తొలి ఐదురోజులు పూటకు నాలుగు స్పూన్‌లు చొప్పున ఆయనకు కొబ్బరి నూనె ఇచ్చాం. మిగతాది అంతా మంచినీళ్లు తాగడమే. కొంచెం నిమ్మకాయ ఇచ్చేవాళ్లం. వారం రోజుల్లో బరువు తగ్గారు. మధుమేహానికి మందులు వాడాల్సిన అవసరం రాలేదు. తెలుగు రాష్ట్రాల నుంచి మధుమేహాన్ని ఏడాదిలో తరిమికొట్టాలని లక్ష్యంగా పెట్టుకున్నాను."

- వీరమాచినేని రామకృష్ణా రావు

కొవ్వు తింటూనే కొవ్వు తగ్గించుకోవచ్చు

"రామకృష్ణ సూచించిన డైట్ ఫార్ములాతో డయాబెటిస్ రహిత ప్రపంచం సాధ్యమనే నమ్ముతాను. వైద్య పరంగా పరిశోధనలు చేసిన తర్వాత ఇవన్నీ నిజాలని తెలుతాయి. స్వయంగా నేను 81 నుంచి 75 కేజీలకు తగ్గాను. నాలో షుగర్ లెవెల్స్ 250 నుంచి 110కి తగ్గాయి. ఎక్కువ తింటున్నా షుగర్ కంట్రోల్‌లో ఉంటోంది. ఎక్కువ ఫ్యాట్ తింటూనే ఫ్యాట్ తగ్గించుకోవడం ఈ విధానంలో ప్రత్యేకత"

- డాక్టర్ హరిశ్చంద్ర, సీనియర్ హోమియో ఫిజిషియన్, విజయవాడ

థైరాయిడ్ తగ్గుముఖం

"రామకృష్ణ ప్రతిపాదించిన నూతన ఆహార పద్ధతిలో ఒబేసిటీ తగ్గుతోంది. బరువు తగ్గితే సహజంగానే థైరాయిడ్ సమస్యకు దారితీసే స్థాయిలు తగ్గుతాయి. ఈ డైట్ తీసుకుంటే టైప్-2 మధుమేహం అదుపులో ఉంటుంది"

- డాక్టర్ ఎస్.జయదేవ్, ఎండోక్రినాలజిస్ట్, విజయవాడ

మోకాలి నొప్పికి విముక్తి

"నాలుగడుగులు వేయాలంటే కాలు విపరీతంగా నొప్పి పుట్టేది. మెట్లు ఎక్కడమంటే భయమేసేది. గతంలో తిండి తగ్గించినా బరువు తగ్గలేదు. హై ఫ్యాట్ డైట్‌తో నెలరోజుల్లో ఆరు కిలోలు తగ్గా. మోకాలి నొప్పి తగ్గింది"

- డాక్టర్ యు.శ్రీలక్ష్మి, నాగార్జున ఆసుపత్రి, విజయవాడ

షుగర్ మందులు మానేశా!

"ఏడు నెలల క్రితం హై ఫ్యాట్ ఆహారంలోకి వచ్చా. ఐదోరోజు నుంచే షుగర్‌కు మందులు ఆపేశా. షుగర్ కంట్రోల్‌లో ఉంది. మూణ్నెళ్ల పాటు నూతన విధానంలో ఆహారం స్వీకరించా. వంద నుంచి 77 కిలోలకు బరువు తగ్గా. ప్రస్తుతం ఏది తిన్నా మధుమేహం పెరగడం లేదు"

- కేవీ సాంబశివారెడ్డి, విజయవాడ

స్పాండిలైటిస్ 60 % తగ్గింది

"గత ఆరేళ్లుగా స్పాండిలైటిస్ నుంచి బాధపడుతున్నా. ప్రస్తుతం అరవై శాతం మార్పు వచ్చింది. గతంలో తలతిప్పలేకపోయేవాడిని. గతంలో 118 కిలోలు ఉండేవాడిని ప్రస్తుతం 91 కేజీలకు తగ్గాను"

- కె.లోకేష్, టీచర్స్ కాలనీ, విజయవాడ

మోదీకి ట్రంప్ కౌంటర్

- మీ దేశం మీకెంత ముఖ్యమో.. అమెరికా నాకూ ముఖ్యమే

న్యూఢిల్లీ/దావోస్, జనవరి 26: ప్రపంచదేశాలు ఆత్మరక్షణాత్మక ధోరణులు అవలంబిస్తున్నాయని, ఓ వైపు ప్రపంచీకరణ వేగంగా విస్తరిస్తున్న క్రమంలో ఈ స్వీయ రక్షణాత్మక విధానాలు సరికాదని, ఇది ప్రపంచానికే పెనుసవాల్‌గా మారిన మూడు ప్రమాదాల్లో ఒకటని- దావోస్ వేదికగా ప్రధాని నరేంద్ర మోదీ విమర్శలు గుప్పించారు. అమెరికా పేరు ప్రస్తావించకుండా అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రవచించిన అమెరికా ఫస్ట్ విధానాన్ని మోదీ పరోక్షంగా నిరసించారు. దీనిని ట్రంప్ తిప్పికొట్టారు. "అమెరికా అధ్యక్షుడిగా నేను నా దేశాన్ని విశ్వసిస్తాను. అమెరికాయే నా మొదటి ప్రాథామ్యం. ఇతర దేశాలకు వారి వారి దేశాలెలాగైతే మొదటి ప్రాథామ్యమో నాకూ అంతే.. మిగిలిన దేశాలు ఎలాగైతే వారి దేశాల, కంపెనీల, ఉద్యోగుల ప్రయోజనాలను పరిరక్షించాలో మేం కూడా అలాగే పరిరక్షించుకుంటాం.." అని ట్రంప్ దావోస్‌లో జరిగిన ప్రపంచ ఆర్థిక వేదిక సదస్సులో చేసిన ముగింపు ఉపన్యాసంలో స్పష్టం చేశారు. కొద్ది వారాల కిందట హెచ్-1బీ వీసాల వ్యవహారం భారత్‌ను తీవ్రంగా కుదిపేసింది. దాదాపు 15 లక్షల మంది టెకీలు, వారి కుటుంబాలు అమెరికా నుంచి స్వదేశానికి తిరిగి రావాల్సిన పరిస్థితి నెలకొంది. భారత్-అనుకూల ఒత్తిడి గ్రూపులు, కంపెనీ యాజమాన్యాల లాబీయింగ్‌తో ఆ చర్యను విరమించుకుంది ట్రంప్ సర్కార్. దీంతోపాటు- డ్రీమర్స్ (మెక్సికో, మరికొన్ని పొరుగుదేశాల నుంచి ఏళ్ల కిందట వలస వచ్చిన వారి పిల్లలు, మనవలు, కుటుంబాలు, బంధువులు) ఆటోమేటిక్‌గా అమెరికా పౌరసత్వం పొందే విధానానికి కూడా స్వస్తి పలుకుతామని ట్రంప్ ప్రకటించడం, దీని వల్ల దాదాపు 78 లక్షల మంది భవిత ప్రమాదంలో పడడం ఆందోళనలను రేకెత్తించింది. వీటిని దృష్టిలో ఉంచుకుని మోదీ- ఈ ఆత్మరక్షణాత్మక ధోరణులను తప్పుబట్టారు. అయితే ట్రంప్ ఊరుకోలేదు.."ఉగ్రవాదంపై పోరాడుతున్నాం. నాకు అమెరికన్ల భద్రత ముఖ్యం. అందుకే ఇమ్మిగ్రేషన్ వ్యవస్థను మారుస్తున్నాం. కుటుంబాలు, వారి బంధువుల కొనసాగింపు వ్యవస్థను మార్చి నైపుణ్యం గలవారికి స్వాగతం పలుకుతున్నాం. అమెరికా ఎదిగితే ప్రపంచం ఎదుగుతుంది.. ఇది గుర్తుంచుకోవాలి" అని రిటార్ట్ ఇచ్చారు. మోదీ ప్రసంగాన్ని చైనాతోపాటు ఆసియాన్ దేశాలు, ఇతర వర్ధమాన దేశాలు సమర్థించాయి. ట్రంప్ కాస్త ప్రాక్టికల్‌గా మాట్లాడారని దావోస్ సదస్సుకు హాజరైన సీఈఓలు వ్యాఖ్యానించారు.

'మానవ బాంబు'ను పట్టేశారు!

శ్రీనగర్, జనవరి 26: రిపబ్లిక్ డేకి ఒక రోజు ముందు జమ్ము కశ్మీర్ పోలీసులు మానవ బాంబు అనే అనుమానంతో పుణెకు చెందిన ఒక యువతిని అదుపులోకి తీసుకున్నారు. కేంద్ర సంస్థల నిఘా సమాచారాన్ని రాష్ట్ర పోలీసులు పొరపాటుగా అర్థం చేసుకోవడంతో ఆమెను మానవ బాంబుగా భావించడం, అదే సమాచారం అన్ని జిల్లాల పోలీస్ స్టేషన్లకు వెళ్లడంతో కలకలం రేగింది. దీంతో.. బిజ్‌బెహరాలో 'పేయింగ్ గెస్ట్'గా ఉంటున్న ఆమెను అరెస్టు చేశారు. ఆ యువతి పేరు సాదియా అన్వర్ షేక్. పుణెలో 11వ తరగతి వరకు చదివింది. గత ఏడాది 18 సంవత్సరాలు నిండాయి. సామాజిక మాధ్యమాల్లో తప్పుడు ప్రచారం వలలో పడి తీవ్రవాదం వైపు ఆకర్షితురాలైంది. ఐఎస్‌లో చేరాలనుకుంది. అయితే.. ఆమెపై పెండింగ్ కేసులు లేనందున కుటుంబ సభ్యులకు అప్పగించనున్నట్లు తెలిపారు.

విపక్షాల 'ఉమ్మడి దాడి'

ముంబై, జనవరి 26: భిన్నత్వంలో ఏకత్వాన్ని సంతరించుకున్న దేశ ప్రజల పరిరక్షణే లక్ష్యంగా రూపొందించుకున్న రాజ్యాంగంపై జరుగుతున్న దాడిని అడ్డుకుందామని విపక్షాల నేతలు పిలుపునిచ్చారు. 'రాజ్యాంగాన్ని పరిరక్షించండి' నినాదంతో కేంద్రంలోని బీజేపీ నేతృత్వంలోని ఎన్డీఏ ప్రభుత్వానికి వ్యతిరేకంగా విపక్షాలు భారీ పాదయాత్ర నిర్వహించాయి. శుక్రవారం మధ్యాహ్నం మహారాష్ట్ర సచివాలయ సమీపంలోని ఓవల్ మైదాన్ వద్ద ఉన్న అంబేడ్కర్ విగ్రహం నుంచి దక్షిణ ముంబైలోని గేట్ వే ఆఫ్ ఇండియా వరకు మొత్తం 2 కిలో మీటర్లమేర పాదయాత్ర నిర్వహించారు. ఎన్సీపీ చీఫ్ శరద్ పవార్ మాట్లాడుతూ.. మోదీ నేతృత్వంలోని ప్రభుత్వం రాజ్యాంగంపై దాడి చేస్తోందని, దాడిని ఎదుర్కొనేందుకు ప్రతిఒక్కరూ ముందుకు రావాల్సిన సమయం ఆసన్నమైందని చెప్పారు. ఈ నెల 29న విపక్ష పార్టీల నేతలు ఢిల్లీలో భేటీ అయి కార్యాచరణను రూపొందిస్తారన్నారు. ఈ పాదయాత్రలో సీపీఎం జాతీయ కార్యదర్శి సీతారాం ఏచూరి, మహారాష్ట్ర మాజీ సీఎం పృథ్వీరాజ్ చవాన్, జేడీయూ అసమ్మతి నేత శరద్ యాదవ్, సీపీఐ నేత రాజా, పాటీదార్ నేత హార్దిక్ పటేల్, కాంగ్రెస్ నేత షిండే పాల్గొన్నారు.


జ్యోతిప్రకాశ్ భార్యకు అశోక్‌చక్ర అవార్డు అందచేస్తున్న రాష్ట్రపతి కోవింద్


వేడుకల్లో రాష్ట్రపతి కోవింద్, ఉప రాష్ట్రపతి వెంకయ్య, ప్రధాని మోదీ


రాజ్‌పథ్ వద్ద గణతంత్ర వేడుకల్లో శకటాల ప్రదర్శన

దశ దిశలా చాటుతూ..

ఘనంగా భారత గణతంత్ర వేడుకలు.. తొలిసారిగా పది ఆసియా దేశాల అధినేతలు హాజరు

న్యూఢిల్లీ, జనవరి 26: గజగజ వణికించే ఆరు డిగ్రీల చలి! రాజధాని నడిబొడ్డున తెరలా పరచుకున్న మంచు! రాజ్‌పథ్‌కు అటూ ఇటూ వేలాదిమంది జనం హోరు! చిత్రకారుడు అద్భుతమైన పెయింటింగ్ గీసినట్లు ఉన్న ఆ ప్రాంతంలో దేశ సైనిక పరాక్రమాలను వివరించేలా త్రివిధ దళాల విన్యాసాలు! అద్భుత సాంస్కృతిక వైవిధ్య ప్రదర్శన! గతంలో ఎన్నడూ లేని విధంగా.. చరిత్రలో తొలిసారిగా వాటిని వీక్షించిన పది ఆసియా దేశాల అధినేతలు! భారత 69వ గణతంత్ర వేడుకలు దేశ రాజధానిలోని రాజ్‌పథ్‌లో శుక్రవారం ఘనంగా జరిగాయి. వంద అడుగుల వేదికపై రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్, ప్రధాన మంత్రి నరేంద్ర మోదీలతోపాటు కూర్చుని ముఖ్య అతిథులుగా విచ్చేసిన ఆసియా దేశాల నేతలు పరేడ్‌ను వీక్షించారు. త్రివిధ దళాల సుప్రీం కమాండర్‌గా రాష్ట్రపతి సైనిక వందనం అందుకున్నారు. పరేడ్‌లో భాగంగా పది ఆసియా దేశాల జెండాలతో కవాతు నిర్వహించారు. సింగపూర్ ప్రధాని లీ సీన్ లూంగ్, వియత్నాం ప్రధాని న్యూయెన్ జువాన్ ఫుక్, మయన్మార్ కౌన్సిలర్ ఆంగ్ సాన్ సూచీ, ఇండోనేసియా అధ్యక్షుడు జోకో విడోడో, థాయిలాండ్ ప్రధాని జనరల్ ప్రయుత్ చాన్‌ఓచా, ఫిలిప్పీన్స్ అధ్యక్షుడు రోడ్రిగో రోవో దుటెర్టే, లావోస్ ప్రధాని థాంగ్లోన్ సిసౌలిత్, మలేసియా ప్రధాని నజీబ్ రజాక్, బ్రూనై సుల్తాన్ హసనల్ బోల్కియా, కాంబోడియా ప్రధాని హున్ సేన్ గణతంత్ర వేడుకల్లో పాల్గొంచుకున్నారు. బ్రహ్మోస్ క్షిపణి వ్యవస్థ.. టీ-90 ట్యాంకులు.. ఆయుధాలను గుర్తించే రాడార్.. ఆకాశ్ వ్యవస్థలను ఆర్మీ ప్రదర్శిస్తే.. దేశీయంగా తయారు చేసిన తేజస్.. సీ130జే సూపర్ హెర్క్యులస్,


గణతంత్ర వేడుకల్లో పాల్గొన్న ఆసియాన్ దేశాల మంత్రులు

సీ-17 గ్లోబ్ మాస్టర్, ఎస్‌యూ-30 ఎంకేఐ తదితర సైనిక పాటవాలను వైమానిక బలగాలు ప్రదర్శించాయి. వీటిని వేలాదిమంది ప్రజలతోపాటు పది ఆసియా దేశాధినేతలు కూడా వీక్షించి మంత్రముగ్ధులయ్యారు.

భారత్, ఆసియాన్ బంధం వాదవివాదాలకతీతం: మోదీ

భారత్, ఆసియా దేశాల సంబంధాలు వాద వివాదాలకు అతీతమని, చిన్న దేశమా పెద్ద దేశమా అన్న దానితో సంబంధం లేకుండా అన్ని దేశాల సార్వభౌమ సమానత్వాన్ని పాటిస్తాయని ప్రధాని మోదీ వ్యాఖ్యానించారు. పది దేశాల అధినేతలు భారత్‌ను సందర్శించడం 'చారిత్రక మైలురాయి'గా అభివర్ణించారు. గణతంత్ర దినోత్సవం సందర్భంగా పది ఆసియా దేశాల్లో పది భాషలకు చెందిన 27 దినపత్రికల సంపాదకీయ పేజీల్లో మోదీ రాసిన వ్యాసం ప్రచురితమైంది. అందులో ఆసియా దేశాలతో భారత్ సంబంధాలు ఎంత ముఖ్యమో వివరించారు. "ప్రతి ఆసియాన్ సభ్యుడితోనూ మాకు దౌత్య, ఆర్థిక, భద్రతా భాగస్వామ్యం ఉంది. మా సముద్రాలు సురక్షితంగా ఉండడానికి కలిసి పని చేస్తాం. మా వాణిజ్యం, పెట్టుబడులు ఎన్నో రెట్లు పెరిగాయి" అని పేర్కొన్నారు. కాగా, భారత్, ఆసియాన్ బంధానికి పాతికేళ్లు పూర్తయిన సందర్భంగా రామాయణంపై పోస్టల్ స్టాంపును విడుదల చేశారు.



గణతంత్రంలో మోదీ కాలి నడక

న్యూఢిల్లీ, జనవరి26 (ఆంధ్రజ్యోతి): గణతంత్ర దినోత్సవ వేడుకల్లో ప్రధాని మోదీ తన 'మార్కు' మరోసారి చూపించారు. వేడుకలు ముగిసిన తర్వాత.. ఆయన రాజ్‌పథ్ మార్గంలో నడుస్తూ హల్‌చల్ చేశారు. పరేడ్‌కు వచ్చిన ప్రధానిని చూడగానే అక్కడి వారంతా కేరింతలు కొడుతూ ఒక వేవ్‌లా లేచారు. దీంతో ప్రధాని సెక్యూరిటీ వలయాన్ని దాటుకుని మరీ బయటకొచ్చి చేతులు ఊపుతూ వారిని అలరించారు. వేదిక వద్దకు వెళ్లేటప్పుడు.. తిరిగి వచ్చే క్రమంలో అదే స్పందన రావడంతో మోదీ చేతులు ఊపుతూ ప్రేక్షకుల్లో ఉత్సాహం నింపారు.


జేబురుమాలుతో కళ్లు తుడుచుకుంటున్న రాష్ట్రపతి కోవింద్

రాష్ట్రపతి కంటతడి!

న్యూఢిల్లీ, జనవరి 26: గణతంత్ర వేడుకల్లో రాష్ట్రపతి రాంనాథ్ కోవింద్ కన్నీటిపర్యంతమయ్యారు! అత్యున్నత శౌర్య పురస్కారమైన అశోక చక్ర పతకాన్ని అందజేసిన సందర్భంగా ఆయన భావోద్వేగానికి గురై కంటతడి పెట్టారు. జమ్ముకశ్మీరులోని బందీపొరాలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో శరీరంలోకి తూటాలు దిగబడినా లెక్కచేయకుండా ముగ్గురు ఉగ్రవాదులను మట్టుపెట్టి వీరమరణం పొందిన వైమానిక దళ కమెండో కార్పొరల్ జ్యోతి ప్రకాశ్ నిరాలాకు కేంద్ర హోంశాఖ అశోక చక్రను ప్రకటించింది. శుక్రవారం జరిగిన గణతంత్ర వేడుకల్లో జ్యోతిప్రకాశ్ తల్లి మాలతీ దేవి, భార్య సుష్మానంద్‌కు ఈ పతకాన్ని అందజేస్తూ రాష్ట్రపతి కోవింద్ కంటతడి పెట్టారు. తన జేబురుమాలుతో కళ్లు తుడుచుకున్నారు.

మీ విజయాలు భేష్: పుతిన్

న్యూఢిల్లీ, జనవరి 26: గణతంత్ర దినోత్సవం సందర్భంగా భారత్‌కు రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు ప్రధాని నరేంద్ర మోదీకి ప్రత్యేక సందేశం పంపారు. వివిధ రంగాల్లో భారత్ విజయాలను కొనియాడిన పుతిన్... ప్రజలందరూ శాంతి సౌభాగ్యాలతో వర్ధిల్లాలని ఆకాక్షించారు. "ఆర్థిక, సామాజిక, శాస్త్ర, సాంకేతిక, ఇతర రంగాల్లో మీ దేశ విజయాలు సుపరిచితం. అంతర్జాతీయ భద్రత, సుస్థిరత విషయంలో; ప్రాంతీయ, అంతర్జాతీయ ఎజెండాలోని అంశాల పరిష్కారంలో భారత్ ముఖ్య భూమిక పోషిస్తోంది. భారత్‌తో వ్యూహాత్మక భాగస్వామ్యం మాకెంతో ప్రత్యేకం"అని పుతిన్ పేర్కొన్నారు.



నాలుగు కాస్తా ఆరైంది!

- రాజ్‌పథ్‌లో రాహుల్‌కు ఆరో వరసలో సీటు
- కేంద్రానివి దిగజారుడు రాజకీయాలన్న కాంగ్రెస్

న్యూఢిల్లీ, జనవరి 26: 'కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీకి గణతంత్ర వేడుకల్లో నాలుగో వరసలో సీటు కేటాయించారు. సాధారణంగా ప్రతిపక్ష నేతకు మొదటి వరసలో అవకాశం కల్పిస్తారు. మా నేతను అవమానించేందుకే ఇలా చేశారు'.. ఇదీ గురువారం కాంగ్రెస్ నేతల ఆక్రోశం! అప్పటికి కేంద్ర మంత్రులు, నేతలకు సీట్ల కేటాయింపు ఇంకా పూర్తవలేదని అధికార వర్గాలు చెప్పాయి. కానీ, శుక్రవారం కాంగ్రెస్ నేతల ఆందోళన రెట్టింపైంది. గణతంత్ర వేడుకల్లో రాహుల్‌కు వారనుకున్న నాలుగో వరస కాదు.. ఆరో వరసలో సీటు కేటాయించడమే ఇందుకు కారణం! మొత్తం మీద రాహుల్ రాజ్‌పథ్‌లో జరిగిన 69వ గణతంత్ర వేడుకలను అతిథులు, కేంద్ర మంత్రులు, సీనియర్ బీజేపీ నేతలకు దూరంగా.. సాధారణ ప్రజలకు దగ్గరగా ఉండే ఆరో వరసలో కూర్చొని వీక్షించారు. బీజేపీ అధ్యక్షుడు అమిత్ షా, అగ్రనేత ఆడ్వాణీలు ముందు వరసలో ఆసీనులయ్యారు. అయితే ఎక్కడ కూర్చున్నాననే విషయాన్ని తాను పట్టించుకోనని రాహుల్ ఓ చానెల్‌తో మాట్లాడుతూ చెప్పారు. మరోవైపు కాంగ్రెస్ నేతలు మాత్రం ఈ విషయమై కేంద్ర ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. కేంద్ర ప్రభుత్వానికి దిగజారుడు రాజకీయాలని కాంగ్రెస్ అధికార ప్రతినిధి రణదీప్ సుర్జేవాలా ట్వీట్ చేశారు.

పాక్‌తో స్వీట్లు పంచుకోని భారత్

- పాక్ రేంజర్ల కాల్పులపై బీఎస్ఎఫ్ నిరసన

న్యూఢిల్లీ, జనవరి 26: గణతంత్ర దినోత్సవం సందర్భంగా పాకిస్థాన్ రేంజర్లతో స్వీట్లు ఇచ్చి పుచ్చుకోవడానికి సరిహద్దు భద్రతా దళం (బీఎస్ఎఫ్) నిరాకరించింది. రిపబ్లిక్ డేతో పాటు స్వాతంత్ర్య దినోత్సవం, దీపావళి, ఈద్, ఇతర పండుగ రోజుల్లో భారత్, పాక్ సైనికులు ఒకరికొకరు తీపి పంచుకోవడం ఆనవాయితీ. అయితే కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఉల్లంఘిస్తున్న పాక్ రేంజర్లు గత కొద్ది రోజుల్లోనే ఏడుగురు పౌరులు సహా 13 మందిని బలిగొన్నారు. అంతర్జాతీయ సరిహద్దు, నియంత్రణ రేఖ వెంబడి భారత పోస్టులు, జనావాసాలు లక్ష్యంగా పాక్ రేంజర్లు తూటాల వర్షం కురిపిస్తున్నారు. దీనికి నిరసనగానే సంప్రదాయంగా వస్తున్న స్వీట్లు ఇచ్చి పుచ్చుకోవడానికి బీఎస్ఎఫ్ తిరస్కరించినట్లు సమాచారం.

ఢిల్లీ మసీదులో మలేసియా ప్రధాని ప్రార్థనలు

న్యూఢిల్లీ, జనవరి 26: మలేసియా ప్రధాని నజీబ్ రజాక్ శుక్రవారం ఢిల్లీలోని మసీదులో ప్రార్థనలు నిర్వహించారు. మధ్యాహ్నం ఒంటి గంట సమయంలో ఆయన పార్లమెంటు సమీపంలోని జమా మసీదుకు వచ్చారు. రజాక్ రాకతో ఆ ప్రాంతంలో కట్టుదిట్టమైన భద్రత ఏర్పాటు చేశారు. గణతంత్ర వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మిగతా ఆగ్నేయాసియా దేశాల అధినేతలతో కలిసి రాజ్‌పథ్‌లో కనులవిందుగా సాగిన కవాతును తిలకించారు.

హిమాలయాల్లో మువ్వన్నెల రెపరెపలు

న్యూఢిల్లీ, జనవరి 26: ఎముకలు కొరికే చలిలో, 18 వేల అడుగుల ఎత్తున ఐటీబీపీ(ఇండో టిబెటిన్ బోర్డర్ పోలీస్) జవాన్లు దేశ జాతీయ పతాకాన్ని రెపరెపలాడించారు. హిమాలయాల్లో మైనస్ 30 డిగ్రీల ఉష్ణోగ్రతను సైతం లెక్కచేయకుండా దేశ భక్తిని చాటారు. శుక్రవారం గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని జవాన్లు చేసిన ఈ సాహసానికి సంబంధించిన వీడియోను ఐటీబీపీ అధికారిక ట్విటర్ ఖాతాలో పోస్ట్ చేసింది. ఈ వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది.



పాలక్కడ్‌లో జెండా ఆవిష్కరించిన భగవత్



పాలక్కడ్ (కేరళ)/న్యూఢిల్లీ, జనవరి 26: గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆరెస్సెస్ చీఫ్ మోహన్ భగవత్ పాలక్కడ్‌లోని వ్యాస విద్యా పీఠం ఉన్నత పాఠశాలలో జాతీయ జెండాను ఆవిష్కరించారు. విద్యా భారతి ఆధ్వర్యంలో ఈ పాఠశాలను నిర్వహిస్తున్నారు. గత ఏడాది రిపబ్లిక్ డే సందర్భంగా భగవత్... ప్రభుత్వ ఎయిడెడ్ ఉన్నత పాఠశాలలో జెండా ఎగురవేయడంపై వివాదం రేగిన సంగతి తెలిసిందే. ప్రభుత్వ కార్యాలయాలు, విద్యాసంస్థల్లో ప్రభుత్వ అధికారులు మాత్రమే జెండా ఆవిష్కరించాలన్న పాలక్కడ్ కలెక్టర్ ఆదేశాలను భగవత్ ఉల్లఘించడమే ఆ వివాదానికి కారణం. అయితే ఆ పాఠశాలలో భగవత్ జెండాను ఆవిష్కరించడంలో తప్పులేదని, అది ప్రతి పౌరుడి హక్కు అని ఆరెస్సెస్ బదులిచ్చింది. కాగా, రాజ్యాంగంలోని మార్గదర్శకాలను ప్రతి ఒక్కరూ అనుసరించాలని భగవత్ రిపబ్లిక్ డే సందేశంలో కోరారు. బీజేపీ సీనియర్ నేత ఎల్‌కే ఆడ్వాణీ ఢిల్లీలోని తన నివాసం వద్ద జాతీయ జెండాను ఆవిష్కరించారు.



బుద్ధం శరణం.. గాంధీ సిద్ధాంతం


పెరేడ్‌లో బ్రహ్మోస్ డబ్ల్యూపీఎన్ వ్యవస్థ

న్యూఢిల్లీ, జనవరి 26: ప్రకృతి సోయగమంతా అక్కడే పోతపోసిందా అన్నట్టు రంగురంగుల పూలు.. అజ్ఞాన చీకట్లను పటాపంచలు చేస్తున్నాయా అనిపించేలా దీపాల వెలుగులు.. ఇలా గణతంత్ర దినోత్సవం సందర్భంగా రాజ్‌పథ్‌లో సాగిన ఓ శకటం ఆహూతులను కళ్లుతిప్పుకోకుండా చేసింది. సంప్రదాయ దీపావళి పండుగ విశిష్టతను చాటేందుకు కేంద్ర ప్రజాసంబంధాల సంస్థ (సీడీడబ్ల్యూడీ) ఈ శకటాన్ని ప్రదర్శించింది. ఇదొక్కటేనా.. వివిధ రాష్ట్రాలు, మంత్రిత్వశాఖల నుంచి 23 శకటాల వరుస రాజ్‌పథ్‌లో వీక్షకులను కట్టిపడేసింది. ప్రత్యేకించి భారత్-ఆసియాన్ దేశాల మధ్య ఉన్న చారిత్రక, సాంస్కృతిక, మతపరమైన సంబంధాలను ప్రతిబింబించేలా విదేశీ వ్యవహారాల మంత్రిత్వశాఖ రెండు శకటాలను ప్రదర్శించింది. బుద్ధుడు ధ్యాన ముద్రలో కూర్చొని ఉన్నట్టుగా హిమాచల్ ప్రదేశ్, మధ్యప్రదేశ్ రాష్ట్రాలు శకటాలను ప్రదర్శించాయి. మహాత్మాగాంధీ సిద్ధాంతాన్ని చాటుతూ గుజరాత్ ప్రభుత్వం ప్రదర్శించిన శకటం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. చేతివృత్తులపై త్రిపుర, పర్యాటకంపై ఉత్తరాఖండ్, జీవనవృత్తులపై జమ్ముకశ్మీర్ శకటాలను ప్రదర్శించాయి. కాగా మహాత్మాగాంధీ గురించి ఓ చారిత్రక సందర్భాన్ని గుర్తుచేస్తూ ఆలిండియా రేడియో తొలిసారిగా ప్రదర్శించిన శకటం ఆలోచింపజేసింది. పెద్ద నోట్లరద్దు తర్వాత బ్లాక్‌మనీని అరికట్టేందుకు జరిపిన దాడులపై ఆదాయపన్ను శాఖ శకటాన్ని ప్రదర్శించింది. కాగా, రాజ్‌పథ్‌లో త్రివర్ణ పతాకం రెపరెపల సాక్షిగా భారత సైనిక శక్తి ఆవిష్కృతమైంది. దేశ సైనిక శక్తికి త్రివిధ దళాల పరేడ్ నిలువటద్దం పట్టింది. ఆర్మీ, వాయుసేన, నావికాదళాలకు చెందిన శకటాలతోపాటు బీఎస్ఎఫ్ దళాలు, ఎన్‌సీసీ బృందాల ప్రదర్శన అద్భుతంగా సాగింది. వాయుసేనకు చెందిన ఐదు ఎంఐ-17 వీ5 హెలికాప్టర్లతో మన దేశ పతాకాన్ని ఎగురవేసిన దృశ్యం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. నావికాదళం ఆధ్వర్యంలో టి-90 ట్యాంకులు, ఆకాశ్ క్షిపణి, బ్రహ్మోస్ క్షిపణుల ప్రదర్శన ఆకట్టుకుంది.

భారత్-ఆసియన్ దేశాల సంబంధాలను చాటేలా శకటాలు

'సీమా భవానీ'ల సూపర్ షో

న్యూఢిల్లీ, జనవరి 26: గణతంత్ర వేడుకల్లో బీఎస్ఎఫ్ మహిళా బృందం 'సీమా భవాని' అద్భుత ప్రదర్శన చేసింది. రిపబ్లిక్ డే పరేడ్‌లో తొలిసారిగా పాల్గొన్న అమ్మాయిలు బైక్ విన్యాసాలతో అదరగొట్టారు. సబ్ ఇన్‌స్పెక్టర్ స్టాంజిన్ నోర్యాంగ్ ఆధ్వర్యంలో 350 సీసీ రాయల్ ఎన్‌ఫీల్డ్ బుల్లెట్లపై సీమా భవానీలు చేసిన స్టంట్స్ అబ్బురపరిచాయి. రాష్ట్రపతికి సెల్యూట్ చేయడంతో పాటు ఫిష్ రైడింగ్, సైడ్ రైడింగ్, బుల్ ఫైటింగ్ వంటి విన్యాసాలతో ఆకట్టుకున్నారు. మహిళా బృందం విన్యాసాలకు విశేష స్పందన వచ్చింది.

పొగ మంచులోనూ గర్జించాయి

న్యూఢిల్లీ, జనవరి 26 : పొగ మంచు దట్టంగా అలుముకున్నా.. అందరి చూపులు ఆకాశం వైపే. వాయుసేనకు చెందిన విమానాల కళ్లు చెదిరే విన్యాసాలను పొగమంచు కూడా అడ్డుకోలేకపోయింది. ముఖ్యంగా రుద్ర చోపర్ల విన్యాసాలు ఆకట్టుకున్నాయి. సీ-17 గ్లోబ్‌మాస్టర్, సుఖోయ్-30 ఎమ్‌కేఐ, తేజాస్ యుద్ధవిమానాలు, జాగ్వార్, మిగ్- 29 విన్యాసాలు ఆకర్షించాయి.



ఆంధ్రజ్యోతి

స్పోర్ట్స్

మరోసారి సైనానే..



'ఇండోనేసియా' క్వార్టర్స్‌లో సింధుపై గెలుపు

జకార్తా: ప్రపంచ మాజీ నంబర్ వన్ సైనా నెహ్వాల్.. ఒలింపిక్ రజత పతక విజేత సింధుపై మరోసారి ఆధిక్యం ప్రదర్శించింది. శుక్రవారం ఇక్కడ జరిగిన ఇండోనేసియా మాస్టర్స్ టోర్నీ క్వార్టర్‌ఫైనల్లో సైనా 21-13, 21-19తో వరుస గేము ల్లో సింధును ఓడించింది. సైనా..సెమీఫైనల్లో థాయ్‌లాండ్‌కు చెందిన రచనోక్ ఇన్‌టానన్‌ను ఎదుర్కొంటుంది. క్వార్టర్‌ఫైనల్లో నాలుగో సీడ్ రచనోక్ 21-17, 21-10 స్కోరుతో వరల్డ్ చాంపియన్ నొజోమి ఒకుహరా (జపాన్)ను మట్టికరిపించింది. రచనోక్‌పై నెహ్వాల్ 8-5తో ఆధిక్యంలో ఉండడం విశేషం. అంతర్జాతీయ సర్క్యూట్‌లో సైనా, సింధు రెండుసార్లు ఢీకొనగా..ఇద్దరూ చెరో మ్యాచ్‌లో నెగ్గారు. అంతేకాదు గత సీనియర్ నేషనల్స్ ఫైనల్లోనూ సింధుపై సైనాది పైచేయి అయింది. ఇక పురుషుల డబుల్స్‌లో భారత జోడీ సాత్విక్ సాయి రాజ్- చిరాగ్ శెట్టి 21-23, 21-15, 21-19తో పీటర్సన్- కోల్డింగ్‌ను చిత్తుచేసి సెమీస్‌లో అడుగు పెట్టింది.

పాకిస్థాన్.. కాచుకో

సెమీస్‌లో భారత్ • అండర్-19 ప్రపంచకప్



క్వీన్స్‌టౌన్: అంచనాలకు తగ్గట్టుగా రాణిస్తున్న భారత జట్టు అండర్-19 ప్రపంచకప్‌లో సెమీఫైనల్స్‌కు చేరింది. శుక్రవారం బంగ్లాదేశ్‌తో జరిగిన క్వార్టర్ ఫైనల్స్ మ్యాచ్‌లో 131 పరుగుల తేడాతో నెగ్గింది. దీంతో సెమీస్‌లో దాయాది పాకిస్థాన్‌కు సవాల్ విసిరేందుకు సిద్ధమైంది. ఈనెల 30న సెమీస్ జరుగుతుంది. శుభ్‌మన్ గిల్ (86), అభిషేక్ శర్మ (50) అర్ధ సెంచరీలతో పాటు కెప్టెన్ పృథ్వీ షా (40) రాణించడంతో ముందుగా బ్యాటింగ్‌కు దిగిన భారత్ 49.2 ఓవర్లలో 265 పరుగులకు ఆలౌట్ అయ్యిం ది. అనంతరం బరిలోకి దిగిన బంగ్లా జట్టు భారత బౌలర్ల ధాటికి 42.1 ఓవర్లలో 134 పరుగులకే కుప్పకూలింది. ఓపెనర్ పినాక్ ఘోష్ (43) ఒక్కడే రాణించాడు. పేసర్ కమలేశ్ నాగర్‌కోటి మూడు వికెట్లతో చెలరేగగా శివమ్, అభిషేక్‌లకు రెండేసి వికెట్లు దక్కాయి.

బెన్‌స్టోక్స్ మళ్లీ జాక్‌పాట్ కొడతాడా.. అశ్విన్‌ను తిరిగి చెన్నై దక్కించుకునేనా.. అఫ్ఘాన్ సంచలనం రషీద్ ఈసారి ఎన్ని కోట్లు పలుకుతాడో.. సీనియర్లు యువరాజ్, హర్భజన్ పరిస్థితేంటో.. గత సీజన్‌లో పరుగుల వరద పారించిన గంభీర్‌ను ఏజట్టు ఎగరేసుకుపోతుందో.. టీ20లో తిరుగులేని చాహల్.. యువ సంచలనం పృథ్వీ షా ఏమేరకు ధర పలుకుతారో.. ఇవే ఇప్పుడు అభిమానుల మదిని తొలుస్తున్న ప్రశ్నలు. ప్రపంచ క్రికెట్‌లోనే అత్యంత విలువైన ఐపీఎల్ వేలానికి రంగం సిద్ధమైంది. నేటినుంచి రెండురోజుల పాటు జరిగే వేలంలో దాదాపు అందరు ఆటగాళ్లు అందుబాటులో ఉండడంతో ఫ్రాంచైజీలు తమజట్లకు కొత్త రూపునిచ్చుకునేందుకు ఎదురుచూస్తున్నాయి.



అశ్విన్

జాక్‌పాట్ ఎవరిదో!



బెన్‌స్టోక్స్

నేడు, రేపు ఐపీఎల్ ఆటగాళ్ల వేలం • ఉ. 9 గం.నుంచి స్టార్ స్పోర్ట్స్1లో

బెంగళూరు: ఇప్పటిదాకా మనం చూసిన ఐపీఎల్ జట్లు వేరు.. ఇక నుంచి చూడబోయేది వేరు.. శనివారం, ఆదివారం ఐపీఎల్ 11వ సీజన్ కోసం జరగబోయే ఆటగాళ్ల వేలమే దీనికి కారణం. మొత్తం 581 మంది క్రికెటర్లు వేలానికి అందుబాటులో ఉండనున్నారు. కోహ్లీ, ధోనీ, రైనా, జడేజా, రోహిత్‌లాంటి స్టార్లు ఈ వేలంలో లేకపోయినా మిగతా దేశీయ, అంతర్జాతీయ స్టార్ ఆటగాళ్లంతా సిద్ధంగా ఉండడంతో రెండురోజుల పాటు జరిగే ఈ వేలం ఆసక్తిదాయకంగా జరగడం ఖాయం. భారత్ నుంచి 361 మంది వేలంలో ఉన్నారు. భవిష్యత్‌లో చిన్నస్థాయి వేలాలు జరిగినా ఇప్పుడే సరైన ఆటగాళ్లను తీసుకుని జట్లను పటిష్ఠం చేసుకోవాలని 8 ఫ్రాంచైజీలు భావిస్తున్నాయి. కాగా, ఆయా ఫ్రాంచైజీల కోరిక మేరకు ముగ్గురు స్టార్ ఆటగాళ్లను అట్టిపెట్టుకునే వెసులుబాటు ఐపీఎల్ పాలకమండలి ఇప్పటికే కల్పించింది. మరో ఇద్దరిని రైట్ టు మ్యాచ్ ద్వారా తీసుకోవచ్చు. వేలంలో ప్రతీజట్టు కనీసం రూ.60 కోట్లను.. గరిష్ఠంగా రూ.80 కోట్లను వెచ్చించాలి.

16 మందికి మేటి ఆటగాళ్ల హోదా: వందల మంది అందుబాటులో ఉన్నా 16 మందికే బీసీసీఐ మేటి ఆటగాళ్ల హోదాను కల్పించింది. వీరికి కనీసధర రూ.2 కోట్లు. అశ్విన్, ధవన్, రహానె, హర్భజన్, యువ రాజ్, గంభీర్, గేల్, స్టోక్స్, స్టార్క్, విలియమ్సన్, మ్యాక్స్‌వెల్, రూట్, డుప్లెసిస్, డ్వేన్ బ్రావో, పొలార్డ్, షకీబ్ ఈ జాబితాలో ఉన్నారు.

వీరిపైనే నజర్..: వచ్చే సీజన్లలో తమజట్లు బలంగా ఉండేందుకు అన్నిఫ్రాంచైజీలు ఈసారి స్టార్ ఆటగాళ్లపై భారీ మొత్తాన్నే వెచ్చించనున్నాయి. గతేడాది స్టోక్స్ రూ. 14.5 కోట్లతో లీగ్ రికార్డును బ్రేక్ చేశాడు. ఈసారి వ్యక్తిగత గొడవలతో కొంతకాలం ఆటకు దూరమైన వేళ అతడిపై ఫ్రాంచైజీలు ఎలా ఖర్చుపెడతాయో చూడాలి. అశ్విన్‌ను తిరిగి తీసుకునేందుకు చెన్నై సిద్ధంగా ఉన్నా మిగతాజట్ల నుంచి వారికి గట్టిపోటీ ఎదురవ్వొచ్చు. అశ్విన్, గంభీర్‌లకోసం ఎంత మొత్తమైనా వెచ్చించేందుకు ఢిల్లీ సిద్ధమైంది. ఆల్‌రౌండర్ జాదవ్‌ను బెంగళూరు తిరిగి తీసుకోవాలనుకుంటోంది. లెగ్ స్పిన్నర్లు కుల్దీప్, చాహల్‌లపై అన్నిజట్లు దృష్టిపెట్టాయి. విదేశీ ఆటగాళ్లలో స్పిన్నర్ రషీద్ ఖాన్‌ను ఆర్‌టీఎం ద్వారా హైదరాబాద్ కొనుగోలు చేయాలనుకుంటోంది. ఈసారి ఇంగ్లండ్ కెప్టెన్ జో రూట్ కూడా వేలంలో ఉండడం ఆసక్తికరం. క్రిస్ లిన్ కోసం కోల్‌కతా ఆర్‌టీఎం ఉపయోగించవచ్చు. స్మిత్ ఒక్కడినే అట్టిపెట్టుకున్న రాజస్థాన్ దగ్గర అత్యధికంగా రూ. 67.5 కోట్ల మొత్తం ఉంది. మన్రో, డుప్లెసిస్, పొలార్డ్‌లకు గిరాకీ ఉండనుంది.

ఊహించినట్టుగానే రోజర్ ఫెడరర్ ఆస్ట్రేలియన్ ఓపెన్ ఫైనల్లో ప్రవేశించాడు.. దక్షిణకొరియా సంచలనం చుంగ్ యాన్‌తో జరిగిన సెమీఫైనల్ పూర్తిగా కొనసాగలేదు..తొలి సెట్‌ను అలవోకగా నెగ్గి రెండో సెట్‌లో ఫెడరర్ ఆధిక్యంలో ఉన్న దశలో ప్రత్యర్థి గాయంతో వైదొలిగాడు.. ఏడో ఆస్ట్రేలియన్ ఓపెన్ టైటిల్ వేటలోనున్న ఫెడరర్ ఆదివారం జరిగే ఫైనల్లో ఆరోసీడ్ మారిన్ సిలిచ్‌తో తలపడనున్నాడు.. భారత్‌కు చెందిన రోహన్ బోపన్న మిక్స్‌డ్ తుదిపోరుకు చేరుకొని గణతంత్ర దినోత్సవాన అభిమానులను మురిపించాడు.



7కు ఒక్క అడుగే..

- ఆస్ట్రేలియన్ ఓపెన్ ఫైనల్లో ఫెడరర్ • సిలిచ్‌తో టైటిల్ ఫైట్ రేపు
- మిక్స్‌డ్ డబుల్స్ తుది పోరుకు రోహన్ బోపన్న జోడీ

మెల్‌బోర్న్: డిఫెండింగ్ చాంపియన్ రోజర్ ఫెడరర్ ఆస్ట్రేలియన్ ఓపెన్ ఫైనల్‌కు దూసుకుపోయాడు. దక్షిణకొరియా యువ ఆటగాడు చుంగ్ యాన్‌తో శుక్రవారం జరిగిన సెమీస్‌లో ఫెడెక్స్ 6-1, 5-2 స్కోరుతో ఆధిక్యంలో ఉన్న దశలో ప్రత్యర్థి గాయంతో తప్పుకొన్నాడు. ఆదివారం జరిగే ఫైనల్లో క్రొయేషియాకు చెందిన ఆరోసీడ్ మారిన్ సిలిచ్‌తో ఫెడరర్ తలపడతాడు. స్విస్‌స్టార్‌కిది 30వ గ్రాండ్‌స్లామ్ ఫైనల్ కావడం విశేషం. అంతేనా..ఏడోసారి మెల్‌బోర్న్ పార్క్‌లో అతడు టైటిల్ ఫైట్‌కు చేరుకోవడం గమనార్హం. ఓ గ్రాండ్‌స్లామ్ సెమీఫైనల్లో అడుగుపెట్టిన మొట్టమొదటి దక్షిణకొరియా ప్లేయర్‌గా రికార్డు నెలకొల్పిన 21 ఏళ్ల చుంగ్ తొలిసెట్ చివరల్లో ఎడమ పాదం గాయానికి చికిత్స తీసుకొన్నాడు. ఆపై ఆట కొనసాగించినా రెండు గేమ్‌లు మాత్రమే ఆడగలిగాడు. గాయం తీవ్రమై కోర్టులో కదలడానికే ఇబ్బందిపడిన అతడు రెండో సెట్‌లో 2-5తో వెనుకంజలో ఉన్న తరుణంలో ఇక కొనసాగలేక అంపైర్ వద్దకు వెళ్లి మ్యాచ్‌నుంచి వైదొలుగుతున్నట్టు తెలిపాడు. ఈ విజయంతో గ్రాండ్‌స్లామ్‌ల సెమీస్‌లో ఫెడరర్ రికార్డు 30-13కు చేరింది. 20వ గ్రాండ్‌స్లామ్ టైటిల్ వేటలో ఉన్న రోజర్.. ఫైనల్ ప్రత్యర్థి సిలిచ్‌పై 8-1తో మెరుగైన రికార్డు కలిగిఉన్నాడు. చివరిసారి.. గత వింబుల్డన్ ఫైనల్లో సిలిచ్‌ను వరుస సెట్లలో ఫెడెక్స్ చిత్తుచేశాడు.



బోపన్న, టిమియాస్

రెండో గ్రాండ్‌స్లామ్ దిశగా బోపన్న

భారత డబుల్స్ స్టార్ రోహన్ బోపన్న రెండో గ్రాండ్‌స్లామ్‌కు మరింత చేరువయ్యాడు. ఆస్ట్రేలియన్ ఓపెన్ మిక్స్‌డ్ డబుల్స్‌లో అతడు ఫైనల్ చేరాడు. హంగరీకి చెందిన టిమియాస్ బాబోస్ జతగా బోపన్న సెమీఫైనల్లో 7-5, 5-7, 10-6తో మార్సిలో డెమోలినర్ (బ్రెజిల్)- మరియా జోస్ మార్టినెట్ (స్పెయిన్)పై గెలిచాడు. ఫైనల్లో బోపన్న జోడీ.. డబ్రోవస్కీ (కెనడా)- మేట్ పవిక్ (క్రొయేషియా)తో తలపడనుంది. కాగా.. బాబోస్- మ్లదనోవిక్ జోడీ ఆస్ట్రేలియన్ ఓపెన్ మహిళల డబుల్స్ విజేతగా నిలవడం విశేషం.

మధ్యాహ్నం 1గం. తర్వాత సోనీ సిక్స్‌లో

నేడు మహిళల ఫైనల్

మహిళల ఫైనల్లో టాప్‌సీడ్ హలెప్, రెండో సీడ్ వోజ్నియాకి శనివారం అమీతుమీ తేల్చుకోనున్నారు. ఇద్దరిలో ఎవరు విజేతలుగా నిలిచినా వారికి తొలి ఆస్ట్రేలియన్ ఓపెన్‌తోపాటు మొదటి గ్రాండ్‌స్లామ్ టైటిల్ అవుతుంది. అంతేకాదు..ట్రోఫీతోపాటు ఆ ప్లేయర్‌కు నెంబర్ వన్ ర్యాంకు కూడా సొంతమవుతుంది.



వోజ్నియాకి

హలెప్

ఆస్ట్రేలియాకు తొలి విజయం

అడిలైడ్: ఇంగ్లండ్‌తో జరుగుతున్న ఐదు వన్డేల సిరీస్‌లో ఆస్ట్రేలియా జట్టుకు తొలి విజయం దక్కింది. ఇప్పటికే సిరీస్‌ను కోల్పోయిన ఆతిథ్య జట్టు నాలుగో వన్డేలో 3 వికెట్ల తేడాతో నెగ్గింది. పూర్తిగా బౌలర్లు ఆధిపత్యం చూపించిన ఈ మ్యాచ్‌లో తొలుత ఇంగ్లండ్ 44.5 ఓవర్లలో 196 పరుగులకు ఆలౌటైంది. క్రిస్ వోక్స్ (78) అద్భుత ఇన్నింగ్స్‌తో ఆదుకున్నాడు. కమిన్స్‌కు నాలుగు వికెట్లు దక్కాయి. ఆ తర్వాత ఆసీస్ 37 ఓవర్లలో ఏడు వికెట్లకు 197 పరుగులు చేసింది. హెడ్ (96) త్రుటిలో శతకం కోల్పోయాడు. రషీద్‌కు మూడు వికెట్లు దక్కాయి.

• సెమీస్‌లో పేస్ జోడి

న్యూఢిల్లీ: న్యూపోర్ట్ బీచ్ చాలెంజర్ టెన్నిస్ టోర్నీలో లియాండర్ పేస్- జేమ్స్ సెరెటాని జోడి సెమీఫైనల్ చేరింది. క్వార్టర్స్‌లో ప్రత్యర్థి నుంచి వాకోవర్ లభించడంతో పేస్ జోడి ముందంజ వేసింది.

• ముస్తాక్ అలీ టీ-20 విజేత ఢిల్లీ

కోల్‌కతా: సయ్యద్ ముస్తాక్ అలీ టీ20లో ఢిల్లీ విజేతగా నిలిచింది. ఫైనల్లో రాజస్థాన్‌పై 41 పరుగులతో నెగ్గింది. ముందుగా ఢిల్లీ.. ఉన్ముక్త్(53) అర్ధ సెంచరీతో 20ఓవర్లలో 6వికెట్లకు 153 రన్స్ చేసింది. తర్వాత రాజస్థాన్ 19.1ఓవర్లలో 112 రన్స్‌కే ఆలౌటైంది.

పగుళ్లు వచ్చిన పిచ్‌పై అస్థిరమైన బౌన్స్‌తో దూసుకొస్తున్న బంతులు.. ఎక్కడ పడి ఎటు వెళ్తున్నాయో అస్సలు తెలియడం లేదు.. ఒకటి భుజంపై నుంచి దూసుకెళ్తుంటే.. మరొకటి ఛాతిని తాకుతోంది.. ఇంకోటి నడుం ఎత్తులో వచ్చి ఇబ్బంది పెడుతోంది..! దూరంగా వెళ్తున్నదని వదిలేస్తే మోచేతులకు గాయం చేస్తోంది..! బ్యాటు మధ్యలో తాకుతుందని ఆడితే.. వచ్చి గ్లోవ్స్‌ను ముద్దాడి చేతి వేళ్లను నలిపేస్తోంది..! దాదాపు భారత బ్యాట్స్‌మెన్ అందరినీ ఎప్పుడో ఒకసారి గాయపరిచింది..! అయినా.. వీటన్నింటిని కాచుకొని రెండు సెషన్లకు పైగా ధైర్యంగా ఎదురు నిలిచిన టీమిండియా 241 పరుగుల లక్ష్యాన్ని ప్రత్యర్థి ముందు ఉంచింది..! కానీ, బ్యాటింగ్ చేస్తూ మనోళ్లు ఇబ్బంది పడినప్పుడు ఆట కొనసాగించిన అంపైర్లు.. బుమ్రా సంధించిన ఓ బౌన్సర్ ఆతిథ్య ఓపెనర్ డీన్ ఎల్గర్ తలకు తగలడంతో ఆటను అర గంట ముందుగానే ఆపేశారు..! ఛేదనలో ప్రస్తుతం సౌతాఫ్రికా 17/1 స్కోరుతో నిలిచింది..! కానీ, వికెట్ అంత భయంకరంగా ఏమీ లేదని.. తాము ఆడతామని భారత్ స్పష్టం చేసింది..! ఇదే వికెట్‌పై తాము రోజంతా బ్యాటింగ్ చేసినప్పుడు ప్రత్యర్థిని ఎందుకు ఆడించరని ప్రశ్నించింది..! సౌతాఫ్రికా కూడా ఆడేందుకు సిద్ధంగా ఉన్నట్టు తెలిపింది..! దాంతో, ముందుగా శనివారం ఉదయం వికెట్‌ను పరిశీలించాకే నిర్ణయం తీసుకుంటామని చెప్పిన అధికారులు.. నాటకీయ పరిణామాల తర్వాత ఆట కొనసాగిస్తామని ప్రకటించారు..! మరి, మిగతా 9 వికెట్లు తీసి భారత్ గెలుస్తుందా..! మరో 224 రన్స్ చేసి సౌతాఫ్రికా క్లీన్‌స్వీప్ చేస్తుందా.. ఫలితానికి కీలకమైన పిచ్ శనివారం ఏం చేస్తుందో..



ధోనీని దాటిన విరాట్

విదేశాల్లో అత్యధిక పరుగులు చేసిన భారత సారథిగా ధోనీ రికార్డు ను విరాట్ కోహ్లీ అధిగమించాడు. రెండో ఇన్నింగ్స్‌లో 41 రన్స్ చేసిన కోహ్లీ.. విదేశీగడ్డపై కెప్టెన్‌గా 3456 పరుగులు రాబట్టాడు. దాంతో, 60 మ్యాచ్‌ల్లో 3454 రన్స్‌తో ధోనీ పేరిట ఉన్న రికార్డు బద్దలైంది. కోహ్లీ కేవలం 35 టెస్టుల్లోనే ఈ ఘనతను సాధించడం విశేషం.

తేలేది నేడే!

- బౌన్సీ వికెట్‌పై భారత్ అద్భుత పోరాటం • పిచ్ కారణంగా ఆట నిలిపేసిన రెఫరీ
- సౌతాఫ్రికా లక్ష్యం 241.. ప్రస్తుతం 17/1 • నేడు కొనసాగనున్న మ్యాచ్

లోపం పిచ్‌దా.. ఆటదా..!



బుమ్రా

'ఇది చెత్త పిచ్. నేనైతే దీనికి వందకు రెండు మార్కులే ఇస్తా. ఇది అసలు క్రికెట్ పిచ్ కాదు. విజయ్ అవుటైనప్పుడే ఆటను నిలిపేయాల్సింది. అంత ప్రమాదకరంగా ఉన్నదీ వికెట్' అని టీవీ వ్యాఖ్యత అయిన వెస్టిండీస్ మాజీ పేసర్ మైకేల్ హోల్డింగ్ ఆగ్రహం వ్యక్తం చేశాడు. హోల్డింగ్ అన్నట్టు అప్పుడే ఆటను నిలిపేస్తే ఎవరికీ ఎలాంటి సమస్య ఉండేది కాదేమో. సాహసోపేతంగా ఆడిన భారత్.. మ్యాచ్‌ను తన చేతుల్లోకి తెచ్చుకున్న సమయంలో ఆట ఆగడం వివాదానికి దారితీసింది. సఫారీల కంటే ఎక్కువగానే భారత ఆటగాళ్లు ఇబ్బంది పడ్డా ఏమీ అనకుండా, మరో ఇరవై నిమిషాలైతే రోజు ముగుస్తుందనగా హడావిడిగా ఆటను ఆపడం సమంజసం కాదన్న అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. భారత్ ఇన్నింగ్స్ మొత్తం ముగిసేంత వరకూ కనీసం 'మీరు ఆడగలరా?' అని కూడా అంపైర్లు



మైదానం వీడాలంటూ ఆటగాళ్లకు సూచిస్తున్న అంపైర్

తమను అడగలేదని రహానె స్వయంగా చెప్పాడు. చాలా బంతులు విజయ్, కోహ్లీ, రహానె, హార్దిక్ శరీరాలకు తాకినప్పుడు ఎందుకు ఆపలేదన్న ప్రశ్న వస్తోంది. ఇలాంటి వికెట్లపై బంతులు అనూహ్యంగా బౌన్స్ అవడం సహజం. ఈ రోజు దాని మోతాదు కొంచెం ఎక్కువైందనొచ్చు. అప్పుడు బ్యాట్స్‌మెన్ టెక్నిక్ కూడా కీలకం అవుతుంది. భారత ఆటగాళ్లు మంచి టెక్నిక్‌తో ఆడారని చెప్పొచ్చు. అదే సమయంలో ఆట నిలిపివేతకు కారణమైన ఎల్గర్‌లో అది లోపించిందని నిపుణులు అంటున్నారు. బుమ్రా షార్ట్‌బాల్‌ను అతను సరిగ్గా డిఫెన్స్ చేయలేకపోయాడని చెబుతున్నారు. భారత టెయిలెండర్లు బ్యాటింగ్ చేస్తున్నప్పుడు సఫారీ పేసర్లు ఇలాంటి బౌన్సర్లు ఎన్నో సంధించిన విషయం మరిచిపోకూడదు. అందువల్ల ఇక్కడ లోపం పిచ్‌దే కాదు... బ్యాట్స్‌మెన్ ఆడే విధానంలో కూడా ఉన్నది.

జొహన్నెస్‌బర్గ్: సవాల్ విసిరే పరిస్థితుల్లో సాహసోపేత బ్యాటింగ్‌తో ఆకట్టుకున్న భారత్ మూడో టెస్టులో విజయం సాధించే అవకాశాలను మెరుగు పరుచుకుంది. ప్రత్యర్థి ముంగిట 241 పరుగుల లక్ష్యాన్ని ఉంచింది. పిచ్‌పై ఆందోళన వ్యక్తం చేస్తూ మ్యాచ్ అధికారులు మూడో రోజు ఆటను నిలిపేసే సమయానికి సౌతాఫ్రికా ఛేదనలో 17/1తో నిలిచింది. ఓపెనర్ మార్‌క్రమ్ (4)ను షమి అవుట్ చేయగా.. ప్రస్తుతం డీన్ ఎల్గర్ (11 బ్యాటింగ్), ఆమ్లా (2 బ్యాటింగ్) క్రీజులో ఉన్నారు. మరో రెండు రోజుల ఆట మిగిలున్న మ్యాచ్‌లో సౌతాఫ్రికా విజయానికి ఇంకా 224 పరుగులు కావాలి. తొమ్మిది వికెట్లు తీస్తే భారత్‌దే గెలుపు. అంతకుముందు భారత్ రెండో ఇన్నింగ్స్‌లో 247 పరుగుల వద్ద ఆలౌటైంది. రహానె (48), కెప్టెన్ కోహ్లీ (41) సత్తా చాటగా.. భువనేశ్వర్ (33), షమి (28 బంతుల్లో ఫోర్, 2 సిక్సర్లతో 27), విజయ్ (25) విలువైన పరుగులు చేశారు. సఫారీ బౌలర్లలో రబాడ, మోర్కెల్, ఫిలాండర్ తలో మూడు వికెట్లు తీశారు.

అనూహ్య పరిణామాల మధ్య: ఈ వికెట్‌పై భారీగా కనిపిస్తున్న లక్ష్య ఛేదనకు దిగిన సఫారీలకు షమి ఆరంభంలోనే షాకిచ్చాడు. ఐదు పరుగులకే ఓపెనర్ మార్‌క్రమ్‌ను అవుట్ చేశాడు. ఆ తర్వాత షమితో పాటు భువీ పదునైన బౌన్సర్లతో ప్రత్యర్థులను ఇబ్బంది పెట్టాడు. ఈ క్రమంలో మరో ఓపెనర్ ఎల్గర్ గ్లోవ్స్, థై ప్యాడ్‌కు రెండు బంతులు తగిలాయి. అయితే, ఇన్నింగ్స్ తొమ్మిదో ఓవర్ మూడో బంతికి బుమ్రా సంధించిన షార్ట్ పిచ్ బాల్.. ఎల్గర్ హెల్మెట్ ముందుభాగం గ్రిల్‌ను బలంగా ఢీకొట్టింది. దాంతో, నుదుటి భాగంలో గాయంతో అతను ఇబ్బంది పడ్డాడు. ఫిజియో ఐస్ ప్యాక్‌తో అతనికి చికిత్స చేశారు. అప్పటికి మరో అరగంట ఆట మిగిలింది. కానీ, అంపైర్లు ఇయాన్ గ్లౌడ్, అలీం దార్ ఆటను నిలిపి మ్యాచ్ రెఫరీ ఆండీ పైక్రాఫ్ట్‌ను పిలిపించారు. రిఫరీ పిచ్‌ను పరిశీలించి ఇద్దరు కెప్టెన్లతో తన గదిలో సమావేశం అయ్యారు. అప్పటికే సౌతాఫ్రికా ఆటగాళ్లు డ్రెస్సింగ్ రూమ్ వెళ్లగా.. భారత ప్లేయర్లు కాసేపు మైదానంలో ఉండి.. తర్వాత డగౌట్‌లో వేచి చూశారు. రెఫరీతో కెప్టెన్ల భేటీ ముగిశాక కూడా ఆట కొనసాగుతుందా లేదా అనే విషయం తెలియలేదు. కాసేపటికే భారత ఆటగాళ్లు కూడా డ్రెస్సింగ్ రూమ్‌కు వెళ్లగా.. తర్వాత మూడో రోజు ఆట ముగిసిందన్న ప్రకటన వెలువడింది.

భారత్ అద్భుత పోరాటం..: కాసేపు క్రీజులో నిలవడమే సవాల్‌గా మారిన వాండరర్స్ వికెట్‌పై భారత ఆటగాళ్లు గొప్పగా పోరాడారు. కోహ్లీ, రహానె ఇన్నింగ్స్‌ను నిలబెడితే.. ఆఖర్లో భువనేశ్వర్, షమి మెరుపులు మెరిపించడంతో భారత్ ఊహించినదాని కంటే ఎక్కువ పరుగులే చేసింది. తొలుత ఓవర్‌నైట్ స్కోరు 49/1తో ఆట కొనసాగించిన భారత్‌కు ఆదిలోనే గట్టి ఎదురుదెబ్బ తగిలింది. తొలి ఐదు ఓవర్లలోనే రాహుల్ (16)తో పాటు చటేశ్వర్ పుజారా (1) అవుటయ్యారు. కానీ, ప్రత్యర్థి బౌలర్లు.. లో లెంగ్త్‌తో పాటు బౌన్సర్లతో కవ్విస్తున్నా.. బంతులు తమను తాకుతూ తీవ్ర ఇబ్బంది పెడుతున్నా.. విజయ్, కెప్టెన్ కోహ్లీ మొక్కవోని విశ్వాసంతో బ్యాటింగ్ చేశారు. ముఖ్యంగా విజయ్ 127 బంతులు కాచుకొని సహనంగా క్రీజులో నిలిచాడు. మరో ఎండ్‌లో కోహ్లీ చెత్త బంతులను బౌండ్రీకి తరలిస్తూ పరుగులు రాబట్టాడు. అయితే, తొలి సెషన్ చివరి బంతికి రబాడ మంచి యార్కర్‌తో విజయ్‌ను క్లీన్ బౌల్డ్ చేసి ఈ జోడీని విడదీశాడు. 100/4 స్కోరుతో లంచ్‌కు వెళ్లొచ్చాక కోహ్లీకి రహానె జతకలిశాడు. విరాట్ తన క్లాసిక్ బ్యాటింగ్‌తో పరుగులు రాబట్టగా.. రహానె వచ్చీరాగానే ఎదురుదాడికి దిగాడు. ఏ మాత్రం అవకాశం ఉన్నా.. బంతిని బౌండ్రీకి చేర్చాడు. అయితే, కోహ్లీని కళ్లు చెదిరే ఇన్‌స్వింగర్‌తో బౌల్డ్ చేసిన రబాడ ఈ జోడీని విడదీశాడు. ఆ వెంటనే.. హార్దిక్ పాండ్యా (4)ను రిటర్న్ క్యాచ్‌తో అవుట్ చేయడంతో భారత్ 148/6తో కష్టాల్లో పడింది. అయితే, భువనేశ్వర్ మరోసారి బ్యాటుతో ఆకట్టుకున్నాడు. మరో ఎండ్‌లో ధాటిగా ఆడుతున్న రహానెకు అతను మంచి సహకారం అందించాడు. ప్రత్యర్థి పేలవ ఫీల్డింగ్ సద్వినియోగం చేసుకుంటూ ఇద్దరూ ఏడో వికెట్‌కు 86 బంతుల్లోనే 55 పరుగులు జోడించారు. జట్టు స్కోరు 200 దాటిన రహానె అవుటైనా.. టెయిలెండర్ షమి చివర్లో ధనాధన్ బ్యాటింగ్‌తో రెచ్చిపోయాడు. వెంటవెంటనే రెండు సిక్సర్లు, ఒక బౌండ్రీ కొట్టిన అతను జట్టుకు విలువైన పరుగులు అందించాడు. మరో షాట్ ఆడే ప్రయత్నంలో చివరకు ఎంగిడి బౌలింగ్‌లో డివిల్లీర్స్‌కు క్యాచ్ ఇచ్చాడు. ఆ వెంటనే భువీని మోర్కెల్, బుమ్రా (0)ను ఫిలాండర్ అవుట్ చేయడంతో భారత ఇన్నింగ్స్ ముగిసింది.

స్కోరుబోర్డు

భారత్ తొలి ఇన్నింగ్స్: 187; దక్షిణాఫ్రికా తొలి ఇన్నింగ్స్: 194; భారత్ రెండో ఇన్నింగ్స్: విజయ్ (బి) రబాడ 25, పార్థివ్ (సి) మార్‌క్రమ్ (బి) ఫిలాండర్ 16, రాహుల్ (సి) డుప్లెసిస్ (బి) ఫిలాండర్ 16, పుజారా (సి) డుప్లెసిస్ (బి) మోర్కెల్ 1, కోహ్లీ (బి) రబాడ 41, రహానె (సి) డికాక్ (బి) మోర్కెల్ 48, హార్దిక్ (సి అండ్ బి) రబాడ 4, భువనేశ్వర్ (సి) డికాక్ (బి) మోర్కెల్ 33, షమి (సి) డివిల్లీర్స్ (బి) ఎంగిడి 27, ఇషాంత్ (నాటౌట్) 7, బుమ్రా (సి) రబాడ (బి) ఫిలాండర్ 0; **ఎక్స్‌ట్రాలు: 29; మొత్తం: 80.1 ఓవర్లలో 247 ఆలౌట్; వికెట్ల పతనం:** 1-17, 2-51, 3-57, 4-100, 5-134, 6-148, 7-203, 8-238, 9-240; **బౌలింగ్:** ఫిలాండర్ 21.1-5-61-3, రబాడ 23-5-69-3, మోర్కెల్ 21-6-4 7-3, ఎంగిడి 12-2-38-1, పెహ్లుక్వాయో 3-0-15-0. **దక్షిణాఫ్రికా రెండో ఇన్నింగ్స్ (లక్ష్యం 241):** మార్‌క్రమ్ (సి) పార్థివ్ (బి) షమి 4, ఎల్గర్ (నాటౌట్) 11, ఆమ్లా (నాటౌట్) 2; **ఎక్స్‌ట్రాలు: 0; మొత్తం:8.3ఓవర్లలో 17/1; వికెట్ పతనం:** 1-5; **బౌలింగ్:** భువనేశ్వర్ 4-0-8-0, షమి 4-1-7-1, బుమ్రా 0.3-0-2-0.

పీడబ్ల్యూఎల్ చాంపియన్ పంజాబ్

న్యూఢిల్లీ: డిఫెండింగ్ చాంపియన్ పంజాబ్ రాయల్స్ ప్రొ రెజ్లింగ్ లీగ్ (పీడబ్ల్యూఎల్) టైటిల్‌ను నిలబెట్టుకుంది. శుక్రవారం జరిగిన ఏకపక్ష ఫైనల్లో పంజాబ్ 5-2తో హర్యానా హ్యామర్స్‌ను ఓడించి విజేతగా నిలిచింది.



Printed and Published by Koganti Venkata Seshagiri Rao, on behalf of Aamoda Publications Pvt. Ltd., at the Aamoda press at Gollapalli road.,Dharmaram(B)Village,Dichpally Mandal, Nizamabad- 503230. Editor: K. Srinivas, Ph. Nos. 08461-245301, 245306. Fax 245307, RNI NO: AP TEL /2004/12975 .Managing Director : Vemuri Radha Krishna, Founder: K.L.N.Prasad.